శ్రీమద్వాల్మీకి రామాయణ

సుందర కాండము

పదచ్ఛేద - అన్వయక్రమ - ప్రతిపదార్థ - వ్యాఖ్యాన
విశేష - తాత్పర్యయుక్త

సుబోధినీ వివరణ సహితము

అంగుళీయక ప్రదానము

పంచమ సంపుటము

(35-40 సర్గములు)

This book is published with the financial assistance of the Tirupathi Devasthanams under their scheme "Aid to Authors of Religious Books"

※

విద్యాప్రవీణ, భాషాప్రవీణ,
మైలవరపు సుబ్రహ్మణ్యము,

బోయనపల్లి
కామేశ్వరరావు, B. A.

6. 8. 96

ప్రథమ ముద్రణము
వేయి ప్రతులు
1987

సర్వస్వామ్యములు—
ప్రచురణకర్తవి

ప్రచురణకర్త :
బోయనపల్లి కామేశ్వరరావు బి. ఏ.
కామరాజుపేట (పయా) రాజమండ్రి.
తూర్పు గోదావరిజిల్లా.

015, 1A1
35 H87.5

గ్రంథము వలయువారు పై చిరునామాకు
వ్రాసి పొందవచ్చును.

వెల : రు. 20–00

26998

ముద్రణ :
విజయశ్రీ ప్రింటింగువర్క్సు,
కందకం వీధి, రాజమండ్రి -1.

విజయతే శ్రీ వేంకటేశః ప్రభుః

శ్లో॥ లభ్యతే దర్శనా ద్యస్య
నిర్వృతి ర్నేత్రయోః, హృది
బ్రహ్మానందాను భూతి శ్చ
తం భజే వేంకట ప్రభుమ్॥

శ్లో॥ వినుతిః కలిదోష శోషణాయ
ప్రణతి ర్వాంఛిత సిద్ధయే చ యస్య,
స్మరణం చిరసౌఖ్య లబ్ధయే స్యాత్
కలయే తం హృది వేంకటాధినాథమ్॥

శ్లో॥ యో దేవ స్సృజ నావనాయ కృతసంకల్పో౽వతీర్ణః క్షితౌ
లక్ష్మీశోభిత విగ్రహః ప్రవిలసద్వైకుంఠ రమ్యాలయః,
అశ్రాంతోర్నవ రాజితో ఘన దయాసింధు స్స బంధు స్సతాం
భక్తాభీష్ట వరప్రదో విజయతే శ్రీవేంకటేశః ప్రభుః॥

సుబోధినీ సమర్పకులు :

బోయనపల్లి
కామేశ్వరరావు, బి.ఏ,

మైలవరపు
సుబ్రహ్మణ్యము

అంగుళీయక ప్రదానము

శ్లో॥ వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః।
రామనామాంకితం చేదం పశ్య దే వ్యంగుళీయకమ్॥
ప్రత్యయార్థం త వానీతం తేన దత్తం మహాత్మనా।
సమాశ్వసిహి భద్రం తే క్షీణ దుఃఖఫలా హ్యసి॥

తా॥ మహాత్మురాలవైన ఓ సీతాసాధ్వీః నేను ప్రజ్ఞాశాలియైన శ్రీరాముని దూతను. ఆ మహాత్ముడు నీకు నమ్మకము కలుగుట కొఱకై ఇచ్చిన రామ నామాంకితమైన అంగుళీయకమును గొని వచ్చితిని. చూడుము. పూర్వపాప ఫలితమైన నీ దుఃఖ మంతయును నశించి పోయినది. ఊఱడిల్లుము. నీకు మంగళము అగును.

౩౬వ సర్గము ౨, ౩ శ్లో.లు. పుట 72

శ్లో॥ వరేణ్యో వారిజాతాక్షో వర్షా భ్రశ్యామ సుందరః।
విశాల దృఢవక్ష యస్స రామో ఽవతు నస్సదా॥ 5
దయామృత మహాసింధు ర్దాంతో దశరథాత్మజః।
దక్షో ఽక్షోభ్యో దక్షిణో యస్స రామో ఽవతు నస్సదా॥౨౩.
జానకీప్రియ గాయత్రీ పుట ౩, ౪

విషయ సూచిక

౧ విజ్ఞప్తి — సుబోధినీ సమర్పకులు

౨ శుభాశీస్సు — బ్రహ్మశ్రీ శిష్టా చంద్రమౌళి శాస్త్రి గారు

౩ శుభాకాంక్ష — ఉ. వే. ప్ర. శ్రీమాన్ ఎస్. టి. పి. వి. కోనప్పాచార్యులు గారు

౪ సుందరకాండ సౌందర్యదీప్తి — డా ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ గారు

౫ సుందర సుబోధిని — ఆచార్య ఎమ్. ఆర్. అప్పారావు గారు

౬ జానకీ ప్రియ గాయత్రీ — సుబోధినీ సమర్పకులు

	సర్గ	శ్లో.	పుట
1. సీతమ్మకు హనుమ తెలిపిన శ్రీరాముని రూప విశేషములు	35	1	1
2. శ్రీరామునకు సుగ్రీవునితో మైత్రి కలిగిన విధము	,,	31	32
3 సుగ్రీవుడు పంపిన వానరులు సీత నన్వేషించిన విధము	,,	52	45
4. సముద్రము దాటి హనుమ సీతమ్మను కనుగొనిన విధము	,,	69	57
5. హనుమ మాటలు విని సీతమ్మ ఆనందించుట	,,	83	66
6 హనుమ అంగుళీయకము నొసగగా సీతమ్మ అతనిని ప్రశంసించుట	36	1	72
7. సీతమ్మ హనుమను శ్రీరాముని కుశల వార్తల నడుగుట	,,	15	83
8. ఆమె నోదార్చుచు హనుమ శ్రీరాముని విరహావస్థను వివరించుట	,,	32	98
9. సీతమ్మ హనుమకు తన దురవస్థను వివరించుట	37	1	112
10. హనుమ సీత నోదార్చుచు ఆమెను శ్రీరాముని కడకు గొనిపోయెదను రమ్మనుట	,,	19	125

11. తన శక్తిపై సంశయము కలిగించుచు హనుమ సీతమ్మకు తన భీమ రూపమును జూపుట	,,	33	135
12. సీతమ్మ హనుమతో శ్రీరాముని కడ కేగుటలో నందెడి అనౌచిత్యమును వివరించుట	,,	41	140
13. సీతమాటలకు సంతుష్టినొంది హనుమ శ్రీరామున కొసగుటకై ఆనవా లిమ్మని ఆమె నడుగుట	38	1	163
14. రామునకు జ్ఞాపకము చేయుమని సీతమ్మ చెప్పిన వాయస వృత్తాంతము	,,	11	171
15. సీత రాముని పరాక్రమమును, లక్ష్మణుని గుణగణ ములను జ్ఞాపకము చేసికొనుట	,,	41	197
16. రామునకు గుర్తుగా నిమ్మని సీత తన చూడామణి నొసగుట	,,	68	219
17. తనను త్వరలో విడిపించు నట్లు రాముని ప్రోత్స హింపు మని హనుమను కోరుట	39	1	224
18. త్వరలో నీ కోరిక నెఱవేరు నని హనుమ సీతకు ధైర్యము చెప్పుట	,,	12	232
19. తన బాధలు తెల్పుచు సీత మాసమునకు మించి తాను జీవింపజాల ననుట	40	1	262
20. సీతమ్మ నోదార్చి ఆమె సందేశమును గైకొని హనుమ అటనుండి వెడలుట	,,	12	271

విజ్ఞప్తి

జగత్ప్రాణ దేవుని కరుణచే జనించిన తన నందనుని రూప లావణ్యములకు మురిసి జనని అంజన అతనిని ముద్దుగా సుందరా! యని పిలుచుచుండెడి దట. అట్టి సుందరుడగు హనుమ జగదేక సుందరుడగు నాథుని రాముని క్షేమవార్తను త్రిజగత్సుందరియైన జానకికి అంగుళీయక ప్రదాన పూర్వకముగా సుందరముగా తెలిపినాడు. రమణీయ రామాయణ సుందర కాండమునందు అది అతి మనోహరమైన ఘట్టము.

కాలప్రభావముచేత సీతాసతి జీవితముపై రోతనొంది శోకాంధకార నిమగ్నయై యుండగా హనుమ ఆమెకు ప్రియమైన ప్రియునివార్తను తెలిపి ఆమె హృదయమున జీవన సౌందర్యమును ప్రకాశింపజేసినాడు. ఈ సందర్భమును వాల్మీకి మహర్షి తన దివ్య చక్షువుతో దర్శించి పవిత్ర మధురాక్షర రూపమున మంత్రరాజమైన సత్కావ్యఖండముగా లోకమునకు ప్రసాదించినారు. కాబట్టి ఈ ఘట్టము భక్తజనులకు అఘహారమై శోక సంతమసము ముడిపి జీవితమున ఆనంద ప్రకాశము నొసగుచు శ్రేయోదాయకమై వెలయుచున్నది.

ఇట్టి పావన సుందరకృతిని యథాశక్తిగా సుబోధముగావించి ఆంధ్ర సోదరులకు సమర్పింపగల్గుచున్నందుకు సంతసించుచున్న ఈ మధ్యకాలము నందు మమ్ము బాధించిన అనారోగ్యాది అంతరాయ క్లేశములను దైవ కృపచే దాటి యుంటిమని మనవిచేయుచున్నాము. అపుడపుడు కలుగుచుండు దైవిక పరీక్షలను తట్టుకొని నిలచునప్పుడే మానవులకు చేసిన పుణ్యములు ఫలించి దైవకృపసిద్ధించు ననిగదా పెద్దల సిద్ధాంతము. అట్టిదేమా అనుభవము: మా గురుదేవుల ఆదేశానుసారము ఇటీవలి కాలమున సరయూ త్రివేణీ జాహ్నవీ బ్రహ్మకుండాది తీర్థములు సేవించుచు అయోధ్యా ప్రయాగ వారణాసీ హరిద్వారాది క్షేత్రములలో పరిమిత కాలము కృతనివాసులమై

రామదేవుని కృపనర్థించి తపించి చేసికొన్న సుకృతము. సంపాదించుకొన్న రామానుగ్రహము మమ్ము తప్పక కృతికృత్యులనుచేయును అను మాధైర్య విశ్వాసములు ఫలించి మమ్ము వేధించిన క్లేశములు తొలగిన వని సగర్వ ముగ తెలుపుకొను భాగ్యము నేటికి గలిగినది. కొద్ది కాలవిలంబమైనను తిరిగి యత్నపరులము కాగలిగితిమి,

ఈ మహిమాన్విత కృతిని గూర్చి మేము యథాశక్తిగా చేయుచున్న మా కృషిని అభినందించుచు మేము దర్శించిన శతవృద్ధులు, సంతతసీతా రామ హనుమద్ధ్యానైక చిత్తులు, హనుమత్ పరబ్రహ్మ ప్రతిరూపులు నైన శ్రీ చంద్రమౌళిశాస్త్రిగారును, నిరంతర రామాయణార్థానుసంధాన, ప్రవచన నిరతులును, మాపై చిరతరానురక్తులును, అగు శ్రీమాన్ కోనప్పా చార్య విద్వద్వర్యులును, ఇట్లే లోకమునకు సీతా మాతృచరిత్రను సమర్పించుచున్న గౌతమీ తీరమువారము అని మమ్ము గురించి తెలుపు కొనగనే అమితమైన ఆదరముతో సంభావించి ఈసుందరకృతికి సౌందర్య దీప్తి నొసగిన విద్వత్కవయిత్రి, సీతాభారతీరుద్రమా లక్షణ లసిత యైన డా. లక్ష్మీకాంతమ్మగారును మరియు బహుళములైన ముఖ్య కార్యములందు వ్యగ్రులై యుండియు మా యెడను, మా కృషి యెడను ప్రత్యేకాభిమాన ముతో తమ అమూల్య సమయమును వెచ్చించి మా కోరిక మేరకు ప్రత్యేక ప్రాధాన్యము గల ఈ సంపుటమును తమ సహజ సౌజన్యము తోడను కళాభి నివేశముతోడను సమ్యగముగ పరిశీలించి తమ ఆమోద వచనములను అందజేసి మా నిరీక్షణమును ఫలింప జేసిన ఆచార్య ఎమ్. ఆర్. అప్పారాయ మహోదయులును అవ్యాజానురాగముతో మమ్ము ప్రోత్సహించిన విధము మేము మఱువజాలనిది.

ఈ కృతి ప్రకటనమున జరిగిన విలంబమున మమ్ము మఱల మఱల ప్రబోధించుచు మాపై కృప నెఱపిన తిరుమల వేంకట ప్రభు కృపావీక్షణ ములకు కృతజ్ఞులమై యున్నాము.

ఇట్లు బుధ విధేయులు
సుబోధినీ సమర్పకులు

శ్రీః

శ్రీ చన్ద్రమౌళీశ్వరాయ నమః

శ్రీ మత్పరమ హంస పరివ్రాజకాచార్య వర్య

జగద్గురు శ్రీ శఙ్కర భగవత్పాదాచార్య పరంపరాగతం

శ్రీ కామకోటి పీఠ మహా సంస్థానమ్

కాఞ్చీపురమ్

17-10-1987

శ్రీ పాదానాం

ఆశీర్వచన పత్రమ్

ఆదికవేః శ్రీవాల్మీకేః రామాయణే సుందర కాండస్య ఆంధ్రానువాదాత్మకస్య ప్రతిపదార్థాది విశేష యుక్తస్య అంగుళీయక ప్రదాన నామకః పంచమో భాగః ప్రకాశ్యతే శ్రీ ఎమ్. సుబ్రహ్మణ్య శ్రీ బి. కామేశ్వరరావు సుకృతిభ్యాం ఇతి జ్ఞాత్వా భృశం సంతుష్యామః

పూర్వేభ్యః చతుర్భ్యః భాగేభ్యోఽపి అత్యధికం జన మనోమోదకత్వం అస్య పంచమస్య భవతు శ్రీరామచంద్ర ప్రసాదేన ఇత్యాశాస్మహే॥

నారాయణ స్మృతిః

ప్రస్తుత పంచమ సంపుట ముద్రణము పూర్తి అయి బైండింగునకు వెళ్ళుచున్న చివరిక్షణములో శ్రీకామకోటి పీఠ మహాసంస్థానమునుండి శ్రీపాదుల ఈ ఆశీర్వచనానుగ్రహము లభించినది. విశిష్టమైన ఈ భాగమును అద్దానిచే అలంకరించుకొను భాగ్యము కలిగించిన శ్రీ జగద్గురు పాదులకు కృతజ్ఞులమై నమస్కృతము లర్పించుచున్నాము.

సుబోధినీ సమర్పకులు

శుభాశీస్సులు

శ్రీ సనాతన భాగవత భక్త సమాధ్యక్షులు,
ప్రశాంతి విద్యా న్మహాసభా కేంద్ర పండితులు,
ఎండోమెంటు పరిపాలనాశాఖ మతసలహా సభ్యులు,
మంత్ర శాస్త్ర ప్రవీణ, హనుమ దుపాసక
బ్రహ్మశ్రీ శిష్ట్లా చంద్రమౌళి శాస్త్రి గారు
పెదపాడు ప॥ గో॥ జిల్లా.

శ్లో॥ "యథా సర్వేషు దేవేషు శ్రీరామః పరమో మతః।
తథా రామాయణే శ్రీమాన్ సుందరః కాండ ఉత్తమః॥

[దేవత లందఱియందును శ్రీరాముఁ డుత్తముఁ డైనట్లు శ్రీరామాయణము నందలి కాండములలో సుందర కాండ ముత్తమ మైనది.]

"బీజకాండ మితి ప్రోక్తం సర్వ రామాయణే ష్వపి।"

[సమస్త రామాయణములందును సున్దరకాణ్డయే బీజకాణ్డము. అనగా ప్రధానము.]

శ్లో॥ సప్తసర్గ క్రమేణైవ నిత్యం యః పఠతే పుమాన్।
స పుమాన్ జయ మాప్నోతి సర్వకార్యేషు సర్వదా॥

[సప్తసర్గ క్రమముతో నిత్యపారాయణ మొనర్చు మానవులకు సర్వ కార్య జయము చేకూరును.]

మహాభారతమునందు 'భగవద్గీత' ప్రధానము, రామాయణమునందు 'సున్దరకాణ్డ' ప్రధానము. కాగా- భగవద్గీత కేవల మోక్షప్రదము. కాని సున్దరకాన్డ భోగమోక్ష ప్రదము.

శ్లో॥ యత్రాస్తి భోగో నహి తత్ర మోక్షః యత్రాస్తి మోక్షో
నహి తత్ర భోగః। శ్రీమారుతే స్సేవన
తత్పరాణాం। భోగశ్చ మోక్షశ్చ కరస్థఏవ॥
[హనుమత్తత్వబోధినీ]

అట్టి విశిష్టమైన సున్దరకాండమునందు 'అంగుళీయక ప్రదాన వృత్తాన్తము' అత్యంత ప్రధానమును, రమణీయము నైనది. తత్సంబంధమగు 36వ సర్గను నియమముగ పారాయణమొనర్చు భక్తులకు క్రింది ఫలితము లభించఁ గలదు.

శ్లో॥ విశ్లిష్ట బంధుసంయోగ కామనా చే ద్దనూమతః।
రామాంగుళీ యార్పణం తు సీతాయై సంధ్యయోః పఠేత్॥
అదా వంతేపివా నిత్యం పన సామ్ర ఫలార్పణమ్॥

మిత్రులు శత్రులుగ మారినపుడుగాని, భార్యాభర్తలు మున్నగు ఆప్తులు, సోదరులు, దేశాంతరముల యందున్నవారలు తిరిగి యొకచోట చేరవలెనని కోరుకొను నపుడుగాని శ్రీరామ ముద్రికను హనుమంతుడు సీత కొసగిన సుందరకాండ ముప్పదియారవ సర్గను త్రికాలముల యందు పఠించి పఠనమునకుముందు, అనంతరము పనస ఫలములుకాని, మామిడి పండుకాని నివేదించవలెను. (లేదా సంప్రాప్త ఫలముల నివేదించవచ్చును.)

అట్టి మహిమోపేతమైన సద్గ్రన్థమునకు- పరమ హనుమద్భక్తులగు శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యముగారును, శ్రీ బోయనపల్లి కామేశ్వరరావు గారును- సహృద్భావముతో అన్యోన్య సహకారముతో, ఉపయుక్తము లైన పెక్కు విశేషములుచేర్చి జగద్ధితమైన వ్యాఖ్యానము రచించి భక్తజనుల కందించిరి.

సర్వదేవతా స్వరూపుడగు ఆంజనేయస్వామి వారిని సర్వదా రక్షించుగాక!!!

'ఇతిశమ్'

ఇట్లు,
"హనుమదుపాసక"
శిష్టా చంద్రమౌళిశాస్త్రి.

శుభాకాంక్ష

భాషాప్రవీణ, విద్యాప్రవీణ,
ఉభయవేదాంత ప్రవర్తకులు
శ్రీమాన్ శ్రీమత్తిరుమల పురిపెళ్ల
వేంకట కోనప్పాచార్య స్వామిగారు.
రిటైర్డు ప్రిన్సిపాలు, ఆంధ్రయువతీ కళాశాల
విద్యానగర్ 8-202 రాజమండ్రి.

శ్రీ రామాయణ మహాభారతములు రెండును సుప్రసిద్ధేతిహాసములైనను అందు శ్రీ రామాయణము చాల మంది భారతీయులచే నిత్య పారాయణ గ్రంథముగా ఆదరింపబడుచున్నది. అది ఉత్తమమైన వేదోపబృంహక గ్రంథరాజము. వేదాంతులకు ఉపనిషదర్థ మంజూష, సాహితీ ప్రియులకు మహోత్తమ కావ్యము. అందలి పాత్రలు ఆదర్శనీయములు. అందలి ప్రతి సూక్తియు హృదయ పేటికలో భద్రపరచు కొనవలసినది. అందలి ధర్మములు త్రికాలా బాధితములు. శ్రీ రామాయణ మందలి సుందర కాండము మహా ప్రభావ సంపన్నము. పారాయణ మొనర్చు వారికి అభీష్టఫలముల నీయగల అమోఘ శక్తి సంభరితమైనది. ప్రతి సర్గము ఒక మంత్రరాజమే. తజ్జపమువలన అభీష్ట ప్రాప్తి, అనిష్ట నివృత్తి పొందిన ధన్యులెందరో కలరు.

శ్రీ రామాయణము నందు అయిదవ కాండకు సుందర కాండము అని పేరు. ఈ పేరు చాల విలక్షణమైనది. తక్కిన కాండములకు ఆ భాగములలోని కథా విషయమును బట్టి అయోధ్య, అరణ్య, కిష్కింధ, యుద్ధ కాండములని పేరులు అమరియున్నవి. ఈ అయిదవ కాండకు "సుందర" కాండమను పేరే అందలి నిగూఢార్థవైలక్షణ్యమును వెల్లడించుచున్నది.

"సుందరే సుందరో రామః సుందరే సుందరః కపిః ।
సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్ ॥

సుందరే సుందరం కావ్యం - - -" ఇత్యాదిగ నెందరో సుంద రుల సౌందర్యము ఇందు వర్ణింపబడి యుండుటచే ఇది సుందర కాండ మనుట సమంజసమే. ఈ రీతిగా పై శ్లోకము నందు చెప్పబడిన సీతా రామాంజనేయుల సౌందర్యము బాహ్య మైనట్టిది కాదు. అంతర మైనట్టిది. ఆ అంతర సౌందర్య వర్ణనము చేతనే ఇది సుందర కాండ మైనది.

ఆ అంతర సౌందర్య మేమి ? అనగా ప్రకృతిబద్ధుడైన జీవునకు స్వ స్వరూప, పరస్వరూప జ్ఞానములను బోధించి ఉజ్జీవింప జేయుట. అదియే ఇందు వ్యంగ్యార్థముగా చెప్పబడినది. ఇందు సీత జీవాత్మ, లంక ప్రకృతి, అంజనేయుడు ఆచార్యుడు, రాముడు పరమాత్మ. ఇట్టి అర్థవిశే షము లెన్నియో సుందరకాండము నందు వ్యక్తమగుచున్నవి. వ్యాఖ్యాత లగు గోవిందరాజాచార్యాదులు ఆ విషయములను చక్కగా వ్యాఖ్యానించి యున్నారు. వేదాంతులు అట్టి అర్థవిశేషములను బట్టియే సుందరకాండ సౌందర్యమును మెచ్చుకొందురు.

కేవల సాహితీ పరమైన దృష్టితో చూచినప్పటికిని ఇందు వ్యంగ్యార్థ వైభవమునకు లోటులేదు. ఇంచుమించు ప్రతి శ్లోకమునందును వాచ్యార్థ మును మించినట్టి వ్యంగ్యార్థము అతి సుందరముగా గోచరించుచునే యుండును.

సీత జాడతెలియక రాముడు, సుగ్రీవుడు, సీతాన్వేషణముకొరకై బయలుదేరిన వానరులు అందరును ఆందోళన నొందుచున్నారు. సీత కూడ రాముని జాడతెలియక వేదనపడుచున్నది. చివరకు ఈ సుందర కాండలో అంజనేయుని కృషి ఫలించి అందరి ఆందోళనమును తొలగి సుఖపర్య వసాయి యైనది. కావుననే అశుభములు తొలగి శుభములను బడ

యుటకై సుందరకాండమును వివిధ నియమములతో పారాయణము చేయుచున్న వారును చేయించుకొనుచున్న వారును ఉన్నారు. వారు తమ అభీష్టములను బడయుట చూచుచున్నాము.

ఇట్టి మహా మహిమోపేతమైన, గంభీరార్థ బోధకమైన వాల్మీకి రామాయణాంతర్గత సుందరకాండకు సుప్రసిద్ధములైన పూర్వ వ్యాఖ్యాతల వ్యాఖ్యానములను పరిశీలించి ఆయంశముల నన్నింటిని తమ స్వబోధినీ వ్యాఖ్యలో చేర్చి సుబోధకమైన భాషలో, శైలిలో పండిత, సామాన్య, జన గ్రాహ్యముగా సుందరకాండ రహస్యార్థములను వివరించి శ్రీ సుబ్రహ్మణ్య కామేశ్వరరావుగార లిద్దరును తెలుగువారికి మహోపకార మొనర్చి యున్నారు. దాదాపు మూడు వేల శ్లోకములు గల సుందరకాండమును ప్రతిపదార్థ తాత్పర్య విశేషార్థములతో వివరింప బూనుట మహా సాహసిక కృత్యము. ఈ సాహస కృత్యములో శ్రీ సుబ్రహ్మణము గారును శ్రీ కామేశ్వరరావు గారును చరితార్థులైనట్లుగనే భావింపవచ్చును. ఇప్పటికి నలభై సర్గల వ్యాఖ్యానము పూర్తియైనది. ఐదు సంపుటములు వెలువడినవి. తక్కిన భాగము మరియొక మూడు సంపుటములు కావచ్చును. అవియును ఆ శ్రీనివాసుని దయా విశేషముచే తొందరగా వెలువడి ఈ మహనీయుల ఉభయుల కృషి పూర్తిగా సఫలము కావలెనని నా ఆకాంక్ష.

ఎస్. టి. పి. వి. కోనప్పాచార్యులు

సుందర కాండ సౌందర్య దీప్తి

కళా ప్రపూర్ణ, ఆంధ్ర సరస్వతి,
సాహితీ రుద్రమ, ధర్మప్రచార భారతి,
డా. ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారు
బాపట్ల గుంటూరు జిల్లా.

ప్రపంచ వాఙ్మయములలో ఆదికావ్యమై ప్రాణికోటియొక్క ముఖ్యముగ మానవులయొక్క జీవిత నైతిక ప్రమాణాదర్శ కావ్యరాజమై విలసిల్లినది వాల్మీకికృతమైన శ్రీమద్రామాయణము.

విగ్రహవంతమైన ధర్మలక్షణము, రామాయణకావ్య నాయకుడైన శ్రీరాముని మూర్తిగా నవతరించి 'త్యాగేనైకేన అమృత మశ్నుతే' అను సారోక్తి యుద్భవింపుటకు ప్రాణభూతమైన, సీతారాముల మహోత్తరమైనట్టి దివ్యత్యాగమే శ్రీమద్రామాయణమునకు ఇతివృత్తము.

శ్రీరామావతారమునకుపూర్వము ప్రవర్తిల్లిన మత్స్య, కూర్మ వరాహా ద్యవతారముల సమయముల యందు సంభవింపని శక్త్యవతరణము మహాసాధ్వీ శిరోరత్నమైన సీతామహాదేవీ రూపముగ త్రేతాయుగమున సంఘటితమైనది. అదియును శివభక్తుడును, మహాతపస్వియు, మహాపరాక్రమశాలియు నగు అంజనాసూనుని యంతటివానిచే "అహో రూప మహో బలం" అనుచు మహోత్కృష్టముగ వర్ణింపబడదగినంతటి ఉజ్జ్వల బల రూప సంపన్నుడై విరాజిల్లియు, కామ క్రోధ మద మాత్సర్యా ద్యరిషట్కమును జయింపజాలక పరదారా వ్యామోహ వ్యసనముచే నంధీభూత చేతస్కుడును, స్వయంకృతాపరాధ తిరస్కృతి తేజో బలసంపన్నుడునై,

అసుర కృత్యాచరణముచే నసురయై, లోక విద్రావణుడుగా పరిణమిల్లిన రావణాసురుని సంహారణార్థము సంఘటితమైనది.

కావుననే ఆదికవి "సీతాయా శ్చరితం మహత్; పౌలస్త్యవధ మిత్యేవ" అని రామాయణ కావ్యమునకు ప్రయోజన రూపముగా సత్యేతరముకాని సార్థక్య భాషణ మొనరించి యున్నాడు.

అట్టి మహత్తర ప్రయోజన సాధనా రూపమైన రామాయణమునకు మహామాలా రత్నముగా అభిలేఖ్యమైన అనుపమ సౌంద ర్యాంచిత మైన కాండము - సుందర కాండము.

జీవ తత్త్వమును, జీవేశ తత్త్వమును ఎన్నడును విడదీయరాని ప్రణయైక్య సంధాన ప్రతిరూపములు,

ఆసురీ గుణాహంకారాభినివిష్టుడై పరమ మూర్ఖుడై త్రైలోక్యాప త్సంపాదనా పరాయణ కారణమైన స్వార్థ ప్రవృత్తి శిరోమణియైన రావణుని సంహరించి జగచ్ఛ్రేయమును కల్పించుటకై జగన్మాతయైన సీతా సీమంతినీ మతల్లి శ్రీరామచంద్రుని యొక్క విరహమును అనుభవింప వలసి వచ్చినది.

అట్లగుట సృష్టికారణమైన జీవ జీవేశ దివ్య ప్రణ యానుసంధానమునకే ముప్పువాటిల్లినది. ఈ ప్రమాదముచే "సోఽకామయత బహూస్యాం ప్రజాయే యేత" అను పరమాత్మ నిర్దేశమునకు, మహాసంకల్పమునకు మహోపద్రవము కల్గి జగత్ప్రియము సౌందర్యవిహీనము కాగల ప్రమాదస్థితి యేర్పడినది.

పరమాత్ముని సంకల్ప రూపమైన సృష్టికార్యమున మూల మాతృకయై ప్రకృతి తత్త్వముగ భువి నవతరించిన పరమ పతివ్రతా శిరోమణియైన సీతా మహాసాధ్వీ విరహముతో కృశించియున్న పరంధాముడైన శ్రీ రామచంద్రునకును శ్రీరామ విరహముతో అహితమైన లంకాద్వీప మహారణ్యమున నశోక తరు చ్ఛాయను అత్యంత దుస్సహవిరహాగ్ని కీలా

దందహ్యమానయై దురపిల్లుచున్న జనకాత్మజకును పునస్సుసంధానిమి నకు తగు పథకమును ఊహించి మహాసృష్టి విరమణ రూపమగు మహా ప్రళయమును నివారించి తిరిగి త్రిభువనములను, పాంచభౌతికమగు దివ్య పౌంద ర్యానందా నుభూతి నవిరామముగ పొందుటకు కారణభూతుడై సది- మహాసత్త్వ సంపన్నుడు, అత్యంత బుద్ధిశాలి, మనోహర తేజోలంకారుడు నగు హనుమయే.

కావుననే 'కర్మను కౌశల'మును యోగముగా పొంది, 'బుద్ధిమతాం వరః' అను ప్రస్తుతి నొంది, అమేయ జవ సత్త్వ సంపత్తి కలిగి, రామమాతగా మాత్రమే తన అభిధేయమ శాశ్వతత్త్వము నొంద వలె ననెడు త్యాగ సౌందర్య ప్రతిపత్తి ప్రవృత్తిగా కల మహనీయుడు హనుమ నాయకుడుగా కల కాండమును ఋషి సత్తముడైన వాల్మీకి మహా కవి సుందర కాండముగ భావించి కీర్తించి అఖిల జగచ్ఛ్రేయ స్సంపాద కుడౌ హనుమను యుక్త రీతిని సంభావించి సుందర కాండమున సంకీర్తన మొనరించినాడు,

ఇంత మహానుభావుకతా ప్రతిపన్నమైన సుందరకాండకు పూర్వ గౌతమీ మండల నివసన పుణ్యకీర్తులు, మహనీయ మూర్తులు, విద్వత్క వితా శిరోలంకారులు, అఖండ పాండితీ మండితులు నైన శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్య భాగధేయులును, శ్రీ బోయనపల్లి కామేశ్వర సుధీ సంప న్నులును గొప్ప కృషి సలిపి పుణ్యకార్య లవలేశమును సహింపక, నిరం తర దురంత దురిత మహార్ణవ మగ్నులై, రావణ సమానులై, విద్వేష కా ర్యాచరణ ధూర్త మతులైన మర్త్యులతో నిండియున్న నేటి స్వార్థపర పౌర జీవన వ్యవసాయకమైన దుర్జన సమాజమునకు విభ్రిత మగుటకును, ఈ భయంకర జనారణ్యమున ఈ ధార్మిక కావ్యము విస్తృత ప్రచారము నంది అపమార్గ ప్రవృత్తు లగు నేటి దుర్జన సమాజమునం దొకింతయైన శోభనా స్పదమగు పరిణతి కల్గుటకొఱకును ఈ సుందరకాండమునకు అతిసరళమును సాంప్రదాయకము నగు పద్ధతిలో వ్యాఖ్యానమును రచించి ఆంధ్ర లోక మునకు అందించిరి.

అంతేకాదు, గోవిందరాజీయము, తిలకము, వాసుదాసస్వామి మందరము మున్నగు వ్యాఖ్యాన విశేషములను కూడ అవసరమైనప్పుడు ఉట్టంకించుటచే రామాయణ మహాకావ్య వ్యాఖ్యాతల అందఱి భావములను ఒక్కచో చేర్చి మన కందించినవారైరి.

ఉదాహరణకు సుందర కాండయందలి ప్రధానమైన అంగుళీయక ప్రదానఘట్టము నొకించుక పరిశీలింతము.

"వానరో౽హం మహాభాగే దూతో రామస్య ధీమతః।
రామనామాంకితం చేదం పశ్య దే వ్యంగుళీయకమ్॥"

అని చెప్పుచు హనుమ సీతమ్మ చేతికి శ్రీరాముని నామాంకితమైన అంగుళీయకమును అందించినాడు. ఇచట విశేష మే మనగా శ్రీరామ చంద్రుని హస్తమునే ఆమె కందించి ఆ మహా పవిత్ర మూర్తుల సుచిర విరహ శోకమునకు స్వస్తి పలికినాడు. ఈ అంగుళీయక ప్రదాన ఘట్టము నకు నిజమైన అర్థ మిదియే. ఆ యంశమును విశదీకరించు-

"గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కర విభూషణమ్।
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితా౽భవత్॥"

అను ఈ శ్లోకమున ఆ మహనీ యార్థము ధ్వనించుచునే యున్నది ఆ ధ్వనిని ఇందలి గోవిందరాజీయ వ్యాఖ్య సుస్పష్టముగ మనకు హృద్గతము చేసినది.

ఇట్టి మహనీయ సుబోధినీ వివరణముతో సుందర కాండమును మన కందించిన శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్య వరేణ్యులకును శ్రీ బోయన పల్లి కామేశ్వర రాయ ధుర్యులకును మనఃపూర్వక ప్రణతి శతము నందించుచు విరమించు చున్నాను.

ఈ. లక్ష్మీ కాన్తమ్మ.

సుందర సుబోధిని

ఆచార్య

ఎమ్. ఆర్. అప్పారావుగారు

మాజీ పార్లమెంటు సభ్యులు

మాజీ ఆంధ్రప్రదేశ ప్రభుత్వామాత్యులు

మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులు

ఉయ్యూరు గార్డెన్స్ - నూజివీడు

కృష్ణా జిల్లా.

శ్రీమద్వాల్మీకి రామాయణము సంపూర్ణ మానవుని జీవిత యాత్రను చిత్రించు మహా కావ్యము. ఆదర్శ గ్రంథము. మానవేతిహాసమున జరిగే పరస్పర సంఘర్షణలకును, సమస్యలకును, చక్కని పరిష్కారమును సూచించు విజ్ఞాన దీపిక. ఆధ్యాత్మిక సంపదకు ఆలవాలము. షట్కాండ పరిమితమైన ఈ రామాయణమున సుందరకాండము ఆధి వ్యాధి నివారణయును, సకల కార్యసిద్ధియును, విజయ సంపాదనమును కరతలామలకము చేయుచున్న పారాయణ గ్రంథము-

ముఖ్యముగా సీతారాముల చిత్త వృత్తినీ, రామభక్తుడైన హనుమానుని అసామాన్య ప్రజ్ఞా పాటవాన్ని, వాక్చాతుర్యాన్ని, శాస్త్ర వైదుష్యాన్ని లోకజ్ఞతనూ, ఈ సుందరకాండము నిరూపించుచున్నది. అందువలనే సౌందర్యోపాసన ప్రాధాన్యమునొంది ఈ కాండము "సుందరకాండము" అను అన్వర్థనామము సంతరించు కొనినది. ఈ అయిదవ సంపుటమునందు

సుందరకాండములోని 32వ సర్గనుండి 40వ సర్గవరకు ఆరు సర్గలు కలవు.

వాల్మీకి రామాయణమునకు ఆయా మతముల వారు స్వీయ మతాను

గుణముగ ఎన్నో వ్యాఖ్యానములు రచించినారు. ఆ వ్యాఖ్యానములను అర్థము చేసికొని, భావములను గ్రహించుటకు, అపారపాండిత్యము, శాస్త్రవైదుష్యము, మత సిద్ధాంత పరిచయమును, కావలయును. సామాన్యులకు అవి అందుబాటులో నుండవు. సామాన్యులను దృష్టిలో నుంచుకొని శ్లోకమును, శ్లోకములోని పదవిభాగమును, అన్వయ క్రమమును, ప్రతి పదార్థమును, ఆయా మత పరములైన వ్యాఖ్యాన విశేషములను, సంగ్రహముగా తాత్పర్యమును, ఈ అయిదవ సంపుటమున విశదము చేయుటచే "సుబోధిని" అను పేరు ఈ ఆంధ్రి వివరణమునకు తగియున్నది. సరళముగ, సుబోధకముగ, ఈ వివరణము వ్రాయబడినది. ఆయా శ్లోకములలోని విశేషముల ననుసరించి వివరణ విపులముగా నుండుటచే పాఠకుల కవసర మనుకున్నచో వివరముగను, సంగ్రహ మనుకున్నచో సంగ్రహముగను సూచింపబడినది.

ఈ అయిదవ సంపుటమునందు 36వ సర్గలో హనుమంతుడు, తాను రామదూత యను నమ్మకమును సీతమ్మకు కలిగించును. 36వ సర్గలో అంగుళీయక ప్రదానము జరుగును. 37వ సర్గలో సీతమ్మను తాను తీసికొని రాక పోవుటలోని ఔచిత్యము వివరింపబడినది. 38వ సర్గలో రామునకు నమ్మకము కలిగించు వాయస వృత్తాంత కథ వివరింపబడినది. 39వ సర్గలో హనుమత్సందేశమున్నూ, 40వ సర్గలో హనుమ త్ప్రేషణమున్నూ వివరింపబడినవి.

రామాయణముపట్ల అనాదిగా పెరిగిన ఆదరము, మరింత వృద్ధి యగుటకును క్రమపద్ధతిలో సంస్కృత రామాయణమునర్థము చేసికొని విజ్ఞాన మార్జించుటకును, మానసికోల్లాసమును పొందుటకును, ఈ గ్రంథము మిక్కిలి ఉపకరించుచున్నది.

రామాయణమున కంతకును ఇట్టి సుబోధక వివరణ మవసరమే. ఇట్టి సత్కృషికి, సత్ప్రయత్నమునకును శ్రీ సుబ్రహ్మణ్యము గారికిని, శ్రీ కామేశ్వరరావు గారికిని దేవ దేవుడైన శ్రీరామచంద్రుని అనుగ్రహము తప్పక లభ్యమై యుండును. మిగిలిన సంపుటములు గూడ త్వరలోనే వెలువడగల వనియు, అవి కూడ తప్పక సామాన్య పాఠకుల ఆదరణకు నోచుకొనగల వనియు ఆశించుచున్నాను. అట్టి శక్తి యుక్తులను ఈ ఉభయులకును తప్పక సర్వజగత్ స్వామియైన శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహింప గలడనుటలో సందేహము లేదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఆచార్య ఎమ్. ఆర్. అప్పారావు.

జానకీప్రియం గాయత్రి

నమ స్సతాం శరణ్యాయ రామాయ కరుణాబ్ధయే,
సీతాలక్ష్మణ యుక్తాయ హనూమ త్సేవితాంఘ్రయే॥ 1

ఆశ్వాసితా హనుమతా ముదితా చాంగుళీయకాత్,
సీతామాతా భవేత్ ప్రీతా గాయత్రా రామసంస్త
వాత్॥ 2

1 సుజన శరణ్యుడు, కారుణ్యసాగరుడు, హనూమత్సీతా లక్ష్మణ సంసేవితుడు నగు శ్రీరామచంద్రునకు నమస్కారము.

2 హనుమ తెలుపుచున్న రామప్రభుని కుశలవార్తను, రూపగుణ వర్ణనమును చెవులార వినుచు చిరకాల భర్తృవియోగ దుఃఖమును మఱచి హనుమయొసగిన రామనామాంకితమగు అంగుళీయకమును గ్రహించి అమితానందము నొందుచున్న సందర్భమున గాయత్రీ రూపముతో సమర్పింపబడిన ఈ రామసంస్తవము జానకీమాతకు మిక్కిలి ప్రియమైన దగును.

"దాశరథాయ విద్మహే సీతావల్లభాయ ధీమహి
తన్నో రామః ప్రచోదయాత్"

జానకీ ప్రియ గాయత్రీ

తత్పరో లభతే శ్రేయః ధ్యాయన్ భక్తో దయామయమ్,
సత్యం శివం సుందరం యం స రామోఽవతు నస్సదా॥

శ్రీరాముడు సత్య శివ సుందర రూపుడైన వేలుపు. తనను నమ్మి కొలుచు భక్తులను ఆ దయామయుడు సర్వశ్రేయముల నొసగి కాచు చుండును. అట్టి కళ్యాణమూర్తి మమ్మెల్లవేళల కాపాడుచుండుగాక.

సవితుర్వంశసంభూతో భాసయ త్యద్భుతప్రభః।
యోఽంతర్గృహిశ్చ భూతానాం స రామోఽవతు నస్సదా

భాస్కరుని వంశమునందు జనించిన శ్రీరాముని ప్రకాశము ఉజ్జ్వలమై యుండుటలో విశేషములేదు. రామతేజము ఇంకను విశిష్టమైనది, అద్భుతమైనది. ఆ తేజస్సు లోకుల అంతరంగములందు గూడ ప్రసరించి దివారాత్రములువాటిని ప్రకాశింపజేయుచుండును, అట్టి దివ్యతేజోమూర్తి మమ్ము సదా రక్షించుగాక.

విశ్వామిత్ర వసిష్ఠాత్రి వాల్మీక్యాది మునిస్తుతః,
వేదవేద్య నరశ్రేష్ఠస్స రామోఽవతు నస్సదా॥ 3

నరవరుడైన దశరథరాముని విశిష్టతనుగూర్చి తెలిసికొన్నచో బోధపడున దే మనగా- మానవుడు ప్రాపంచిక ప్రలోభములకు వశుడుగాకుండ నిష్ఠతో ధర్మపరాయణుడై వర్తించినయెడల ఆదర్శపురుషుడుగా వన్నె కెక్కి మహామునులకుగూడ స్తవనీయుడగుచు వేదప్రస్తూయమానుడగు పరమ పురుషుడుగా తేజరిల్లును-అను సత్యము; అట్టి పరమ పురుషుడు సదా మమ్ము రక్షించుగాక.

తద్రీయా(శ్రమిణశ్చాపి యస్య లీలామృతం ముహుః,
సేవమానా నైవ తృప్తా స్స రామో ఽవతు న స్సదా॥4

గుణాతీత స్థితినిపొంది శుద్ధపరబ్రహ్మ నుపాసించు పరమయోగులు సైతము శ్రీరాముడు లోకమునందు కనబఱచిన లీలావిభూతి చెవుల బడు చున్నప్పుడు ఆనంద తన్మయత్వము నొందుచు మఱల మఱల ఆతని చరితామృతమును గ్రోలుటకై మనసుపడుచుందురు. అట్టి మధురచరితుడు నిత్యము మమ్ము రక్షించుగాక.

వరేణ్యో వారిజాతాక్షో వర్షాభ్రశ్యామ సుందరః,
విశాల దృఢవక్షా యః స్స రామో ఽవతు న స్సదా॥ 5

ఆర్తశరణ్యుడైన ప్రభువరేణ్యుడుగా, కరుణామృతమును వర్షించు కమలలోచనుడుగా, వర్షామేఘమువలె స్నిగ్ధశ్యామలమైన దేహశోభగల సౌందర్యమూర్తిగా, వీరతాస్ఫోరక విశాల దృఢవక్షుడుగా భక్తులకు కనుల పండువుసేయు శ్రీరాముడు సదా మమ్ము రక్షించుగాక.

రేణూన్ యత్పాదపద్మస్థాన్ ధారయంత స్స్వ మూర్ధసు,
రమంతే యోగినో యస్మిన్ స రామోఽవతు న స్సదా॥6

మహాయోగులు సమాధిస్థితిలోనుండి శ్రీరాముని జగన్మోహన మూర్తిని సాక్షాత్కరింపజేసికొని ఆతని పాదములకు మొకరిల్లుదురు. తమ వాంఛితమున కనుగుణముగా ఆ దివ్యమూర్తి పాదపద్మ పరాగరేణువులు తమ శిరములపై పడుచుండగా అమితానందము నొందుచుందురు. అట్టి యోగివంద్యుడు సదా మమ్ము గాచుగాక.

నియమ్య సుదృఢం చిత్తం స్వధర్మం బహుమన్వతే,
త్యక్తమోహా యస్యభక్తా స్స రామోఽవతు న స్సదా॥7

శ్రీరాముని త్యాగమయ జీవితము తమ్ము ప్రభావితులను జేయు చుండగా ఆతని భక్తులు తమ మనస్సును అల్పవిషయముల నుండియు,

తాత్కాలిక భోగములనుండియు మఱలించుకొని మోహరహితులై జీవితపరమార్థము నిజధర్మ నిర్వహణమునందే యున్నదను ఎఱుక కలిగి ఆదర్శప్రాయమైన ఉత్తమ జీవితమును గడపుదురు. అట్టి మహనీయ చరితుడు సదా మమ్ము రక్షించుగాక.

యం సన్మధుర నామానం భవాన్యాసహ శంకరః,
గాయన్ సమ్మోదితే నిత్యం స రామోఽవతు నస్సదా।

శ్రీరాముని నామమాధుర్యము సంపూర్ణముగా నెఱిగిన మహేశ్వరుడు తన అర్ధాంగి గౌరితోకలసి నిరంతరము రామనామమును గానము చేయుచు తన్నామామృత సేవనమున ఆనందతన్మయుడై యుండును. అటి మధురనాముడు మాకు రక్షకుడై యుండుగాక.

భర్తా య స్సర్వలోకానాం దాతా యః స్సర్వసంపదామ్,
హర్తా యో భవదుఃఖానాం స రామోఽవతు న స్సదా.

శ్రీరాముడు సర్వలోకముల యోగక్షేమములను వహించు నిఖిల జగత్ప్రభువు. భక్తులకు సమస్త విభవములను గూర్చు ఇలువేలుపు. వారికి జీవితములో కలుగు క్లేశములను బాపి కాపాడు భక్తవత్సలుడు. అట్టి రామప్రభువు మమ్మెల్లవేళల కాపాడుచుండుగాక.

గోప్తా స్వ పర ధర్మాణాం గోప్తా య శ్శరణార్థినామ్,
గోచరో హృది భక్తానం స రామో ఽవతు న స్సదా॥10

ధర్మరక్షణార్థమై భూమిపై అవతరించిన శ్రీరాముడు తన ధర్మము నెడ ఎట్టి దీక్ష కలిగియుండునో పరులు కూడ అట్టి దీక్షతోడనే తమ ధర్మమును నిర్వహింపవలెనని కోరి వారికి తోడుగ నిలచుచుండును. తనను శరణు కోరిన ఆపన్నుల కభయ మొసగి కాపాడుచుండును. నిత్యయుక్తులై తన్మయత్వముతో తన్ను ధ్యానించువారు కోరినప్పుడెల్ల హృదయమునందు

సాక్షాత్కరించి వారి నానందింపజేయుచుండును. అట్టి కరుణాళువు సదా మమ్ము గాచుగాక.

దేవదేవో దశగ్రీవ ఖరాద్యరి నిషూదనః,
విభీషణశరణ్యో యస్స రామో౽వతు నస్సదా॥ 11

రామప్రభువు దేవతల కామితములనుగూడ తీర్చు దేవదేవుడు లోకోపద్రవకరులైన ఖరుడు దశకంఠుడు మున్నగు ఖలులను రూపుమాపు జగదేకవీరుడు. దానవులైనను విభీషణునివలె సాధువర్తనులైన యెడల వారి కభయమొసగి శ్రేయములను గూర్చు సుజనబంధువు. అట్టి మహనీయుడు సదా మమ్ము గాచుగాక.

వత్సలో భ్రాతృషు స్వేషు భక్త భృత్యజనేషు చ,
వత్సల స్సర్వభూతేషు స రామో౽వతు న స్సదా॥ 12

ప్రేమమూర్తియైన శ్రీరామునికి తమ్ములపైగల అనురాగము అనుపమానమైనది. అతని వాత్సల్యామృతము ఆశ్రితులైన వారికెల్లరకి ననుభవములో నున్నట్టిదే. వారు వీరననేల? అతని ప్రేమసుధ సమయము వచ్చినప్పుడెల్ల ఎల్ల జీవులయెడ సమముగానే జాలువారుచుండును. అట్టి వత్సలహృదయుడు సదా మమ్ము రక్షించుగాక.

స్యందమానామృతరసై ర్వీక్షితై ర్భాషితై రపి,
హృదిస్థో౽వతి భక్తాన్ యస్స రామో౽వతు నస్సదా॥

భక్తసులభుడైన శ్రీరాముడు తనకు తమసర్వస్వము నర్పించి తన సేవలోనే నిమగ్నులై యుండు భక్తుల హృదయపీఠమున అధివసించి ఆప్తబంధువువలె ప్రేమామృత పూర్ణములైన వీక్షణములతోడను భాషణములతోడను వారి నానందింపజేయుచుండును. అట్టి భక్తజన బాంధవుడు సదా మమ్ము బ్రోచుగాక.

ధీరో మేరురి వాత్యంతం గంభీర స్సాగరోయథా,
సుధీవేద్య చరిత్రో య స్స రామో ఉవతు న స్సదా॥14

మేరువగ ధీరుడును సాగర గంభీరుడు నగు శ్రీరాముని గుణగణములను సంపూర్ణముగా గ్రహింపగలిగినవారు వసిష్ఠాది మహాజ్ఞానులు మాత్రమే. కావుననే వారాతనిని లోకాభిరాము డనియు, అప్రతిమ ప్రభావు డనియు, కళ్యాణగుణసాగరు డనియు వేనోళ్ల కీర్తించుచుందురు. అట్టి మహనీయ చరితుడు మమ్ము సదా రక్షించుగాక.

ప్వంగుసన్నందన హస్తాబ్జ సంసేవిత పదాంబుజః,
మహాబాహు ర్మహేష్వాస స్స రామో ఉవతు న స్సదా॥

ప్రియభక్తుడైన మహావీరుడగు మరున్నందనుడు నిరంతరము తన సన్నిధినుండి సేవించుచుండగా ఆజాను బాహువులలో ప్రకాశించు జగదేక ధనుర్ధరుడగు వీరరాఘవుడు సకలలోకములకును అభయ ప్రదాయియైన వేలుపు. అట్టి జగత్ప్రభువు సదా మమ్ము రక్షించుగాక.

హితకృత్సచ్చరిత్రాణాం భయకృద్యో దురాత్మనామ్,
హిమాంశువ జ్జనానందీ స రామో ఉవతు న స్సదా॥16

సాధుజన పరిత్రాణము దుష్టజన వినాశనము అను తన అవతార ప్రయోజనములను నెరవేర్చు రఘువీరుడైన రామచంద్రుడు పూర్ణచంద్రుని వలె జగజ్జనా నందకరుడు. అట్టి మేలైన వేలుపు ఎల్లవేళల మాకు మేలు గూర్చుచు మమ్మేలుగాక.

ధిషణో ధిషణాయాం యః ప్రభాయాం యః ప్రభాకరః,
సుందర స్సుందరాణాం య స్స రామో ఉవతు న స్సదా17

అసాధారణ గుణవిలసితుడగు శ్రీరాముడు ప్రజ్ఞాతిశయమున బృహస్పతి; తేజస్సంపదయందు ప్రభాకరుడు; సౌందర్య విశేషమునందు సాటిలేని జగదేక సుందరుడు. అట్టి విశిష్ట గుణాకరుని రక్షణము సదా మాకు లభించుగాక.

యో యత్ఫలం కామయతే యోజయత్యేవ తేన తమ్,
యో భక్తానాం కల్పవృక్షః స రామో ఽవతు న స్సదా॥

ఏయే భక్తు డేయే ఫలము నాసించి తనను సేవించునో వాని వాని కాయా ఫలమును ప్రసాదించి పూర్ణమనోరథుని చేయు కల్పవృక్షమే రాముడు. అట్టి మహిమోదారుడు మమ్ము సఫలురనుచేసి రక్షించుగాక.

యో బ్రాహ్మ మన్త్రం వేదాంశ్చ వేద వేదవిదాం వరః,
యో నః కళ్యాణకృత్ స్వామీ స రామోఽవతు న స్సదా.

శ్రీరాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగ దక్షుడైన మహాస్త్ర కోవిదుడు. వేదవేత్తలలో అగ్రగణ్యుడైన వేదశాస్త్రార్థ తత్త్వజ్ఞుడు. భక్తులకును మస్త సన్మంగళములనొసగు స్వామి. అట్టి ప్రభువు సదా యమ్ము రక్షించుగాక.

నతాస్సంతః ప్రభో ర్యస్య చరణాంబుజ సన్నిధౌ,
భవం త్యత్యున్నతా స్సంత స్స రామో ఽవతు న స్సదా॥

రామదేవుని భక్తుల భాగ్యము అప్రతిమమైనది. ఆ ధన్యాత్ములు తమ స్వామి పాదపద్మములయందు మోకరిల్లుచు భక్తితో క్రిందికి వంగుదురు తత్ఫలితముగా వారు అత్యున్నతమైన పదవులు పొంది గొప్ప ఉచ్ఛస్థితి నొందుదురు. అట్టి ఆశ్రిత జనోద్ధరణుడు సదా మమ్ము బ్రోచుగాక.

ప్రమోదజనకో యో ఽభూత్ జనన్యాః జనకస్యచ,
జనకస్యచ జానక్యా స్స రామో ఽవతు న స్సదా॥ 21

సకల జనానందకరుడైన రామచంద్రుడు ప్రధానముగా - చిరకాల తపః ఫలముగా జనించిన ముద్దుబిడ్డగా కన్న తల్లిదండ్రులైన కౌసల్యకును దశరథునకును మహానందము కూర్చినాడు. అట్లే దుష్కరమైన తన ప్రతిజ్ఞకు భంగము వాటిల్లకుండ లభించిన వీరవరుడుగా తన మామయైన జనకునకును అర్ధాంగి జానకికిని సాటిలేని ఆనందము కలిగించినాడు. అట్టి ఆనంద నిలయుడు అనవరతము మమ్ము రక్షించుగాక.

చోదయన్ మానవాన్ సర్వాన్ స్వీయాచరణ వర్త్మనా,
నియుంక్తే య స్స్వధర్మేషు స రామో ఽవతు న స్సదా॥

లోకమునందు ధర్మమును స్థాపించుటయే లక్ష్యముగా నుండిన శ్రీ రాముడు ప్రజలను ధర్మవర్తనులనుగా చేయుటకై చేపట్టిన మార్గము- తానాధర్మములను స్వయముగా ఆచరించి చూపుటయే. అతని ఆ వర్తనమే జనులకు మహోపదేశముగా, ప్రభుశాసనముగానుండి వారిని ధర్మముతప్పని సద్వర్తనులనుగా తీర్చిదిద్దినది. అట్టి ధర్మమూర్తి మమ్ము సదా రక్షించుగాక.

దయామృత మహాసింధు ర్దాంతో దశరథాత్మజః,
దక్షో ఽక్షోభ్యో దక్షిణో యః స న రామో ఽవతు న స్సదా॥

దయామృత సాగరుడైన దశరథనందనుడు దాంతుడు, దక్షుడు, దాక్షిణ్యగుణ శోభితుడు, ఎట్టి పరిస్థితియందును క్షుభితముగాని ఆత్మశక్తి గలవాడు. అట్టి మహాత్ముడు మమ్ము రక్షించుగాక.

యాతి ప్రచోదనాం ధర్మే యాతి చానంద మక్షయమ్,
యం గాయన్ శుద్ధధీ ర్మర్త్య స్స రామో ఽవతు న స్సదా॥

శ్రీరాముని పావనచరితమును గానముచేయు మానవుడు పరిశుద్ధ హృదయు డగును. నిర్మల చిత్తముతో ధర్మాచరణము చేయుచు జీవిత పరమార్థమైన ఆత్మవికాసమును పొంది శాశ్వతానందసిద్ధి నందును. అట్టి రామవిభుడు మాకు చిరత రానందమును గూర్చి రక్షించుగాక.

జానకీప్రియ గాయత్ర్యాః పఠనం ప్రీతయే భవేత్,
రామస్యచైవ సీతాయాః గాయత్ర్యాశ్చ హనూమతః॥

గాయత్రీమంత్ర వర్ణాఢ్యా వర్ణితాత్మేశ సద్గుణా,
జానకీప్రియ గాయత్రీ స్యా ద్దేవా సకలప్రియా॥

హరిః ఓం తత్ సత్.

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

శ్రీమద్వాల్మీకి రామాయణే

సుందర కాండే

పంచత్రింశ స్సర్గః

శ్లో॥ తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ
వానరర్షభాత్
ఉవాచ వచనం సాంత్వ మిదం మధురయా గిరా. 1

పదచ్ఛేదము :– తాం – తు – రామకథాం – శ్రుత్వా – వైదేహీ – వానరర్షభాత్ – ఉవాచ – వచనం – సాంత్వం – ఇదం – మధురయా – గిరా.

అన్వయక్రమము :– వైదేహీ వానరర్షభాత్ తాం రామకథాం శ్రుత్వా మధురయా గిరా ఇదం సాంత్వం వచనం ఉవాచ.

ప్రతిపదార్థము :– వైదేహీ = జానకీదేవి, వానరర్షభాత్ = వానరశ్రేష్ఠుడైన హనుమంతునినుండి; తాం రామకథాం = ఆ శ్రీరాముని చరితమును, శ్రుత్వా = వినిని, మధురయా గిరా = తీయని మాటతో, ఇదం సాంత్వం వచనం = ఈ సౌమ్యమైన మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :– సీతాదేవి హనుమంతుడువినిపించిన ఆ శ్రీరాముని వృత్తాంతమును సంతోషముతో విని, మధురమైన వచనములతో సౌమ్యముగ హనుమంతుని చూచి ఇట్లు పలికెను.

శ్లో॥ క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్,
వానరాణాం నరాణాంచ కథ మాసీ త్సమాగమః. 2

పదచ్ఛేదము :- క్వ - తే - రామేణ - సంసర్గః - కథం - జానాసి - లక్ష్మణం - వానరాణాం - నరాణాం - చ - కథం - ఆసీత్ - సమాగమః.

అన్వయక్రమము :- తే రామేణ సంసర్గః క్వ? (త్వం) లక్ష్మణం కథం జానాసి? వానరాణాం నరాణాంచ సమాగమః కథం ఆసీత్?

ప్రతిపదార్థము :- తే = నీకు, రామేణ = శ్రీరామునితో, సంసర్గః = కలయిక, క్వ = ఎచ్చట? (త్వం = నీవు) లక్ష్మణం = లక్ష్మణుని, కథం = ఎట్లు, జానాసి = ఎఱుగుదువు? వానరాణాం = వానరులకును, నరాణాం చ = నరులకును, సమాగమః = సమావేశము, కథం ఆసీత్ = ఎట్లు ఆయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.-

తనిశ్లోకి .- గురుకులవాసయోగ్యతలేనట్టి వానరులకును, వసిష్ఠశిష్యులైన రామలక్ష్మణులకును కలయిక ఎట్లు సంభవించెను? వానరులు శాస్త్రశిక్షామారులు గావున నాగరికులతో వారికి సంపర్కము అసంభవమై యుండును గదాయని సీతమ్మ భావము.

తాత్పర్యము :- నీకు శ్రీరామునితో పరిచయము ఎచ్చట లభించినది? నీవు లక్ష్మణుని ఎట్లు ఎఱుగుదువు? వానరులును ఈ సోదరులును కలసి మాటాడుకొనుట ఎట్లు సంభవమయినది?

శ్లో॥ యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్యచ వానర,
తాని భూయ స్సమాచక్ష్వ న మాం శోక
స్సమావిశేత్. 3

పదచ్ఛేదము :— యాని - రామస్య - చిహ్నాని - లక్ష్మణస్య - చ - వానర, తాని - భూయః - సమాచక్ష్వ-న-మాం- శోకః -సమావిశేత్.

అన్వయక్రమము :— వానర ! రామస్య లక్ష్మణస్య చ యాని చిహ్నాని (సంతి) భూయః తాని సమాచక్ష్వ; మాం శోకః న సమావిశేత్.

ప్రతిపదార్థము :— వానర ! = ఓ వానరోత్తమా ! రామస్య = శ్రీరాముని యొక్కయు, లక్ష్మణస్య చ = లక్ష్మణుని యొక్కయు, యాని చిహ్నాని = ఏగుర్తులయితే, (సంతి = ఉన్నవో) తాని = ఆ గుర్తులను, భూయః = తిరిగి, సమాచక్ష్వ = బాగుగ చెప్పుము. మాం = నన్ను, శోకః = దుఃఖము, న సమావిశేత్ = చేరకుండుగాక.

తాత్పర్యము :— ఓ కపివత్తమా ! శ్రీరాముని యొక్కయు లక్ష్మణుని యొక్కయు రూపములందు గుర్తులెట్టివై యున్నవోవానిని నాకు మరల వివరముగ తెలుపుము. నేను వానిని వినుచు నా శోకమును పోగొట్టు కొందును.

శ్లో॥ కీదృశం తస్య సంస్థానం రూపం తస్యచ కీదృశమ్,
కథ మూరూ కథం బాహూ లక్ష్మణస్యచ శంస మే. 4

పదచ్ఛేదము :— కీదృశం - తస్య - సంస్థానం - రూపం - తస్య-చ-కీదృశమ్, కథం - ఊరూ - కథం-బాహూ - లక్ష్మణస్య - చ - శంస - మే.

అన్వయక్రమము :— తస్య సంస్థానం కీదృశమ్? తస్యరూపం కీదృశమ్? ఊరూ కథం? బాహూ కథం? లక్ష్మణస్యచ (సంస్థానం రూపంచ కీదృశమ్?) మే శంస.

ప్రతిపదార్థము :- తస్య= ఆ శ్రీరామునియొక్క, సంస్థానం= అవయవసన్ని వేశము, కీదృశం=ఎట్టిది? తస్య=అతనియొక్క రూపంచ= ఆకారమును, కీదృశం=ఎట్టిది? ఊరూ కథం = ఊరుద్వయ మెట్లుండును? బాహూ కథం= భుజద్వయ మెట్లుండును? లక్ష్మణస్యచ=లక్ష్మణునికిగూడ, (సంస్థానం రూపంచ=అవయవస్థితియు ఆకారమును, కీదృశం = ఎట్టిది?) మే శంస = నాకు చెప్పుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి .- సీతాదేవి ప్రశ్న విషమప్రశ్న. అందు రెండు భాగములు ఉన్నవి. బాహువులు బహిరంగము లెవరైనను చూడ వచ్చును. తొడ లెట్టివని యడిగెను. అనగా మర్మాంగము లెట్టివని ప్రశ్న. ఇవి వస్త్రము మఱుగున నుండునవి. వీనిని ఈతడెట్లు తెలిసికొనును? తెలిసికొనెనో; స్త్రీయైన తనతో వానినెట్లు చెప్పును? ఔచిత్య మెఱుగునా యెఱుగడా? రాముని మాతయే యైనపక్షమునందు ఈత డౌచిత్య మెఱుగక మాట్లాడడు. అని సీతాదేవి తలంచి ఈప్రశ్న వేసెను.

దీనివలన ఆచార్యుడు భగవత్తత్త్వము నామూలాగ్రము సరహస్య ముగ తెలిసినవాడై యుండవలెను. దాని నెవరి కెట్లు చెప్పవలయునో యది యును తెలిసినవాడై యుండవలయునని భావము.

తాత్పర్యము :- శ్రీరాముని అవయవ సన్నివేశ మెట్టిది? అతని వర్ణము మున్నగు ఆకారవిశేష మెట్టిది? అతని ఊరువు లెట్టివి? భుజము లెట్టివి? మఱియు లక్ష్మణుని అవయవ విశేషమును ఆకారవిశేషమును ఎట్టివో నాకు తెలియజెప్పుము.

శ్లో॥ ఏవ ముక్తస్తు వైదేహ్యా హనుమా న్మారుతాత్మజః,
తతో రామం యథాతత్త్వ మాఖ్యాతు ముపచక్రమే. 6

పదచ్ఛేదము :- ఏవం - ఉక్తః - వైదేహ్యా - హనుమాన్ - మారుతాత్మజః - తతః - రామం - యథాతత్త్వం - ఆఖ్యాతుం - ఉపచక్రమే.

అన్వయక్రమము :- వైదేహ్యా ఏవం ఉక్తః మారుతాత్మజః హనుమాన్ తతః రామం యథాతత్త్వం ఆఖ్యాతుం ఉపచక్రమే.

ప్రతిపదార్థము :- వైదేహ్యా = సీతాదేవిచే, ఏవం ఉక్తః = ఈరీతిగా అడుగబడినవాడై, మారుతాత్మజః = వాయునందనుడగు, హనుమాన్ = హనుమంతుడు, తతః = అటుపిమ్మట, రామం = శ్రీరాముని గూర్చి, యథాతత్త్వం = ఉన్నది యున్నట్లుగా, ఆఖ్యాతుం = పేర్కొనుటకు, ఉపచక్రమే = మొదలుపెట్టెను.

తాత్పర్యము :- సీతాదేవి తనను ఈరీతిగా అడుగగా వాయునందనుడైన హనుమ అప్పుడు శ్రీరామునియొక్క యథార్థమైన రూపమును వివరించుచు ఇట్లు చెప్పనారంభించెను.

శ్లో॥ జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి,
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్యచ. 6

పదచ్ఛేదము :- జానంతీ - బత - దిష్ట్యా - మాం - వైదేహి - పరిపృచ్ఛసి, భర్తుః - కమలపత్రాక్షి - సంస్థానం - లక్ష్మణస్యచ - చ.

అన్వయక్రమము:- కమలపత్రాక్షి! వైదేహి! భర్తుః, లక్ష్మణస్యచ సంస్థానం జానంతీ (అపి) దిష్ట్యా మాం పరిపృచ్ఛసి.

ప్రతిపదార్థము :- కమలపత్రాక్షి = పద్మపత్రములవంటి నేత్రముల గలదానవైన, వైదేహి = ఓ జానకీ! భర్తుః = భర్తయొక్కయు,

లక్ష్మణస్యచ = లక్ష్మణునియొక్కయు, సంస్థానం= అవయవముల పొందిక
ను, జానంతీ (అపి) = తెలిసినదానవై నను, దిష్ట్యా = భాగ్యవశమున,
మాం = నన్ను, పరిపృచ్ఛసి = వివరముగ అడుగుచున్నావు. ఐత =
అహా! (నా యదృష్టము!)

తాత్పర్యము :- ఓ జానకీ! నీ భర్తయొక్కయు లక్ష్మణుని
యొక్కయు రూపరేఖాదులను చక్కగా ఎఱిగియున్నదానవై నను నాభాగ్య
వశమున నాచే చెప్పించుటకై నన్నడుగుచున్నావు గదా! అహా! ఏమి నా
యదృష్టము.

శ్లో॥ యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్యచ యానివై,
లక్షితాని విశాలాక్షీ వదతః శ్రుణు తాని మే. 7

పదచ్ఛేదము :- యాని- రామస్య- చిహ్నాని- లక్ష్మణస్య-చ-
యాని - వై, లక్షితాని - విశాలాక్షి - వదతః - శ్రుణు - తాని - మే.

అన్వయక్రమము :- విశాలాక్షి! రామస్య యానిచిహ్నాని లక్షి
తాని: (తథా) లక్ష్మణస్యచ (యానిచిహ్నాని లక్షితాని) తాని వదతః మే
(వచః) శ్రుణు.

ప్రతిపదార్థము :- విశాలాక్షి! = విశాలమైన కన్నులు గల
దానా! రామస్య = రామునియొక్క, యాని చిహ్నాని = ఏ చిహ్నము
లయితే, లక్షితాని = గుర్తింపబడినవో, (తథా = అట్లే) లక్ష్మణస్యచ =
లక్ష్మణుని యొక్కయు యాని (చిహ్నాని) = ఏ (చిహ్నములయితే) లక్షి
తాని = కనుగొనబడినవో, తాని = ఆ చిహ్నములనుగూర్చి, వదతః =
పేర్కొనుచున్నట్టి, మే = నాయొక్క, (వచః = మాటను) శ్రుణు =
ఆలకింపుము.

తాత్పర్యము :— జానకీ! రాముని ఆకార విశేషములను నేనేమి గుర్తించితినో, లక్ష్మణుని రూపవిశేషములను నేనేమి చూచితినో వానిని నీకు తెలుపుచున్నాను, ఆ కింపుము.

శ్లో॥ రామః కమలపత్రాక్షః పూర్ణచంద్రనిభాననః,
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే. 8

పదచ్ఛేదము :— రామః - కమలపత్రాక్షః - పూర్ణచంద్రనిభాననః - రూపదాక్షిణ్య సంపన్నః - ప్రసూతః - జనకాత్మజే.

అన్వయక్రమము :— జనకాత్మజే ! రామః కమలపత్రాక్షః, పూర్ణచంద్రనిభాననః రూపదాక్షిణ్య సంపన్నః, ప్రసూతః.

ప్రతిపదార్థము :— జనకాత్మజే ! = ఓ జానకీ ! రామః = శ్రీరాముడు, కమలప త్రాక్షః = పద్మపత్రములవంటి నేత్రములు గలవాడు గను, పూర్ణచంద్రనిభాననః = నిండుచంద్రునితో సమానమైన ముఖము గలవాడుగను, రూపదాక్షిణ్య సంపన్నః = సౌందర్యముతోడను, దయా గుణముతోడను నిండియున్నట్టివాడుగను, ప్రసూతః = జన్మించినట్టివాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— 'పూర్ణచంద్రనిభాననః' అనుటకు బదులుగా 'సర్వసత్వమనోహరః' అని ఒకపాఠము. అనగా సర్వప్రాణి మనోహరుడు.

తిర్యగ్జాతివాడనై చెటుకొమ్మలమధ్య తిరుగుచుండు నా మనస్సును గూడ నపహరించినవాడు. అనగా సామాన్యుల దృష్టినిగూడ నాకర్షించు

సౌందర్యము గలవాడని భావము. రూపదాక్షిణ్య సంపన్నః - రూపమనుటచే సర్వవిధ శరీరసౌందర్యముతో నిండినవాడనియు, దాక్షిణ్యమనుటచే సర్వవిధములైన ఆత్మగుణములతో నిండినవాడనియు భావము. సంపన్నః ప్రసూతః - రాముని గుణములన్నియు జన్మతః ప్రాప్తించినవేగాని తెచ్చి పెట్టుకొన్నవి గావని భావము.

వాసుదాసస్వామి :- కమలపత్రాక్షః - తామర ఱేకులవలె వెడల్పగు కన్నులు గలవాడు. శ్రీరాముడు సహజసుందరుడు. ఆయనయందీకన్ను లభిరామములై యున్నవి. ఆ "పుంసాం మోహన రూపుని" యొక్క సౌందర్య రసప్రవాహమున, ఈ కన్నులు దూరమునుండి చూచువారిని సమీపమునకు ఆకర్షించును. సమీపమునకు రాగానే వారి మనస్సులను తమయందే లగ్నము చేసికొనును. రూపదాక్షిణ్య సంపన్నః - రూపము చేతను దాక్షిణ్యముచేతను పరిపూర్ణముగ నిండినవాడై పుట్టెను. అనగా ఆయన కళ్యాణగుణము లాయనతోడనే పుట్టినవి, కాని నడుమ వచ్చినవి గావు. ఇది "పూర్ణమదః పూర్ణమిద"మ్మను శ్రుత్యర్థమును బోధించుచున్నది. అనగా పరత్వదశయందే షాడ్గుణ్య పరిపూర్తి గలదో అవతార దశయందును నాయారు గుణములును గలవని భావము.

తాత్పర్యము :- ఓ సీతాదేవీ! శ్రీరాముడు పద్మపత్రములను బోలిన విశాలమైన నేత్రములు గలవాడు, నిండు చంద్రుని బోలిన ముఖము గలవాడు, ఇట్టి దేహసౌందర్యము గలిగి గొప్ప దయాగుణముతో నిండి యున్న హృదయము గలవాడుగా జన్మించినట్టి మహాపురుషుడు సుమా!

శ్లో॥ తేజసా ఽదిత్యసంకాశః క్షమయా పృథివీసమః,
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసవోపమః. 9

పదచ్ఛేదము :- తేజసా - ఆదిత్యసంకాశః - క్షమయా - పృథివీసమః - బృహస్పతిసమః - బుద్ధ్యా - యశసా - వాసవోపమః,

అన్వయక్రమము:– (సః) తేజసా ఆదిత్య సంకాశః, క్షమయా పృథివీసమః, బుద్ధ్యా బృహస్పతిసమః, యశసా వాసవోపమః.

ప్రతిపదార్థము :– (సః = ఆ శ్రీరాముడు) తేజసా = తేజస్సుచే ఆదిత్యసంకాశః = సూర్యునితో సమానుడు. క్షమయా = ఓర్పుచే, పృథివీ సమః = భూమితో సమానుడు, బుద్ధ్యా = బుద్ధిచే, బృహస్పతిసమః = బృహస్పతితో సమానుడు. యశసా = కీర్తిచే, వాసవోపమః = ఇంద్రునితో సమానుడు.

తాత్పర్యము :– ఆ శ్రీరాముడు తేజోవిశేషముచేత సూర్యుని బోలినట్టివాడు. సహనగుణమున భూదేవితో సమానుడు. బుద్ధివిశేషమున బృహస్పతికిసాటి వచ్చువాడు. యశస్సునందు దేవేంద్రునితో సమానుడు.

శ్లో॥ రక్షితా జీవలోకస్య స్వజనస్యచ రక్షితా,
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్యచ పరంతపః. 10

పదచ్ఛేదము :– రక్షితా– జీవలోకస్య – స్వజనస్య – చ- రక్షితా-రక్షితా – స్వస్య – వృత్తస్య –ధర్మస్–యచ – పరంతపః.

అన్వయక్రమము :– పరంతపః (సః) జీవలోకస్య రక్షితా, స్వజనస్యచ రక్షితా, స్వస్యవృత్తస్య ధర్మస్యచ రక్షితా.

ప్రతిపదార్థము :– పరంతపః = శత్రువులను తపింపజేయునట్టి, (సః = ఆ శ్రీరాముడు) జీవలోకస్య = ప్రాణిలోకమునకు, రక్షితా = రక్షకుడు. స్వజనస్యచ = తనవారికిని, రక్షితా = రక్షకుడు, స్వస్య వృత్తస్య = తన నడవడికిని, ధర్మస్యచ = ధర్మమునకును, రక్షితా = రక్షకుడు.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- శ్రీరామచంద్రుడు మనుష్యులను హిత మార్గమునందు ప్రవర్తింపచేయుటకై లోకసంగ్రహార్థము ధర్మరక్షణము, ధర్మానుష్ఠానమును కూడ చేయుచున్నాడు. ఇట్లు రామచంద్రుడునం దుపదేశ పాండిత్యమేగాక అనుష్ఠానసామర్థ్యము కూడ చెప్పబడినది.

తాత్పర్యము :- శత్రుభయంకరుడైన శ్రీరాముడు సమస్తజీవ లోకమును రక్షించునట్టివాడు. తనవారి నెల్లరను కాపాడునట్టివాడు. తన చరిత్రమును కాపాడుకొనుచు ఇతరుల ధర్మమునుకూడ జాగ్రత్తగా రక్షించునట్టివాడు.

శ్లో॥ రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా,
మర్యాదానాంచ లోకస్య కర్తా కారయితాచ సః. 11

పదచ్ఛేదము :- రామః - భామిని - లోకస్య - చాతుర్వర్ణ్యస్య - రక్షితా - మర్యాదానాం - చ - లోకస్య - కర్తా - కారయితా - చ - సః.

అన్వయక్రమము :- భామిని! రామః చాతుర్వర్ణ్యస్య లోకస్య రక్షితా, సః లోకస్య మర్యాదానాం కర్తాచ కారయితాచ.

ప్రతిపదార్థము - భామిని! = వనితారత్నమా! రామః = శ్రీరాముడు, చాతుర్వర్ణ్యస్య = నాల్గువర్ణములు కలిగియున్నట్టి, లోకస్య = లోకమునకు, రక్షితా = రక్షకుడు, సః = ఆతడు, లోకస్య = లోకము యొక్క, మర్యాదానాం = కట్టుబాటులకు, కర్తా = కూర్చువాడును, కారయితాచ = ఆచరింపచేయువాడును.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'లోకస్యకర్తా' - అనుటచే హర్తయు భర్తయు గూడనని స్ఫురింపకపోవలెను. ఇట్లు చెప్పుటచే శ్రీరాముడు సృష్టిస్థితి

సంహారకారకుడైన పరబ్రహ్మయని, గూఢముగ సూచింపబడినది ఇట్లు హనుమ పలుకుట ఆ క్షణమున హనుమంతునిలోని మాయాంశమును తొలగించి జ్ఞానమును ప్రకాశింప చేయుటచే గలిగినది. 'మర్యాదానాం కర్తా కారయితా' - తన అవతార ప్రయోజనముగా, ధర్మరక్షణము తన కర్తవ్య మని ఇట్లు తెలుపబడినది.

తాత్పర్యము :- తల్లీ! శ్రీరాముడు చాతుర్వర్ణ్య సంయుతమైన ఈ లోకమును రక్షించువాడు. లోకము నందలి ధర్మవ్యవస్థను కాపాడుచు ఆ ధర్మమును తాను ఆచరించువాడును పరులచే ఆచరింపచేయునట్టివాడును సుమా।

శ్లో॥ అర్చిష్మా నర్చితో ఒత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః,
సాధూనా ముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్. 12

పదచ్ఛేదము :- అర్చిష్మాన్ - అర్చితః - అత్యర్థం - బ్రహ్మ చర్యవ్రతే- స్థితః -సాధూనాం- ఉపకారజ్ఞః- ప్రచారజ్ఞః- చ-కర్మణాం.

అన్వయక్రమము :- (సః) అర్చిష్మాన్, అత్యర్థం అర్చితః, బ్రహ్మచర్యవ్రతేస్థితః, సాధూనాం ఉపకారజ్ఞః, కర్మణాం ప్రచారజ్ఞఃచ.

ప్రతిపదార్థము :- (సః = ఆ శ్రీరాముడు) అర్చిష్మాన్ = గొప్పతేజస్సు గలవాడు, అత్యర్థం = మిక్కిలిగా, అర్చితః = పూజింప బడినట్టివాడు, బ్రహ్మచర్యవ్రతే స్థితః=బ్రహ్మచర్య వ్రతమును పాలించు వాడు, సాధూనాం = సత్పురుషులకు, ఉపకారజ్ఞః = ఉపకారము చేయుట తెలిసినవాడు, కర్మణాం = కార్యములయొక్క, ప్రచారజ్ఞఃచ= ఆచరణ విశేషము నెఱిగినవాడును.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము - ప్రచారజ్ఞః - ఐహికాముష్మిక కర్మల ప్రయోగము తెలిసినవాడు.

తిలకము .- 'అర్చిష్మాన్ సన్ అర్చితః - ప్రకాశస్వరూపుడై న ఆదిత్య రూపుడై బుధులచే ఆరాధింపబడుచున్నాడని భావము. 'బ్రహ్మ చర్యవ్రతేస్థితః' - శాస్త్రమునందు తెలుపబడినరీతిగా గృహస్థగనుండి విధినిషేధములను పాటించునట్టి బ్రహ్మచర్యవ్రతమని భావము.

రామాయణ శిరోమణి :-'అర్చిష్మాన్ సన్ అర్చితః' ప్రకాశ స్వరూపియైన పరమాత్మయై సర్వదేవతలచే పూజింపబడునట్టివాడని భావము. 'బ్రహ్మచర్యవ్రతేస్థిత' - తనచే నిర్మింపబడిన మర్యాదా రూపములైన వేదోక్త నియమములకు బద్ధుడైయున్నవాడని భావము, (బ్రహ్మ-వేదము) ఉపకారజ్ఞః - ఉపకారము చేయుటయే ఎఱిగినట్టివాడు. (అనగా అపకారము చేయుట ఎఱుగనివాడని భావము.

తాత్పర్యము :- అతడు మహాతేజస్సంపన్నుడై ఎల్లలోకము లచే అర్చింపబడునట్టివాడు. శాస్త్రవిహితమైన బ్రహ్మచర్యవ్రతము ననుస రించువాడు. సత్పురుషులకు ఉపకారము చేయ నేర్చినవాడు. కర్తవ్యముల ఆచరణము చక్కగా తెలిసినవాడు.

శ్లో॥ రాజనీత్యాం వినీతశ్చ బ్రాహ్మణానా ముపాసకః,
జ్ఞానవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః. 13

పదచ్ఛేదము :- రాజనీత్యాం - వినీతః - చ - బ్రాహ్మణానాం - ఉపాసకః, జ్ఞానవాన్ శీలసంపన్నః - వినీతః - చ - పరంతపః.

అన్వయక్రమము :- (సః) రాజనీత్యాం వినీతః, బ్రాహ్మ ణానాం ఉపాసకః, జ్ఞానవాన్, శీలసంపన్నః, వినీతః చ, పరంతపః చ.

ప్రతిపదార్థము :— (సః) = ఆ శ్రీరాముడు, రాజనీత్యాం = రాజనీతియందు, వినీతః = శిక్షణము పొందినట్టివాడు, బ్రాహ్మణానాం ఉపాసకః = బ్రాహ్మణులను అర్చించునట్టివాడు, జ్ఞానవాన్ = ఉత్తమ జ్ఞానము కలిగియున్నవాడును. శీలసంపన్నః = ఉత్తమ చరిత్ర కలిగినట్టి వాడును, వినీతః = వినయవంతుడును, పరంతపః చ = శత్రువులను తపింపచేయువాడును.

విశేషార్థములు – వాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— 'రాజవిద్యావినీతః' అని ఒకపాఠము. రాజవిద్యలు4 – 1. అన్వీక్షికి 2. త్రయీ 3. వార్త-4.దండనీతి అనునవి. అన్వీక్షికి = తర్క-విద్య. త్రయి = మూడు వేదములు, వార్త = వాణిజ్యాదికము. దండము= దోషులను దండించుట.

తాత్పర్యము :— ఆ శ్రీరాముడు రాజనీతియందు చక్క-గా శిక్షణ నొందినవాడు బ్రాహ్మణుల యెడ భక్తిగలవాడు. ఉత్తమమైన జ్ఞానము నార్జించినవాడు. శ్రేష్ఠమైన చరిత్ర గలవాడు. వినయసంపన్నుడు. శత్రువుల నణచువాడును సుమా!

శ్లో॥ యజుర్వేదవినీతశ్చ వేదవిద్భి స్సుపూజితః
ధనుర్వేదేచ వేదేషు వేదాంగేషుచ నిష్ఠితః. 14

పదచ్ఛేదము :— యజుర్వేదవినీతః – చ– వేదవిద్భిః – సుపూజితః, ధనుర్వేదే – చ – వేదేషు – వేదాంగేషు – చ – నిష్ఠితః.

అన్వయక్రమము :— (సః)యజుర్వేదవినీతః, వేదవిద్భిః సుపూజితః, ధనుర్వేదేచ, వేదేషు, వేదాంగేషుచ నిష్ఠితః.

ప్రతిపదార్థము :- (సః = ఆ శ్రీరాముడు) యజుర్వేద వినీతః = యజుర్వేదమునందు శిక్షను పొందినట్టివాడు. (శ్రీరామునిది యజుర్వేదము) వేదవిద్భిః = వేదవేత్తలచే, సుపూజితః = మిక్కిలి గౌరవింపబడినవాడు, ధనుర్వేదేచ = ధనుర్వేదము నందును, వేదేషు = చతుర్వేదములందును, వేదాంగేషుచ = వేదములయొక్క షడంగముల యందును, నిష్ఠితః = ప్రజ్ఞను సంపాదించినవాడు.

విశేషార్థములు – వాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- ఇందు యజుర్వేదమును ప్రత్యేకించి చెప్పుటచే శ్రీరామచంద్రమూర్తి యజుశ్శాఖీ యని తెలియనగును.

తాత్పర్యము :- తన వేదమైన యజుర్వేదమును చక్కగా అధ్యయనము చేసినవాడు. వేదవేత్తలచే పూజింపబడువాడును. ధనుర్వేదము నందును నాల్గువేదములందును, ఆరు వేదాంగములందును సంపూర్ణ ప్రజ్ఞ గలిగియున్నవాడును సుమా!

శ్లో॥ విపులాంసో మహాబాహుః కంబుగ్రీవ శ్శుభాననః,
గూఢజత్రు స్సుతామ్రాక్షో రామోనామ
జనైశ్శ్రుతః. 15

పదచ్ఛేదము :- విపులాంసః – మహాబాహుః – కంబుగ్రీవః – శుభాననః – గూఢజత్రుః – సుతామ్రాక్షః – రామః – నామ – జనైః – శ్రుతః.

అన్వయక్రమము :- (సః) విపులాంసః. మహాబాహుః, కంబుగ్రీవః, శుభాననః, గూఢజత్రుః సుతామ్రాక్షః, జనైః రామోనామ శ్రుతః.

ప్రతిపదార్థము :- (సః = అతడు) విపులాంసః = విశాలమైన మూపులు గలవాడు, మహాబాహుః = పొడవైన దృఢమైన భుజములు గలవాడు, కంబుగ్రీవః = శంఖమువంటి కంఠము గలవాడు, శుభాననః = మంగళకరమైన ముఖము గలవాడు గూఢజత్రుః = పైకి కాన్పింపని మూపు సంధి ఎముకలు గలవాడు, జనైః = జనులచే, రామోనామ = రాముడను పేర, శ్రుతః = ప్రసిద్ధి నొందినవాడు.

తాత్పర్యము :- అతడు విశాలమైన భుజశిరస్సులు గలవాడు, గొప్పవైన భుజములు గలవాడు, శంఖముపంటి కంఠము గలవాడు, మంగళకరమైన ముఖము గలవాడు, పైకి కాన్పింపని మూపు సంధి ఎముకలు గలవాడు, చక్కని ఎఱ్ఱని కన్నులు గలవాడు, రాముడను పేర ప్రజలలో ప్రసిద్ధి నొందినట్టి వాడును సుమా॥

శ్లో॥ దుందుభిస్వన నిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
సమశ్చ సువిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః. 16

పదచ్ఛేదము :- దుందుభిస్వన నిర్ఘోషః - స్నిగ్ధవర్ణః - ప్రతాపవాన్ - సమః - చ - సువిభక్తాంగః - వర్ణం - శ్యామం - సమాశ్రితః,

అన్వయక్రమము :- (సః) దుందుభిస్వననిర్ఘోషః, స్నిగ్ధవర్ణః, ప్రతాపవాన్, సమః, సువిభక్తాంగః శ్యామం వర్ణం సమాశ్రితః చ॥

ప్రతిపదార్థము :- (సః = ఆ శ్రీరాముడు), దుందుభిస్వననిర్ఘోషః = దుందుభిధ్వనివంటి కంఠస్వరము గలవాడు, స్నిగ్ధవర్ణః = నున్నని చిక్కని ఛాయగలవాడు, ప్రతాపవాన్ = గొప్ప ప్రతాపము గల

వాడు, సమః=సమానమైన (శరీరావయవములుగల) వాడు, సువిభక్తాంగః= చక్కని విడివడిన అవయవములు గలవాడు, శ్యామంవర్ణం= మేఘవర్ణమును, సమాశ్రితః= పొందియున్నాడు.

తాత్పర్యము :- శ్రీరాముడు దుందుభిధ్వనివంటి కంఠస్వరము గలవాడు, నిగనిగలాడు నున్నని చిక్కనైన శరీరకాంతి గలవాడు. పరాక్రమవంతుడు, సమానమైన శరీర ప్రమాణములు గలవాడు, చక్కగ వేరు పడియున్న అవయవ సన్నివేశము గలవాడు, సుందరమైన మేఘవర్ణము వంటి నీలచ్ఛాయతో వెలయునట్టివాడు.

శ్లో॥ త్రిస్థిర స్త్రి ప్రలంబశ్చ త్రిసమ స్త్రిషు చోన్నతః,
త్రితామ్ర స్త్రిషుచ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః. 17

పదచ్ఛేదము :- త్రిస్థిరః - త్రిప్రలంబః - చ - త్రిసమః - త్రిషు - చ - ఉన్నతః, - త్రితామ్రః, - త్రిషు - చ - స్నిగ్ధః - గంభీరః త్రిషు - నిత్యశః

అన్వయక్రమము :- (సః) త్రిస్థిరః, త్రిప్రలంబః, త్రిసమః, త్రిషు ఉన్నతః, త్రితామ్రః, త్రిషుస్నిగ్ధః, నిత్యశః త్రిషుగంభీరఃచ.

ప్రతిపదార్థము :- [సః = ఆ శ్రీరాముడు], త్రిస్థిర:=తొమ్ము మణికట్టు పిడికిలియను మూడు స్థానములందును గట్టితనము గలవాడు, త్రిప్రలంబ: =కనుబొమ్మలు, వృషణములు, బాహువులు అను మూడును పొడవుగ నుండువాడు, త్రిసమ: = కేశాగ్రములు, వృషణములు, జానువులు అను మూడును సమముగ నుండువాడు, త్రిషు ఉన్నత: = బొడ్డు, పొట్ట, తొమ్ము అను మూడును ఉన్నతములై యుండువాడు, త్రితామ్ర:= కంటి కొనలు, నఖములు, అరచేతులు [అరికాళ్ళు] అను మూడింటి యందును ఎఱ్ఱదనము గల్గియుండువాడు, త్రిషు స్నిగ్ధ:=పాదరేఖలు, కేశములు,

లింగమణి అను మూడింటియందును సున్నదనము గలవాడు, నిత్యశః = ఎల్లప్పుడును, త్రిషు గంభీరః చ = కంఠస్వరము, గమనము, నాభియను మూడింటి యందును గాంభీర్యము గలవాడు.

విశేషార్థములు – వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము:– త్రిస్థిరః –"ఉరశ్చ మణిబంధశ్చ ముష్కశ్చ నృపతేః స్థిరాః" అనియు, త్రిప్రలంబః – "ప్రలంబా యస్య స ధనీ త్రయో భ్రూ ముష్క–బాహవః" అనియు, త్రిసమః "కేశాగ్రం వృషణం జానూ సమం యస్య స భూపతిః" అనియు, త్రిషు ఉన్నత : 'నాభ్యంతః కుక్షి వక్షోభిః ఉన్నతైః క్షితిపో భవేత్" అనియు, త్రితామ్ర: "నేత్రాంత నఖ పాణ్యం ఘ్రితలైః తామ్రైః త్రిభి స్సుఖీ" యనియు, త్రిషుస్నిగ్ధః "స్నిగ్ధా భవంతిపై యేషాం పాదరేఖా శ్శిరోరుహాః, తథా లింగమణి స్తేషాం మహాభాగ్యం వినిర్దిశేత్" అనియు, త్రిషు గంభీర : "స్వరే సత్వే గతౌ నాభౌ గంభీరః త్రిషు శస్యతే" అనియును సాముద్రిక శాస్త్రము.

గోవిందరాజీయము :– త్రిప్రలంబః – "దీర్ఘభ్రూ బాహు ముష్కస్తు చిరంజీవీ ధనీ నరః" అనియు లేక "త్రయశ్చ యస్య విద్యంతే ప్రలంబా మేఢ్ర బాహవః" అనియు, త్రిషుఉన్నతః "ఉన్నతకుక్షిః క్షితిపః పరిమండలోన్నతనాభీ యః క్షితిపః, హృదయం నలేపనం పృధు సమో న్నతం మాంసళంచ నృపతీనాం – వరాహమిహిరుడు. త్రితామ్రః "శ్లిష్టాంగుళీ రుచిరతామ్రనఖౌ సుపార్ష్ణీ పాదౌ కరౌ వపి సురక్త నఖాత్మరేఖౌ. త్రిషుగంభీరః 'స్వర స్సత్వంచ నాభిశ్చ గంభీరః శస్యతే బుధైః' వరరుచి.

తొడలు, స్తనములు, వృషణములు అనుచు స్త్రీలయెడల ఆయా అవయవములనన్నింటిని కంఠతః నిర్దేశించుట ఉచితముకాదు గాబట్టి సర్వ

శాస్త్రవిశారదురాలైన ఆ జానకీదేవికి తెలియునట్లుగా సాముద్రికశాస్త్ర ప్రసిద్ధములైన పదములతో హనుమ ఇట్లు సూచించు చున్నాడని తెలియు చున్నది.

తాత్పర్యము :— శ్రీరాముడు బొమ్ము మణికట్టు పిడికిలి యను మూడు అవయవములందును గట్టితనము గలవాడు, కనుబొమ్మలు బాహు వులు వృషణములు అను మూడును పొడవుగా నుండువాడు, కేశాంతములు వృషణములు జానువులును సమముగా నుండువాడు, పొట్ట బొడ్డు హృద యము అను మూడును ఎత్తుగ నుండువాడు, కంటికొనలు గోళ్ళు అరి కాళ్ళు (అరిచేతులు) ఎఱ్ఱగనుండువాడు, పాదరేఖలు కేశములు లింగమణి అను మూడును, నున్నగ నుండువాడు, మాట నడక బొడ్డుఅను మూడింటి యందును ఎల్లప్పుడు గాంభీర్యము గల్గియుండునట్టి వాడునుసుమా ;

శ్లో॥ త్రివలీమాం స్త్ర్యవనత శ్చతుర్వ్యంగ స్త్రిశీర్ష వాన్,
చతుష్కల శ్చతుర్లేఖ శ్చతుః కిష్కు శ్చతుస్సమః. 18

పదచ్ఛేదము :— త్రివళీమాన్ - త్ర్యవనతః - చతుర్వ్యంగః - త్రిశీర్షవాన్, చతుష్కలః - చతుర్లేఖః - చతుఃకిష్కుః - చతుస్సమః

అన్వయక్రమము :— (సః) త్రివళీమాన్, త్ర్యవనతః, చతు ర్వ్యంగః, త్రిశీర్షవాన్, చతుష్కలః, చతుర్లేఖః, చతుః కిష్కుః, చతు స్సమఃచ.

ప్రతిపదార్థము :— (సః = ఆ శ్రీరాముడు), త్రివళీమాన్ = పొట్టయందు (కంఠమున, ఉదరమునగూడ) మూడు ముడుతలు కలిగినట్టి వాడు, త్ర్యవనతః = స్తనములు, స్తనాగ్రములు, పాదరేఖలు, ఈ మూడును వంగియుండువాడు. చతుర్వ్యంగః = కంఠము, లింగము, పిక్కలు, పిఱుదులు అను నాలుగును పొట్టివిగ నుండువాడు, త్రిశీర్షవాన్ =

మూడు ముడులుగలశిరస్సు గలవాడు, చతుష్కలః = నాలుగు (వేదముల ప్రాప్తిని సూచించు) రేఖలు బొటన వ్రేలిపై గలవాడు, చతుర్లేఖః = లలాటమున నాలుగు రేఖలుగలవాడు, చతుఃకిష్కుః = రెండు మోచేతులు, రెండు మోకాళ్ళు అను నాల్గును దృఢముగ నుండువాడు చతుస్సమః = బాహువులు, పిక్కలు తొడలు, చెక్కిళ్ళు అను నాల్గును సమముగ నుండువాడు.

విశేషార్థములు – వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– చతుర్వ్యంగః ''గ్రీవా ప్రజననం పృష్ఠం హ్రస్వే జంఘేచ పూజితే, త్రిశీర్షవాన్ ''ఆవర్తత్రయ యుక్తం యస్య శిరః క్షితి భృతా మయం నాథః'' చతుష్కలః ''మూలే ఒంగుష్ఠస్య రేఖానాం చతస్రః త్రిస్రఏవహి, ఏకా ద్వేవా యథాయోగం వేదరేఖా ద్విజన్మనామ్, చతుర్లేఖః ''లలాపే యస్య దృశ్యంతే చతుస్త్రి ద్వ్యేక రేఖికాః శతద్వయం శతం షష్టి స్తస్యాయుర్వింశతి స్తథా.'' చతుఃకిష్కుః-కిష్కుః అనగా ఇరువది నాలుగు అంగుళముల హస్తము. ఇట్టి నాల్గుకిష్కువుల ప్రమాణము గలవాడు. అనగా ౯౬ అంగుళముల పొడవైనవాడనిభావము. చతుస్సమ 'బాహుజానూరుగండాని చత్వార్యథ సమానిచ' అనియు బ్రహ్మాండ పురాణము.

గోవిందరాజీయము :– త్ర్యవనతః ''పీనో వలిత్రై ర్నిమ్నైః క్షితిపతయ శ్చూచుకై స్తనై స్పృథినః, స్నిగ్ధా నిమ్నా రేఖా ధనినాం తద్వ్యత్యయేన నిస్స్వానామ్'' వరాహమిహిరుడు చతుర్లేఖః-పాదతలమున నాల్గురాజ లక్షణ రేఖలు గలవాడు. 'యస్య పాదతలే వజ్రధ్వజ శంఖాం కుశోపమాః, రేఖాః సమ్యక్ ప్రకాశంతే మనుజేంద్రం త మాదిశేత్'' అని నారద వచనము.

చతుఃకిష్కుః ''షణ్ణవత్యంగుళోత్సేధో యః పుమాన్ స దివౌకస'' బ్రహ్మాండపురాణము.

తాత్పర్యము :- శ్రీరాముడు కంఠమునందును, ఉదరము నందును మూడు ముడుతలు గలవాడు, స్తనములు, స్తనాగ్రములు, పాద రేఖలు అను మూడును వంగియుండువాడు, కంఠము, పృష్ఠము పిక్కలు అను నాల్గును పొట్టిగనుండువాడు, మూడు సుడులతో గూడిన శిరస్సు గల వాడు, చతుర్వేద ప్రాప్తిని సూచించు నాల్గురేఖలు చేతిబొటన వ్రేలిపైగల వాడు. తొంబదిఆరు అంగుళముల పొడవుగలవాడు, బాహువులు, పిక్కలు, తొడలు, చెక్కిళ్ళు అను నాల్గును సమముగ నుండువాడును సుమా!

శ్లో॥ చతుర్దశ సమద్వంద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః,
మహోష్ఠహనునాసశ్చ పంచస్నిగ్ధో ఽష్టవంశవాన్. 19

పదచ్ఛేదము :- చతుర్దశ సమద్వంద్వః - చతుర్దంష్ట్రః - చతుర్గతిః - మహోష్ఠహనునాసః - చ - పంచస్నిగ్ధః అష్టవంశవాన్.

అన్వయక్రమము :-(సః)చతుర్దశసమద్వంద్వః చతుర్దంష్ట్రః చతుర్గతిః, మహోష్ఠహనునాసః, పంచస్నిగ్ధః, అష్టవంశవాన్.

ప్రతిపదార్థము :- (సః - ఆ శ్రీరాముడు) చతుర్దశసమ ద్వంద్వః = కనుబొమ్మలు. నాసాపుటములు, కన్నులు, చెవులు, పెద వులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్టులు, మోకాళ్ళు, అండ కోశము, కటిప్రదేశము, చేతులు, పాదములు, పిఱుదులు అను పదునాల్గు జంటలను సమానములై యుండువాడు. చతుర్దంష్ట్రః = శుభలక్షణములు గల నాలుగు కోఱపన్నులు గలవాడు, చతుర్గతిః = సింహము, శార్దూ లము, గజము, వృషభము అను నాల్గింటి గమనము వంటి గంభీరమైన గమనము గలవాడు. మహోష్ఠహనునాసః = శ్రేష్ఠములైన పెదవులు, చెక్కిళ్ళు, నాసికయును గలవాడు. పంచస్నిగ్ధః = కన్నులు, పన్నులు, చర్మము, కేశములు, పాదములు అను నైదును నునుపుగలిగి యుండు వాడు, అష్టవంశవాన్ = ఎనిమిది పొడవైన ఎముకలుగల అవయవములు

26998

గలవాడు (వెన్నెముక, శరీరము, వ్రేళ్ళు, చేతులు, ముక్కు, కన్నులు. చెవులు మగగుఱి అను ఎనిమిది అవయవములును పొడవుగ నుండువాడు)

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- చతుర్దశ సమద్వంద్వః "భ్రువౌ నాసాపుటే నేత్రే కర్ణౌ ఓష్ఠాన్య చూచుకే, కూర్పరౌ మణిబంధౌ చ జానునీ వృషణౌ కటీ, కరౌ పాదౌ స్ఫిజౌ యస్య సమౌ జ్ఞేయః స భూపతిః" చతుర్దంష్ట్రః- "స్నిగ్ధా ఘనాశ్చ దశనా సుతీక్ష్ణదంష్ట్రాస్సమాశ్చశుభాః" వరాహమిహిరుడు.

రామాయణ శిరోమణి :- "బాహూచ నలకౌ చోరూ జంఘే చేత్యష్టవంశకాః" నలకౌ అనగా అంగుళీద్వయమని అర్థము.

గోవిందరాజీయము :- చతుర్గతిః - "గజసింహగతీ వీరౌ శార్దూల వృషభోపమౌ" అను బాలకాండము నందలి వచన మిచట అనుసంధించుకొనవలెను. మహోష్ఠహనునాసః - "బంధుజీవ కుసుమోపమో ఉధరో, మాంసలో రుచిరబింబ రూపధృత్, పూర్ణమాంసళహనుస్తు భూమిప స్తుంగ తుండరుచిరాకృతిస్తథా" (తుండమనగా నాశిక)అని సంహితావచనము) పంచస్నిగ్ధః - చక్షుస్నేహేన సౌభాగ్యం దంత స్నేహేన భోజనం, త్వచస్స్నేహేన శయనం పాదస్నేహేన వాహన" మ్మని వరరుచి వాక్యము "స్నిగ్ధ నీల మృదుకుంచితాః తథా, మూర్ధజా స్సుఖకరా స్సమం శిరః"వరాహమిహిరుడు. అష్టవంశవాన్ - పృష్ఠవంశః శరీరంచ హస్త పాదాంగుళీ కరౌ, నాసికా చక్షుషీ కర్ణౌ ప్రజనో యస్య చాయతాః" అని సాముద్రిక వచనము.

మహేశ్వర తీర్థులు :- చతుర్దశ సమద్వంద్వః "కర్ణాక్షి భ్రూ గండనాసా దంతోష్ఠస్కంధజత్రుణీ, పాదౌ కరౌ స్తనా వూరూ స్ఫిజౌ ద్వంద్వౌ చతుర్దశ" పంచస్నిగ్ధః "వాగ్వక్త్రనఖలోమాని త్వచశ్చ" అను పంచావయములు స్నిగ్ధములై యుండువాడు.

తాత్పర్యము .– శ్రీరాముడు కనుబొమలు, నాసాపుటములు, కన్నులు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్టులు. మోకాళ్ళు, వృషణములు, కటిప్రదేశము, చేతులు, పాదములు, పిఱుదులు అను పదునాలుగు జంటలును. సమానములై యుండువాడు. శుభలక్షణోపేతములైన నాలుగు కోఅపన్నులు గల్గియున్నవాడు. సింహ శార్దూల గజ వృషభ గమనములతో సమానమైన ఠీవిగల గమనము కలిగియుండువాడు.

గొప్పవైన పెదవులును, దవుడలును నాసికయును గల్గియున్నవాడు, కన్నులు, పన్నులు, చర్మము, కేశములు, పాదములు అను ఐదును నునుపు గలిగియుండువాడు. వెన్నెముక. శరీరము, వ్రేళ్ళు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు, మగగుఱి యను ఎనిమిది అవయవములును ప్రశస్త లక్షణోపేతములై యుండువాడును సుమా।

శ్లో॥ దశపద్మో దశబృహ త్త్రిభి ర్వ్యాప్తో ద్విశుక్లవాన్,
షడున్నతో నవతను స్త్రిభి ర్వ్యాప్నోతి రాఘవః. 20

పదచ్ఛేదము :– దశపద్మః-దశబృహత్- త్రిభిః - వ్యాప్తః- ద్విశుక్లవాన్ - షడున్నతః - నవతనుః - త్రిభిః - వ్యాప్నోతి - రాఘవః.

అన్వయక్రమము :– రాఘవః దశపద్మః, దశబృహత్, త్రిభిః వ్యాప్తః, ద్విశుక్లవాన్, షడున్నతః, నవతనుః, త్రిభిః వ్యాప్నోతి.

ప్రతిపదార్థము :– రాఘవః = శ్రీరాముడు, దశపద్మః = ముఖము, కన్నులు, నాలుక. పెదవులు చెవులు, స్తనములు, గోళ్ళు, చేతులు, పాదములు అను పది అవయవములు పద్మాకారముగ గల్గియుండువాడు, దశబృహత్ = వక్షము, శిరస్సు, నుదురు, కంఠము, బాహువులు, మూపులు, బొడ్డు, ప్రక్కలు, వెనుకభాగము, స్వరము అను పది ఎత్తైనఅవయవములు గలవాడు, త్రిభి ర్వ్యాప్తః=తేజస్సు, యశస్సు,

రోధ యను మూడింపిచే నిస్తరించి యున్నవాడు, ద్విశుక్లవాన్ = పన్నులు, కన్నులు అను రెండు తెల్లని అవయవములు గలవాడు, షడున్నతః = కక్షము, కడుపు, వక్షము, ముక్కు, మూపు, లలాటము లను ఆరు ఉన్నతమైన అవయవములు గలవాడు. నవతనుః - కేశములు, మీస ములు, గోళ్ళు, రోమములు, వ్రేళ్ళు, కణుపులు, చర్మము, లింగము, దృష్టి, బుద్ధి అను తొమ్మిది సూక్ష్మమైనవిగా గలవాడు, త్రిభి ర్వ్యాప్నోతి = పూర్వాహ్నము, మధ్యాహ్నము, అపరాహ్నము అను మూడు కాలములందును ధర్మార్థ కామములను మూడు పురుషార్థములతో వ్యాపించి యుండును,

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు .

తిలకము :- దశపద్మః "ముఖనేత్రాస్య జిహ్వోష్ఠతాలు స్తన నఖాఃకరౌ, పాదౌచ దశపద్మాని పద్మాకారాణి యస్యచ (అస్యమనగా ఓష్ఠ మధ్యము) దశబృహత్ - 'ఉరశ్శిరోలలాటంచగ్రీవా బాహ్వాంసనాభయః" పార్శ్వపృష్ఠస్వరా శ్చేతి విశాలా స్తే శుభప్రదాః-సాముద్రిక వచనము. ద్విశుక్లవాన్. "ద్వౌ శుద్ధౌ తు శుభౌ శుక్లౌ వంశౌ మాతుః పితుస్తథా, అనియును, "షడున్నతః 'కక్షః కుక్షిశ్చవక్షశ్చ ఘ్రాణ స్కంధో లలాటికా, సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాంగా శ్శుభప్రదాః" వరరుచి వాక్యము, నవతనుః 'సూక్ష్మా ణ్యంగుళిపర్వాణి కేశలోమనఖత్వచః, శేఫశ్చ యేషాం సూక్ష్మాణి తే నరాదీర్ఘజీవినః" -అని వరరుచి వాక్యము. మృదుశ్మశ్రు సూక్ష్మ దృష్టి సూక్ష్మబుద్ధి -అను మూడును గలసి మొత్తము తొమ్మిది యగును.

గోవింద రాజీయము :- దశబృహత్-"శిరోలలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా, ఉదరం పాణి పాదౌచ పృష్ఠం దశ బృహం తిచ" (బ్రహ్మపురాణము) త్రిభి ర్వ్యాప్నోతి - "ధర్మార్థకామాః కాలేషు త్రిషు యస్య స్వనుష్ఠితాః" (బ్రహ్మపురాణము)

మహేశ్వర తీర్థులు :- త్రిభిర్వ్యాప్తః "త్రిభి ర్వ్యాప్తిశ్చ యస్య స్యాత్ తేజసా యశసా శ్రియా',

శ్రీరాముని ఈ అవయవ ప్రశంసలో కొన్ని పునరుక్తులు కాన వచ్చుటకు కారణము, సాముద్రిక శాస్త్ర కర్తలలో గల మతభేదములే. శ్రీరాముడు సర్వమతములను అనుసరించి మహాపురుష లక్షణ సమన్వితుడై యున్నాడని తెలుపుటయే కవిలక్ష్యమని గ్రహించవలెను.

తాత్పర్యము :.. రఘువంశ తిలకుడైన శ్రీరాముని ముఖము కన్నులు, నోరు, నాలుక, పెదవులు, దవుడలు, స్తనములు, గోళ్ళు, హస్తములు, పాదములు అను పది అవయవములును తామరపువ్వులను బోలియుండును. అతని శిరస్సు, లలాటము, కరములు, కంఠము, వక్షము హృదయము, ఉదరము, హస్తములు, పాదములు, పృష్ఠము అను పది అవయవములును స్థూలములై యుండును. అతని తేజస్సు, కీర్తి, శోభ యను మూడును మిక్కిలి విశిష్టమైనవి. అతని దంతములు, నేత్రములు అను రెండును ధవళవర్ణము గల్గి అందముగ నుండును. లేక పితృ మాతృ వంశములు రెండును నిష్కళంకముగ నున్నవాడు. అతని చంక, కడుపు, బొమ్మ, ముక్కు, మూపు, నుదురు అను నారును ఉన్నతములై నట్టివి. అతని వ్రేళ్ళకణుపులు, తలవెండ్రుకలు, గోళ్ళు, రోమములు. చర్మము, లింగము, మీసములు, దృష్టి, బుద్ధి యను తొమ్మిదియును మిక్కిలి సూక్ష్మమైనట్టివి. అతడు పూర్వ మధ్య అపరాహ్ణములను మూడు కాలములందును ధర్మార్థకామము లను మూడు పురుషార్థములను సాధించు స్వభావము గలవాడు.

శ్లో॥ సత్యధర్మపర శ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః,
దేశకాల విభాగజ్ఞః సర్వలోక ప్రియంవదః. 21

పదచ్ఛేదము :_ సత్యధర్మపరః - శ్రీమాన్ - సంగ్రహాను గ్రహే - రతః - దేశకాలవిభాగజ్ఞః - సర్వలోక ప్రియంవదః.

అన్వయక్రమము :- (సః) సత్యధర్మపరః, శ్రీమాన్, సంగ్రహానుగ్రహీ రతః, దేశకాల విభాగజ్ఞః, సర్వలోక ప్రియంవదః చ.

ప్రతిపదార్థము :- (సః = ఆ శ్రీరాముడు) సత్యధర్మపరః = సత్యమునందును, ధర్మమునందును గొప్ప ఆసక్తి గలిగి యుండువాడు. శ్రీమాన్ = శుభలక్షణ సముపేతుడు, సంగ్రహానుగ్రహీ = సంగ్రహించుట యందును, (ఆ ద్రవ్యమును) వినియోగించుట యందును, రతః = మిక్కిలి ఆసక్తి గలవాడు. దేశకాల విభాగజ్ఞః = దేశము యొక్కయు, కాలము యొక్కయు విభజనము తెలిసినవాడు, సర్వలోక ప్రియంవదః – సమస్త జనులకును ప్రియముగ మాటాడునట్టివాడు.

విశేషార్థములు : వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- సంగ్రహానుగ్రహీ రతః – ధనమును బలమును సంగ్రహించి వానితో ప్రజారక్షణము చేయుటలో నిపుణుడు.

తాత్పర్యము :- శ్రీరాముడు సత్యమునందును ధర్మము నందును మిక్కిలి ఆసక్తి గల్గి యుండువాడు. సర్వ శుభలక్షణ సంపన్నుడు. సంపదలను సంపాదించుట యందును ప్రజాహితముగ వినియోగించుట యందును గొప్పశ్రద్ధ గలవాడు. దేశముయొక్కయు, కాలముయొక్కయు విభాగములను చక్కగా గుర్తించి సద్వినియోగము చేయనేర్చినవాడు. సమస్త జనులకును ప్రియముగ భాషించువాడు.

శ్లో॥ భ్రాతా తస్యచ ద్వైమాత్రః సౌమిత్రి రమితప్రభః
అనురాగేణ రూపేణ గుణైశ్చాపి తథావిధః . 22

పదచ్ఛేదము :- భ్రాతా – తస్య – చ – ద్వైమాత్రః – సౌమిత్రిః – అమితప్రభః – అనురాగేణ – రూపేణ – గుణైః – చ – అపి – తథావిధః.

అన్వయక్రమము :_ తస్య ద్వైమాత్రః భ్రాతా సౌమిత్రిశ్చ అమితప్రభః అనురాగేణ, రూపేణ, గుణైశ్చ తథావిధః.

ప్రతిపదార్థము :_ తస్య = ఆ శ్రీరామునియొక్క, ద్వైమాత్రః = రెండవతల్లి కుమారుడైన, భ్రాతా సౌమిత్రిః చ = సోదరుడైన సుమిత్రానందనుడగు లక్ష్మణుడును, అమితప్రభః = అపారమైనతేజస్సు గలవాడు, అనురాగేణ = ప్రేమచేతను, రూపేణ = సౌందర్యముచేతను, గుణైశ్చ = సద్గుణములచేతను, తథావిధః = ఆ శ్రీరాముని వంటివాడే.

విశేషార్థములు · వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వర తీర్థులు :_ ద్వైమాత్రః = ఇరువురుతల్లులబిడ్డడు అనగా సుమిత్ర కౌసల్యల నిరువురిని తన తల్లిగనే చూచుకొనునట్టివాడు.

తాత్పర్యము :_ శ్రీరాముని సవతి తల్లియైన సుమిత్ర కుమారుడగు లక్ష్మణుడు కౌసల్యా సుమిత్రలను ఇరువురను తన కన్నతల్లుల వలె చూచుకొనువాడు. అమిత తేజస్సంపన్నుడు. అనురాగము, సౌందర్యము మున్నగు సద్గుణములచే సర్వవిధముల తనయన్నయైన శ్రీరాముని బోలినవాడు.

శ్లో॥ స సువర్ణచ్ఛవి శ్శ్రీమా న్రామ శ్శ్యామో మహాయశాః

పదచ్ఛేదము :_ సః - సువర్ణచ్ఛవిః - శ్రీమాన్ - రామః - శ్యామః - మహాయశాః.

అన్వయక్రమము :_ సః (లక్ష్మణః) సువర్ణచ్ఛవిః; శ్రీమాన్ మహాయశాః రామః శ్యామః.

ప్రతిపదార్థము :_ సః (లక్ష్మణః) = ఆ లక్ష్మణుడు, సువర్ణచ్ఛవిః = బంగారుకాంతిగలవాడు; శ్రీమాన్ = సర్వశుభలక్షణ సంయుతుడును, మహాయశాః = గొప్పకీర్తిగలవాడు నగు, రామః = శ్రీరాముడు, శ్యామః = నీలవర్ణము గలవాడు.

తాత్పర్యము :- ఆ లక్ష్మణుడు బంగారు చాయతో నొప్పుచుండు గలవాడు, మహాత్ముడైన శ్రీరాముడు మాత్రము నీలమేఘచ్ఛాయ గలవాడు.

సూచన: ఈ పాదము కొన్ని ప్రతులలో లేదు.

శ్లో॥ తా వుభౌ నరశార్దూలౌ త్వద్దర్శన కృతోత్సవౌ,
విచిన్వంతౌ మహీం కృత్స్నా మస్మాభి స్సహ సంగతౌ.

పదచ్ఛేదము :- తౌ - ఉభౌ - నరశార్దూలౌ - త్వద్దర్శన కృతోత్సవౌ - విచిన్వంతౌ - మహీం - కృత్స్నాం - అస్మాభిః - సహ- సంగతౌ॥

అన్వయక్రమము :- నరశార్దూలౌ తౌ ఉభౌ త్వద్దర్శన కృతోత్సవౌ, కృత్స్నాం మహీం విచిన్వంతౌ, అస్మాభిః సహ సంగతౌ.

ప్రతిపదార్థము :- నరశార్దూలౌ తౌ ఉభౌ = పురుషశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులిరువురును, త్వద్దర్శన కృతోత్సవౌ = నిన్ను చూచుటయందు వేడుకగలవారై, కృత్స్నాం మహీం = భూమిని అంతను, విచిన్వంతౌ = వెదకుచున్నవారై, అస్మాభిఃసహ = మాతోడ, సంగితౌ = కలిసినారు.

తాత్పర్యము :- పురుష సింహులైన ఆ యన్నదమ్ములిరువురును నిన్నుకనుగొను కుతూహలముతో భూమినంతను పర్యటించుచు మమ్ము కలసికొనిరి.

శ్లో॥ త్వామేవ మార్గమాణౌ తౌ విచరంతౌ వసుంధరామ్,
దదర్శతు ర్మృగపతిం పూర్వజే నావరోపితమ్. 24

శ్లో॥ ఋష్యమూకస్య మూలేతు బహుపాదపసంకులే,
భ్రాతు ర్భయార్త మాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్.

పదచ్ఛేదము :– త్వాం - ఏవ - మార్గమాణౌ - తౌ - విచరంతౌ - వసుంధరామ్ - దదర్శతుః-మృగపతిం - పూర్వజేన - అవరోపితమ్ - ఋష్యమూకస్య - మూలే - తు - బహుపాదపసంకులే - భ్రాతుః - భయార్తం - ఆసీనం - సుగ్రీవం - ప్రియదర్శనమ్॥

అన్వయక్రమము :– త్వామేవ మార్గమాణౌ, వసుంధరాం విచరంతౌ బహుపాదపసంకులే ఋష్యమూకస్య మూలే ఆసీనం, పూర్వజేన అవరోపితం, భ్రాతుః భయార్తం, ప్రియదర్శనం మృగపతిం దదర్శతుః॥

ప్రతిపదార్థము :– త్వామేవ = నిన్నే, మార్గమాణౌ = వెదకుచున్నవారై, వసుంధరాం = భూమిపై, విచరంతౌ = పర్యటించుచున్నట్టి, తౌ = ఆ సోదరులిరువురును, బహుపాదపసంకులే = అసంఖ్యములైన వృక్షములతో దట్టముగనున్నట్టి, ఋష్య మూకస్య మూలే = ఋష్యమూక పర్వతము యొక్క దిగువభాగమున, ఆసీనం = కూర్చుండియున్నట్టియు, పూర్వజేన = అన్నయైన వాలిచే, అవరోపితం = రాజ్యభ్రష్టుడుగ చేయబడినవాడును, భ్రాతుఃభయార్తం = అన్నగారివలనభయముచే పీడింపబడుచున్నవాడును, ప్రియదర్శనం = సుందరమైన రూపముతో కానవచ్చువాడు నగు, మృగపతిం = వానరశ్రేష్ఠుడైన, సుగ్రీవం = సుగ్రీవుని, దదర్శతుః = చూచిరి.

తాత్పర్యము:– ఆ రామలక్ష్మణు లిరువురును నిన్ను గూర్చియే వెదకుచు దేశము అంతయు తిరుగుచు ఋష్యమూక పర్వతము దిగువ గల చెట్ల గుబురునందు అన్నచే రాజ్యభ్రష్టుడై, అతనికి భయపడుచు కూర్చుండియున్నట్టి సుందరరూపుడైన వానరశ్రేష్ఠుని జూచిరి.

శ్లో॥ వయంచ హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరమ్,
పరిచర్యామహే రాజ్యాత్ పూర్వజే నావరోపితమ్. 26

పదచ్ఛేదము :– వయం – చ – హరిరాజం – తం – సుగ్రీవం – సత్య సంగరమ్ – పరిచర్యామహే – రాజ్యాత్ – పూర్వజేన – అవరోపితమ్,

అన్వయక్రమము :– వయంచ పూర్వజేన రాజ్యాత్ అవరోపితం, సత్యసంగరం హరిరాజం సుగ్రీవం పరిచర్యామహే॥

ప్రతిపదార్థము :– వయంచ = మేమును, పూర్వజేన = అన్నగారిచే, రాజ్యాత్ = రాజ్యమునుండి, అవరోపితం = దింపి వేయబడినట్టి వాడును, సత్యసంగరం = సత్యమైన ప్రతిజ్ఞగలవాడును అగు హరిరాజం, తం సుగ్రీవంవానరేంద్రుడైన = ఆ సుగ్రీవుని, పరిచర్యామహే = సేవించుచున్నాము.

తాత్పర్యము :– ఇచ్చటనే మేము వాలిచేరాజ్యము గోల్పోయియున్న ఉత్తమ వీరుడైన వానరశ్రేష్ఠుడగు ఆ సుగ్రీవునికడ నుండి ఆతనిని సేవించుచు నుంటిమి.

శ్లో॥ తత స్తౌ చీరవసనౌ ధనుః ప్రవర పాణినౌ,
ఋష్యమూకస్య శైలస్య రమ్యం దేశ ముపాగతౌ॥ 27

పదచ్ఛేదము :– తతః – తౌ – చీరవసనౌ – ధనుః ప్రవరపాణినౌ – ఋష్యమూకస్య – శైలస్య – రమ్యం – దేశం – ఉపాగతౌ॥

అన్వయక్రమము :– తతః చీరవసనౌ, ధనుఃప్రవరపాణినౌ, తౌ ఋష్యమూకస్య శైలస్య రమ్యం (తం) దేశం ఉపాగతౌ॥

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, చీరవసనౌ = నారచీరలు ధరించినవారై, ధనుః ప్రవరపాణినౌ = గొప్ప ధనుస్సులను చేతియందు పూనియున్నట్టి, తౌ = ఆ రామలక్ష్మణులిరువురును, ఋష్యమూకస్య శైలస్య = ఋష్యమూకపర్వతముయొక్క, రమ్యం తం దేశం = సుందరమైన ఆ ప్రదేశమును, ఉపాగతౌ = చేరినారు.

తాత్పర్యము :- అప్పుడు నారచీరలను ధరించి చేతులందు గొప్పవైన ధనుస్సులను దాల్చియున్నట్టి ఆ సోదరులిద్దరును సుందరమైన ఆ ఋష్యమూక పర్వతప్రదేశమునకు వచ్చిరి.

శ్లో॥ స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః,
అభిప్లుతో గిరే స్తస్య శిఖరం భయమోహితః. 28

పదచ్ఛేదము :- సః - తౌ - దృష్ట్వా - నరవ్యాఘ్రౌ - ధన్వినౌ - వానరర్షభః - అభిప్లుతః - గిరేః - తస్య - శిఖరం - భయమోహితః॥

అన్వయక్రమము :- సః వానరర్షభః నరవ్యాఘ్రౌ ధన్వినౌ తౌ దృష్ట్వా భయమోహితః సః తస్య గిరేః శిఖరం అభిప్లుతః॥

ప్రతిపదార్థము :- సః వానరర్షభః = వానరశ్రేష్ఠుడైన ఆ సుగ్రీవుడు, నరవ్యాఘ్రౌ = పురుషశ్రేష్ఠులను, ధన్వినౌ = గొప్ప ధనుస్సులను ధరించినవారునగు, తౌ = ఆ రామలక్ష్మణులను, దృష్ట్వా = చూచి, భయమోహితః = భయగ్రస్తుడై, తస్య గిరేః = ఆ ఋష్యమూక పర్వతము యొక్క, శిఖరం అభిప్లుతః = శిఖరమును అధిరోహించినాడు.

తాత్పర్యము :- అప్పుడు సుగ్రీవుడు మహా ధనుస్సులను ధరించియున్నట్టి ఆ మనుజశ్రేష్ఠుల నిరువురను గాంచి భయచకితుడై ఆ ఋష్యమూక పర్వత శిఖరము మీదికి పరుగుతో పోయి చేరుకొనెను,

శ్లో॥ తతః స్స శిఖరే తస్మిన్ వానరేంద్రో వ్యవస్థితః,
తయో స్సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్.29

పదచ్ఛేదము :- తతః - సః - శిఖరే - తస్మిన్ - వానరేంద్రః - వ్యవస్థితః - తయోః - సమీపం - మాం - ఏవ - ప్రేషయామాస - సత్వరమ్॥

అన్వయక్రమము :— తతః తస్మిన్ శిఖరే వ్యవస్థితః సః వానరేంద్రః తయోః సమీపం సత్వరం మామేవ ప్రేషయామాస॥

ప్రతిపదార్థము :— తతః = అటుపిమ్మట, తస్మిన్ శిఖరే = ఆ పర్వత శిఖరమున, వ్యవస్థితః = కుదుటబడియున్న, సః వానరేంద్రః = ఆ వానరరాజగు సుగ్రీవుడు, సత్వరం = వెంటనే మా మేవ = నన్నే, తయోః సమీపం = ఆ రామలక్ష్మణుల కడకు, ప్రేషయామాస = పంపించెను.

తాత్పర్యము :— పిమ్మట ఆ పర్వత శిఖరమున కొంచెము కుదుటబడి సుగ్రీవుడు వెంటనే నన్నే పిలిచి ఆ రామలక్ష్మణులను గూర్చి తెలిసికొని రమ్మని పంపెను.

శ్లో॥ తా వహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవవచనా త్ప్రభూ,
రూపలక్షణ సంపన్నౌ కృతాంజలి రుపస్థితః. 30

పదచ్ఛేదము :— తౌ - అహం - పురుషవ్యాఘ్రౌ - సుగ్రీవవచనాత్ ప్రభూ - రూపలక్షణ సంపన్నౌ - కృతాంజలిః - ఉపస్థితః ॥

అన్వయక్రమము :— అహం సుగ్రీవవచనాత్ పురుషవ్యాఘ్రౌ, రూపలక్షణ సంపన్నౌ, తౌ ప్రభూ కృతాంజలిః (సన్) ఉపస్థితః ॥

ప్రతిపదార్థము :— అహం = నేను, సుగ్రీవవచనాత్ = సుగ్రీవుని ఆజ్ఞవలన, పురుషవ్యాఘ్రౌ = పురుషశ్రేష్ఠులైన, రూపలక్షణసంపన్నౌ = సౌందర్యముతోడను ఉత్తమ లక్షణములతోడను కూడియున్నట్టి, తౌ ప్రభూ = ఆ స్వాములనిరువురిని, కృతాంజలిః = దోసిలి ఒగ్గినవాడనై, ఉపస్థితః = సమీపించినాడను.

తాత్పర్యము :— నేను అప్పుడు సుగ్రీవుని ఆదేశము ననుసరించి, గొప్ప సౌందర్యముతోను, మహాపురుష లక్షణములతోను, వెలయు

చున్న ఆ పురుష సింహుల కడకు బోయి దోసిలిఒగ్గి వినయముతో చేరి నిలచితిని.

శ్లో॥ తౌ పరిజ్ఞాత తత్త్వార్థౌ మయా ప్రీతిసమన్వితౌ।
పృష్ఠ మారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ. 3।
నివేదితౌచ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే.

పదచ్ఛేదము :- తౌ - పరిజ్ఞాతతత్త్వార్థౌ - మయా - ప్రీతి సమన్వితౌ - పృష్ఠం - ఆరోప్య - తం - దేశం ప్రాపితౌ - పురుష ర్షభౌ - నివేదితౌ - చ - తత్త్వేన - సుగ్రీవాయ - మహాత్మనే ॥

అన్వయక్రమము :- తౌ పురుషవ్యాఘ్రౌ మయా పరిజ్ఞాత తత్త్వార్థౌ, ప్రీతిసమన్వితౌ పృష్ఠం ఆరోప్య తందేశం ప్రాపితౌ; మహా త్మనే సుగ్రీవాయ తత్త్వేన నివేదితౌచ.

ప్రతిపదార్థము :- తౌ పురుష వ్యాఘ్రౌ = ఆ పురుష శ్రేష్ఠు లిరువురును, మయా = నాచేత, పరిజ్ఞాతతత్త్వార్థౌ = తెలియచేయబడిన యథార్థవిషయముగలవారై, ప్రీతిసమన్వితౌ = సంతోషముతోగూడిన వారగుచు, పృష్ఠం ఆరోప్య = (నా) వీపుపై నెక్కించుకొని, తం దేశం= (సుగ్రీవుడున్న)ఆ ప్రదేశమును, ప్రాపితౌ = చేర్చబడినారు, మహాత్మనే= మహానుభావుడైన, సుగ్రీవాయ = సుగ్రీవునకు, తత్త్వేన = యథార్థవిష యముచే, నివేదితౌచ = విన్నవింపబడినారు కూడను.

తాత్పర్యము :- పిమ్మట పురుషశ్రేష్ఠులైన ఆ సోదరులు నా నుండి మా చరిత్రనంతను తెలిసికొని సంతోషము నొందిరి. పిమ్మట నేను వారిని నా వీపుపైనెక్కించుకొని సుగ్రీవుని కడకు తీసికొనివచ్చి అతనికి వారిరువురి చరిత్రను విన్నవించితిని,

శ్లో॥ తయో రన్యోన్య సంభాషా దృఢశం ప్రీతి రజాయత.

పదచ్ఛేదము :- తయోః - అన్యోన్య సంభాషాత్ - భృశం-ప్రీతిః - అజాయత.

అన్వయక్రమము :- తయోః అన్యోన్య సంభాషాత్ భృశం ప్రీతిః అజాయత॥

ప్రతిపదార్థము :- తయోః = ఆ రామ సుగ్రీవులకు, అన్యోన్యసంభాషాత్ = పరస్పర సంభాషణము వలన, భృశం = మిక్కిలిగా, ప్రీతిః అజాయత = పరస్పర ప్రేమ జనించెను.

శ్లో॥ తతౌ తౌ కీర్తి సంపన్నౌ హరీశ్వర నరేశ్వరౌ,
పరస్పర కృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా ॥ 32

పదచ్ఛేదము :- తతౌ - తౌ - కీర్తిసంపన్నౌ - హరీశ్వర నరేశ్వరౌ - పరస్పర కృతాశ్వాసౌ - కథయా - పూర్వవృత్తయా.

అన్వయక్రమము :- తతౌ కీర్తిసంపన్నౌ, తౌ హరీశ్వర నరేశ్వరౌ। పూర్వవృత్తయా కథయా పరస్పర కృతశ్వాసౌ (అభవతామ్)

ప్రతిపదార్థము :- తతౌ = ఆ సమయమునందు, కీర్తి సంపన్నౌ = గొప్ప ప్రతిష్ఠనొంది యున్నట్టి, తౌ హరీశ్వర నరేశ్వరౌ = ఆ సుగ్రీవుడును, శ్రీరాముడును, పూర్వవృత్తయా = పూర్వముజరిగినట్టి, కథయా = చరిత్రచే, పరస్పర కృతాశ్వాసౌ = ఒండొరులను ఓదార్చుకొన్నవారు, (అభవతామ్) = అయిరి,

తాత్పర్యము :- అప్పుడు తమ పూర్వచరిత్రచే గొప్ప విఖ్యాతి గల్గిన ఆ రామసుగ్రీవు లిరువురును తాత్కాలికముగనైనట్టి తమ తమ విషాద గాథలను ఒకరి కొకరు తెలుపుకొనుచు ఊరటనొందిరి.

శ్లో॥ తం తత స్సాంత్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః,
స్త్రీహేతో ర్వాలినా భ్రాత్రా నిరస్త మురు తేజసా. 33

పదచ్ఛేదము :— తం - తతః - సాంత్వయామాస - సుగ్రీవం - లక్ష్మణాగ్రజః - స్త్రీహేతోః - వాలినా - భ్రాత్రా - నిరస్తం - ఉరు తేజసా ॥

అన్వయక్రమము:— తతః లక్ష్మణాగ్రజః ఉరుతేజసా, భ్రాత్రా వాలినా స్త్రీహేతోః నిరస్తం తం సుగ్రీవం సాంత్వయామాస.

ప్రతిపదార్థము :— తతః = పిమ్మట, లక్ష్మణాగ్రజః = శ్రీ రాముడు, ఉరుతేజసా = మహాపరాక్రమ సంపన్నుడైన, భ్రాత్రా వాలినా = సోదరుడైన వాలిచే, స్త్రీహేతోః = భార్యకారణముగా, నిరస్తం = వెడల గొట్టబడిన, తం సుగ్రీవం = ఆ సుగ్రీవుని, సాంత్వయామాస = ఓదా ర్చెను.

తాత్పర్యము :— పిమ్మట శ్రీరాముడు - గొప్పపరాక్రమము గల్గిన తన సోదరుడైన వాలి తన భార్యను అపహరించి, తనను రాజ్యము నుండి వెడలగొట్టగా వ్యథనొందుచున్నట్టి ఆ సుగ్రీవుని ప్రేమ వచనము లతో నూరడించెను.

శ్లో॥ తత స్త్వన్నాశజం శోకం రామ స్యాక్లిష్ట కర్మణః,
లక్ష్మణో వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్. 34

పదచ్ఛేదము :— తతః - త్వన్నాశజం - శోకం - రామస్య అక్లిష్టకర్మణః - లక్ష్మణః - వానరేంద్రాయ - సుగ్రీవాయ - న్యవేదయత్.

అన్వయక్రమము :— తతః లక్ష్మణః అక్లిష్ట కర్మణః రామస్య త్వన్నాశజం శోకం వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్.

ప్రతిపదార్థము :— తతః = పిమ్మట, లక్ష్మణః = లక్ష్మణుడు, వానరేంద్రాయ = వానరశ్రేష్ఠుడైనట్టి, సుగ్రీవాయ = సుగ్రీవునకు, అక్లిష్ట కర్మణః = పరులకు క్లేశములు గల్గింపని కృత్యములు కలిగినట్టి, రామస్య =

శ్రీరామునియొక్క. త్వన్నాశజం = నీ వియోగముచే గలిగినట్టి, శోకం= దిగులునుగూర్చి, న్యవేదయత్ = ఎఱుకపఱచెను.

తాత్పర్యము ._అటుపిమ్మట సుగ్రీవునికి లక్ష్మణుడు నీ వియోగమువలన రామభద్రునికి కలిగిన శోకపరిస్థితినంతను గూర్చి తెలిపెను.

శ్లో॥ స శ్రుత్వా వానరేంద్రస్తు లక్ష్మణే నేరితం వచః,
తదాసీ న్నిష్ప్రభోఽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్.

పదచ్ఛేదము :- సః - శ్రుత్వా - వానరేంద్రః - తు - లక్ష్మణేన - ఈరితం - వచః - తదా - ఆసీత్ - నిష్ప్రభః - అత్యర్థం- గ్రహగ్రస్తః - ఇవ - అంశుమాన్॥

అన్వయక్రమము :- సః వానరేంద్రః లక్ష్మణేన ఈరితం వచః శ్రుత్వా, తదా గ్రహగ్రస్తః అంశుమాన్ ఇవ అత్యర్థం నిష్ప్రభః ఆసీత్॥

ప్రతిపదార్థము :- సః వానరేంద్రః = ఆ వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు, లక్ష్మణేన = లక్ష్మణునిచే, ఈరితం = చెప్పబడినట్టి, వచః= మాటను, శ్రుత్వా = విని, తదా = అప్పుడు, గ్రహగ్రస్తః = రాహువుచే మ్రింగబడిన, అంశుమాన్ఇవ = సూర్యునివలె, అత్యర్థం = మిక్కిలి, నిష్ప్రభః = తేజోరహితుడు, ఆసీత్ = అయెను.

తాత్పర్యము :- అప్పుడు లక్ష్మణుడు తెలిపిన వృత్తాంతమంతయును విని సుగ్రీవుడు రాహువుచే గ్రసించబడిన సూర్యబింబము వలె మిక్కిలి విచారముతో తేజోవిహీను డయ్యెను.

శ్లో॥ తత స్త్వఙ్గాత్ర శోభీని రక్షసా హ్రియమాణయా,
యా న్యాభరణ జాలాని పాతితాని మహీతలే. 36

శ్లో॥ తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః,
సంహృష్టా దర్శయామాసుః గతింతు న విదుస్తవ. 37

పదచ్ఛేదము :- తతః - త్వద్గాత్రశోభీని - రక్షసా - హ్రియమాణయా-యాని - ఆభరణజాలాని - పాతితాని - మహీతలే, తాని - సర్వాణి - రామాయ - ఆనీయ - హరియూథపాః -సంహృష్టాః - దర్శయామాసుః - గతిం - తు - న - విదుః - తవ॥

అన్వయక్రమము:- తతః రక్షసా హ్రియమాణయా(త్వయా) త్వద్గాత్రశోభీని యాని ఆభరణ జాలాని మహీతలే పాతితాని, తాని సర్వాణి ఆనీయ సంహృష్టాః హరియూథపాః రామాయ దర్శయామాసుః. (తే) తవ గతింతు న విదుః.

ప్రతిపదార్థము :- తతః = అటు పిమ్మట, రక్షసా = రావణునిచే, హ్రియమాణయా = అపహరింపబడుచున్నట్టి, (త్వయా = నీచేత) త్వద్గాత్ర శోభీని = నీ శరీరముపై ప్రకాశించుచున్నట్టి, యాని ఆభరణ జాలాని = ఏ భూషణముల సమూహములు, మహీతలే = నేలపై, పాతితాని = పడవేయబడినవో, తాని సర్వాణి = వాని నన్నింటిని, ఆనీయ = తీసికొనివచ్చి, సంహృష్టాః = సంతోషము నొందియున్నవారై హరియూథపాః = వానరవీరులు, రామాయ = శ్రీరామునకు, దర్శయామాసుః = = చూపించిరి. (తే = ఆవానరవీరులు) తవ = నీ యొక్క, గతింతు = ఉనికిని మాత్రము, న విదుః = ఎఱుగరు.

తాత్పర్యము :- అప్పుడు నిన్ను రావణాసురుడు అపహరించుకొని పోవుచున్నప్పుడు ఆకసమునుండి నీవు నీ యొడలిపై వెలయుచున్న పీ యాభరణములను తీసివైచి నేలపై క్రిందికి పడవేసితివో ఆయాభరణముల నన్నింటిని తీసికొనివచ్చి మావానర వీరులు సంతోషముతో అనవాలుగా చూపుటకై శ్రీరామునకు ప్రదర్శించిరి. కాని వారికి నీ వెచ్చటనున్నావో మాత్రము తెలియకుండెను.

శ్లో॥ తాని రామాయ దత్తాని మయై వోప హృతానిచ,
స్వనవం త్యవకీర్ణాని తస్మిన్ విహతచేతసి. 38

పదచ్ఛేదము :- తాని - రామాయ - దత్తాని - మయా - ఏవ - ఉపహృతాని - చ - స్వనవంతి - అవకీర్ణాని - తస్మిన్ - విహతచేతసి.

అన్వయక్రమము :- తస్మిన్ విహత చేతసి (సతి) స్వనవంతి, అవకీర్ణాని, ఉపహృతాని తాని మయైవ రామాయ దత్తాని.

ప్రతిపదార్థము :- తస్మిన్ = ఆ శ్రీరాముడు - విహత చేతసి (సతి) = స్పృహ తప్పినవాడై యుండగా, స్వనవంతి = చప్పుడగు చున్నట్టివియును, అవకీర్ణాని = చెదరిపోయి యున్నట్టి వియును, ఉపహృతాని = తేబడినట్టివియును అగు, తాని = ఆయాభరణములు, మయైవ = నాచేతనే, రామాయ = శ్రీరామునకు, దత్తాని = ఈయబడినవి.

తాత్పర్యము :- అయాభరణములను కనుగొనగనే ప్రియా సంస్మరణముచే శ్రీరాముడు స్పృహను గోల్పోయెను. గలగలమను చప్పుడుతో నేలపై బడి చెదరిపోయినట్టి, ఆయాభరణములను అక్కడ మావానరులు తెచ్చియుంచగా వాటిని నేనే శ్రీరాముని చేత నుంచితిని॥.

శ్లో॥ తా న్యంకే దర్శనీయాని కృత్వా బహువిధం తదా,
తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్॥ 39

పదచ్ఛేదము :- తాని- అంకే - దర్శనీయాని - కృత్వా - బహువిధం - తదా - తేన - దేవప్రకాశేన - దేవేన - పరిదేవితమ్.

అన్వయక్రమము :- తదా దేవప్రకాశేన తేనదేవేన దర్శనీయాని తాని అంకేకృత్వా బహువిధం పరిదేవితమ్॥

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, దేవప్రకాశేన = దేవతలతో సమానమైన తేజస్సు కల్గినట్టి, తేన దేవేన = ఆ పూజ్యునిచే, దర్శనీ

యాని=మనోహరములైనట్టి, తాని=ఆయాభరణములను, అంకే కృత్వా=ఒడిలో నుంచుకొని, బహువిధం = పలువిధములుగా, పరిదేవితమ్ = దుఃఖింపబడెను.

తాత్పర్యము :— దేవతలతో సమానమైన తేజస్సుగల ఆ మహా ప్రియుడు అప్పుడు కన్నుల పండువుగా కానవచ్చిన ఆయాభరణములను తీసికొని తమ ఒడిలో నుంచు కొని పరిపరివిధములుగా విలపింప దొడగెను.

శ్లో॥ పశ్యత స్తాని రుదత స్తామ్యతశ్చ పునఃపునః,
ప్రాదీపయ ద్దాశరథే స్తదా శోకహుతాశనమ్. 40

పదచ్ఛేదము :— పశ్యతః - తాని - రుదతః - తామ్యతః - చ పునః - పునః - ప్రాదీపయత్ - దాశరథేః - తదా - శోకహుతాశనమ్॥

అన్వయక్రమము :— తదా తాని పునః పునః పశ్యతః, రుదతః, తామ్యతః దాశరథేః (తత్) శోకహుతాశనం ప్రాదీపయత్.

ప్రతిపదార్థము :— తదా = అప్పుడు, తాని = ఆయాభరణములను, పునఃపునః = మరల మరల, పశ్యతః = చూచుచున్నవాడును, రుదతః = శోకించుచున్న వాడును, తామ్యతః = కుమిలి పోవుచున్న వాడు నగు, దాశరథేః = శ్రీరామునికి, (తత్ = ఆయాభరణ దర్శనము) శోకహుతాశనం = శోకాగ్నిని, ప్రాదీపయత్ = ప్రజ్వలింపచేసెను.

తాత్పర్యము :— అప్పుడా యాభరణములను మరల మరల చూచుచు శోకించుచు, తాపము నొందుచున్న ఆ శ్రీరామునికి తనహృదయ మందున్న శోకాగ్ని ఒక్క మారుగా ప్రజ్వలింప దొడగెను॥

శ్లో॥ శాయితంచ చిరం తేన దుఃఖార్తేన మహాత్మనా,
మయాఽపి వివిధై ర్వాక్యైః కృచ్ఛ్రాదుత్థాపితః పునః.

పదచ్ఛేదము :- శాయితం - చ - చిరం - తేన - దుఃఖార్తేన - మహాత్మనా - మయా - అపి - వివిధైః - వాక్యైః - కృచ్ఛ్రాత్ - ఉత్థాపితః - పునః।

అన్వయక్రమము :- దుఃఖార్తేన తేన మహాత్మనా చిరం శాయితంచ; మయా అపి వివిధైః వాక్యైః పునః కృచ్ఛ్రాత్ ఉత్థాపితః॥

ప్రతిపదార్థము :- దుఃఖార్తేన = దుఃఖపీడితుడైనట్టి, తేన మహాత్మనా = ఆ మహనీయునిచే, చిరం = చిరకాలము, శాయితంచ = మూర్ఛనొందబడెను. మయా అపి = నా చేతకూడ, వివిధైః వాక్యైః = పలువిధములగు వచనములతో, పునః = తిరిగి, కృచ్ఛ్రాత్ = అతికష్టమున, ఉత్థాపితః = లేవనెత్తబడెను.

తాత్పర్యము :- శ్రీరాముడు దుర్భరమైనట్టి ఆ దుఃఖముచే చాలసేపటి వఱకు మూర్ఛితుడై యుండెను. సుగ్రీవాది వానరులును నేనును గూడ బహు విధములగు సాంత్వన వచనములతో అతనిని అతి కష్టము మీద స్పృహనొందునట్లు చేయ గలిగితిమి.

శ్లో॥ తాని దృష్ట్వా మహార్హాణి దర్శయిత్వా ముహుర్ముహుః,
రాఘవః సహసౌమిత్రిః సుగ్రీవే సంన్యవేశయత్.

పదచ్ఛేదము :- తాని - దృష్ట్వా - మహార్హాణి - దర్శయిత్వా - ముహుః - ముహుః - రాఘవః - సహసౌమిత్రిః - సుగ్రీవే - సంన్యవేశయత్.

అన్వయక్రమము :- సహసౌమిత్రిః రాఘవః మహార్హాణి తాని ముహుర్ముహుః దృష్ట్వా దర్శయిత్వా సుగ్రీవే సంన్యవేశయత్॥

ప్రతిపదార్థము :- సహసౌమిత్రిః = లక్ష్మణునితో గూడిన, రాఘవః = శ్రీరాముడు, మహార్హాణి = అమూల్యములైనట్టి, తాని = ఆయాభరణములను, ముహుర్ముహుః = మఱల మఱల, దృష్ట్వా = చూచి,

దర్శయిత్వా =(మాకు) చూపించి, సుగ్రీవే = సుగ్రీవుని అధీనమునందు, సంన్యవేశయత్ - ఉంచెను.

తాత్పర్యము :- ఆ యాభరణముల నన్నింటిని పెక్కుమాఱులు చూచి చూచి తన చుట్టునున్న మా యెల్లరకును చూపి చూపి వానిని భద్రపఱచుమని సుగ్రీవున కొసగెను.

శ్లో॥ స త వాదర్శనా దార్యే రాఘవః పరితప్యతే,
మహతా జ్వలతా నిత్య మగ్నినే వాగ్నిపర్వతః.

పదచ్ఛేదము :- సః - తవ - అదర్శనాత్-అర్యే - రాఘవః - పరితప్యతే - మహతా - జ్వలతా - నిత్యం - అగ్నినా - ఇవ - అగ్ని పర్వతః॥

అన్వయక్రమము :- ఆర్యే!రాఘవః తవఅదర్శనాత్ మహతా, జ్వలతా అగ్నినా అగ్నిపర్వతః ఇవ నిత్యం పరితప్యతే॥

ప్రతిపదార్థము :- ఆర్యే! = ఓ పూజ్యురాలా! రాఘవః = శ్రీరాముడు, తవ అదర్శనాత్ = నీవు కాన్పింపకుండుట వలన, మహతా = గొప్పదైన, జ్వలతా అగ్నినా = మండుచున్నట్టి అగ్నిచే, అగ్ని పర్వతః ఇవ = అగ్ని పర్వతమువలె, నిత్యం = నిత్యము, పరితప్యతే = మిక్కిలి తాపము నొందింపబడుచున్నాడు.

తాత్పర్యము :- ఓ పూజ్యురాలా! శ్రీరాముడు నీవు కాన్పింపక పోవుటచే తీవ్రమైన జ్వాలలతో మండుచున్న అగ్నిపర్వతమువలె తనలో అహర్నిశలు ఎంతగనో పరితాపము నొందుచున్నాడు సుమా!

శ్లో॥ త్వత్కృతే త మనిద్రాచ శోక శ్చింతాచ రాఘవమ్,
తాపయంతి మహాత్మాన మగ్న్యగారమి వాగ్నయః.

పదచ్ఛేదము :- త్వత్కృతే-తం-అనిద్రా-చ-శోకః-చింతా-చ రాఘవమ్, తాపయంతి, మహాత్మానం - అగ్న్యగారం - ఇవ - అగ్నయః.

అన్వయక్రమము :— మహాత్మానం తం క్వత్కృతే అనిద్రాచ, శోకశ్చ, చింతాచ అగ్న్యగారం అగ్నయః ఇవ తాపయంతి.

ప్రతిపదార్థము :— మహాత్మానం తం = మహాత్ముడైన ఆ శ్రీరాముని, త్వత్కృతే = నీ కారణముగా, అనిద్రాచ = నిద్రలేకి పోవుటయును, శోకశ్చ = దుఃఖమును, చింతాచ = చింతయును, అగ్న్యగారం = అగ్ని గృహమును, అగ్నయః ఇవ = అగ్నులువలె, తాపయంతి = తపింపజేయుచున్నవి.

తాత్పర్యము :— నీ కారణముగా మహాత్ముడైన ఆ శ్రీరామునికి నిద్రలేకున్నది. అతనికి దుఃఖముతో చింతతో కలిగిన వేదనలు అగ్ని గృహమును అగ్నులు జ్వలింప చేసినట్లుగా అపరిమితమైన తాపము కల్గించుచున్నవి.

శ్లో॥ త వాదర్శనశోకేన రాఘవః పరిచాల్యతే,
మహతా భూమికంపేన మహా నివ శిలోచ్చయః॥ 46

పదచ్ఛేదము — తవ — అదర్శన శోకేన — రాఘవః — పరిచాల్యతే — మహతా — భూమికంపేన — మహాన్ — ఇవ — శిలోచ్చయః.

అన్వయక్రమము :— రాఘవః తవ అదర్శన శోకేన,మహతా భూమి కంపేన మహాన్ శిలోచ్చయః ఇవ పరిచాల్యతే॥

ప్రతిపదార్థము :— రాఘవః = శ్రీరాముడు, తవ = నీయొక్క, అదర్శన శోకేన = కనపడక పోవుటవలన కలిగిన దుఃఖముచే, మహతా = గొప్పదైన, భూమి కంపేన = భూకంపముచే, మహాన్ = గొప్పదైన, శిలోచ్చయః ఇవ = పర్వతమువలె, పరిచాల్యతే = కంపింప చేయబడుచున్నాడు.

తాత్పర్యము :— నీవు కాన్పింప కుండుటచే గలిగిన దుఃఖముచే, శ్రీరాముడు పెద్ద భూకంపమునకు మహాపర్వతము కంపించినట్లుగా కంపించి పోవుచున్నాడుసుమా,

శ్లో॥ కాననాని సురమ్యాణి నదీప్రస్రవణానిచ,
చర న్న రతి మాప్నోతి త్వా మపశ్య న్నృపాత్మజే.

పదచ్ఛేదము :— కాననాని - సురమ్యాణి -నదీప్రస్రవణానిచ-చరన్ - న - రతిం - అప్నోతి - త్వాం - అపశ్యన్ - నృపాత్మజే॥

అన్వయక్రియము :— నృపాత్మజే, (రామః) త్వాం అపశ్యన్ సురమ్యాణి కాననాని, నదీప్రస్రవణానిచ చరన్ రతిం నఆప్నోతి.

ప్రతిపదార్థము :— నృపాత్మజే = ఓ రాజపుత్రీ! (రామః = శ్రీరాముడు) త్వాం అపశ్యన్ = నిన్నుగానక, సురమ్యాణి = మిక్కిలి మనోహరములైన, కాననాని = వనములను, నదీప్రస్రవణానిచ=నదులను, సెలయేళ్ళను, చరన్ = పర్యటించుచు, రతిం = వేడుకను, నఆప్నోతి,= పొందుటలేదు.

తాత్పర్యము :— ఓ జానకీ ! శ్రీరాముడు, నీవు కానరాకుండుటచే ఎంతయో రమ్యములైన వనములందును, నదీతీరము లందును, సెలయేళ్ళ సమీపమునను సంచరించుచున్నప్పటికిని తన మనస్సున ఎట్టి అనందము నొందలేక పోవుచున్నాడుసుమా !

శ్లో॥ స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః,
సమిత్రబాంధవం హత్వా రావణం జనకాత్మజే. 48

పదచ్ఛేదము :— సః - త్వాం - మనుజశార్దూలః - క్షిప్రం - ప్రాప్స్యతి - రాఘవః, సమిత్రబాంధవం - హత్వా - రావణం - జనకాత్మజే !

అన్వయక్రమము :- జనకాత్మజే! మనుజ శార్దూలః సః రాఘవః సమిత్రబాంధవం రావణం హత్వా త్వాం క్షిప్రం ప్రాప్స్యతి॥

ప్రతిపదార్థము :- జనకాత్మజే! = ఓ జనకనందినీ! మనుజ శార్దూలః = పురుష శ్రేష్ఠుడైన, సః రాఘవః = ఆ శ్రీరాముడు, సమిత్ర బాంధవం = మిత్రులతోడను బంధువుల తోడను గూడిన, రావణం = రావణాసురుని, హత్వా = చంపి, త్వాం = నిన్ను, క్షిప్రం = త్వరలో, ప్రాప్స్యతి = పొందగలడు.

తాత్పర్యము :- ఓ జనక రాజకుమారీ! మానవ సింహమైన ఆ వీరుడు మిత్రబంధు సమేతముగా రావణుని యుద్ధమున హతమార్చి నిన్ను అచిర కాలములోనే చేరుకొన గలడు సుమా!

శ్లో॥ సహితౌ రామసుగ్రీవా వుభా వకురుతాం తదా,
సమయం వాలినం హంతుం తవ చాన్వేషణంప్రతి॥ 49

పదచ్ఛేదము :- సహితౌ - రామసుగ్రీవౌ - ఉభౌ - అకురుతాం - తదా - సమయం - వాలినం - హంతుం - తవ - చ -అన్వేషణం-ప్రతి॥

అన్వయక్రమము :- తదా సహితౌ రామ సుగ్రీవౌ ఉభౌ వాలినం హంతుం, తవ అన్వేషణం ప్రతిచ సమయం అకురుతామ్॥

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, సహితౌ = కలసికొన్నట్టి, రామసుగ్రీవౌ ఉభౌ = రామసుగ్రీవు లిరువురును, వాలినం హంతుం = వాలిని వధించుటకు, తవ అన్వేషణం ప్రతిచ = నీ అన్వేషణమును గూర్చియును, సమయం అకురుతామ్ = ప్రతిజ్ఞను చేసిరి.

తాత్పర్యము :- అప్పుడు రామసుగ్రీవు లిరువురును పరస్పర సహకారముతో వాలిని సంహరించుటకును, నిన్ను వెదకి తెలిసి కొనుట కును కలిసి ప్రతిజ్ఞచేసిరి.

శ్లో॥ తత స్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః
కిష్కింధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః.

పదచ్ఛేదము :- తతః - తాభ్యాం - కుమారాభ్యాం-వీరాభ్యాం-సః-హరీశ్వరః, కిష్కింధాం - సముపాగమ్య - వాలీ -యుద్ధే-నిపాతితః॥

అన్వయక్రమము :- తతః సః హరీశ్వరః కిష్కింధాం సముపాగమ్య వీరాభ్యాం తాభ్యాం కుమారాభ్యాం వాలీ యుద్ధే నిపాతితః॥

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, సః హరీశ్వరః = ఆ వానర రాజైన సుగ్రీవుడు, కిష్కింధాం=కిష్కింధకు, సముపాగమ్య=చేరి, వీరాభ్యాం = వీరులైనట్టి, తాభ్యాం = ఆ, కుమారాభ్యాం = రాజ పుత్రులచే, వాలీ = వాలి, యుద్ధే=యుద్ధమునందు, నిపాతితః = కూల్చబడెను.

తాత్పర్యము :- అటుపిమ్మట సుగ్రీవుడు రామలక్ష్మణు లిరువురితో కలిసి కిష్కింధ చేరుకొని వాలితో యుద్ధము చేసి అతనిని నేల గూల జేసెను.

శ్లో॥ తతో నిహత్య తరసా రామో వాలిన మాహవే,
సర్వర్క్ష హరిసైన్యానాం సుగ్రీవ మకరో త్పతిమ్॥

పదచ్ఛేదము :- తతః - నిహత్య- తరసా - రామః-వాలినం-ఆహవే - సర్వర్క్షహరిసైన్యానాం - సుగ్రీవం - అకరోత్ - పతిమ్॥

అన్వయక్రమము:- తతః రామః తరసా ఆహవే వాలినం నిహత్య సుగ్రీవం సర్వర్క్ష హరి సైన్యానాం పతిం అకరోత్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, రామః = శ్రీరాముడు, తరసా = బలముచే, ఆహవే = యుద్ధమునందు, వాలినం = వాలిని, నిహత్య = పరిమార్చి, సుగ్రీవం = సుగ్రీవుని, సర్వర్క్షహరి సైన్యానాం=

సమస్తమైన భల్లూకముల యొక్కయు వానరుల యొక్కయు సైన్యము లకు, పతిం = రాజునుగా, అకరోత్ = చేసెను.

తాత్పర్యము :- అటు పిమ్మట శ్రీరాముడు తన పరాక్రమ విశేషముచే వాలిని యుద్ధమున సంహరించి సుగ్రీవుని సమస్తమైన భల్లూకములకును వానరములకును, ప్రభువు నొనరించెను.

శ్లో॥ రామసుగ్రీవయో రైక్యం దే వ్యేవం సమజాయత,
హనూమంతంచ మాం విద్ధి తయో ర్దూత మి హా గతమ్.

పదచ్ఛేదము :- రామసుగ్రీవయోః - ఐక్యం - దేవి - ఏవం - సమజాయత - హనూమంతం - చ - మాం - విద్ధి - తయోః - దూతం - ఇహ - ఆగతమ్.

అన్వయక్రమము :- దేవి; ఏవం రామ సుగ్రీవయోః ఐక్యం సమజాయత; మాం తయోః (సకాశాత్) ఉపాగతం దూతం హనుమంతం విద్ధి॥

ప్రతిపదార్థము :- దేవి ! = ఓ పూజ్యురాలా ! ఏవం = ఈ రీతిగా, రామ సుగ్రీవయోః = రామ సుగ్రీవులకు, ఐక్యం = మైత్రి, సమజాయత = ఏర్పడినది, మాం = నన్ను, తయోః = వారియొక్క (సకాశాత్ = సన్నిధి నుండి) ఉపాగతం = వచ్చినట్టి, దూతం = దూత యైన, హనూమంతం = హనుమంతునిగా, విద్ధి = తెలిసికొనుము.

తాత్పర్యము :- దేవీ ! రామ సుగ్రీవుల కీ విధముగ మైత్రి ఏర్పడినది. వారి సన్నిధి నుండియే వచ్చిన దూతను నేను. నన్ను హను మంతుడని యెంచుము

శ్లో॥ స్వం రాజ్యం ప్రాప్య సుగ్రీవః స్వా నానీయ మహాకపీన్,
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్. 52

పదచ్ఛేదము :- స్వం - రాజ్యం - ప్రాప్య - సుగ్రీవః - స్వాన్ - ఆ' య - మహాకపీన్ - త్వదర్థం - ప్రేషయామాస - దిశః - దశ - మహాబలాన్.

అన్వయక్రమము :- సుగ్రీవః స్వం రాజ్యం ప్రాప్య, స్వాన్ మహాబలాన్ మహాకపీన్ ఆనీయ త్వదర్థే దశదిశః ప్రేషయామాస.

ప్రతిపదార్థము :- సుగ్రీవః = సుగ్రీవుడు, స్వం రాజ్యం = తన రాజ్యమును, ప్రాప్య = పొంది, స్వాన్ = తన వారైన, మహాబలాన్ = అమిత బలాఢ్యులైన, మహాకపీన్ = వానర వీరులను, ఆనీయ = రప్పించి, త్వదర్థే = నీ కొఱకై, దశదిశః = పది దిక్కులను గూర్చి, ప్రేషయామాస = పంపించెను.

తాత్పర్యము :- సుగ్రీవుడు తన రాజ్యమును తిరిగి సంపాదించుకొన్న పిమ్మట నలుమూలల నున్న మహాబలశాలులైన తన వానర వీరుల నెల్లరను నగరమునకు రప్పించి నిన్ను వెదకుట కొఱకై ఎల్ల దిక్కులకును పంపెను.

శ్లో॥ ఆదిష్టా వానరేంద్రేణ సుగ్రీవేణ మహౌజసః
అద్రిరాజప్రతీకాశా స్సర్వతః ప్రస్థితా మహీమ్.

పదచ్ఛేదము :- ఆదిష్టాః - వానరేంద్రేణ - సుగ్రీవేణ - మహౌజసః, - అద్రిరాజ ప్రతీకాశాః - సర్వతః - ప్రస్థితాః - మహీమ్।

అన్వయక్రమము :- వానరేంద్రేణ సుగ్రీవేణ ఆదిష్టాః మహౌజసః అద్రిరాజ ప్రతీకాశాః (వానరాః) మహీం సర్వతః ప్రస్థితాః॥

ప్రతిపదార్థము :- వానరేంద్రేణ = వానర ప్రభువయిన, సుగ్రీవేణ = సుగ్రీవునిచే, ఆదిష్టాః = ఆజ్ఞాపింప బడినవారై, మహౌజసః = మహాప్రతాప సంపన్నులును, అద్రిరాజ ప్రతీకాశాః = మహా

పర్వత సన్నిభులును అగు, వానరాః = వానరులు, మహీం = భూమిని, సర్వతః = అంతటను, ప్రస్థితాః = బయలువెడలిరి.

తాత్పర్యము :— వానర రాజైన సుగ్రీవునిచే అజ్ఞాపింప బడి నట్టి, మహా పరాక్రమ సంపన్నులైన మహాపర్వత సన్నిభులగు ఆ వానర వీరులు భూమిపై నెల్ల యెడలను నిన్ను వెదకుటకై బయలుదేరి వెడలిరి.

శ్లో॥ తత స్తే మార్గ మాణా వై సుగ్రీవ వచనాతురాః
చరంతి వసుధాం కృత్స్నాం వయ మన్యేచ వానరాః

పదచ్ఛేదము :— తతః - తే - మార్గమాణాః - వై - సుగ్రీవ వచనాతురాః - చరంతి - వసుధాం - కృత్స్నాం - వయం - అన్యే - చ - వానరాః॥

అన్వయక్రమము :— తతః సుగ్రీవ వచనా తురాః తే వయం, అన్యేవానరాశ్చ కృత్స్నాం వసుధాం మార్గమాణాః చరంతి॥

ప్రతిపదార్థము :— తతః - అటు పిమ్మట, సుగ్రీవ వచనా తురాః = సుగ్రీవుని ఆజ్ఞకు భీతినొందిన వారమై, తే వయం = అట్టి మేము, అన్యే వానరాశ్చ = ఇతరులైన వానరులును, కృత్స్నాం వసుధాం = సమస్తమైన భూమిని, మార్గమాణాః = వెదకుచున్నవారై, చరంతి = పరిభ్రమించుచున్నారు.

సూ చ న ;- 'సుగ్రీవ వచనానుగాః' అని పాఠాంతరము అనగా సుగ్రీవుని మాటను అనుసరించిన వారమై.

తాత్పర్యము :— అటు పిమ్మట సుగ్రీవుని ఆజ్ఞకు బద్ధులమై మేమును, ఇతర వానరులమును నిన్ను వెదకుచున్న వారమై భూమండల మంతటను పరిభ్రమించు చుంటిమి.

శ్లో॥ అంగదో నామ లక్ష్మీవా న్వాలిసూను ర్మహాబలః,
ప్రస్థితః కపిశార్దూల స్త్రిభాగబల సంవృతః. 55

పదచ్ఛేదము :- అంగదః - నామ - లక్ష్మీవాన్ - వాలి సూనుః - మహాబలః - ప్రస్థితః - కపిశార్దూలః - త్రిభాగబల సంవృతః,

అన్వయక్రమము :- అంగదః నామ లక్ష్మీవాన్ మహాబలః కపిశార్దూలః వాలిసూనుః త్రిభాగబల సంవృతః ప్రస్థితః॥

ప్రతిపదార్థము :- అంగదః నామ = అంగదుడను పేరుగలిగినట్టి, లక్ష్మీవాన్ = శుభలక్షణ సముపేతుడును, మహాబలః = మహాబలశాలియును, కపిశార్దూలః = వానరశ్రేష్ఠుడును అగు, వాలిసూనుః = వాలితనయుడు, త్రిభాగబల సంవృతః=మూడవ వంతు సైన్యముతో గూడినవాడై, ప్రస్థితః = బయలుదేరెను.

తాత్పర్యము :- శుభలక్షణ సమన్వితుడును, మహాబలాఢ్యుడును, వానర శ్రేష్ఠుడును అగు వాలితనయుడైన అంగదుడు మూడవ వంతు వానరసైన్యమును వెంటనిడుకొని నిన్ను వెదకుటకై బయలుదేరెను.

శ్లో॥ తేషాం నో విప్రనష్టానాం వింధ్యే పర్వతసత్తమే,
భృశం శోకపరీతానా మహోరాత్రగణా గతాః. 56

పదచ్ఛేదము :- తేషాం - నః - విప్రనష్టానాం - వింధ్యే- పర్వత త్తమే - భృశం - శోకపరీతానాం - అహోరాత్ర గణాః- గతాః,

అన్వయక్రమము :- పర్వత సత్తమే వింధ్యే విప్రణష్టానాం, భృశం శోకపరీతానాం తేషాం నః అహోరాత్ర గణాః గతాః.

ప్రతిపదార్థము :- పర్వత సత్తమే = పర్వత శ్రేష్ఠమైన, వింధ్యే = వింధ్యగిరి యందు, విప్రణష్టానాం = మార్గము గోల్పోయినట్టియు, భృశం = మిక్కిలిగ, శోకపరీతానాం = శోకగ్రస్తులమైయున్న వారమునగు, తేషాం నః = అట్టి మాకు, అహోరాత్రగణాః = రాత్రింబవళ్ళ సమూహములు, గతాః = గడచిపోయినవి.

తాత్పర్యము :- మహా పర్వతమైన వింధ్యగిరిపై మార్గమును గోల్పోయి మిక్కిలిగ శోకసంతప్తులమై తిరుగుచుండగా, మాకు అచ్చట ఎన్నియో పగళ్లును రాత్రులును గడచిపోయినవి.

శ్లో॥ తే వయం కార్యనైరాశ్యా త్కాలస్యాతిక్రమేణచ,
భయాచ్చ కపిరాజస్య ప్రాణాం స్త్యక్తు ముపస్థితాః.

పదచ్ఛేదము :- తే - వయం - కార్యనైరాశ్యాత్ - కాలస్య - అతిక్రమేణ - చ - భయాత్ - చ - కపిరాజస్య - ప్రాణాన్ - త్యక్తుం - ఉపస్థితాః.

అన్వయక్రమము:- తేవయం కార్యనైరాశ్యాత్, కాలస్య అతిక్రమేణచ, కపిరాజస్య భయాత్చ ప్రాణాన్ త్యక్తుం ఉపస్థితాః॥

ప్రతిపదార్థము :- తే వయం = అట్టిమేము, కార్యనైరాశ్యాత్ = కార్యము నెడగల్గిన నిరాశవలనను, కాలస్య అతిక్రమేణ చ = కాలమతిక్రమించుట చేతను, కపిరాజస్య భయాత్ చ = సుగ్రీవుని భయము వలనను, ప్రాణాన్ త్యక్తుం = ప్రాణములను విడుచుటకు, ఉపస్థితాః = సిద్ధపడితిమి

తాత్పర్యము :- మా కర్తవ్యమును నెఱవేర్చలేనందువలన గలిగిన నిరాశ వలనను, మా వానర రాజొసగిన కాల మతిక్రమించుట చేతను, చండశాసనుడైన సుగ్రీవుని భయము వలనను ముందు త్రోవ గానక ప్రాణములను విడుటకే నిర్ణయించుకొంటిమి.

శ్లో॥ విచిత్య గిరిదుర్గాణి నదీప్రస్రవణానిచ,
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాం స్త్యక్తుం వ్యవస్థితాః

పదచ్ఛేదము :— విచిత్య - గిరిదుర్గాణి - నదీప్రస్రవణాని - చ - అనాసాద్య - పదం - దేవ్యాః - ప్రాణాన్ - త్యక్తుం - వ్యవస్థితాః.

అన్వయక్రమము :— గిరిదుర్గాణి నదీప్రస్రవణానిచ విచిత్య దేవ్యాః పదం అనాసాద్య ప్రాణాన్ త్యక్తుం వ్యవస్థితాః.

ప్రతిపదార్థము :— గిరిదుర్గాణి = పర్వత మార్గములను, నదీప్రస్రవణాని చ = నదులను సెలయేళ్ళను గూడ, విచిత్య = అన్వేషించి, దేవ్యాః పదం = పూజ్యురాలవైన నీ యునికిని, అనాసాద్య = కనుగొనలేక, ప్రాణాన్ త్యక్తుం = ప్రాణములను విడుచుటకు, వ్యవస్థితాః = నిశ్చయించుకొన్నాము.

తాత్పర్యము :— దుర్గమములైన పర్వతములను నదులను, సెలయేళ్ళను ఎల్లయెడలను వెదకి వెదకి పూజ్యురాలవైన నీ యునికిని ఎందును కనుగొనజాలక చివరికి మా ప్రాణములను త్యజించుటకే నిశ్చయించుకొంటిమి.

శ్లో॥ తత స్తస్య గిరే ర్మూర్ధ్ని వయం ప్రాయ ముపాస్మహే॥

పదచ్ఛేదము :— తతః - తస్య - గిరేః - మూర్ధ్ని - వయం - ప్రాయం - ఉపాస్మహే॥

అన్వయక్రమము :— తతః వయం తస్యగిరేః మూర్ధ్ని ప్రాయ ఉపాస్మహే॥

ప్రతిపదార్థము :— తతః = అటు పిమ్మట, వయం = మేము, తస్య గిరేః = ఆ వింధ్య పర్వతము యొక్క, మూర్ధ్ని = శిఖరముపై, ప్రాయం ఉపాస్మహే = ప్రాయోపవేశమును బూని యుంటిమి.

తాత్పర్యము :— అట్లు ప్రాణములు విడుచుటకు నిశ్చయించుకొన్నట్టి మేము వెంటనే ఆ వింధ్య పర్వత శిఖరముపై ప్రాయోపవేశవ్రతమును బూని కూర్చుంటిమి.

35 H87.5
26998

సూచన :- ఈ పాదము ఉత్తరదేశ ప్రతులలో మాత్రమేగాన వచ్చుచున్నది.

శ్లో॥ దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చసర్వాన్వానరపుంగవాన్,
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయ దంగదః. 59
తవనాశం చ వై దేహి వాలినశ్చ తథా వధమ్,
ప్రాయోపవేశ మస్మాకం మరణంచ జటాయుషః. 60

పదచ్ఛేదము :- దృష్ట్వా - ప్రాయోపవిష్టాన్ - చ - సర్వాన్ - వానరపుంగవాన్ - భృశం - శోకార్ణవే - మగ్నః - పర్యదేవయత్ - అంగదః - తవ - నాశం - చ - వైదేహి - వాలినః - చ - తథా - వధమ్ - ప్రాయోపవేశం - అస్మాకం - మరణం - చ - జటాయుషః.

అన్వయక్రమము :- వైదేహి ! అంగదః ప్రాయోప విష్టాన్ సర్వాన్ వానరపుంగవాన్ దృష్ట్వా, తవ నాశంచ, వాలినః వధంచ, జటాయుషః మరణం చ, తథా అస్మాకం ప్రాయోపవేశం చ దృష్ట్వా శోకార్ణవే మగ్నః భృశం పర్యదేవయత్॥

ప్రతిపదార్థము :- వైదేహి = ఓ జానకీ, ప్రాయోప విష్టాన్ = ప్రాయోపవేశ దీక్షను బూని యున్నట్టి, సర్వాన్ వానరపుంగవాన్ దృష్ట్వా = వానర శ్రేష్ఠుల నందరను జూచి, తవ నాశంచ = నీవు కన బడకుండుటను, వాలినః వధం చ = వాలి యొక్క వధను, జటాయుషః మరణం చ = జటాయువు యొక్క మరణమును, తథా = అట్లే, అస్మాకం ప్రాయోపవేశం చ = మా ప్రాయోప వేశమును, దృష్ట్వా = కనుగొని, శోకార్ణవే = శోక సాగరమున, మగ్నః = నిమగ్నుడై, భృశం = మిక్కిలిగా, పర్యదేవయత్ = విలపించెను.

తాత్పర్యము :- ప్రాయోపవేశ దీక్షను బూనియున్న మా వానర వీరులను చూడగానే అంగదుడు, నీవు కనిపింప కుండుట, వాలి

వధింప బడుట, జటాయువు మృతి నొందుట, అను వానితో బాటు మా ప్రాయోపవేశమును తలచు కొని శోక సముద్రమున మునిగి అమితముగ విలపింప దొడగెను.

శ్లో॥ తేషాం న స్స్వామిసందేశా న్నిరాశానాం ముమూర్షతామ్,
కార్యహేతో రిహాయాతః శకుని ర్వీర్యవా న్మహాన్॥
గృధ్రరాజస్య సోదర్యః సంపాతి ర్నామ గృధ్రరాట్,
శ్రుత్వా భ్రాతృవధం కోపా దిదం వచన మబ్రవీత్.

పదచ్ఛేదము :- తేషాం - నః - స్వామి సందేశాత్ విరాశానాం - ముమూర్షతామ్ - కార్యహేతోః - ఇహ - అయాతః-శకునిః- వీర్యవాన్ - మహాన్ - గృధ్రరాజస్య-సోదర్యః - సంపాతిః - నామ - గృధ్రరాట్-శ్రుత్వా - భ్రాతృవధం-కోపాత్-ఇదం- వచనం అబ్రవీత్॥

అన్వయక్రమము :- తేషాం నః స్వామి సందేశాత్ ముమూర్షతామ్ (సతాం) గృధ్రరాజస్య సోదర్యః సంపాతిః నామ గృధ్రరాట్ మహాన్ వీర్యవాన్ శకునిః కార్యహేతోః ఇహ ఆ యాతః, భ్రాతృవధం శ్రుత్వా కోపాత్ ఇదం వచనం అబ్రవీత్.

ప్రతిపదార్థము .- తేషాం నః = అట్టి మేము- స్వామి సందేశాత్ = రాజాజ్ఞవలన, ముమూర్షుతాం (సతాం) = చనిపోవగోరుచుండగా, గృధ్రరాజస్య = గృధ్రరాజైన జటాయువు యొక్క, సోదర్యః = సోదరుడగు, సంపాతిః నామ = సంపాతి యని ఖ్యాతిని గన్నట్టి, గృధ్రరాట్ = గృధ్రములలో శ్రేష్ఠుడైన, మహాన్ వీర్యవాన్ శకునిః= గొప్ప పరాక్రమ శాలియగు పక్షి, కార్యహేతోః = పని కారణముగ, ఇహ = ఇచ్చటికి, అయాతః = వచ్చిన వాడై, భ్రాతృవధం శ్రుత్వా = తమ్ముని మరణమును గూర్చి విని, కోపాత్ = క్రోధమున, ఇదం వచనం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :— అట్లు మేము మా వానర రాజు ఆజ్ఞకు భీతి నొంది, ప్రాణములు వీడుటకు సిద్ధమైయుండగా, జటాయువు సోదరుడైన మహా పరాక్రమ సంపన్నుడగు సంపాతి యనెడి పక్షిరాజు ఒకానొక కార్యమును గూర్చి మేమున్న ఆ వింధ్య పర్వత శిఖరము మీదకు వచ్చి తన సోదరుడైన జటాయువు మరణమును గూర్చి విని మిక్కిలి క్రోధముతో మమ్ము చూచి ఇట్లు పలికెను.

శ్లో॥ యవీయాన్ కేన మే భ్రాతా హతః క్వచ నిపాతితః ।
ఏత దాఖ్యాతు మిచ్ఛామి భవద్భి ర్వానరోత్తమాః॥

పదచ్ఛేదము :— యవీయాన్ - కేన - మే- భ్రాతా - హతః - క్వ - చ - నిపాతితః - ఏతత్ - ఆఖ్యాతుం - ఇచ్ఛామి - భవద్భిః- వానరోత్తమాః॥

అన్వయక్రమము :— వానరోత్తమాః మే యవీయాన్ భ్రాతా కేన నిపాతితః? క్వచ నిపాతితః? భవద్భిః ఏతత్ ఆఖ్యాతుం ఇచ్ఛామి.

ప్రతిపదార్థము :— వానరోత్తమాః = ఓ వానర శ్రేష్ఠులారా! మే = నా యొక్క, యవీయాన్ = చిన్నవాడైన, భ్రాతా = సోదరుడు, కేన = ఎవ్వనిచే నిపాతితః = వధింపబడెను? క్వచ = ఎచ్చట, నిపాతితః = నేలగూల్చబడెను? భవద్భిః = మీచే, ఏతత్ = ఇది, ఆఖ్యాతుం = చెప్పుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తాత్పర్యము :— నా తమ్ముడు ఎవనిచే వధింపబడినాడు? ఎచ్చట నేల గూల్చబడినాడు? ఓ వానర శ్రేష్ఠులారా! నాకీ విషయమును మీరు వివరముగా తెలుపుడు.

శ్లో॥ అంగదో ఽకథయ త్తస్య జనస్థానే మహద్వధమ్ ।
రక్షసా భీమరూపేణ త్వాముద్దిశ్య యథార్థతః॥ 64

పదచ్ఛేదము :— అంగదః - అకథయత్ - తస్య - జనస్థానే - మహత్ - వధమ్ - రక్షసా - భీమరూపేణ - త్వాం-ఉద్దిశ్య- యథార్థతః.

అన్వయక్రమము :— జనస్థానే త్వాం ఉద్దిశ్య భీమరూపేణ రక్షసా తస్య మహద్వధం అంగదః యథార్థతః అకథయత్॥

ప్రతిపదార్థము :— జనస్థానే = జనస్థానమునందు త్వాం = నిన్ను, ఉద్దిశ్య = గురించి, భీమరూపేణ = భీకరాకారుడైన, రక్షసా = రాక్షసునిచే, తస్య = ఆ జటాయువు యొక్క, మహద్వధం = గొప్పదైన వధను గూర్చి, అంగదః = అంగదుడు, యథార్థతః = ఉన్నది యున్నట్లుగా, అకథయత్ = చెప్పెను.

తాత్పర్యము :— జనస్థానమునందు నీ గురించియే భయంకరుడైన ఒక రాక్షసునిచే ఆ జటాయువు యుద్ధమున నిహతుడయ్యెనని అంగదుడు జరిగిన ఆ యథార్థమును సంపాతికి వివరించెను.

శ్లో॥ జటాయోస్తు వధం శ్రుత్వా దుఃఖితస్సోఽరుణాత్మజః।
త్వాం మాహ స వరారోహే వసంతీం రావణాలయే.

పదచ్ఛేదము :— జటాయోః-తు-వధం-శ్రుత్వా-దుఃఖితః-సః - అరుణాత్మజః-త్వాం - ఆహ - సః-వరారోహే-వసంతీం-రావణాలయే॥

అన్వయక్రమము :— వరారోహే। జటాయోః వధం శ్రుత్వా దుఃఖితః సః అరుణాత్మజః త్వాం రావణాలయే వసంతీం ఆహ.

ప్రతిపదార్థము :— వరారోహే। = ఓ సుందరాంగి। జటాయోః = జటాయువు యొక్క, వధం = వధనుగూర్చి, శ్రుత్వా = విని, దుఃఖితః = దుఃఖము నొందినట్టి, సః అరుణాత్మజః = ఆ అనూరు తనయుడైన సంపాతి, త్వాం = నిన్ను, రావణాలయే = రావణుని భవనమునందు, వసంతం = ఉన్నదానినిగా, ఆహ = పలికెను.

తాత్పర్యము :– ఓ సీతా సుందరీ జటాయువధను గూర్చివిని దుఃఖితుడైన ఆ సంపాతి నీవు రావణుని భవనము నందున్నావని మాకు తెలిపెను.

శ్లో॥ తస్య త ద్వచనం శ్రుత్వా సంపాతేః ప్రీతివర్ధనమ్।
అంగదప్రముఖా స్సర్వేతతః సంప్రస్థితా వయమ్॥ 66

పదచ్ఛేదము :– తస్య - తత్ - వచనం - శ్రుత్వా సంపాతేః - ప్రీతివర్ధనమ్ - అంగద ప్రముఖాః - సర్వే - తతః - సంప్రస్థితాః - వయమ్॥

అన్వయక్రమము – తస్య సంపాతేః ప్రీతివర్ధనం తద్వ చనం శ్రుత్వా అంగద ప్రముఖాః వయం సర్వే తతః సంప్రస్థితాః॥

ప్రతిపదార్థము :– తస్య సంపాతేః = ఆ సంపాతి యొక్క, ప్రీతివర్ధనం = సంతోష వర్ధనమైనట్టి, త ద్వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, అంగద ప్రముఖాః = అంగదుడు మున్నగు, వయం సర్వే = మేమెల్లరమును, తతః = అటనుండి, సంప్రస్థితాః = బయలు వెడలితిమి.

తాత్పర్యము :– సంపాతి చెప్పిన సంతోషకరమైన ఆ మాటను విని, అంగదుడు మున్నగు మేమందఱమును ఆ వింధ్య పర్వతము నుండి ముందునకు సాగిపోయితిమి.

శ్లో॥ వింధ్యా దుత్థాయ సంప్రాప్తాః సాగరస్యాంత ముత్తమమ్,
త్వద్దర్శనే కృతోత్సాహా హృష్టాః పుష్టాః
ప్లవంగమాః॥ 67

పదచ్ఛేదము :– వింధ్యాత్ - ఉత్థాయ - సంప్రాప్తాః - సాగరస్య - అంతం - ఉత్తమమ్ - త్వద్దర్శనే - కృతోత్సాహాః - హృష్టాః - పుష్టాః - ప్లవంగమాః॥

అన్వయక్రమము :- త్వద్దర్శనే కృతోత్సాహాః, హృష్టాః పుష్టాః ప్లవంగమాః వింధ్యాత్ ఉత్థాయ ఉత్తమం సాగరస్య అంతం సంప్రాప్తాః॥

ప్రతిపదార్థము :- త్వద్దర్శనే = నీ దర్శనమునందు కృతోత్సాహాః = కలిగిన ఉత్సాహము గలవారమై, హృష్టాః = సంతోషము కలిగియున్నవారమును, పుష్టాః = బలమునొందియున్న వారము నగు, ప్లవంగమాః = వానరులము, వింధ్యాత్ ఉత్థాయ = వింధ్య పర్వతము నుండి లేచి, ఉత్తమం = శ్రేష్ఠమైన, సాగరస్య అంతం = సముద్రము యొక్క తీరమును, సంప్రాప్తాః = చేరుకొంటిమి.

తాత్పర్యము :- నిన్ను దర్శించ వలెనని ఉత్సాహము గల వారమై గొప్ప ఆనందముతో, గొప్పబలము నొంది మా వానరులము ఆ వింధ్య పర్వతము నుండి కదలి విశాలమైన సముద్రతీరమును చేరుకొంటిమి.

శ్లో॥ అంగదప్రముఖా స్సర్వే వేలోపాంత ముపాగతాః,
చింతాం జగ్ముః పున ర్భీమాం త్వద్దర్శనసముత్సుకాః.

పదచ్ఛేదము :- అంగదప్రముఖాః - సర్వే - వేలోపాంతం - ఉపాగతాః - చింతాం - జగ్ముః - పునః - భీమాం - త్వద్దర్శన సముత్సుకాః॥

అన్వయక్రమము :- త్వద్దర్శన సముత్సుకాః అంగదప్రముఖాః సర్వే వేలోపాంతం ఉపాగతాః పునః భీమాం చింతాం జగ్ముః॥

ప్రతిపదార్థము :- త్వద్దర్శన సముత్సుకాః = నీ దర్శనమునందు వేగిరపాటు కలిగినట్టివారైన, అంగద ప్రముఖాః సర్వే = అంగదుడు మున్నగు వారెల్లరును, వేలోపాంతం = తీరప్రదేశమును, ఉపా

గతాః = చేరినవారై, పునః = తిరిగి, భీమాం = భయంకరమైన, చింతాం = విచారమును, జగ్ముః = పొందిరి.

తాత్పర్యము :— నీ దర్శనమును గూర్చి తహతహలాడుచున్న అంగదాది వానరులెల్లరును సముద్రతీరమును చేరి అచ్చట భయంకరమైన ఆ మహాసాగరమును జూచి మిక్కిలి చింతకులోనయిరి.

శ్లో॥ అ థాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః,
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః.

పదచ్ఛేదము :— అథ - అహం- హరిసైన్యస్య - సాగరం- ప్రేక్ష్య - సీదతః - వ్యవధూయ - భయం - తీవ్రం - యోజనానాం - శతం - ప్లుతః

అన్వయక్రమము :— అథ అహం సాగరం ప్రేక్ష్య సీదతః హరి సైన్యస్య తీవ్రం భయం వ్యవధూయ యోజనానాంశతంప్లుతః॥

ప్రతిపదార్థము :— అథ = పిమ్మట, అహం = నేను, సాగరం = సముద్రమును, ప్రేక్ష్య = చూచి, సీదతః = భయవిహ్వలులగుచున్న, హరిసైన్యస్య = వానరసైన్యముయొక్క, తీవ్రం = తీవ్రమైనట్టి, భయం = భీతిని, వ్యవధూయ = పోగొట్టి, యోజనానాం శతం = నూఱు యోజనములను, ప్లుతః = దాటినాను.

తాత్పర్యము :— అప్పుడు నేను సముద్రమునుజూచి భీతిగ్రస్తులైయున్న మా వానరసైన్యమును బాధించుచున్న ఆ తీవ్రమైన భయమును పోగొట్టి నూఱు యోజనములు విస్తీర్ణము గల సముద్రమును దాటి వచ్చితిని.

శ్లో॥ లంకా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా,
రావణశ్చ మయా దృష్టః త్వం చ శోకనిపీడితా. 70

పదచ్ఛేదము :- లంకా - చ - అపి - మయా - రాత్రౌ - ప్రవిష్టా - రాక్షసాకులా - రావణః - చ - మయా - దృష్టః - త్వం - చ - శోకనిపీడితా.

అన్వయక్రమము :- మయా - రాక్షసాకులా లంకాఅపిచ రాత్రౌ ప్రవిష్టా, రావణశ్చ మయా దృష్టః, శోకనిపీడితా త్వంచ దృష్టా.

ప్రతిపదార్థము :- మయా = నాచేత, రాక్షసాకులా = రాక్షసులచే నిండినట్టి, లంకా అపిచ = లంకానగరముగూడ, రాత్రౌ = రాత్రియందు, ప్రవిష్టా = ప్రవేశింపబడినది రావణశ్చ = రావణుడుగూడ, మయా = నాచేత, దృష్టః = చూడబడినాడు, శోకనిపీడితా = శోకసంతప్తురాలవైన, త్వంచ = నీవుగూడ, దృష్టా = కనుగొనబడితివి.

తాత్పర్యము .- రాక్షసులతో నిండియున్న ఈ లంకానగరమును నేను రాత్రికాలమున ప్రవేశించితిని. రావణుని గూడ చూచితిని. శోకముచే మిక్కిలి కృశించియున్న నిన్నును కనుగొంటిని.

శ్లో॥ ఏతత్తే సర్వ మాఖ్యాతం యథావృత్త మనిందితే,
అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథే రహమ్. 71

పదచ్ఛేదము :- ఏతత్ - తే - సర్వం - అఖ్యాతం - యథావృత్తం - అనిందితే - అభిభాషస్వ - మాం - దేవి - దూతః-దాశరథేః- అహమ్.

అన్వయక్రమము ;- అనిందితే। ఏతత్ సర్వం తే యథావృత్తం అఖ్యాతమ్, దేవి మాం అభిభాషస్వ, అహం దాశరథేః దూతః.

ప్రతిపదార్థము :- అనిందితే = ఓ పూజ్యురాలా, ఏతత్=ఇది, సర్వం = అంతయును, తే = నీకు, యథావృత్తం = ఉన్నది యున్నట్లుగా, ఆఖ్యాతమ్ = చెప్పబడినది, దేవి = ఓ పూజ్యురాలా!, మాం అభిభాషస్వ = నాతో భాషింపుము, అహం = నేను, దాశరథేః = దశరథ రామునియొక్క-, దూతః = దూతను.

తాత్పర్యము :- ఓ సీతాసాధ్వీ! నీకు ఉన్నది యున్నట్లుగా విషయమంతయును తెలిపి యుంటిని; తల్లీ! నాతో మాటాడుము. నేను దశరథ రాముని దూతనుగాని వేఱొకడను గాను.

శ్లో॥ త న్మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్త మిహాగతమ్,
సుగ్రీవసచివం దేవి బుధ్యస్వ పవనాత్మజమ్. 72

పదచ్ఛేదము :- తత్ - మాం - రామకృతోద్యోగం-త్వన్నిమిత్తం - ఇహ - ఆగతమ్ - సుగ్రీవసచివం - దేవి - బుధ్యస్వ - పవనాత్మజమ్.

అన్వయక్రమము :- దేవి! తత్ మాం రామకృతోద్యోగం ఇహ త్వన్నిమిత్తం ఆగతం సుగ్రీవ సచివం పవనాత్మజం బుధ్యస్వ.

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా!, తత్ = ఆకారణముచే, మాం = నన్ను, రామకృతోద్యోగం = శ్రీరాముని గుఱించి చేయుచున్న ప్రయత్నము గల వానినిగను, ఇహ = ఇచ్చట, త్వన్నిమిత్తం = నీకొఱకుగా, ఆగతం = వచ్చిన వానినిగను, సుగ్రీవసచివం = సుగ్రీవుని మంత్రియైనట్టి, పవనాత్మజం = వాయుపుత్రునిగను, బుధ్యస్వ= తెలిసికొనుము.

తాత్పర్యము :- తల్లీ! నేనిచ్చటకు రామకార్యార్థముగా నిన్ను దర్శించుటకై వచ్చినట్టి సుగ్రీవుని మంత్రియైన వాయుసుతుడ నని నన్ను గుఱించి తెలిసికొనుము.

శ్లో॥ కుశలీ తవ కాకుత్స్థః సర్వశస్త్రభృతాంవరః,
గురో రారాధనే యుక్తో లక్ష్మణశ్చ సుభలక్షణః. 73

పదచ్ఛేదము :- కుశలీ - తవ-కాకుత్స్థః - సర్వశస్త్రభృతాం - వరః, గురోః - ఆరాధనే - యుక్తః - లక్ష్మణః - శుభలక్షణః.

అన్వయక్రమము :- సర్వశస్త్రభృతాంవరః తవ కాకుత్స్థః, కుశలీ, గురోః ఆరాధనేయుక్తః శుభలక్షణః లక్ష్మణః చ కుశలీ.

ప్రతిపదార్థము :- సర్వశస్త్రభృతాంవరః = శస్త్రధారులైన వీరులందరిలో, వరః = శ్రేష్ఠుడైన, తవ కాకుత్స్థః = నీ శ్రీరాముడు, కుశలీ = క్షేమముగలిగి యున్నవాడు, గురోః=అన్నయొక్క, ఆరాధనే = సేవయందు, యుక్తః = లగ్నమైయున్నవాడును, శుభలక్షణః = శుభలక్షణ సమన్వితుడును అగు, లక్ష్మణఃచ =లక్ష్మణుడును, కుశలీ = కుశలముగనున్నాడు.

తాత్పర్యము :- తల్లీ! లోకమున మేటివీరుడైన నీ శ్రీరాముడు క్షేమముగ నున్నాడు. అన్నయైన అతని సేవయందు జాగరూకుడై యున్న శుభలక్షణ సంపన్నుడగు లక్ష్మణుడు గూడ కుశలముగ నున్నాడు.

శ్లో॥ తస్య వీర్యవతో దేవి భర్తు స్తవహితే రతః,
అహ మేక స్తు సంప్రాప్తః సుగ్రీవవచనా దిహ. 74

పదచ్ఛేదము :- తస్య - వీర్యవతః - దేవి - భర్తుః -తవ- హితే - రతః - అహం - ఏకః - తు - సంప్రాప్తః - సుగ్రీవ వచనాత్ - ఇహ.

అన్వయక్రమము :- దేవి! వీర్యవతః తస్య తవ భర్తుః హితేరతః అహం ఏకః సుగ్రీవవచనాత్ ఇహ సంప్రాప్తః.

ప్రతిపదార్థము :- దేవి = ఓ పూజ్యురాలా!, వీర్యవతః = పరాక్రమవంతుడైనట్టి, తస్య = అట్టి తవ భర్తుః = నీ పెనిమిటియొక్క, హితేః = క్షేమమునందు, రతః = ఆసక్తిగలవాడనై, అహం = నేను, ఏకః = ఒక్కడనే సుగ్రీవవచనాత్ = సుగ్రీవుని ఆజ్ఞవలన, ఇహ = ఇటకు, సంప్రాప్తః = చేరియుంటిని.

తాత్పర్యము :- అమ్మా! పరాక్రమశాలియైననీభర్తకు ప్రియమును సాధింపగోరినవాడనై సుగ్రీవుని ఆజ్ఞప్రకారము ఒంటరిగా ఈ లంకకు చేరుకొంటిని.

శ్లో॥ మ యేయ మసహాయేన చరతా కామరూపిణా,
దక్షిణా ది గనుక్రాన్తా త్వన్మార్గ విచయైషిణా. 75

పదచ్ఛేదము :- మయా - ఇయం - అసహాయేన - చరతా - కామరూపిణా - దక్షిణా - దిక్ - అనుక్రాంతా - త్వన్మార్గవిచయైషిణా.

అన్వయక్రమము :- అసహాయేన, త్వన్మార్గవిచయైషిణా, కామరూపిణా చరతా మయా ఇయం దక్షిణాదిక్ అనుక్రాంతా.

ప్రతిపదార్థము :- త్వన్మార్గవిచయైషిణా = నీజాడను తెలిసికొనగోరినట్టియు, అసహాయేన = ఒంటరియైనట్టియు, కామరూపిణా చరతా = కామరూపమును ధరించినవాడనై సంచరించుచున్నట్టియు, మయా = నాచేత, ఇయం దక్షిణా దిక్ = ఈ దక్షిణదిక్కు, అనుక్రాంతా = అనుసరింపబడినది.

తాత్పర్యము :- నిన్ను వెదుకగోరి ఒంటరిగనే కామరూపముతో బయలుదేరి చరించుచున్నట్టి నేను ఈ దక్షిణ దిక్కునుగైకొని వచ్చితిని.

శ్లో॥ దిష్ట్యాహం హరిసైన్యానాం త్వన్నాశ మనుశోచతామ్
అపనేష్యామి సంతాపం త వాధిగమ శంసనాత్. 76

పదచ్ఛేదము :- దిష్ట్యా - అహం - హరిసైన్యానాం - త్వన్నాశం - అనుశోచతామ్, అపనేష్యామి - సంతాపం - తవ - అధిగమ శంసనాత్.

అన్వయక్రమము :- దిష్ట్యా అహం త్వన్నాశం అనుశోచతాం హరిసైన్యానాం సంతాపం తవ అధిగమ శంసనాత్ అపనేష్యామి.

ప్రతిపదార్థము :- దిష్ట్యా = భాగ్యవశమున, అహం = నేను, త్వన్నాశం = నీవుకనబడకుండుటనుగూర్చి, అనుశోచతాం = పరితపించుచున్నట్టి, హరిసైన్యానాం = వానరసైన్యములయొక్క, సంతాపం = శోకమును, తవ = నీయొక్క, అధిగమ శంసనాత్ = సంప్రాప్తి కథనము వలన, అపనేష్యామి = తొలగించగలను.

తాత్పర్యము :- నీవు కనబడుటలేదని దుఃఖించుచున్న, మా వానరవీరుల సంతాపము తొలగించుచు నీవు కాన్పించితి వను శుభవార్తను చెప్పి నా భాగ్యవశమువలన వారికి సంతోషము కలిగించెదను.

శ్లో॥ దిష్ట్యాహి న మమ వ్యర్థం సాగర స్యేహా లంఘనమ్,
ప్రాప్స్య మ్యహ మిదం దేవి త్వద్దర్శనకృతం యశః॥ 77

పదచ్ఛేదము :- దిష్ట్యా - హి-న - మమ-వ్యర్థం-సాగరస్య-ఇహ - లంఘనమ్, ప్రాప్స్యామి - అహం - ఇదం - దేవి - త్వద్దర్శనకృతం - యశః.

అన్వయక్రమము :- దిష్ట్యా మమ సాగరస్య లంఘనం ఇహ నిహివ్యర్థమ్, దేవి ! అహం త్వద్దర్శనకృతం ఇదంయశః ప్రాప్స్యామి.

ప్రతిపదార్థము :- దిష్ట్యా = అదృష్టవశముచే, మమ = నాయొక్క, సాగరస్య లంఘనం = సముద్రలంఘనము, ఇహ=ఇక్కడ, నహివ్యర్థం - నిష్ప్రయోజనముగాలేదు, దేవి=ఓపూజ్యురాలా, అహం=

నేను, త్వద్దర్శనకృతం = నిన్ను దర్శించుటచే కలిగినట్టి, ఇదం యశః = ఈ కీర్తిని, ప్రాప్స్యామి = పొందగలను.

తాత్పర్యము :- నా యదృష్టవశమున నేను గావించినట్టి ఈ సముద్రలంఘన ప్రయాసము వ్యర్థముగాలేదు. తల్లీ! నిన్ను దర్శించితి నన్న కీర్తి నాకే దక్కగలదు.

శ్లో॥ రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వా మభిపత్స్యతే,
సపుత్ర బాంధవం హత్వా రావణం రాక్షసాధిపమ్. 78

పదచ్ఛేదము :- రాఘవః - చ-మహావీర్యః- క్షిప్రం-త్వాం- అభిపత్స్యతే - సపుత్ర బాంధవం - హత్వా - రావణం - రాక్షసాధిపమ్.

అన్వయక్రమము :- మహావీర్యః రాఘవశ్చ క్షిప్రం సపుత్ర బాంధవం రాక్షసాధిపం రావణం హత్వా త్వాం అభిపత్స్యతే

ప్రతిపదార్థము :- మహావీర్యః = మహాపరాక్రమశాలియగు, రాఘవశ్చ = శ్రీరాముడును, క్షిప్రం = శీఘ్రముగ, సపుత్ర బాంధవం= పుత్రుల తోడను బంధువుల తోడను గూడినట్టి, రాక్షసాధిపం = రాక్షస రాజైన, రావణం = రావణుని, హత్వా = సంహరించి, త్వాం = నిన్ను, అభిపత్స్యతే = చేరగలడు.

తాత్పర్యము :- మహావీరుడైన శ్రీరాముడు అచిరకాలములోనే కొడుకులతోడను బంధువుల తోడను, ఆ రాక్షస ప్రభువైన రావణుని పరిమార్చి నిన్ను పొందగలడునుమా!

శ్లో॥ మాల్యవా న్నామ వైదేహి గిరీణా ముత్తమో గిరిః,
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః. 79

పదచ్ఛేదము :- మాల్యవాన్ - నామ - వైదేహి - గిరీణాం- ఉత్తమః - గిరిః, తతః - గచ్ఛతి - గోకర్ణం-పర్వతం - కేసరీ - హరిః.

అన్వయక్రమము :- వైదేహి, మాల్యవాన్నామ గిరీణాం ఉత్తమః గిరిః (అస్తి) కేసరీహరిః తతః గోకర్ణం పర్వతం గచ్ఛతి॥

ప్రతిపదార్థము :- వైదేహి = ఓజానకీ! మాల్యవాన్నామ= మాల్యవంతము అను ప్రసిద్ధమైనట్టి, గిరిః = పర్వతము (అస్తి=ఉన్నది) కేసరీ హరిః = కేసరియను వానరోత్తముడు, తతః = అచ్చటినుండి, గోకర్ణం పర్వతం=గోకర్ణ మను పర్వతమును గూర్చి, గచ్ఛతి=వెడలెను,

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- "యస్య న జ్ఞాయతే శీలం కులం యస్య చ సంశ్రియమ్,
న తస్య సంగతిం కుర్యాదిత్యువాచ బృహస్పతిః"

ఎవని యాచారము, స్వభావము, కులము, ఎవరివద్ద నెచ్చోటనుండు నది, తెలియదో వానితోడగూడి యుండరాదు అని బృహస్పతి వచనము. కాన కులహీనునితో, ఆచారహీనునితో, సదాశ్రయములేనివారితో, స్నేహం చేయగూడదు. కాబట్టి హనుమ సీతాదేవికి తన విషయము ఇచ్చట చెప్పుచున్నాడు. అదియునుగాక శిష్యులు సైతము గురువు వంశాదులను విచారించవలెనని ధ్వనితము.

తాత్పర్యము :- ఓ జానకీదేవీ! మాల్యవంతమని పేరువడసిన పర్వతశ్రేష్ఠము ఒకటిగలదు. అదినివాసముగా చేసికొన్న కేసరియను వానరోత్తముడు ఒకమాఱు ఆ గిరినుండి గోకర్ణపర్వతమునకు వెడలియుండెను.

శ్లో॥ సచ దేవర్షిభి ర్దిష్టః పితా మమ మహాకపిః,
తీర్థే నదీపతేః పుణ్యే శంబసాదన ముద్ధరత్. 80

ప్రతిచ్ఛేదము :- సః - చ - దేవర్షిభిః - దిష్టః - పితా - మమ - మహాకపిః - తీర్థే - నదీపతేః - పుణ్యే - శంబసాదనం-ఉద్ధరత్,

అన్వయక్రమము :- మమపితా నః మహాకపిః దేవర్షిభిః దిష్టః నదీపతేః పుణ్యేతీర్థే శంబసాదనం ఉద్ధరత్.

ప్రతిపదార్థము :- మమ పితా =నా తండ్రియైనట్టి, సః మహా కపిః = ఆ వానరశ్రేష్ఠుడు, దేవర్షిభిః = దేవఋషులచే, దిష్టః = ఆదే శింపబడినవాడై, నదీపతేః = సముద్రముయొక్క, పుణ్యే తీర్థే= పవిత్ర తీర్థమునందు, శంబసాదనం = శంబసాదనుడను రక్కసుని, ఉద్ధరత్ = సంహరించెను.

తాత్పర్యము :- నా తండ్రియైన కేసరియను ఆ వానరోత్త ముడు అచటి దేవఋషులచే ఆజ్ఞాపింపబడినవాడై పవిత్రమైన సాగర తీర్థమును పాడుచేయుచు అచటనే నివసించుచున్న శంబసాదనుడను రాక్షసుని సంహరించెను.

శ్లో॥ త స్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి,
హనుమా నితి విఖ్యాతో లోకే స్వే నైవ కర్మణా. 81

పదచ్ఛేదము :- తస్య - అహం - హరిణః - క్షేత్రే-జాతః- వాతేన - మైథిలి - హనుమాన్ - ఇతి - విఖ్యాతః - లోకే - స్వేన - ఏవ - కర్మణా॥

అన్వయక్రమము :- మైథిలి! అహం తస్య హరిణః క్షేత్రే వాతేన జాతః, స్వేన ఏవ కర్మణా హనుమాన్ ఇతి విఖ్యాతః॥

ప్రతిపదార్థము :- మైథిలి = ఓ జానకీ! అహం = నేను, తస్య = ఆ, హరిణః = వానరుని యొక్క, క్షేత్రే = కళత్రమునందు, వాతేన = వాయుదేవునిచే, జాతః = జనించినాను, స్వేన = నాదైన, కర్మణా ఏవ = పని చేతనే, హనుమాన్ ఇతి = హనుమంతుడని, విఖ్యాతః = పేరొందితిని.

తాత్పర్యము :- ఓ జానకీ! నేను ఆ కేసరి యను వానర శ్రేష్ఠుని కళత్రమైన అంజనాదేవి యందు వాయు దేవుని వరముచే జన్మించి నట్టి వాడను. నా చేష్టకారణముగానే హనుమంతుడనని పేరు గాంచితిని.

శ్లో॥ విశ్వాసార్థంతు వైదేహి భర్తు రుక్తా మయా గుణాః,
అచిరా త్త్వా మితో దేవి రాఘవో నయితా ధ్రువమ్ 82

పదచ్ఛేదము :- విశ్వాసార్థం - తు - వైదేహి - భర్తుః - ఉక్తాః - మయా-గుణాః - అచిరాత్ - త్వాం - ఇతః - దేవి - రాఘవః - నయితా - ధ్రువమ్॥

అన్వయక్రమము :- వైదేహి! (తవ) విశ్వాసార్థం మయా భర్తుః గుణాః ఉక్తాః; దేవి! రాఘవః త్వాం ఇతః అచిరాత్ ధ్రువం నయితా॥

ప్రతిపదార్థము :- వైదేహి! = ఓ జానకీ! తవ = నీ యొక్క, విశ్వాసార్థం = నమ్మకము కొఱకు, మయా = నా చేత, భర్తుః = ప్రభువు యొక్క, గుణాః = గుణములు, ఉక్తాః = చెప్పబడినవి, దేవి = ఓ పూజ్యురాలా! రాఘవః = శ్రీరాముడు, త్వాం = నిన్ను, ఇతః = ఇట నుండి, అచిరాత్ = త్వరలోనే, ధ్రువం = నిశ్చయముగా, నయితా = తీసికొని పోవగలడు॥

తాత్పర్యము :- ఓ జానకీదేవీ! నీకు నమ్మకమును కలిగించుట కొఱకై స్వామి గుణములను వర్ణించి చెప్పితిని. తల్లీ! శ్రీరాముడు నిన్ను రాక్షస మధ్యము నుండి అతిశీఘ్రకాలములోనే నిశ్చయముగా గొని పోగలడు సుమా!

శ్లో॥ ఏవం విశ్వాసితా సీతా హేతుభి శ్శోకకర్శితా,
ఉపపన్నై రభిజ్ఞానై ర్దూతం త మధిగచ్ఛతి. 83

పదచ్ఛేదము :— ఏవం - విశ్వాసితా - సీతా - హేతుభిః - శోకకర్శితా - ఉపపన్నైః - అభిజ్ఞానైః - దూతం - తం - అధిగచ్ఛతి॥

అన్వయక్రమము :— శోకకర్శితా సీతా- ఏవం హేతుభిః విశ్వాసితా (సతీ) ఉపపన్నైః అభిజ్ఞానైః తం దూతం అధిగచ్ఛతి॥

ప్రతిపదార్థము :— శోకకర్శితా = దుఃఖముచే పీడింపబడినట్టి, సీతా = సీతాదేవి, ఏవం = ఈ రీతిగా, హేతుభిః = కారణములచే, విశ్వాసితా (సతీ) = నమ్మకము కల్గింపబడినదై, ఉపపన్నైః = యుక్తము లైనట్టి, అభిజ్ఞానైః = గుర్తులచే, తం = అతనిని, దూతం = దూతగా, అధిగచ్ఛతి = గ్రహించినది.

తాత్పర్యము :— శోకపీడితు రాలైయున్న సీతాదేవికి హనుమ ంఈ విధముగా యుక్తమైన కారణములచే నమ్మకము కలిగించెను. అతనిలో కానవచ్చిన ఉత్తమ లక్షణములచే సీతమ్మయు అతనిని శ్రీరాముని దూతగా నమ్మినది.

శ్లో॥ అతులంచ గతా హర్షం ప్రహర్షేణ తు జానకీ,
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమోచ చానందజం
జలమ్. 84

పదచ్ఛేదము :— అతులం - చ - గతా - హర్షం - ప్రహర్షేణ - తు - జానకీ - నేత్రాభ్యాం - వక్రపక్ష్మాభ్యాం - ముమోచ - ఆనందజం - జలమ్॥

అన్వయక్రమము :— జానకీ అతులం హర్షం గతా (సతీ) ప్రహర్షేణ వక్రపక్ష్మాభ్యాం నేత్రాభ్యాం ఆనంద జం జలం ముమోచ॥

ప్రతిపదార్థము :— జానకీ = సీతాదేవి, అతులం హర్షం = సాటిలేని సంతోషమును, గతా (సతీ) = పొందినదై, ప్రహర్షేణ = మహా

నందముతో, వక్రపక్ష్మాభ్యాం = వంకరయైన కను బొమ్మలు కలిగినట్టి, నేత్రాభ్యాం = కన్నులనుండి, ఆనందజం జలం = సంతోష బాష్పములను, ముమోచ = విడిచెను.

తాత్పర్యము :— సీతాదేవి అమితమైన ఆనందము నొందినదై ఆ మహానందముతో సుందరములైన కను బొమలతో వెలయునట్టి తన కన్నుల నుండి ఆనంద బాష్పములను రాల్చినది

శ్లో॥ చారు తద్వదనం తస్యా స్తామ్ర శుక్లాయ తేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇ వోడురాట్ 8౫

పదచ్ఛేదము :— చారు - తత్ - వదనం - తస్యాః - తామ్ర శుక్లాయతేక్షణమ్ - అశోభత - విశాలాక్ష్యాః - రాహుముక్తః - ఇవ - ఉడురాట్ ॥

అన్వయక్రమము :— విశాలాక్ష్యాః తస్యాః తామ్రశుక్లాయతేక్షణం చారు తద్వదనం రాహుముక్తః ఉడురాట్ ఇవ అశోభత॥

ప్రతిపదార్థము :— విశాలాక్ష్యాః = విశాలములైన నేత్రములు కల్గిన, తస్యాః = ఆమెయొక్క, తామ్రశుక్లాయతేక్షణం = ఎఱ్ఱని, తెల్లని వెడల్పైన నేత్రములతో కూడిన, చారు = సుందరమైన,తద్వదనం = ఆమె యొక్క ముఖము, రాహుముక్తః = రాహువుచే విడువ బడిన, ఉడురాట్ ఇవ = చంద్రుడువలె, అశోభత = శోభిల్లెను.

తాత్పర్యము :— విశాలాక్షియైన ఆ సీతాదేవియొక్క ఎఱ్ఱగను తెల్లగను పొడవుగను నున్న కన్నులతో మనోహరమైనట్టి, వదనము ఆ సమయమున కలిగిన ఆనంద విశేషముచే రాహువుచే విడువబడి ప్రకాశించుచున్న పున్నమనాటి చంద్రునివలె ఎంతయో కాంతితో శోభిల్లెను.

శ్లో॥ హనూమంతం కపిం వ్యక్తం మన్యతే నాన్యథేతి సా
అథోవాచ హనూమాం స్తా ముత్తరం ప్రియదర్శ
నామ్॥ 86

పదచ్ఛేదము :— హనూమంతం - కపిం - వ్యక్తం - మన్యతే - న - అన్యథా - ఇతి - సా - అథ - ఉవాచ - హనూమాన్ - తాం - ఉత్తరం - ప్రియదర్శనామ్॥

అన్వయక్రమము :— సా హనూమంతం వ్యక్తం కపిం మన్యతే. అన్యథాన ఇతి మన్యతే, అథ హనూమాన్ ప్రియదర్శనాం తాం ఉత్తరం ఉవాచ.

ప్రతిపదార్థము :— సా = ఆ సీతాదేవి, హనూమంతం = హనుమంతుని, వ్యక్తం కపిం = స్పష్టమైన వానరునిగా, మన్యతే = తలచెను. అన్యథా న ఇతి = వేఱొక విధముగా గాదనియు, మన్యతే = తలచినది. అథ = పిమ్మట, హనూమాన్ = హనుమంతుడు, ప్రియదర్శనాం తాం = సంతోషకరముగ గానవచ్చు చున్నట్టి ఆమెను, ఉత్తరం ఉవాచ = మీది విషయమును పలికెను.

తాత్పర్యము :— సీతాదేవి తనతో మాటాడుచున్న వానరుడు హనుమంతుడే గాని మాయావియైన వేఱొకడు గాడని గ్రహించినది. అప్పుడు సంతోష చిహ్నములతో గాన వచ్చుచున్న సీతాదేవిని గూర్చి హనుమంతుడు పై విధముగ పలికెను.

శ్లో॥ ఏత త్తే సర్వ మాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి,
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియా మ్యహమ్87

పదచ్ఛేదము :— ఏతత్ - తే - సర్వం - ఆఖ్యాతం - సమాస్వసి-హి - మైథిలి - కిం - కరోమి - కథం - వా-తే -రోచతే - ప్రతియామి - అహమ్॥

అన్వయక్రమము :- మైథిలి! తే ఏతత్ సర్వం (మయా) అఖ్యాతం, సమాశ్వసిహి, కిం కరోమి? కథంవా తే రోచతే? అహం ప్రతియామి॥

ప్రతిపదార్థము :- మైథిలి = ఓ సీతాదేవీ! తే = నీకు, (మయా = నాచేత) ఏతత్ సర్వం = ఇది యంతయును అఖ్యాతం = చెప్పబడినది. సమాశ్వసిహి = ఊరడిల్లుము, కిం కరోమి? = ఏమి చేయుదును?, తే = నీకు, కథంవా = ఏ రీతిగా, రోచతే = ఇష్టమగును? అహం = నేను, ప్రతియామి = వెడలిపోవుదును.

తాత్పర్యము :- ఓ జానకీ! నీవడిగిన దాని కంతకును సమాధానము చెప్పితిని. నీవు ఊరట చెందియుండుము. నేను తిరిగి శ్రీరాముని కడకు వెడలి పోవుచున్నాను, ఇక నేనేమి చేయవలసి యుండును? నీ ఇష్టమైన దేమున్నదో చెప్పుము.

శ్లో॥ హతే ఽసురే సంయతి శంబసాదనే
కపిప్రవీరేణ మహర్షి చోదనాత్,
తతో ఽస్మి వాయుప్రభవో హి మైథిలి
ప్రభావత స్తత్ప్రతిమశ్చ వానరః॥ 88

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకి రామాయణే సుందరకాండే విశ్వాసోత్పాదనం నామ పంచత్రింశస్సర్గః.

పదచ్ఛేదము :- హతే - అసురే - సంయతి - శంబసాదనే - కపిప్రవీరేణ - మహర్షి చోదనాత్ - తతః - అస్మి - వాయుప్రభవః - హి - మైథిలి - ప్రభావతః - తత్ప్రతిమః - చ - వానరః॥

అన్వయక్రమము :- మైథిలి! మహర్షిచోదనాత్ కపిప్రవీరేణ సంయతి శంబసాదనే అసురే హతే (సతి) తతః అహం వాయుప్రభవః. ప్రభావతః తత్ప్రతిమః వానరః అస్మి॥

ప్రతిపదార్థము :— మైథిలి = ఓ జానకీ!, మహర్షి చోదనాత్ = దేవర్షుల యొక్క ప్రేరణ వలన, కపిప్రవీరేణ = వానరోత్తమునిచే సంయతి = యుద్ధమున, శంబసాదనే అసురే = శంబసాదనుడను రాక్షసుడు, హతే (సతి) = నిహతుడై యుండగా, తతః = అందువలన, అహం = నేను, వాయుప్రభవః = వాయుదేవుని వలన జనించినట్టి వాడను, ప్రభావతః = ప్రభావమున, తత్ ప్రతిమః = ఆతనితో సమానుడనగు, వానరః అస్మి = వానరుడనై యున్నాను.

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— తతః = అందువలన, శంబసాదనుడను రాక్షసుని వధించుట వలన ప్రీతి నొందిన మహర్షుల యొక్క అనుగ్రహము వలన అని భావము.

మహేశ్వరతీర్థులు :— ప్రభావతః తత్ ప్రతిమః, కిం కరోమి, యని సీతాదేవిని అడుగుచు హనుమ తాను ఎట్టి ఘనకార్యమునైనను సాధింప గల సామర్థ్యము గల వాడనేయని ఆమెకు తెలుపుటకై నేను ప్రభావము నందు నా తండ్రియైన వాయు దేవునితో సమానుడనై యుంటి నని భావము.

తాత్పర్యము :— మహర్షుల ప్రేరణ ననుసరించి నా తండ్రియైన కేసరి రణరంగమున శంబసాదనుని వధింపగా తత్ఫలితముగా సంతోషము నొందియున్న వాయుదేవుని వరము వలన నేను జన్మించి యున్నాను. ప్రభావ విశేషమున నేనును నా తండ్రియైన వాయుదేవుని యంతటి వాడనే సుమా!

ఇది శ్రీ మత్సుందరకాండమునకు 'సుబోధిని'యను ఆంధ్ర వివరణమున "విశ్వాసోత్పాదనము" అను ముప్పదియైదవ సర్గము.

శ్రీరామాయ నమః
శ్రీరామశరణ్ గురుభ్యో నమః

అథ షట్త్రింశ స్సర్గః

శ్లో॥ భూయఏవ మహాతేజా హనుమా న్పవనాత్మజః,
అబ్రవీ త్ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్ ॥ 1

పదచ్ఛేదము :- భూయః - ఏవ - మహాతేజాః-హనుమాన్-పవనాత్మజః - అబ్రవీత్ - ప్రశ్రితం-వాక్యం-సీతాప్రత్యయ కారణాత్॥

అన్వయక్రమము :- మహాతేజాః పవనాత్మజః హనుమాన్ సీతాప్రత్యయ కారణాత్ భూయః ఏవ ప్రశ్రితం వాక్యం అబ్రవీత్॥

ప్రతిపదార్థము :- మహాతేజాః = మహాతేజ స్సంపన్నుడైన, పవనాత్మజః హనుమాన్ = వాయునందనుడగు హనుమ, సీతా ప్రత్యయ కారణాత్ = సీతకు నమ్మకము కల్గించు నిమిత్తముగా, భూయః ఏవ = తిరిగి వెంటనే, ప్రశ్రితం = వినయముతో గూడిన, వాక్యం = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- మహాతేజ స్సంపన్నుడగు మారుతి సీతకు ఇంకను నమ్మకము కల్గించు కొఱకై వినయముతో తిరిగి ఈ విధముగ పలికెను.

శ్లో॥ వానరో౽హం మహాభాగే దూతో రామస్య ధీమతః,
రామనామాంకితం చేదం పశ్య దే వ్యంగుళీయకమ్. 2

శ్లో॥ ప్రత్యయార్థం త వానీతం తేన దత్తం మహాత్మనా,
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి. 3

పదచ్ఛేదము :- వానరః - అహం - మహాభాగే - దూతః - రామస్య - ధీమతః రామనామాంకితం - చ - ఇదం - పశ్య - దేవి - అంగుళీయకమ్॥ ప్రత్యయార్థం - తవ - ఆనీతం - తేన - దత్తం - మహాత్మనా -సమాశ్వసిహి - భద్రం - తే - క్షీణదుఃఖఫలా - హి -అసి.

అన్వయక్రమము :- మహాభాగే అహం ధీమతః రామస్య దూతః వానరః, దేవి, తేన మహాత్మనా దత్తం తవ ప్రత్యయార్థం ఆనీతం రామనామాంకితం ఇదం అంగుళీయకం చ పశ్య, క్షీణ దుఃఖఫలా అసిహి; సమాశ్వసిహి, తే భద్రం (అస్తు)

ప్రతిపదార్థము :- మహాభాగే = ఓ మహాత్మురాలా! అహం= నేను, ధీమతః = ప్రజ్ఞాశాలియైన, రామస్య =శ్రీరాముని యొక్క, దూతః= దూతయైన, వానరః = వానరుడను, దేవి= ఓ పూజ్యురాలా!, క్షీణదుఃఖఫలా = నశించి పోయిన దుఃఖ రూపమైన పాపఫలముగల దానవు, అసిహి = అవుచున్నావు సుమా!, తవ ప్రత్యయార్థం = నీకు నమ్మకము కొఱకై, తేన మహాత్మనా = ఆ మహనీయునిచే, దత్తం = ఒసగబడినట్టి (మయా) ఆనీతం = (నాచే) తీసుకొని రాబడినట్టి, రామనామాంకితం = రామనామ చిహ్నము కలిగినట్టి, ఇదం అంగుళీయకం = ఈ యుంగర మును, పశ్య = చూడుము, సమాశ్వసిహి = ఊరడిల్లుము, తే = నీకు, భద్రం = మంగళము, అస్తు = అగుగాక!

తాత్పర్యము :- ఓ మహాత్మురాలా! నేను ధీశాలియైన రామునిదూతను. ఆ మహాత్ముడు నీకు నమ్మకము కలుగుటకొఱకై ఒస గిన రామనామాంకితమగు అంగుళీయకమును కొనివచ్చితిని చూడుము. పూర్వపాపఫలమైన నీ దుఃఖమంతయు నశించిపోయినది, ఊరడిల్లుము నీకు మంగళము అగును.

శ్లో॥ గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్,
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్ 4

పదచ్ఛేదము :– గృహీత్వా - ప్రేక్షమాణా - సా - భర్తుః - కరవిభూషణమ్ - భర్తారం - ఇవ - సంప్రాప్తా - జానకీ - ముదితా - అభవత్,

అన్వయక్రమము :– జానకీ భర్తుః(తత్) కరవిభూషణం గృహీత్వా ప్రేక్షమాణా భర్తారం సంప్రాప్తాఇవ ముదితా అభవత్.

ప్రతిపదార్థము :– జానకీ= సీతమ్మ, భర్తుః = భర్తయొక్క, (తత్) కరవిభూషణం = ఆ హస్తాభరణమును, గృహీత్వా = గైకొని, ప్రేక్షమాణా = కన్నులార చూచుకొనుచున్నదై, భర్తారం = భర్తను, సంప్రాప్తాఇవ = పొందినదివలెనే, ముదితా అభవత్ = ఆనందము నొందినదాయెను.

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవింద రాజీయము :– 'గృహీత్వా ప్రేక్షమాణా' ఇచ్చట కవి తీసికొని చూచి అనకుండ చూచుచున్నదై అని వచించుటచే సీతమ్మకు ఆ యంగుళీయకము ఎంతతడవు చూచినను తనివి తీరక ఎంతయో తడవు అట్లే చూచుచుండెనని భావము. 'భర్తారం సంప్రాప్తాఇవ' భర్తను పొందినట్లుగనే అనగా అంగుళీయకము లభించిన వివాహసమయము నాటి నుండి దానివియోగ సమయము వఱకును సీతారాముల ప్రణయ విహారములలో ఆ యుంగరము ప్రసంగమున వచ్చిన మధుర ఘట్టములన్నియును ఆమెస్మృతికి వచ్చుచుండగా సీతమ్మకు తన ప్రియునియొక్క సుందర రూపమును ప్రణయ చేష్టలును దృగ్గోచరమాయెను. అనగా భర్తయొక్క సాన్నిధ్యము తనకు లభించినట్లే ఆమె ఆనందము నొందెనని భావము.

వాసుదాసస్వామి :— అనేకములగు పూర్వకృత్యముల యుంగరము మూలమున జ్ఞప్తికిరాగా క్రమక్రమముగ నాకారమంతయు స్పష్టముగ భావనాశక్తి బలమున గోచరింపగా తన భర్తయే ఎదుటవచ్చి నిలిచెనని శ్రీరాముడటకు వచ్చినట్లని కవిగూఢముగ సూచించుచున్నాడు. ఈ క్రమము భగవన్మూర్తియొక్క ధ్యానసోపాన మార్గమును తెలుపు చున్నది. శిష్యుడు భగవన్మూర్తి ఎదురుగవచ్చి నిలచినట్లు శోధువలెను నిట్లుపాసించవలెను.

తాత్పర్యము :— రావణాసురుడే మోయను శంకచే బంకుచున్న సీతాదేవి హనుమంతుని చేతినుండి ఆ యుంగరమును అమితమైన ఆనందముతో గైకొని మనస్సులోని శంకతొలంగిపోవగా భర్తచేతి అలంకారమైన ఆ యుంగరమును తనివితీర చూచుచున్నదై భర్తయే తనయెదుటకు వచ్చి యున్నట్లుగ ఆనందము నొందియుండెను.

శ్లో॥ చారు తద్వదనం తస్యా స్తామ్రశుక్లాయతేక్షణమ్,
బభూవ హర్షోదగ్రంచ రాహుముక్త ఇవోడురాట్. 5

పదచ్ఛేదము :— చారు - తత్ - వదనం - తస్యాః-తామ్ర శుక్లాయతేక్షణమ్ - బభూవ - హర్షోదగ్రం - చ-రాహుముక్తః - ఇవ-ఉడురాట్.

అన్వయక్రమము :— తస్యాః తామ్ర శుక్లాయతేక్షణం తత్ వదనం రాహుముక్తః ఉడురాట్ ఇవ హర్షోదగ్రం బభూవ.

ప్రతిపదార్థము :— తస్యాః = ఆసీతాదేవియొక్క, తామ్రశుక్లాయతేక్షణం = ఎఱ్ఱనైన, తెల్లనైన, విశాలమైన కన్నులు గల్గినట్టి, తత్ వదనం = ఆ ముఖము, రాహుముక్తః = రాహువుచే విడువబడినట్టి, ఉడురాట్ ఇవ = చంద్రుడువలె, హర్షోదగ్రం= ఆనందముతో నిండినది, బభూవ = ఆయెను.

తాత్పర్యము :- ఆ సీతాదేవి ముఖము అప్పుడు రాహువుచే విడువబడిన సంపూర్ణ చంద్రబింబమువలె మహానందముతో విరాజిల్లు చుండెను.

శ్లో॥ తత స్సా హ్రీమతీ బాలా భర్తృసందేశహర్షితా,
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్. ౬

పదచ్ఛేదము :- తతః - సా - హ్రీమతి - బాలా - భర్తుః - సందేశహర్షితా - పరితుష్టా - ప్రియం కృత్వా - ప్రశశంస - మహాకపిమ్.

అన్వయక్రమము :- తతః హ్రీమతీ సా బాలా భర్తుః సందేశ హర్షితా, పరితుష్టా (తం) మహాకపిం ప్రియం కృత్వా ప్రశశంస.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, హ్రీమతీ = లజ్జావతియైన, సా బాలా = ఆ సీతాతరుణి, భర్తుః = భర్తయొక్క, సందేశ హర్షితా = సందేశముచే ఆనందము నొందినదై, పరితుష్టా = నిండుగ తృప్తినొందినదై, (తం) మహాకపిం = అవానర శ్రేష్ఠుడైన హనుమను ప్రియం కృత్వా = ప్రీతిపాత్రునిగచేసి, ప్రశశంస = శ్లాఘించినది.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- హ్రీమతీ = అంగుళీయక సాన్నిధ్యముచే భర్తయొక్క సన్నిధిని సిగ్గుపడునట్లుగ సిగ్గు నొందినదని భావము.

వాసుదాసస్వామి .- హ్రీమతీ=లజ్జ గలది. సీతమ్మ ఇప్పుడు ముప్పదిరెండేండ్లది గావున బాలనాయిక గాదు. అట్లుండియు బాలా అనుటచే నా సమయమున ముగ్ధానాయిక యందలి గుణము లజ్జ ఆమెయందు గాన వచ్చి బాల ఆయ్యెనని భావము.

ప్రశంస :- స్తవమొనరించె ననుట గురుస్తోత్రము గురు మహాత్మ్య వర్ణనము తెలుపుచున్నది భగవన్మూర్తిని సాక్షాత్కరింప చేసిన గురువునెంత స్తోత్రము చేసినను కొఱతయే.

తాత్పర్యము :- సీతాదేవి ఆ యంగుళీయకమును చూడగనే తన భర్తను చూచినట్లుకాగా కొద్దిగసిగ్గునొంది ప్రియుని సందేశము లభించినందుకు అమితానందము నొందుచు తనకు ప్రియముగూర్చ ప్రేమపాత్రుడైన ఆ హనుమను ఇట్లు ఆదరముతో శ్లాఘించెను.

శ్లో॥ విక్రాంత స్త్వం సమర్థ స్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ
యే నేదం రాక్షసపదం త్వ యైకేన ప్రధర్షితమ్.

పదచ్ఛేదము :- విక్రాంతః - త్వం - సమర్థః - త్వం - ప్రాజ్ఞః - త్వం - వానరోత్తమ - యేన - ఇదం - రాక్షసపదం - త్వయా - ఏకేన - ప్రధర్షితమ్॥

అన్వయక్రమము :- వానరోత్తమ, త్వం ప్రాజ్ఞః యేనఇదం రాక్షసపదం ఏకేనత్వయా ప్రధర్షితమ్॥

ప్రతిపదార్థము :- వానరోత్తమ = ఓవానర శ్రేష్ఠుడా, త్వం విక్రాంతః = నీవు మహాపరాక్రమ శాలివి, త్వం సమర్థః = నీవు గొప్ప సమర్థత గల వాడవు, త్వం ప్రాజ్ఞః = నీవు మహాబుద్ధిశాలివి, యేన = ఎందుచేతననగా, ఇదం రాక్షస పదం = ఈ రాక్షస నిలయము, ఏకేన త్వయా = ఒంటరియైన నీచేత, ప్రధర్షితమ్ = నిర్భయముగా ప్రవేశింపబడినది.

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- విక్రాంతః - రాక్షసులను క్షోభింప చేయుటచే పరాక్రమశాలి, సమర్థః = ఒంటరిగనే రాక్షసులను జయించు

టచే సమర్థుడు, ప్రాజ్ఞః = మయావులైన రాక్షసులను జయించుటచే ప్రజ్ఞాశాలి యని భావము.

వాసుదాసస్వామి: — ధీరుడవు, సమర్థుడవు, ప్రాజ్ఞుడవు అను పదములు జ్ఞాన శక్తి బలములను తెలుపుచున్నవి. అనాయాసముగ జలనిధి లఘించుటచే బలమును, ఒక్కడవేయనుటచే సామర్థ్యమును లంక యందు ప్రవేశించి సీతమ్మను తెలిసికొనుటచే జ్ఞానమును తెలుపబడెను.

తాత్పర్యము :— వానరశ్రేష్ఠా! ఒంటరివై ఈ ఘోర రాక్షసుల నివాసమును నిర్భయముగా ప్రవేశించినట్టి నీవు సామాన్యుడవు కావు. విక్రమ శాలివి, మహాసమర్థుడవు గొప్ప ప్రజ్ఞావంతుడవును సుమా!

శ్లో॥ శతయోజన విస్తీర్ణ స్సాగరో మకరాలయః,
విక్రమ శ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః. 8

పదచ్ఛేదము :— శతయోజన విస్తీర్ణః- సాగరః- మకరాలయః- విక్రమ శ్లాఘనీయేన - క్రమతా - గోష్పదీకృతః.

అన్వయక్రమము :— శతయోజన విస్తీర్ణః మకరాలయః సాగరః క్రమతా విక్రమశ్లాఘనీయేన (త్వయా) గోష్పదీకృతః.

ప్రతిపదార్థము :— శతయోజన విస్తీర్ణః=నూఱామడల పొడవైనదియును, మకరాలయః = మొసళ్లకు నివాసమైనట్టిదియునగు, సాగరః = సముద్రము, క్రమతా = దాటుచున్నట్టి, విక్రమశ్లాఘనీయేన = పరాక్రమముచే కీర్తింప దగినవాడవైన, (త్వయా = నీచేత) గోష్పదీకృతః = గోవుపాదమంతటిగ చేయబడినది.

తాత్పర్యము :— శ్లాఘనీయమైన పరాక్రమము గల్గిన నీవు నూఱుయోజనముల పొడవై భీకర జలజంతువులకు నిలయమైయున్న ఈ మహాసాగరమును ఒక గోవుపాదమంత చిన్నదిగాచేసి దాటివచ్చితివిగదా!

శ్లో॥ నహి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ,
యస్య తే నాస్తి సంత్రాసో రావణా దపి సంభ్రమః 9

పదచ్ఛేదము :— న - హి - త్వాం - (ప్రాకృతం - మన్యే - వానరం - వానరర్షభ - యస్య - తే - న - అస్తి - సంత్రాసః - రావణాత్ - అపి - సంభ్రమః॥

అన్వయక్రమము :— వానరర్షభ! యస్యతే (సాగరాత్) సంత్రాసః నాస్తి; రావణాత్ అపి సంభ్రమః నాస్తి; (తం) త్వాం ప్రాకృతం వానరం న మన్యే.

ప్రతిపదార్థము :— వానరర్షభ = ఓ వానర శ్రేష్ఠుడా! యస్య తే = ఏ నీకు, (సాగరాత్ = సముద్రమువలన) సంత్రాసః నాస్తి = భయము లేదో, (తం.) త్వాం = అట్టి నిన్ను, ప్రాకృతం వానరం = సామాన్యమైన వానరునిగా, న మన్యే = తలపను.

తాత్పర్యము —: ఓ వానర శ్రేష్ఠుడా! నిన్ను నేను సామాన్య వానరునిగా భావింపజాలను. ఎందుచేతననగా నీవు మహాసముద్రమునకు భయమునొందలేదు, అంతటి రావణాసురుని గూర్చి బెదరు నొందకుంటివి.

శ్లో॥ అర్హాసేచ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్,
యద్యసి ప్రేషిత స్తేన రామేణ విదితాత్మనా. 10

పదచ్ఛేదము :— అర్హాసే - చ-కపిశ్రేష్ఠ - మయా - సమభిభాషితుమ్ - యది - అసి - ప్రేషితః - తేన -రామేణ - విదితాత్మనా.

అన్వయక్రమము :— కపిశ్రేష్ఠ! (త్వం) విదితాత్మనా రామేణ ప్రేషితః అసియది, మయా సమభిభాషితుం అర్హాసే॥.

ప్రతిపదార్థము :— కపిశ్రేష్ఠ = ఓవానరోత్తముడా, త్వం = నీవు, విదితాత్మనా = ఆత్మవేత్తయైన, రామేణ = శ్రీరామునిచే, ప్రేషితః

అసి యది = పంపబడినవాడవైన యెడల, మయా = నాతో, సమభిభాషి తుం = సంభాషించుటకు, అర్హసే = తగుదువు.

తాత్పర్యము :- ఓవానరోత్తమా! నిన్ను ఆ మహాత్ముడైన శ్రీరాముడే పంపియున్న యెడల నీవు నాతో సంభాషించుటకు సర్వవిధముల తగినవాడవని యెంచెదను.

శ్లో॥ ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యా పరీక్షితమ్,
పరాక్రమ మవిజ్ఞాయ మత్సకాశం విశేషతః. 11

పదచ్ఛేదము :- ప్రేషయిష్యతి - దుర్ధర్షః - రామః - న - హి - అపరీక్షితమ్ - పరాక్రమం - అవిజ్ఞాయ - మత్సకాశం - విశేషతః.

అన్వయక్రమము :- దుర్ధర్షః రామః పరాక్రమం అవిజ్ఞాయ (కమపి) నహిప్రేషయిష్యతి; విశేషతః మత్సకాశం అపరీక్షితం (నహి) ప్రేషయిష్యతి.

ప్రతిపదార్థము :- దుర్ధర్షః రామః = ఎదిరించుటకు శక్యముగాని శ్రీరాముడు, పరాక్రమం అవిజ్ఞాయ = పరాక్రమమును గూర్చి తెలిసికొనకుండ, (కమపి = ఎవ్వనినికూడ దూతగా) నహిప్రేషయిష్యతి = పంపబోవడు. విశేషతః = విశేషించి, మత్సకాశం = నా కడకు, అపరీక్షితం = పరీక్షింపబడనట్టి (దూతను) (నహిప్రేషయిష్యతి = ఎంతమాత్రము పంపడు).

తాత్పర్యము :- అసాధారణశౌర్యశాలియైన శ్రీరాముడు దూతయొక్క పరాక్రమమును గూర్చి తెలిసికొనకుండ పరుల కడకు పంపడు. అందువను విశేషించి నా కడకు పంపునపుడు దూత సామర్థ్యమును పరీక్షింపకుండ ఎన్నడును పంపడు.

శ్లో॥ దిష్ట్యాచ కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః,
లక్ష్మణశ్చ మహాతేజా స్సుమిత్రానందవర్ధనః. 12

పదచ్ఛేదము :– దిష్ట్యా - చ - కుశలీ - రామః - ధర్మాత్మా - సత్యసంగరః - లక్ష్మణః - చ - మహాతేజాః - సుమిత్రానందవర్ధనః.

అన్వయక్రమము :– సత్యసంగరః ధర్మాత్మా రామః దిష్ట్యా కుశలీ సుమిత్రానందవర్ధనః మహాతేజాః లక్ష్మణశ్చ కుశలీ॥

ప్రతిపదార్థము :– సత్యసంగరః = సత్యసంధుడైన, ధర్మాత్మా = పరమ ధార్మికుడైన, రామః = శ్రీరాముడు, దిష్ట్యా = నా భాగ్యవశమున, కుశలీ = క్షేమముగా నున్నాడుకదా, సుమిత్రానందవర్ధనః = సుమిత్రముద్దు బిడ్డడైన, మహాతేజాః = అమితతేజస్సంపన్నుడగు, లక్ష్మణశ్చ = లక్ష్మణుడును, కుశలీ = క్షేమముతో నున్నాడుగదా॥

తాత్పర్యము :– సత్యపాలన దీక్ష గలవాడును ధర్మాత్ముడును అగు శ్రీరాముడు నాయదృష్టవశమున క్షేమముగ నున్నాడు గదా॥ సుమిత్రానందనుడైన మహాతేజశ్శాలియగు లక్ష్మణుడును క్షేమముగా నున్నాడుగదా॥

శ్లో॥ కుశలీయది కాకుత్స్థః కిం న సాగరమేఖలామ్,
మహీం దహతి కోపేన యుగాంతాగ్నిరి వోత్థితః. 13

పదచ్ఛేదము :– కుశలీ - యది - కాకుత్స్థః - కిం - న - సాగరమేఖలామ్ - మహీం - దహతి - కోపేన - యుగాంతాగ్నిః - ఇవ - ఉత్థితః.

అన్వయక్రమము :– కాకుత్స్థః కుశలీయది కోపేన ఉత్థితః యుగాంతాగ్నిః ఇవ సాగరమేఖలాం మహీం కిం నదహతి॥

ప్రతిపదార్థము :- కాకుత్స్థః = రఘురాముడు, కుశలీయది = క్షేమముగ నున్నవాడయిన యెడల, కోపేన = క్రోధముచే, ఉత్థితః = ప్రజ్వరిల్లినట్టి, యుగాంతాగ్నిః ఇవ = ప్రళయాగ్నివలె సాగరమేఖలాం = సముద్రమధ్యమునందుగల (సాగరమే మొలనూలుగాగల) మహీం = భూమిని, కిం న దహతి = ఏలదహించుటలేదు?

తాత్పర్యము :- శ్రీరాముడు క్షేమముగానే యున్నచో భార్య నపహరించిన శత్రువుపై క్రోధము నొంది ప్రళయ కాలమునందు విజృంభించిన సంవర్తాగ్నివలె చతుస్సముద్ర మధ్య గతమైన, భూమండలము నంతను వెంటనే ఏల దహించివేయుట లేదు?

శ్లో॥ అథవా శక్తిమంతౌ తౌ సురాణామపి నిగ్రహే,
మమైవ తు న దుఃఖానా మస్తి మన్యే విపర్యయః. 14

పదచ్ఛేదము :- అథ - శక్తిమంతౌ - తౌ - సురాణాం - అపి - నిగ్రహే - మమ - ఏవ - తు - న - దుఃఖానాం - అస్తి - మన్యే - విపర్యయః.

అన్వయక్రమము :- అథవా తౌ సురాణాం నిగ్రహే అపి శక్తిమంతౌ; తు మమ ఏవ దుఃఖానాం విపర్యయః న (అస్తి ఇతి) మన్యే॥

ప్రతిపదార్థము :- అథవా = లేక, తౌ = ఆరామలక్ష్మణులు, సురాణాం = దేవతల యొక్క, నిగ్రహే అపి = నిర్జించుటయందు గూడ, శక్తిమంతౌ = సామర్థ్యముగలవారే, తు = కాని, మమ = నా యొక్క, దుఃఖానాం ఏవ = దుఃఖములకే, విపర్యయః = అంతము, నాస్తి ఇతి = లేదు అని, మన్యే = తలచుచున్నాను.

తాత్పర్యము :- లేక పురుష సింహులైన ఆయన్నదమ్ము లిరువురును దేవతల నణచివేయుటలో గూడ సామర్థ్యముగల వారలే గాని ప్రస్తుతము నా దుఃఖములకే అంతమనునది లేకయున్నదని నేను భావించుచున్నాను.

శ్లో॥ కచ్చి న్న వ్యథతే రామః కచ్చి న్న పరితప్యతే,
ఉత్తరాణిచ కార్యాణి కురుతే పురుషోత్తమః, 15

పదచ్ఛేదము :- కచ్చిత్ - న - వ్యథతే - రామః - కచ్చిత్ - న - పరితప్యతే - ఉత్తరాణి - చ - కార్యాణి - కురుతే - పురుషోత్తమః

అన్వయక్రమము :- రామః వ్యథతే న కచ్చిత్। పరితప్యతే న కచ్చిత్। పురుషోత్తమః ఉత్తరాణి కార్యాణి కురుతే (కచ్చిత్ః)

ప్రతిపదార్థము :- రామః = శ్రీరాముడు, వ్యథతే న కచ్చిత్ = దిగులు నొందుచుండుట లేదుగదా।, పరితప్యతే న కచ్చిత్। = సంతాపము నొందుట లేదుగదా। పురుషోత్తమః = పురుషశ్రేష్ఠుడైన యాతడు, ఉత్తరాణి = ముందుకాలమున చేయదగిన, కార్యాణి = కృత్యములను, కురుతే కచ్చిత్ = చేయుచున్నాడుగదా।

తాత్పర్యము :- శ్రీరాముడు నన్నుదలచుకొనుచు వ్యథతో మునిగి యుండలేదుగదా। సంతాపముచే వివశుడై యుండుటలేదు గదా। పురుషశ్రేష్ఠుడైన యాతడు నా విమోచనము కొఱకై ముందు జఱుపవలసిన కృత్యములను మెలకువతో చేయుచున్నాడు గదా।

శ్లో॥ కచ్చి న్న దీన స్సంభ్రాంతః కార్యేషు చ న ముహ్యతి
కచ్చి త్పురుషకార్యాణి కురుతే నృపతే స్సుతః. 16

పదచ్ఛేదము :- కచ్చిత్ - న - దీనః - సంభ్రాంతః - కార్యేషు - చ - న - ముహ్యతి - కచ్చిత్ - పురుష కార్యాణి - కురుతే - నృపతేః - సుతః॥

అన్వయక్రమము :- దీనః సంభ్రాంతః కార్యేషు నముహ్యతి కచ్చిత్। నృపతేః సుతః పురుషకార్యాణి కురుతే కచ్చిత్।

ప్రతిపదార్థము :— దీనః = దైన్యము నొందిన వాడును, సంభ్రాంతః = సంభ్రమము గలవాడు నై, కార్యేషు = కర్తవ్యము లందు, న ముహ్యతి కచ్చిత్ = మోహగ్రస్తుడై యుండుట లేదుగదా? నృపతేః సుతః = రాజకుమారుడైన యాతడు, పురుష కార్యాణి = పురుష యత్నముతో చేయుపనులను, కురుతే కచ్చిత్ = చేయుచున్నాడు గదా!

తాత్పర్యము :— దైన్యమునకు చిక్కినవాడై భ్రమకు వశుడగుచు తన కర్తవ్యములందు మోహగ్రస్తుడై యుండుటలేదుగదా! ఆ రాజకుమారుడు పురుషయత్నముతో సాధింపవలసిన కార్యములను విడువక నెఱవేర్చు చున్నాడు గదా!

శ్లో॥ ద్వివిధం త్రివిధోపాయ ముపాయమపి సేవతే,
విజిగీషు స్సుహృ త్కచ్చి న్మిత్రేషుచ పరంతపః. 17

పదచ్ఛేదము :— ద్వివిధం - త్రివిధోపాయం - ఉపాయం - అపి - సేవతే - విజిగీషుః - సుహృత్ - కచ్చిత్ - మిత్రేషు - చ - పరంతపః॥

అన్వయక్రమము :— పరంతపః (సః) మిత్రేషు సుహృత్ (సన్) ద్వివిధం ఉపాయం, అమిత్రేషు చ విజిగీషుః (సన్) త్రివిధోపాయం అపిసేవతే కచ్చిత్?

ప్రతిపదార్థము :— పరంతపః = శత్రు తాపనుడైన, (సః = ఆ శ్రీరాముడు) మిత్రేషు=మిత్రులయెడ, సుహృత్ (సన్) = సౌహార్దము గలవాడై, ద్వివిధం ఉపాయం = (సామదానములను) రెండు ఉపాయములను, అమిత్రేషు చ = శత్రువులందును, విజిగీషుః (సన్) = విజయ పొందగలవాడై, త్రివిధోపాయం=దానభేద దండము లను మూడు ఉపాయములను, అపిసేవతే కచ్చిత్ = అవలంబించుచున్నాడు గదా?

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వర తీర్థీయము :- మిత్రేషు చ ద్వివిధం ఉపాయం అనగా మిత్రులయెడ సామదానములను రెండు ఉపాయములు, చకారముచే ఆ మిత్రులయెడ భేదదండములను రెండు ఉపాయములను అని చెప్పనగును.

తిలకము :- ద్వివిధం ఉపాయం - సౌమ్యా సౌమ్య రూపద్వివిధోపాయములు-త్రివిధోపాయం ధర్మార్థ కామము లను మూడు పురుషార్థముల సంపాదనకు సాధన భూతమైన మూడు ఉపాయములను.

రా. శిరోమణి :- మిత్రేషు చ సుహృత్ - చ కారమువలన శతృవుల యెడగూడ శ్రీరాముడు సౌహార్దముగలవాడు.

ద్వివిధం ఉపాయం :- ఐహికాముష్మిక ప్రాప్తి ఉపాయములు

త్రివిధోపాయం :- బ్రహ్మవిష్ణు మహేశ్వరులకు ప్రీతి సంపాదకములగు ఉపాయములు

తాత్పర్యము :- మహావీరుడైన శ్రీరాముడు మిత్రులయెడ మంచి మనస్సుతో సామదానములనెడి ద్వివిధోపాయములను, శత్రువుల యెడ విజయేచ్ఛతో దానభేద దండరూపమైన మూడు ఉపాయములను యుక్తముగ నెఱపు చున్నాడుకదా!

శ్లో॥ కచ్చి స్స్వమిత్రాణి లభతే మిత్రై శ్చాప్యభిగమ్యతే,
కచ్చి త్కల్యాణ మిత్రశ్చ మిత్రై శ్చాపి పురస్కృతః. 18

పదచ్ఛేదము :- కచ్చిత్ - మిత్రాణి - లభతే - మిత్రైః - చ - అపి - అభిగమ్యతే-కచ్చిత్ - కల్యాణమిత్రః - చ - మిత్రైః - చ - అపి-పురస్కృతః॥

అన్వయక్రమము :- (సః) మిత్రాణి లభతే కచ్చిత్। మిత్రైః అభిగమ్యతే కచ్చిత్ ।కల్యాణమిత్రైః భవతి కచ్చిత్। మిత్రైః పురస్కృతః అపి (భవతి కచ్చిత్)?

ప్రతిపదార్థము :- (సః = ఆ శ్రీరాముడు) మిత్రాణి లభతే కచ్చిత్ = మిత్రులను పొందుచున్నాడుగదా। (సంపాదించుచున్నాడుగదా), మిత్రైః అపిచ = మిత్రులతోగూడ, అభిగమ్యతే కచ్చిత్ = చేరబడు చున్నాడుగదా, కల్యాణ మిత్రైః (భవతి) కచ్చిత్ = ఉత్తములైన మిత్రులు గలవాడుగ నున్నాడుగదా। మిత్రైః చ అపి=మిత్రులచేగూడ, పురస్కృతః (భవతి) కచ్చిత్ = గౌరవింపబడుచున్నాడు గదా।

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- అమిత్రైః అభిగమ్యతే కచ్చిత్ — తన వలన పరాభవింపబడిన శత్రువులచే శరణుగోరి సేవింపబడుచున్నాడుగదా।

తాత్పర్యము :- నా శ్రీరాముడు మిత్రులను సంపాదించుచు వారిచే సేవింపబడుచున్నాడుగదా। సత్పురుషులైన మిత్రులతో గలిసియుండి వారిచే గౌరవింపబడుచున్నాడుగదా।

శ్లో॥ కచ్చిదాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః,
కచ్చిత్పురుషకారంచ దైవంచ ప్రతిపద్యతే. 19

పదచ్ఛేదము :- కచ్చిత్ - ఆశాస్తి - దేవానాం - ప్రసాదం - పార్థివాత్మజః - కచ్చిత్ - పురుషకారం - చ - దైవం - చ - ప్రతిపద్యతే॥

అన్వయక్రమము :- పార్థివాత్మజః దేవానాం ప్రసాదం ఆశాస్తి కచ్చిత్। పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే కచ్చిత్।

ప్రతిపదార్థము :- పార్థివాత్మజః=రాజకుమారుడైన శ్రీరాముడు దేవానాం = దేవతల యొక్క ప్రసాదం = అనుగ్రహమును, ఆ శాస్తే కచ్చిత్=కోరుచున్నాడుగదా। పురుషకారం చ = పురుషయత్నమును దైవం చ = దైవానుగ్రహమును, ప్రతిపద్యతే కచ్చిత్ = పొందుచున్నాడుగదా।

తాత్పర్యము :- రాజపుత్రుడైన శ్రీరాముడు దేవతల అనుగ్రహమును యుక్తమైన రీతిలో ప్రార్థించి పొందుచున్నాడుగదా। తన పురుషకారమునకును దైవానుగ్రహమునకును యుక్తమైన ప్రాధాన్యము నిచ్చుచున్నాడుగదా।

శ్లో॥ కచ్చి న్న విగతస్నేహః ప్రవాసా న్మయి రాఘవః
కచ్చి న్మాం వ్యసనా దస్మా న్మోక్షయిష్యతి రాఘవః. 20

పదచ్ఛేదము :- కచ్చిత్ - న - విగతస్నేహః - ప్రవాసాత్ - మయి - రాఘవః - కచ్చిత్ - మాం - వ్యసనాత్ - అస్మాత్ - మోక్షయిష్యతి - రాఘవః॥

అన్వయక్రమము :- రాఘవః ప్రవాసాత్ మయి విగతస్నేహః న (భవతి) కచ్చిత్। రాఘవః మాం అస్మాత్ వ్యసనాత్ మోక్షయిష్యతి కచ్చిత్।

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, ప్రవాసాత్ = ప్రవాస కారణమున, మయి = నాయందు, విగతస్నేహః = నశించిన అనురాగముగలవాడు, న (భవతి) కచ్చిత్ = కాడుగదా। రాఘవః, = రఘుకుల భూషణుడు, మాం, = నన్ను, అస్మాత్ వ్యసనాత్ = ఈ విపత్తు నుండి, మోక్షయిష్యతి కచ్చిత్ = విడిపింప గలడుగదా।

"వినశ్యతి స్నేహః ప్రవాసాశ్రియాత్" (స్నేహము దూరదేశ వాసమువలన నశించును.) భర్తృహరి నుడివిన ఈ నీతి సూక్తికి ప్రస్తుత వాల్మీకి శ్లోకమే మూలము.

తాత్పర్యము :- శ్రీరాముడు నా ఈ దూరదేశస్థితి వలన నా యెడ అనురాగ హీనుడై యుండుటలేదుగదా! నాకు సంభవించిన ఈ విపత్తు నుండి నన్ను అతడు త్వరలో విడిపించునుగదా!

శ్లో॥ సుఖానా ముచితో నిత్య మసుఖానా మనూచితః,
దుఃఖ ముత్తర మాసాద్య కచ్చి ద్రామో న సీదతి. 21

పదచ్ఛేదము :- సుఖానాం - ఉచితః - నిత్యం - అసుఖానాం- అనూచితః-దుఃఖం - ఉత్తరం - ఆసాద్య - కచ్చిత్ - రామః - న - సీదతి॥

అన్వయక్రమము :- నిత్యం సుఖానాం ఉచితః, అసుఖానాం అనూచితః రామః ఉత్తరం దుఃఖం ఆసాద్య న సీదతి కచ్చిత్।

ప్రతిపదార్థము :- నిత్యం = ఎల్లప్పుడును, సుఖానాం = సుఖములకే, ఉచితః = తగినవాడును, అసుఖానాం = క్లేశములకు, అనూచితః = తగనివాడు నగు, రామః = శ్రీరాముడు, ఉత్తరం = గొప్పదైన, దుఃఖం = దుఃఖమును, ఆసాద్య = పొందిన, సీదతి కచ్చిత్ = కృంగి పోవుటలేదుగదా!

తాత్పర్యము :- ఎల్లవేళల సుఖములకు మాత్రమే తగి యున్నవాడును, కష్టములకు ఎంతమాత్రము తగనివాడు నగు శ్రీరాముడు ఈ తీవ్రమైన దుఃఖమును పొంది క్రుంగిపోవుట లేదుగదా!

శ్లో॥ కౌసల్యాయా స్తథా కచ్చి త్సుమిత్రాయా స్తథైవచ,
అభీక్ష్ణం శ్రూయతే కచ్చి త్కుశలం భరతస్యచ॥ 22

పదచ్ఛేదము :- కౌసల్యాయాః - తథా - కచ్చిత్ - సుమిత్రాయాః - తథా - ఏవ - చ - అభీక్ష్ణం - శ్రూయతే - కచ్చిత్ - కుశలం - భరతస్య - చ॥

అన్వయ క్రమము :- కౌసల్యాయాః తథా సుమిత్రాయాః తథైవ భరతస్యచ కుశలం అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్ ?

ప్రతిపదార్థము :- కౌసల్యాయాః = కౌసల్యాదేవి యొక్కయు, తథా = అట్లు, సుమిత్రాయాః = సుమిత్ర యొక్కయు, తథైవ = అట్లే, భరతస్య చ = భరతుని యొక్కయును, కుశలం = క్షేమము, అభీక్ష్ణం = తఱచుగా, శ్రూయతే కచ్చిత్ = వినబడుచున్నదిగదా।

తాత్పర్యము :- కౌసల్యాదేవి క్షేమమును, సుమిత్రాదేవి కుశలమును, భరతుని క్షేమవార్త యు తఱచు వినవచ్చుచున్నదిగదా।

శ్లో॥ మన్నిమిత్తేన మానార్హః కచ్చి చ్ఛోకేన రాఘవః,
కచ్చి న్నాన్యమనా రామః కచ్చి న్మాం తారయిష్యతి.23

పదచ్ఛేదము :- మన్నిమిత్తేన - మానార్హః-కచ్చిత్ -శోకేన- రాఘవః - కచ్చిత్ - న - అన్యమనాః - రామః - కచ్చిత్ - మాం - తారయిష్యతి॥

అన్వయక్రమము :- మనార్హః రాఘవః మన్నిమిత్తేన శోకేన పరితప్యతే న కచ్చిత్ ? రామః అన్యమనాః న (భవతి) కచ్చిత్ ? మాం తారయిష్యతి కచ్చిత్ ?

ప్రతిపదార్థము :- మనార్హః = గౌరవార్హుడైన, రాఘవః = శ్రీరాముడు, మన్నిమిత్తేన = నా కారణముగ కలిగినట్టి, శోకేన = దుఃఖముచే, (పరితప్యతే) (న కచ్చిత్) = సంతాపము నొందుటలేదుగదా। రామః = శ్రీరాముడు, అన్యమనాః=అన్యమనస్కుడు, న భవతి కచ్చిత్= అగుటలేదుగదా? మాం=నన్ను, తారయిష్యతి కచ్చిత్=దాటింపగలడుగదా।

తాత్పర్యము :- మాననీయుడైన శ్రీరాముడు నా వియోగముచే గలిగిన దుఃఖముతో మిక్కిలిగా తపించుటలేదుగదా! అతడు పరధ్యానములో నున్నవాడై కర్తవ్య మూఢు డగుటలేదుగదా! ధీరత్వము వహించి ఈ విపత్తునుండి నన్ను తప్పక ఉద్ధరింపగలడు గదా!

శ్లో॥ కచ్చి దక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః,
ధ్వజినీం మంత్రిభి ర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే. 24

పదచ్ఛేదము :- కచ్చిత్ - అక్షౌహిణీం - భీమాం - భరతః - భ్రాతృవత్సలః - ధ్వజినీం - మంత్రిభిః - గుప్తాం - ప్రేషయిష్యతి - మత్కృతే॥

అన్వయక్రమము :- భ్రాతృవత్సలః భరతః మంత్రిభిః గుప్తాం భీమాం అక్షౌహిణీం ధ్వజినీం మత్కృతే ప్రేషయిష్యతి కచ్చిత్॥

ప్రతిపదార్థము :- భ్రాతృవత్సలః = సోదరునిపై ప్రేమగల, భరతః = భరతుడు, మంత్రిభిః గుప్తాం = మంత్రులచే రక్షింపబడుచున్న, భీమాం = భయంకరమైనట్టి, అక్షౌహిణీం = పెద్దసంఖ్యగల చతురంగబలము కలిగినట్టి, ధ్వజినీం = సైన్యమును, మత్కృతే = నా నిమిత్తమై, ప్రేషయిష్యతి కచ్చిత్ = పంపగలడుగదా!

తాత్పర్యము :- అమితమైన సోదర ప్రేమగల మా భరతుడు అన్నకు గలిగిన కష్టమును తెలిసికొని సమర్థులైన యుద్ధమంత్రులను తోడిచ్చి చతురంగ బలసంపన్నమైన శత్రు భయంకరమగు మహాసైన్యమును నన్ను విడిపించుటకై పంపునుగదా.

శ్లో॥ వానరాధిపతి శ్రీమాన్ సుగ్రీవః కచ్చి దేష్యతి,
మత్కృతే హరిభి ర్వీరై ర్వృతో దంతనఖాయుధైః. 25

పదచ్ఛేదము :— వానరాధిపతిః – శ్రీమాన్ – సుగ్రీవః – కచ్చిత్ – ఏష్యతి – మత్కృతే – హరిభిః – వీరైః – వృతః – దంతనఖాయుధైః॥

అన్వయక్రమము :— వానరాధిపతిః శ్రీమాన్ సుగ్రీవః దంతనఖాయుధైః హరిభిః వృతః మత్కృతే ఏష్యతి కచ్చిత్?

ప్రతిపదార్థము :— వానరాధిపతిః = వానరరాజైన, శ్రీమాన్ సుగ్రీవః = శ్రీమంతుడైన సుగ్రీవుడు, దంతనఖాయుధైః = దంతములును నఖములును ఆయుధములుగా కలిగినట్టి, హరిభిః = వానరులతో, వృతః = కూడినవాడై, మత్కృతే = నా నిమిత్తమై, ఏష్యతి కచ్చిత్ = రాగలడుగదా?

తాత్పర్యము :— వానరాధీశుడైన మహనీయుడగు సుగ్రీవుడు తన దంతములను, నఖములను ఆయుధములుగా చేసికొని యుద్ధము చేయు మహావీరులైన వానరులను వెంటబెట్టుకొని నన్ను విడిపించుట కొఱకై ఈ లంకకు త్వరలో రాగలడుగదా?

శ్లో॥ కచ్చి న్న లక్ష్మణ శ్శూర స్సుమిత్రానందవర్ధనః,
అస్త్రవి చ్ఛరజాలేన రాక్షసా న్విధమిష్యతి. 26

పదచ్ఛేదము :— కచ్చిత్ – న – లక్ష్మణః – శూరః – సుమిత్రానందవర్ధనః – అస్త్రవిత్ – శరజాలేన – రాక్షసాన్ – విధమిష్యతి.

అన్వయక్రమము :— సుమిత్రానందవర్ధనః, శూరః, అస్త్రవిత్ లక్ష్మణః శరజాలేన రాక్షసాన్ న విధమిష్యతి కచ్చిత్?

ప్రతిపదార్థము :— సుమిత్రానందవర్ధనః = సుమిత్రకు ఆనందమును పెంపొందింప చేయువాడును, శూరః = మహావీరుడునగు, అస్త్ర

విత్ లక్ష్మణః = మహాప్రవేదియైన, లక్ష్మణుడు, శరజాలేన = బాణసమూహముచే, రాక్షసాన్ = రక్కసులను, న విధమిష్యతి కచ్చిత్ = హతమార్చకయుండునా ;

తాత్పర్యము :- సుమిత్రానందనుడు, మహావీరుడు, వివిధాప్రకోవిదుడు అయిన మా మఱది లక్ష్మణుడు ఈ రాక్షసులపై బాణవర్షమును కురిపించి వారిని త్వరలో పరిమార్చగలడుగదా।

శ్లో॥ రౌద్రేణ కచ్చి దస్త్రేణ రామేణ నిహతం రణే।
ద్రక్ష్యా మ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్. 27

పదచ్ఛేదము :- రౌద్రేణ - కచ్చిత్ - అస్త్రేణ - రామేణ - నిహతం - రణే-ద్రక్ష్యామి - అల్పేన - కాలేన - రావణం - ససుహృజ్జనమ్॥

అన్వయక్రమము :- అల్పేన కాలేన రౌద్రేణ అస్త్రేణ రామేణ ససుహృజ్జనం రావణం రణే నిహతం ద్రక్ష్యామి కచ్చిత్।

ప్రతిపదార్థము :- అల్పేన కాలేన = స్వల్పకాలముననే, రౌద్రేణ అస్త్రేణ = భీకరమైన అస్త్రముతో, రామేణ = శ్రీరామునిచే, ససుహృజ్జనం = మిత్రవర్గముతో గూడినట్టి, రావణం = రావణాసురుని, రణే = యుద్ధమునందు, నిహతం = వధింపబడిన వానినిగా, ద్రక్ష్యామి కచ్చిత్ = చూడగలనుగదా।

తాత్పర్యము :- అచిరకాలములోనే యుద్ధమున శ్రీరాముడు భీకరమైన అస్త్రములను ప్రయోగించి మిత్రబంధు సమేతముగా నేల గూల్చగా చచ్చిపడియున్న రావణుని త్వరలోనే నేను చూడగలనుగదా।

శ్లో॥ కచ్చి న్న త ద్ధేమసమానవర్ణం
త స్యాననం పద్మసమానగంధి,

మయా వినా శుష్యతి శోకదీనం
జలక్షయే పద్మమివాతపేన॥ 28

పదచ్ఛేదము :- కచ్చిత్ - న - తత్ - హేమసమానవర్ణం - తస్య - ఆననం - పద్మసమానగంధి - మయా - వినా - శుష్యతి - శోకదీనం - జలక్షయే - పద్మం - ఇవ - ఆతపేన॥

అన్వయక్రమము :- హేమసమానవర్ణం, పద్మసమానగంధి తస్య తత్ ఆననం జలక్షయే ఆతపేన పద్మం ఇవ మయావినా శోకదీనం (సత్) శుష్యతి న కచ్చిత్।

ప్రతిపదార్థము :- హేమసమానవర్ణం = బంగారముతో సమానమైన వర్ణముగలదియును, పద్మసమానగంధి = పద్మముతో సమానమైన పరిమళము గలదియునగు, తస్య = ఆ శ్రీరాముని యొక్క. తత్ ఆననం = ఆ ముఖము, జలక్షయే = నీరుక్షీణించినప్పుడు, ఆతపేన = ఎండచే, పద్మం ఇవ=తామర పువ్వువలె, మయావినా = నేనులేకుండగా, శోకదీనం (సత్) = దుఃఖముచే వెలవెల బోయినదై, శుష్యతిన కచ్చిత్= ఎండిపోవ లేదుగదా।

తాత్పర్యము :- బంగారమువలె మనస్సును ఆకర్షించునట్టి రమ్యమైన వర్ణముగలిగి పద్మసౌరభమును వెదజల్లునట్టి నా ప్రియుని ముఖము నా వియోగమున సంతాపముచే చిక్కిపోయినదై, ఎండిపోవుచున్న సరస్సులో ఎండకు కమిలిపోయిన తామరపువ్వువలె శుష్కించి పోలేదుగదా।

శ్లో॥ ధర్మాపదేశాత్త్యజతః స్వరాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతేః,
నాసీద్వ్యథా యస్య న భీర్న శోకః
కచ్చిత్స ధైర్యం హృదయే కరోతి. 29

పదచ్ఛేదము :— ధర్మాపదేశాత్ - త్యజతః - స్వరాజ్యం - మాం - చ - అపి - అరణ్యం - నయతః - పదాతేః - న - అసీత్ - వ్యథా - యస్య - న - భీః - న - శోకః - కచ్చిత్ - సః - ధైర్యం- హృదయే - కరోతి॥

అన్వయక్రమము :— ధర్మాపదేశాత్ స్వరాజ్యం త్యజతః, మాం అపి అరణ్యం నయతః, పదాతేః యస్య వ్యథా నా సీత్, భీః నాసీత్, శోకః చ నాసీత్, సః అద్యహృదయే ధైర్యం కరోతి కచ్చిత్॥

ప్రతిపదార్థము :— ధర్మాపదేశాత్ = ధర్మము నిమిత్తమున, స్వరాజ్యం = తన రాజ్యమును, త్యజతః = పరిత్యజించుచున్న వాడును, మాం అపి = నన్ను గూడ, అరణ్యం నయతః = అడవికి గొనిపోవు చున్నవాడును, పదాతేః = కాలినడకనుపోవుచున్నవాడును అగు, యస్య= ఏ ధీరునకు, వ్యథా=చింత, నాసీత్ = లేకుండెనో, శోకః చ= దుఃఖము కూడ, నాసీత్ = లేకుండెనో, సః = ఆ శ్రీరాముడు, అద్య = నేడు, హృదయే = మదిలో, ధైర్యం కరోతి కచ్చిత్ = ధైర్యమును పూనియు న్నాడు గదా॥

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— భీః = జానకిని వెంటగొని పోవుటకు భయము, శోకః - రాజ్యపరి త్యాగమునకు దుఃఖము, వ్యథా - అరణ్యవాసమునకు దిగులు.

మహేశ్వరతీర్థులు :— వ్యథా - రాజ్య త్యాగమువలన, భీః- అరణ్యసంచారమును గూర్చి, శోకః - సీతావన సంచారమునకు.

వాసుదాసస్వామి :— నేను పదునెనిమి దేళ్ళపిల్లను కాజడవు లలో ముండ్లలో, రాళ్ళలో తన కన్నులయెదుట తిరుగుచున్నప్పుడును మనసున ధీరత నొందిన ధైర్యశాలి ఇప్పుడు సీతపోయిన పోనిమ్మని ధైర్యము విడువకయున్నాడుగదా॥

తాత్పర్యము :— ధర్మపాలనము కొఱకై రాజ్యమును విడిచి పెట్టుచున్నప్పుడుగాని, నన్ను తన వెంట అరణ్యమునకు కాలినడకను గొని పోవుచున్నప్పుడుగాని ఏ ధీరుడు ఎట్టి వ్యథయును భయమును దుఃఖమును లేక యుండగలైనో అట్టి ఆత డీనాడు నా వియోగముచే మనస్సునందు ధైర్యమును గోల్పోవుటలేదుగదా!

శ్లో॥ నచాస్య మాతా న పితా న చాన్యః
స్నేహా ద్విశిష్టో ఽస్తి మయా సమో వా,
తావ ద్ధ్యహం దూత జిజీవిషేయం
యావ త్ప్రవృత్తిం శ్రుణుయాం ప్రియస్య, ౩౦

పదచ్ఛేదము :— న - చ - అస్య - మాతా - న - పితా - న - చ - అన్యః - స్నేహాత్ - విశిష్టః - అస్తి - మయా - సమః - వా, తావత్ - హి - అహం - దూత - జిజీవిషేయం - యావత్ - ప్రవృత్తిం - శ్రుణుయాం - ప్రియస్య॥

అన్వయక్రమము :— స్నేహాత్ అస్య మాతా నవిశిష్టా, పితాచ న విశిష్టః, అన్యశ్చ విశిష్టః న అస్తి, మయా సమః చ వా నాస్తి, దూత! ప్రియస్య ప్రవృత్తిం యావత్ శ్రుణుయాం, తావత్ హి అహం జిజీవిషేయమ్॥

ప్రతిపదార్థము :— స్నేహాత్ = స్నేహము వలన, అస్య = శ్రీరామునకు, మాతా = తల్లి, న విశిష్టా = అధికురాలుకాదు, పితా చ = తండ్రియును, నవిశిష్టః = అధికుడుకాడు, అన్యశ్చ = ఇతరుడును విశిష్టః = అధికుడు, నాస్తి = లేడు, మయా = నాతో, సమః చ వా = సమానుడునుగాని, నాస్తి = లేడు, దూత = ఓ చారుడా!, ప్రియస్య = ప్రియునియొక్క, ప్రవృత్తిం = వార్తను, యావత్ = ఎప్పటివఱకు, శ్రుణుయాం = వినగలుగుదునో, తావత్‌హి = అంతవఱకే సుమా, అహం = నేను, జిజీవిషేయం = జీవింప గోరెదను.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "స్నేహాత్ విశిష్ట। మయా సమోవా నాస్తి-అనుచు అపరమ పురుషునియొక్క శక్తిరూపమైన దానను అని సీతమ్మ వెల్లడించు చున్నదని తెలియవలెను

గోవింద రాజీయము :- రామవియోగము కలిగిన ఉత్తర క్షణముననే సీతమ్మ ప్రాణములను విడువ వలసియున్నను అట్టి ప్రాణ త్యాగము శ్రీరామునకు అభిమతముగాదని ఆమె ప్రాణములను ధరించియే యున్నది తాను జీవించి యున్నప్పుడే శ్రీరాముడు శత్రువులపై ప్రతీ కారము గావించుటకు అవకాశముండును. అట్టి అవకాశము రామునకొనగి ఆతడు లంకకు చేరునంత వఱకు తాను జీవించి యుండుట తన ధర్మమని తెలుపుచు అటుపిమ్మట విషయముపై తనకు అసక్తి లేదని రాముని వార్తయు చర్యయు వినువఱకును జీవించి యుండునని వ్యక్తపఱచెను.

వాసుదాసస్వామి :- ఇంతవఱకు వానరేంద్రా కపీంద్రాయని సంబోధించిన సీత ఇప్పుడు దూతా। యని సంబోధించినది, ఏలనవగా దూతతో చెప్పినమాట అతని స్వామితో చెప్పినట్లే। అతని స్వామికా మాట లతడు చెప్పవలయుననియే యుద్దేశ్యము. ఈ విషయము శ్రీ మద్ భాగవ తములోని దశమ స్కంధమునందలి భ్రమర గీతలతో పోల్చి చూడవలెను.

తాత్పర్యము :- దూతవైన ఓ హనుమా। శ్రీరాముడు నన్నే మిక్కిలి ప్రేమించినాడు. ఆతడు నన్ను ప్రేమించినంతగాని, అంత కంటె ఎక్కువగాగాని ఎవ్వరిని ప్రేమించలేదని నాకు తెలియును. తన తల్లిగాని, తండ్రిగాని, వేఱొకరుగాని అతని ప్రేమను చూఱగొనుటలో నా తరువాతివారే సుమా। అందుచేతనే అతని క్షేమవార్తను వినవలెనని ఎట్లో ఇంత కాలమును జీవించియుంటిని, తరువాతి విషయము నావశములోనిది గాదు సుమా।

శ్లో॥ ఇతీవ దేవీ వచనం మహార్థం,
తం వానరేంద్రం మధురార్థ ముక్త్వా
శ్రోతుం పున స్తస్య వచో ఽభిరామం
రామార్థయుక్తం విరరామ రామా॥ 31

పదచ్ఛేదము :- ఇతి - ఇవ - దేవీ - వచనం - మహార్థం- తం - వానరేంద్రం - మధురార్థం - ఉక్త్వా - శ్రోతుం - పునః - తస్య - వచః - అభిరామం - రామార్థయుక్తం - విరరామ - రామా.

అన్వయ క్రమము :- దేవీ రామా తం వానరేంద్రం ఇతి ఇవ మహార్థం మధురార్థం వచనం ఉక్త్వా రామార్థ యుక్తం తస్య అభిరామం వచః పునః శ్రోతుం విరరామ॥

ప్రతిపదార్థము :- దేవీ=పూజ్యురాలైన, రామా = ఆ సీతాదేవి, తం వానరేంద్రం = ఆ వానరశ్రేష్ఠుని గూర్చి, ఇతి ఇవ = ఈ విధముగా, మహార్థం = గొప్పదైన భావము కలిగినట్టిదియును, మధురార్థం = మధురమైన అర్థముగలదియునగు, వచనం = మాటను, ఉక్త్వా = పలికి, రామార్థయుక్తం = శ్రీరాముని ప్రయోజనముతో కూడినట్టి, తస్య = ఆ హనుమయొక్క, అభిరామం వచః = రమణీయమైన వాక్కును, పునః = తిరిగి, శ్రోతుం = వినుటకొఱకు, విరరామ = విరమించెను.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- మహార్థం - సీతారాముల ప్రణయము నందలి సూక్ష్మములైన విషయము లింకను ఎన్నియో హనుమకు తెలిపినది. ఆ విషయములు తనకు గూడ అగోచరములైనవనియు ఆత్మీయునిగా నెంచిన హనుమకు మాత్రమే ఆమె తెలిపినది అనియు మహర్షి 'మహార్థం'

అను పదముతో సూచించియున్నాడు. మధురార్థం - సీతామాత పచనము నందలి మాధుర్యముచే హనుమ ఏకాగ్రచిత్తుడై చిరకాలము వినుచు నిశ్శబ్ద ముగ నుండిపోయెను. అందుచేతనే సీతాదేవి హనుమ ముఖమున తన ప్రియునిగూర్చి ఇంకను వినవలయునను కుతూహలముతో అతనికి అవకాశము ఇచ్చి తాను విరమించెనని భావము.

తాత్పర్యము :— సీతాదేవి ఈ రీతిగా మహార్థపూర్ణములును, మధురార్థభరితములును అగు వచనములను ఎన్నియో హనుమకు తెలిపి ఆ హనుమ ముఖమునుండి తిరిగి తన ప్రియునిగూర్చి మనోహరములైన వచనములను వినగోరి తన మాటలను చాలించెను.

శ్లో॥ సీతాయా వచనం శ్రుత్వా మారుతి ర్భీమవిక్రమః,
శిర స్యంజలి మాధాయ వాక్య ముత్తర మబ్రవీత్. 32

పదచ్ఛేదము :— సీతాయాః - వచనం - శ్రుత్వా - మారుతిః - భీమవిక్రమః - శిరసి - అంజలిం - ఆధాయ - వాక్యం-ఉత్తరం-అబ్రవీత్.

అన్వయక్రమము :— భీమవిక్రమః మారుతిః సీతాయాః వచనం శ్రుత్వా శిరసి అంజలిం ఆధాయ ఉత్తరం వాక్యం అబ్రవీత్.

ప్రతిపదార్థము :— భీమవిక్రమః = భీకర పరాక్రమ శాలియైన, మారుతిః = హనుమ, సీతాయాః = సీతయొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, శిరసి = తలపై, అంజలిం = దోయిలిని, ఆధాయ = ఉంచి, ఉత్తరం వాక్యం=ప్రత్యుత్తర వచనము ను, అబ్రవీత్ = పలికెను.

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :— ఉత్తరం వాక్యం - శ్రేష్ఠమైన వాక్యమును.

తాత్పర్యము :— భయంకర విక్రముడైన హనుమ సీతాదేవి చెప్పిన మాటలను విని గౌరవాతిశయముతో శిరస్సువంచి దోసిలియొగ్గి ఇట్లుపలికెను.

శ్లో॥ న త్వాం ఇహస్థాం జానీతే రామః కమలలోచనః,
తేన త్వాం నానయ త్యాశు శచీమివ పురందరః. 33

పదచ్ఛేదము :_ న - త్వాం - ఇహస్థాం - జానీతే - రామః_ కమలలోచనః - తేన - త్వాం - న - ఆనయతి - ఆశు - శచీం - ఇవ- పురందరః॥

అన్వయక్రమము :_ కమలలోచనః రామః త్వాం ఇహస్థాం న జానీతే, తేన శచీం పురందరః ఇవ (సః) త్వాం ఆశు న ఆనయతి॥

ప్రతిపదార్థము :_ కమలలోచనః = తామర పువ్వులవంటి విశాలమైన కన్నులుగల, రామః = శ్రీరాముడు, త్వాం = నిన్ను, ఇహస్థాం = ఇచ్చట నున్నదానినిగా, న జానీతే = ఎఱుగడు, తేన = అందు చేత, శచీం = శచీదేవిని, పురందరః ఇవ = దేవేంద్రుడువలె, త్వాం = నిన్ను, సః = ఆ శ్రీరాముడు, ఆశు = శీఘ్రముగా, న ఆనయతి = తీసికొని వచ్చుటలేదు.

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :_ శచీం పురందర ఇవ - అసురాహ్లాద దైత్యునిచే అపహరింపబడినట్టి శచీదేవిని వలె నని భావము. అనుహ్లాదుని చేజిక్కిన శచీదేవిని ఇంద్రుడు కొంతకాలము తెలిసికొనలేక, పిమ్మట తెలిసికొనిన వెంటనే ఏ విధముగా తెచ్చుకొనెనో అట్లని భావము.

తాత్పర్యము :- నిన్ను ప్రాణముగా చూచుకొను రాముడు నీ విచ్చట నున్నట్లు ఎఱుగడు కాబట్టి పూర్వము శతుహస్తగతమైన శచీ దేవిని దేవేంద్రుడు తిరిగి తెచ్చుకొని నట్లుగా నిన్ను తీసికొని పోలేక యున్నాడు.

శ్లో॥ శ్రుత్వైవచ వచో మహ్యం క్షిప్ర మేష్యతి రాఘవః,
చమూం ప్రకర్ష న్మహతీం హర్యృక్షగణసంయుతామ్. 34

పదచ్ఛేదము :- శ్రుత్వా - ఏవ - చ - వచః - మహ్యం - క్షిప్రం - ఏష్యతి - రాఘవః - చమూం - ప్రకర్షన్ - మహతీం - హర్యృక్షగణ సంయుతామ్॥

అన్వయక్రమము :- రాఘవః మహ్యం (మత్తః) వచః శ్రుత్వాఏవ హర్యృక్షగణసంయుతాం మహతీం చమూం ప్రకర్షన్ క్షిప్రం ఏష్యతి.

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, మహ్యం(మత్తః)= నా నుండి, వచః = మాటను, శ్రుత్వాఏవ = వినగనే, హర్యృక్షగణసంయుతాం = వానరుల యొక్కయు భల్లూకముల యొక్కయు సమూహములతో గూడినట్టి, మహతీం = గొప్పదైన, చమూం = సైన్యమును, ప్రకర్షన్ = తీసికొని వచ్చుచు, క్షిప్రం = శీఘ్రముగా, ఏష్యతి = రాగలడు.

తాత్పర్యము :- శ్రీరాముడు నేను తెలిపినమాట వినిన వెంటనే గొప్ప గొప్ప వానర వీరులతో భల్లూకయోధులతో గూడిన పెద్ద సైన్యమును నడిపించుకొనుచు ఇచ్చటికి అతి శీఘ్రకాలములోనే చేరగలడుసుమా.

శ్లో॥ విష్టంభయిత్వా బాణౌఘై రక్షోభ్యం వరుణాలయమ్,
కరిష్యతి పురీం లంకాం కాకుత్స్థ శ్శాంతరాక్షసామ్. 35

పదచ్ఛేదము :- విష్టంభయిత్వా - బాణౌఘైః - అక్షోభ్యం - వరుణాలయమ్, కరిష్యతి - పురీం లంకాం - కాకుత్స్థః - శాంత రాక్షసామ్॥

అన్వయక్రమము :- కాకుత్స్థః అక్షోభ్యం వరుణాలయం బాణౌఘైః విష్టంభయిత్వా లంకా పురీం శాంత రాక్షసాం కరిష్యతి॥

ప్రతిపదార్థము :- కాకుత్స్థః = శ్రీరాముడు, అక్షోభ్యం = అతిక్రమింపజాలని, వరుణాలయం = సముద్రమును, బాణౌఘైః = బాణ

సమూహములచే, విష్టంభయిత్వా = స్తంభింపచేసి, లంకాపురీం = లంకా నగరమును, శాంతరాక్షసాం = నశించిన రాక్షసులు గలదానిగా, కరిష్యతి= చేయగలడు.

తాత్పర్యము :- శ్రీరాముడు దుర్గమమై భీకరమైయున్న సాగరమును శీఘ్రమైన తన బాణసమూహముచే స్తంభింపజేసి దాటివచ్చి లంకా నగరమును రాక్షస శూన్యముగా చేసివేయగలడు సుమా.

శ్లో॥ తత్ర యద్యంతరా మృత్యు ర్యది దేవా మహాసురాః,
స్థాస్యంతి పథి రామస్య స తా నపి వధిష్యతి. 36

పదచ్ఛేదము :- తత్ర - యది - అంతరా - మృత్యుః యది - దేవాః - మహాసురాః, స్థాస్యంతి - పథి - రామస్య - సః - తాన్ - అపి - వధిష్యతి॥

అన్వయక్రమము :- తత్ర అంతరా మృత్యుః స్థాస్యతియది, రామః తం అపి వధిష్యతి, రామస్యపథి దేవాః మహాసురాః స్థాస్యంతి యది సః తానపి వధిష్యతి॥

ప్రతిపదార్థము :- తత్ర = ఆ యత్నమునందు, అంతరా = మధ్యలో, మృత్యుః = మృత్యుదేవత, స్థాస్యతియది = నిలచిన యెడల, రామః = శ్రీరాముడు, తం అపి వధిష్యతి = దానినిగూడ వధించగలడు. రామస్య పథి = శ్రీరాముని మార్గమున, దేవాః = దేవతలు, మహాసురాః = ఘోర రాక్షసులు, స్థాస్యంతి యది = నిలువబడినయెడల, సః = ఆతడు, తానపి = వారినిగూడ, వధిష్యతి = సంహరించగలడు.

తాత్పర్యము :- శ్రీరాముడు నిన్ను విడిపించుటకై చేయు ప్రయత్నములో దేవతలు అడ్డమైనను, ఘోర రాక్షసులు అడ్డగించినప్పటికిని తుదకు మృత్యువు వచ్చినను ఆతడు వారినెల్లరను గూడ హతమార్చి నిన్నుగొని పోవగలడు సుమా.

శ్లో॥ త వాదర్శనజే నార్యే శోకేన పరిపూరితః,
న శర్మ లభతే రామః సింహార్దితఇవ ద్విపః. 37

పదచ్ఛేదము :- తవ - అదర్శనజేన - ఆర్యే - శోకేన - పరిపూరితః -న- శర్మ - లభతే - రామః - సింహార్దితః - ఇవ - ద్విపః.

అన్వయక్రమము :- ఆర్యే, రామః తవ అదర్శనజేన శోకేన పరిపూరితః, సింహార్దితః ద్విపః ఇవ శర్మ న లభతే॥

ప్రతిపదార్థము :- ఆర్యే! = పూజ్యురాలా!, రామః = శ్రీరాముడు, తవ అదర్శనజేన = నీవుగాన్పింపకుండుటచే గల్గినట్టి, శోకేన = దుఃఖముతో, పరిపూరితః = నిండినవాడై, సింహార్దితః = సింహముచే పీడింపబడిన, ద్విపః ఇవ = ఏనుగువలె, శర్మ = సుఖమును, న లభతే = పొందుటలేదు.

తాత్పర్యము :- తల్లీ! శ్రీరాముడు నీ వియోగముచే గల్గిన మహా దుఃఖముతో తపించుచు సింహముచే హింసింపబడిన ఏనుగువలె సుఖ శాంతులకు దూరమైయున్నాడు సుమా!

శ్లో॥ మందరేణచ తే దేవి శపే మూలఫలేనచ,
మలయేనచ వింధ్యేన మేరుణా దర్దురేణచ. 38
యథా సునయనం వల్గు బింబోష్ఠం చారుకుండలమ్,
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచంద్రమివోదితమ్. 39

పదచ్ఛేదము :- మందరేణ - చ - తే - దేవి - శపే - మూలఫలేన - చ - మలయేన - చ - వింధ్యేన - మేరుణా - దర్దురేణ - చ - యథా - సునయనం - వల్గు - బింబోష్ఠం - చారు కుండలమ్, ముఖం - ద్రక్ష్యసి - రామస్య - పూర్ణచంద్రం - ఇవ - ఉదితమ్॥

అన్వయక్రమము :— దేవి! ఉదితం పూర్ణచంద్రం ఇవ(స్థితం) రామస్య సునయనం, వల్గు, బింబోష్ఠం, చారు కుండలం ముఖం యథా ద్రక్ష్యసి తథా మందరేణ చ మలయేన చ వింధ్యేన చ మేరుణా చ దర్దురేణ చ మూలఫలేనచ శపే.

ప్రతిపదార్థము :— దేవి! = ఓ పూజ్యురాలా!, ఉదితం = ఉదయించినట్టి, పూర్ణచంద్రం ఇవ సితం = నిండు చంద్రునివలె నున్నట్టి, రామస్య = శ్రీరాముని యొక్క, సునయనం = సుందరమైన నేత్రములు గల్గినట్టిదియు, వల్గు = మనోహరమైనట్టిదియు, బింబోష్ఠం = దొండపండువంటి పెదవి గల్గినట్టిదియును, చారుకుండలం = రమణీయమైన కర్ణాభరణములు గల్గినట్టిదియునగు, ముఖం = ముఖమును, యథా = ఏ విధముగా, దక్ష్యసి = చూచెదవో, తథా = ఆ విధముగా, తే = నీకు, మందరేణ చ = మందరగిరితోడను, మలయేన చ = మలయాద్రితోడను, వింధ్యేన చ = వింధ్య పర్వతముతోడను, మేరుణా చ = మేరునగముతోడను, దర్దురేణ చ = దర్దురగిరితోడను, మూలఫలేన చ = కందమూల ఫలసమూహము తోడను, శపే = ఒట్టుపెట్టి చెప్పుచున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— దర్దురేణ - దర్దుర మనెడిది మలయగిరి పరిసరవర్తియైన చందన వృక్షములకు నిలయమైన ఒకానొకపర్వతము.

తాత్పర్యము :— అప్పుడే ఉదయించిన పున్నమనాటి చంద్రునివలె విశాలమైన నేత్రములతో దొండపండువంటి పెదవితో మనోజ్ఞములైన కర్ణాభరణములతో శోభిల్లుచున్న శ్రీరాముని సుందర వదనారవిందమును శీఘ్రమే నీవు చూడగలవని మందర పర్వతము మీదను, మలయగిరి మీదను, వింధ్యనగము మీదను, మేరుమహీధరము మీదను, దర్దురాద్రి మీదను, మాకు భోజ్యములైన కందమూల ఫలాదికము మీదను, ఒట్టుపెట్టి చెప్పుచున్నాను సుమా!

శ్లో॥ క్షిప్రం ద్రక్ష్యసి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ,
శతక్రతుమి వాసీనం నాగపృష్ఠస్య మూర్ధని. 40

పదచ్ఛేదము :- క్షిప్రం - ద్రక్ష్యసి - వైదేహి - రామం - ప్రస్రవణే - గిరౌ - శతక్రతుం - ఇవ - ఆసీనం - నాగపృష్ఠస్య - మూర్ధని॥

అన్వయక్రమము :- వైదేహి, నాగపృష్ఠస్య మూర్ధని ఆసీనం శతక్రతుం ఇవ క్షిప్రం ప్రస్రవణే గిరౌ రామం ద్రక్ష్యసి॥

ప్రతిపదార్థము :- వైదేహి = ఓ జానకి! నాగపృష్ఠస్య మూర్ధని = ఐరావతగజము యొక్క మూపుపై, ఆసీనం = కూర్చొని యున్న, శతక్రతుం ఇవ = దేవేంద్రునివలె, క్షిప్రం = శీఘ్రముగా, ప్రస్రవణే గిరౌ = ప్రస్రవణ పర్వతముపై, రామం = శ్రీరాముని ద్రక్ష్యసి = చూడగలవు.

సూచన :- నాగపృష్ఠస్య అనుటకు బదులుగా 'నాకపృష్ఠస్య' అను పాఠాంతరముగలదు. అప్పుడు స్వర్గమునందున్నట్టి అని అర్థము చెప్పుకోవలెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- నాగపృష్ఠము అని ఇంద్రుని యొక్క అసాధారణ స్వర్ణభవనము.

తాత్పర్యము :- సీతాదేవీ! స్వర్గలోకమున ఐరావతగజముపై వెలయుచుండు దేవేంద్రునివలె ఇచ్చట ప్రస్రవణగిరిపై అధివసించి యుండు నీ ప్రియుని అచిరకాలములోనే చూడగలవు సుమా!

శ్లో॥ న మాంసం రాఘవో భుంక్తే నచైవ మధు సేవతే
వన్యం సువిహితం నిత్యం భక్త మశ్నాతి పంచమమ్. 41

పదచ్ఛేదము :- న - మాంసం - రాఘవః - భుంక్తే - న - చ - ఏవ - మధు - సేవతే - వన్యం - సువిహితం - నిత్యం - భక్తం - అశ్నాతి - పంచమమ్॥.

అన్వయక్రమము :- రాఘవః మాంసం న భుంక్తే, మధు చ న సేవతే, నిత్యం సువిహితం వన్యం పంచమం భక్తం అశ్నాతి॥.

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, మాంసం = మాంసమును, న భుంక్తే = తినుటలేదు, మధు చ = మద్యమును కూడ, న సేవతే = ఉపయోగించుటలేదు, నిత్యం = నిత్యమును, సువిహితం = శాస్త్రోక్తమైనట్టి, వన్యం = వనమున లభించునట్టి, భక్తం = ఆహారమును, పంచమం = ఐదవవంతు, అశ్నాతి = భుజించుచున్నాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- పంచమం అశ్నాతి - పంచమ కాలమున ప్రాతః సంగవ మధ్యాహ్న అపరాహణములు దాటినపిమ్మట ఐదవదియైన సాయం కాలముననే భుజించునని భావము. లేక ప్రాతః కాలము సాయంకాలము మఱల ప్రాతః కాలము సాయంకాలము యను నాల్గు పూటలు గడిచిన పిమ్మట ఐదవపూటకు మాత్రమే నిత్యము భుజించుచున్నాడని భావము.

వాసుదాసస్వామి :-

"దృఙ్మనస్సంగ సంకల్ప జాగరాః కృశతా౽రతిః,
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగ దశా దశ."

అని మన్మథావస్థలు పది. అందు అరతి యను అవస్థ ఇందు చెప్ప బడెను. అరతి యనగా దేనియందును ప్రీతి లేకపోవుట.

తాత్పర్యము :- తల్లీ! నీ రాముడు మాంసమును భుజించుట మానెను. మద్యమును ముట్టుటయే లేదు. శాస్త్రీను సారముగా వాన ప్రస్థులకు విహితమైనట్టి వన్యమైన ఆహారములో తాను తినెడి దానిలో ఐదవ వంతు మాత్రమే ఇప్పుడు భుజించుచున్నాడు సుమా!

శ్లో॥ నైవ దంశా న్న మశకా న్న కీటా న్న సరీసృపాన్,
రాఘవో ఒపనయే ద్గాత్రా త్త్వద్గతే నాంతరాత్మనా. 42

పదచ్ఛేదము :- న - ఏవ - దంశాన్ - న - మశకాన్ - న - కీటాన్ - న - సరీసృపాన్ - రాఘవః - అపనయేత్ - గాత్రాత్ - త్వద్గతేన - అంతరాత్మనా॥.

అన్వయక్రమము :- రాఘవః త్వద్గతేన అంతరాత్మనా గాత్రాత్ దంశాన్ న అపనయేత్, మశకాన్ న, కీటాన్ న, సరీసృపాన్ న అపనయేత్॥.

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, త్వద్గతేన = నీయందులగ్నమైనట్టి, అంతరాత్మనా = మనస్సుచే, గాత్రాత్ = శరీరము నుండి, దంశాన్ = ఈగలను, న అపనయేత్ = తొలగించుకొనడు, మశకాన్ న అపనయేత్ = దోమలను తొలగించుకొనడు, కీటకాన్ న అపనయేత్ = పురుగులను తొలగించుకొనడు, సరీసృపాన్ న అపనయేత్ = పాములను తొలగించుకొనడు.

తాత్పర్యము :- శ్రీరాముడు తన మనస్సును నీయందేలగ్నము చేసియున్నాడు. అతనికి ఇతర మేమియును తెలియుటలేదు. తన ఒడలిపై వ్రాలిన ఈగలను త్రోలుకొనడు. దోమలను త్రోసివేయడు, పురుగులను దులుపుకొనడు, తుదకు పాములు తన మీద పాకుచున్నను తప్పించుకొనడు సుమా!

శ్లో॥ నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః,
నా న్య చ్చింతయతే కించి త్సతు కామవశం గతః. 43

పదచ్ఛేదము :— నిత్యం - ధ్యానపరః - రామః - నిత్యం - శోకపరాయణః - న - అన్యత్ - చింతయతే - కించిత్ - సః - తు - కామవశం-గతః॥.

అన్వయక్రమము :— రామః నిత్యం ధ్యానపరః, నిత్యం శోకపరాయణః, కామవశం గతః సః తు అన్యత్ కించిత్ న చింతయతే॥.

ప్రతిపదార్థము :— రామః = శ్రీరాముడు, నిత్యం = ఎల్లప్పుడును, ధ్యానపరః = చింతానిమగ్నుడగును, నిత్యం = ఎల్లప్పుడును, శోకపరాయణః = దుఃఖనిమగ్నుడై యుండును, కామవశం గతః = కామమునకు లోబడి యున్నట్టి, సః తు = అతడు, అన్యత్ = వేఱైనది, కించిత్ = కొంచెముగూడ, న చింతయతే = ఆలోచించుటలేదు.

తాత్పర్యము :— తల్లీ! నీ రాము డెల్లప్పుడును ఏదియో చింతతో ధ్యాననిమగ్నుడై యుండును. నిరంతరమును దుఃఖగ్రస్తుడగనే యుండును నీ పైన ప్రేమతో అతడు కామపరవశుడై వేఱేమియు ఆలోచింపలేక పోవుచున్నాడు సుమా!

శ్లో॥ అనిద్ర స్సతతం రామ స్సుప్తోఽపి చ నరోత్తమః,
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే. 44

పదచ్ఛేదము :— అనిద్రః - సతతం - రామః - సుప్తః - అపి - చ - నరోత్తమః - సీతా - ఇతి - మధురాం - వాణీం - వ్యాహరన్ - ప్రతిబుధ్యతే॥,

అన్వయక్రమము :— రామః సతతం అనిద్రః (వర్తతే) (సః) నరోత్తమః సుప్తః అపి చ సీతా ఇతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే॥.

ప్రతిపదార్థము :- రామః = శ్రీరాముడు, సతతం = ఎల్లప్పుడును, అనిద్రః (వర్తతే) = నిద్రాశూన్యుడైయుండును, (సః) నరోత్తమః = ఆ పురుషోత్తముడు, సుప్తోపి చ = నిద్రించిన వాడయినను, సీతా ఇతి = జానకీ యని, మధురాం వాణీం = తీయని మాటను, వ్యాహరన్ = పలుకుచు, ప్రతిబుధ్యతే = మేల్కొనును॥.

తాత్పర్యము :- శ్రీరాముడు ఎప్పుడు చూచినను నిద్రలేకయే గాన వచ్చును. ఒకప్పు డెట్టకేలకు నిద్రించినను కొద్దికాలములోనే హా! సీతా యనుచు మధురమైన నీ నామమును ఉచ్చరించుచు మేల్కొనును॥.

శ్లో॥ దృష్ట్వా ఫలంవా పుష్పంవా యచ్చాన్య త్స్త్రీమనోహరమ్,
బహుశో హా ప్రియే త్యేవం శ్వసం స్త్వా మభిభాషతే.45

పదచ్ఛేదము :- దృష్ట్వా - ఫలం - వా - పుష్పం - వా - యత్ - చ - అన్యత్ - స్త్రీమనోహరమ్, - బహుశః - హా - ప్రియే- ఇతి - ఏవం - శ్వసన్ - త్వాం - అభిభాషతే॥.

అన్వయక్రమము :- ఫలంవా పుష్పంవా స్త్రీమనోహరం యత్ అన్యత్ చవా దృష్ట్వా బహుశః శ్వసన్ హా ప్రియే ఇతి ఏవం త్వాం అభిభాషతే॥.

ప్రతిపదార్థము :- ఫలంవా = ఫలమునుగాని, పుష్పంవా = పుష్పమునుగాని, స్త్రీమనోహరం = స్త్రీలకు ప్రియమైనట్టి, యత్ అన్యత్ చవా = ఏ ఇతరమైనదియుగాని, దృష్ట్వా=చూచి, బహుశః = పలుమాఱులు, శ్వసన్ = నిట్టూర్చుచు, హాప్రియే = ఓప్రియురాలా, ఇతి =అని, ఏవం = ఇట్లుగా, త్వాం= నిన్నుగూర్చి, అభిభాషతే = మాటాడును.

తాత్పర్యము :— అతడు మధురమైన ఫలమును గాని రమ్యమైన పుష్పమునుగాని స్త్రీలు ముచ్చటపడు రమణీయమైన ఏ వస్తువును గాని చూచినప్పుడు పలుమారులు నిట్టూర్పులు విడుచుచు హా ప్రియా యనుచు నిన్నుగూర్చియే భాషించుచుండును.

శ్లో॥ స దేవి నిత్యం పరితప్యమానః
త్వామేవ సీ తే త్యభిభాషమాణః,
ధృతవ్రతో రాజసుతో మహాత్మా
తవైవ లాభాయ కృతప్రయత్నః. 46

పదచ్ఛేదము :— సః - దేవి - నిత్యం - పరితప్యమానః - త్వాం - ఏవ - సీతా - ఇతి - అభిభాషమాణః - ధృతవ్రతః - రాజసుతః - మహాత్మా - తవ - ఏవ - లాభాయ - కృతప్రయత్నః॥.

అన్వయక్రమము :— దేవి! మహాత్మా స రాజసుతః నిత్యం పరితప్యమానః సీతా! ఇతి త్వామేవ అభిభాషమాణః ధృతవ్రతః తవ లాభాయ కృత ప్రయత్నః ఏవ (అస్తి).

ప్రతిపదార్థము :— దేవి! = ఓ పూజ్యురాలా! మహాత్మా = మహనీయుడైన, సః రాజసుతః = ఆ రాజపుత్రుడు, నిత్యం = ఎల్లప్పుడును, పరితప్యమానః = పరితపించు చున్నవాడై, సీతా ఇతి = జానకీ యని, త్వామేవ = నిన్నుగూర్చియే, అభిభాషమాణః = భాషించుచున్నవాడై, ధృతవ్రతః = ధరించిన దీక్షగలవాడై, తవ లాభాయ = నిన్ను సంపాదించుటకొఱకు, కృతప్రయత్నః ఏవ (అస్తి) = చేయబడిన ప్రయత్నము కలవాడుగానే యున్నాడు.

తాత్పర్యము :— తల్లీ! మహాత్ముడైన ఆ రాజకుమారుడు నిరంతరము నీకై పరితపించుచు హా! సీతా యని నిన్ను గూర్చియే భాషించుచు దృఢమైన దీక్షతో నిన్ను తిరిగి సంపాదించుటకై తీవ్రమైన ప్రయత్నము చేయుచునే యున్నాడు సుమా!

శ్లో॥ సా రామసంకీర్తనవీతశోకా
రామస్య శోకేన సమానశోకా,
శరన్ముఖే సాంబుదశేషచంద్రా
నిశేవ వైదేహసుతా బభూవ. 47

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకి రామాయణే సుందర కాండే
అంగుళీయక ప్రదానం నామ షట్త్రింశ స్సర్గః

పదచ్ఛేదము :- సా- రామసంకీర్తన వీతశోకా - రామస్య- శోకేన - సమానశోకా - శరన్ముఖే - సాంబుదశేషచంద్రా - నిశా - ఇవ - వైదేహసుతా - బభూవ.

అన్వయక్రమము :- రామ సంకీర్తనవీతశోకా, రామస్య శోకేన సమానశోకా, సా వైదేహసుతా శరన్ముఖే సాంబుదశేషచంద్రా నిశా ఇతి బభూవ॥.

ప్రతిపదార్థము :- రామసంకీర్తనవీతశోకా = శ్రీరాముని సంకీర్తనంవలన తొలగినశోకముగలదియును, రామస్య శోకేన= శ్రీ రాముని దుఃఖముతో, సమనశోకా = సమానమైన దుఃఖముగలదియునగు, సా వైదేహసుతా = ఆ విదేహరాజతనయ, శరన్ముఖే = శరత్కాలా రంభమున, సాంబుదశేషచంద్రా = మేఘశేషముతో గూడినట్టి చంద్రబింబము కలదగు, నిశా ఇవ = రాత్రివలె, బభూవ = ఉండెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'వీతశోకా' - అనిశ్రీః సతతం రామః, అని తనపై ప్రేమగలిగియున్న నాథుని వర్తనమును తలచుకొని దుఃఖము తొలగియున్నది. న మాంసం రాఘవో భుంక్తే - అనురీతినిగల శ్రీరాముని దుఃఖమును తలచి అట్టి దుఃఖమునే పొందుచున్నది. శరన్ముఖే నిశా ఇవ -

శరదృతు ప్రారంభమున నిశలు పూర్తిగ తొలగిపోవని మేఘములచే చంద్ర కాంతిగలవిగను లేనివిగను గూడ నున్నట్లే ఆమె శోకములేనిది గాను ఉన్నదిగాను కూడ నుండెనని భావము.

గోవింద రాజీయము :— సీతమ్మకు రాముని హృదయము తెలియక కొంతశోకమును, అతని వియోగముచే కొంత శోకమును కలిసి మొత్తము రెట్టింపు శోకము గలిగియుండెను. ఇందుమొదటి సగము హనుమంతుని మాటలవలన తొలగినది. రెండవ శోకము మిగిలియేయున్నది. అందుచేతనే సగము శోకము తొలగినను ఇంకను రామునితో సనమామైన వియోగశోకము కలిగియే యున్నదని భావము. (రామస్య శోకేన సమాన శోకా)

తాత్పర్యము :— శ్రీరాముని గూర్చి వినుటచే తన శోకము కొంత తొలగినను అతని దుఃఖమును గూర్చి వినుటచే సీత ఇంకను శోకమునుపొందినదై శరత్కాలా రంభమున సగము మేఘము కప్పియున్న చంద్ర కాంతితో వెలుగును చీకటియును గలరాత్రివలె నుండెను.

ఇది శ్రీమత్సుందర కాండమునకు "సుబోధిని" యను ఆంధ్ర వివరణము నందు "అంగుళీయక ప్రదానము" అను ముప్పది యారవ సర్గము.

శ్రీరామాయ నమః

శ్రీ రామశరణ్ గురుభ్యో నమః

సప్తత్రింశ స్సర్గః

శ్లో॥ సా సీతా వచనం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా,
హనూమంత ముఃవా చేదం ధర్మార్థసహితం వచః. 1

పదచ్ఛేదము :- సా - సీతా - వచనం - శ్రుత్వా - పూర్ణ చంద్రనిభాననా - హనూమంతం - ఉవాచ - ఇదం - ధర్మార్థసహితం వచః॥

అన్వయక్రమము :- పూర్ణచంద్రనిభాననా సా సీతా (తత్) వచనం శ్రుత్వా హనూమంతం ఇదం ధర్మార్థసహితం వచః ఉవాచ॥.

ప్రతిపదార్థము :- పూర్ణచంద్రనిభాననా = నిండుచంద్రునితో సమానమైన ముఖము గలిగినట్టి, సా సీతా = సీతాదేవి, (తత్) వచనం = ఆ మాటను, శ్రుత్వా = విని, హనూమంతం = హనుమంతుని గూర్చి, ఇదం = ఈ, ధర్మార్థసహితం = ధర్మార్థయుక్తమైనట్టి, వచః = మాటను, ఉవాచ = పలికెను

తాత్పర్యము :- నిండుచంద్రుని వంటి ముఖము కల్గిన సీతాదేవి హనుమంతుడు పలికిన మాటలువిని అతనినిజూచి ధర్మార్థ భరితములైన మాటలను తిరిగి ఇట్లుపలికెను.

శ్లో॥ అమృతం విషసంయుక్తం త్వయా వానర భాషితమ్,
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః 2

పదచ్ఛేదము :- అమృతం - విషసంయుక్తం - త్వయా - వానర - భాషితమ్, యత్ - చ - న - అన్యమనాః - రామః - యత్ - చ - శోకపరాయణః॥

అన్వయక్రమము :- వానరః రామః యత్ చ నాన్యమనాఃఇతి (ఉక్తం) తత్ అమృతం, యత్ చ శోకపరాయణః ఇతి (ఉక్తం) తత్ విషసంయుక్తం త్వయా భాషితమ్॥

ప్రతిపదార్థము :- వానర = ఓ హనుమా!, రామః = శ్రీరాముడు, యత్ చ = ఏ, నాన్యమనా ఇతి = అనన్యమనస్కుడని,(ఉక్తం= చెప్పబడెనో,) తత్ అమృతం = అది అమృతముగను, యత్ చ శోకపరాయణః ఇతి = ఏ దుఃఖపరాయణుడు అని, ఉక్తం = చెప్పబడినదో, తత్ = అది, విషసంయుక్తం = విషసంయుతముగను, త్వయా = నీచే, భాషితం = చెప్పబడినది.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! రాముడు అనన్యమనస్కుడై విన్నుదలచుచున్నాడు అన్నమాట నాకు అమృతమువలె నున్నది. కాని అతడు నిరంతరము శోకనిమగ్నుడై యున్నాడని నీవు తెలిపినది మాత్రము విషమిశ్రితమై యుండి నాకు బాధ కలిగించుచున్నది సుమా!

శ్లో॥ ఐశ్వర్యేవా సువిస్తీర్ణే వ్యసనేవా సుదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి. 3

పదచ్ఛేదము :- ఐశ్వర్యే - వా - సువిస్తీర్ణే - వ్యసనే - వా - సుదారుణే - రజ్జ్వా - ఇవ - పురుషం - బద్ధ్వా - కృతాంతః - పరికర్షతి॥

అన్వయక్రమము :- సువిస్తీర్ణే ఐశ్వర్యేవా, సుదారుణే వ్యసనేవా, కృతాంతః రజ్జ్వా బద్ధ్వా ఇవ పురుషం పరికర్షతి॥

ప్రతిపదార్థము :- సువిస్తీర్ణే = మిక్కిలివిస్తారమైన, ఐశ్వర్యేవా = ఐశ్వర్యమునందుగాని, సుదారుణే = ఘోరమైన, వ్యసనేవా=

ఆపదయందుగాని, కృతాంతః = యమధర్మరాజు, రజ్జ్వా = త్రాడుతో, బధ్వా ఇవ = కట్టివేసివలె, పురుషం = మనుజుని, పరికర్షతి = లాగికొని పోవుచుండును.

తాత్పర్యము :- గొప్పదైన ఐశ్వర్య మునందుగాని భయంకర మైన ఆపదయందుగాని దైవము త్రాటితో కట్టితీసికొని పోవునట్లుగా నరుని (పూర్వ కర్మమునుబట్టి తన నిర్ణయమున కనుకూలముగా) లాగిగొని పోవును.

శ్లో॥ విధి ర్నూన మసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ,
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య
మోహితాన్. 4

పదచ్ఛేదము :- విధిః-నూనం - అసంహార్యః - ప్రాణినాం - ప్లవగోత్తమ - సౌమిత్రిం - మాం - చ - రామం - చ - వ్యసనైః - పశ్య - మోహితాన్॥.

అన్వయక్రమము :- ప్లవగోత్తమః నూనం ప్రాణినాం విధిః అసంహార్యః. వ్యసనైః మోహితాన్ సౌమిత్రిం, మాం చ, రామం చ పశ్య॥.

ప్రతిపదార్థము :- ప్లవగోత్తమః = ఓ వానరశ్రేష్ఠుడా! నూనం = నిశ్చయముగా, ప్రాణినాం = జీవులకు, విధిః = దైవము, అసంహార్యః = తప్పింపశక్యముగానిది, వ్యసనైః = ఆపదలచే, మోహితాన్ = మూఢచిత్తులమైయున్న, సౌమిత్రిం = లక్ష్మణుని, మాం చ = నన్ను, రామం చ = రాముని, పశ్య = చూడుము.

తాత్పర్యము :- ఓ వానరశ్రేష్ఠుడా! జీవులకు దైవము నిస్సంశయముగా అనుల్లంఘనీయమైనది. ఎందుచేత ననగా నా లక్ష్మణుడును

నేను తుదకు రాముడును ఎట్లు ఆపదలలో చిక్కుకొని భ్రాంతచిత్తులమై యున్నామో చూడుము.

శ్లో॥ శోకస్యాస్య కథం పారం రాఘవో ఽధిగమిష్యతి,
ప్లవమానః పరిక్రాంతో హతనౌ స్సాగరే యథా. 5

పదచ్ఛేదము :- శోకస్య - అస్య - కథం - పారం - రాఘవః - అధిగమిష్యతి - ప్లవమానః - పరిక్రాంతః - హతనౌః - సాగరే - యథా।

అన్వయక్రమము :- సాగరే హతనౌః (పురుషః) పరిక్రాంతః (సన్) బాహుభ్యాం ప్లవమానః యథా, రాఘవః అస్య శోకస్య పారం కథం అధిగమిష్యతి॥

ప్రతిపదార్థము :- సాగరే = సముద్రమున, హతనౌః = చెడిపోయిన నావగల, పురుషః = పురుషుడు, పరిక్రాంతఃసన్ = పరిభ్రమించుచున్నవాడై, బాహుభ్యాం = భుజములతో, ప్లవమానః యథా = ఈదుచున్నవానివలె, రాఘవః = శ్రీరాముడు, అస్య శోకస్య = ఈ దుఃఖమునకు, పారం = అంతమును, కథం అధిగమిష్యతి = ఎట్లు పొందగలడు?

తాత్పర్యము :- సముద్రమునందు నావ చెడిపోవగా దిక్కుతోచక తిరుగుచు బాహువులతో ఈదుచున్న మనుష్యుడువలె శ్రీరాముడు తన ఈ దుఃఖమునకు ఒడ్డును ఎప్పుడు చేరుకొనగలడోగదా!

శ్లో॥ రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వాచ రావణమ్,
లంకా మున్మథితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః 6

పదచ్ఛేదము :- రాక్షసానాం - వధం - కృత్వా - సూదయిత్వా - చ - రావణం - లంకాం - ఉన్మథితాం - కృత్వా - కదా - ద్రక్ష్యతి - మాం - పతిః॥

అన్వయక్రమము :— వతిః రాక్షసానాం వధం కృత్వా రావణం సూదయిత్వా చ లంకాం ఉన్మథితాం కృత్వా చ మాం కదా ద్రక్ష్యతి?॥

ప్రతిపదార్థము :— పతిః = ప్రభువైన శ్రీరాముడు, రాక్షసానాం = రాక్షసులయొక్క, వధం = వధను, కృత్వా = చేసి, రావణం= రావణాసురుని, సూదయిత్వా చ = పరిమార్చియు, లంకాం = లంకానగరిని, ఉన్మథితాం=కల్లోలము నొందించబడినదానినిగా, కృత్వా చ= చేసియు, మాం = నన్ను, కదా = ఎప్పుడు, ద్రక్ష్యతి = చూడగలడో?

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :— ''పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతా' మ్మన్నట్లు సీతాదేవిని గ్రహించుట యను సాధు పరిత్రాణను ముఖ్యకార్యము. దానికి విఘ్నము గలిగించుదుష్కృతుల వినాశము రెండవ కార్యము అని ఏర్పడుచున్నది.

తాత్పర్యము :— నా భర్త రాక్షసుల నందరను హతమార్చి రావణుని పరిమార్చి లంకను కల్లోలిత మొనర్చి నన్నెప్పుడు గాంచునో కదా!

శ్లో॥ స వాచ్య స్సంత్వర స్వేతి యావదేవ న పూర్యతే,
అయం సంవత్సరః కాల స్తావద్ధి మమ జీవితమ్. 7

పదచ్ఛేదము :— సః - వాచ్యః - సంత్వరస్వ - ఇతి - యావత్ - ఏవ - న - పూర్యతే - అయం - సంవత్సరః - కాలః - తావత్ - హి - మమ - జీవితమ్.

అన్వయక్రమము :— అయం సంవత్సరః కాలః యావదేవ న పూర్యతే, (తావదేవ) సంత్వరస్వ ఇతి సః వాచ్యః, మమ జీవితం తావత్ హి.

ప్రతిపదార్థము :- అయం = ఈ, సంవత్సరః కాలః = సంవత్సర కాలము, యావదేవ = ఎంతవఱకును, న పూర్యతే = పూర్తిచేయబడదో, (తావదేవ=అంతలోనే) సంత్వరస్వ = వేగిరపడుము, ఇతి = అని, సః = ఆ శ్రీరాముడు, వాచ్యః = చెప్పబడవలయును, మమ=నాకు, జీవితం = జీవితకాలము, తావత్ హి = అప్పటివఱకే సుమా.

తాత్పర్యము :- ఈ సంవత్సర కాలము ముగియుటకుపూర్వమే నన్ను విడిపించుటకై తొందరపడవలయును అని శ్రీరామునకు తెలుపుము, నా జీవన కాలము ఈ సంవత్సరముమాత్రమే సుమా.

శ్లో॥ వర్తతే దశమో మాసో ద్వౌతు శేషౌ ప్లవంగమ,
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ. ౮

పదచ్ఛేదము :- వర్తతే - దశమః - మాసః- ద్వౌ - తు - శేషౌ - ప్లవంగమ - రావణేన - నృశంసేన - సమయః-యః-కృతః - మమ.

అన్వయక్రమము :- ప్లవంగమ! నృంశసేన రావణేన మమ యఃసమయః కృతః, తస్యదశమః మాసః వర్తతే, ద్వౌతుశేషౌ.

ప్రతిపదార్థము :- ప్లవంగమ! ఓ హనుమా! నృశంసేన = క్రూరుడైన, రావణేన = రావణునిచే, మమ = నాకు, యః సమయః = ఏ గడువు, కృతః = చేయబడినదో, తస్య = ఆ గడువునకు, దశమః మాసః = పదియవ మాసము, వర్తతే = జరుగుచున్నది, ద్వౌ తు=రెండు (నెలలు) మాత్రమే, శేషౌ = మిగిలియున్నవి.

తాత్పర్యము :- వానరోత్తమా! క్రూరుడైన రావణుడు నా జీవితమునకు నిర్ణయించిన గడువులో పదియవమాస మిప్పుడు జరుగుచున్నది. ఇంక రెండు నెలలు మాత్రమే మిగిలియున్నవి.

శ్లో॥ విభీషణేనచ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి,
అనునీతః ప్రయత్నేన నచ తత్కురుతే మతిమ్. 9

పదచ్ఛేదము :— విభీషణేన - చ - భ్రాత్రా - మమ - నిర్యాతనం - ప్రతి- అనునీతః - ప్రయత్నేన - న-చ - తత్-కురుతే-మతిమ్.

అన్వయక్రమము :— భ్రాత్రా విభీషణేన మమ నిర్యాతనం ప్రతి ప్రయత్నేన అనునీతః (రావణః) తత్ (తస్మిన్) మతిం న కురుతే.

ప్రతిపదార్థము :— భ్రాత్రా = సోదరుడైనట్టి, విభీషణేన = విభీషణునిచే, మమ = నాయొక్క, నిర్యాతనం ప్రతి = తిరిగి అప్పగించుటను గూర్చి, ప్రయత్నేన = గొప్ప ప్రయత్నముతో, అనునీతః = ప్రతిమాలుకొనబడినట్టి (రావణః = రావణుడు) తత్ (తస్మిన్) ఆ తిరిగి ఇచ్చివేయుట యను విషయమున, మతిం న కురుతే = ఇష్టపడుటలేదు.

తాత్పర్యము :— తమ్ముడైన విభీషణుడు నన్ను తిరిగి ఇచ్చివేయుమని ఎన్నివిధములుగనో ప్రయత్నించి ప్రతిమాలినాడుగాని రావణుడు అపనికి ఎంత మాత్రమును ఇష్టపడుటలేదు.

శ్లో॥ మమ ప్రతి ప్రదానంహి రావణస్య న రోచతే.
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశంగతమ్.

పదచ్ఛేదము :—మమ - ప్రతిప్రదానం - హి - రావణస్య - న - రోచతే - రావణం - మార్గతే - సంఖ్యే - మృత్యుః-కాలవశం - గతమ్॥.

అన్వయక్రమము :— మమ ప్రతి ప్రదానం రావణస్య న హి రోచతే. కాలవశం గతం రావణం మృత్యుః సంఖ్యే మార్గతే॥

ప్రతిపదార్థము :— రావణస్య = రావణునకు, మమ ప్రతి ప్రదానం = నన్ను తిరిగి ఇచ్చివేయుట, నహి రోచతే = ఏమియును

ఇష్టము అగుటలేదు, కాలవశం గతం=యమునకు ఆధీనుడైన, రావణం= రావణుని, మృత్యుః = మృత్యుదేవత, సంఖ్యే = యుద్ధమునందు, మార్గతే = వెదకి కొనుచున్నది.

తాత్పర్యము :- రావణునకు నన్ను తిరిగి ఇచ్చివేయుట ఎంత మాత్రము ఇష్టమగుటలేదు. కాలవశుడైయున్న అతనిని మృత్యుదేవత యుద్ధమునందు ఎప్పుడు దొరకునా యని అన్వేషించుచున్నది.

శ్లో॥ జ్యేష్ఠా క న్యా ఽనలానామ విభీషణసుతా కపే,
తయా మ మైత దాఖ్యాతం మాత్రా ప్రహితయా
స్వయమ్. 11

పదచ్ఛేదము :- జ్యేష్ఠా - కన్యా - అనలా - నామ-విభీషణ సుతా - కపే - తయా - మమ - ఏతత్ - ఆఖ్యాతం - మాత్రా - ప్రహితయా - స్వయమ్॥

అన్వయక్రమము :- కపే! అనలానామ విభీషణసుతా జ్యేష్ఠా కన్యా(అస్తి)మాత్రా ప్రహితయా తయా స్వయం మమ ఏతత్ ఆఖ్యాతమ్॥

ప్రతిపదార్థము :- కపే! = ఓ హనుమా! అనలానామ = అనలయను పేరుగల, జ్యేష్ఠా = పెద్దదైనట్టి విభీషణసుతా = విభీషణుని కుమార్తెయైన, కన్యా = ఒక కన్య, (అస్తి=కలదు) మాత్రా = తల్లిచే, ప్రహితయా = పంపబడినట్టి, తయా = ఆమెచే, స్వయం=స్వయముగా, మమ = నాకు,ఏతత్ = ఈ విషయము, ఆఖ్యాతం = చెప్పబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- ఏతత్ - అనగా విభీషణుడు రావణుని అయన ఖ్యంచుట.

వాసుదాసస్వామి :- విభీషణుని భార్య సరమయను నామె పతి యనుమతిదిసికొని తనకూతురగు ననలయను కన్యకచే ఈ విషయము సీతకు దెలిపెను. ఈ విషయమే రామునకు తెలిసి నిస్సంకోచముగా విభీషణుని మిత్రునిగా స్వీకరించి అతనికి లంకారాజ్యాభిషేకముచేయుటలోను కారణమైనది.

పాఠాంతరము -: " అనలా నామవిభీషణసుతా' అనుదానికి మాఱుగా కలానామ యని ఉత్తరదేశీయ ప్రతులందు కానవచ్చుచున్నది.

తాత్పర్యము :- వానరోత్తమా! విభీషణునకు అనలయను పేరుగల కన్యయైన జ్యేష్ఠపుత్రిక గలదు. ఆమెచేతనే అమెతల్లి నాకీ విషయము స్వయముగా తెలిపియున్నది.

శ్లో॥ అవింధ్యోనామ మేధావీ విద్వా న్రాక్షసపుంగవః,
ధృతిమాన్ శీలవాన్ వృద్ధో రావణస్య సుసమ్మతః. 12

శ్లో॥ రామాత్ క్షయ మనుప్రాప్తం రక్షసాం ప్రత్యచోదయత్
నచ తస్య స దుష్టాత్మా శృణోతి వచనం హితమ్. 13

పదచ్ఛేదము :- అవింధ్యః - నామ - మేధావీ - విద్వాన్ - రాక్షసపుంగవః - ధృతిమాన్ - శీలవాన్ - వృద్ధః - రావణస్య - సుసమ్మతః - రామాత్ - క్షయం - అనుప్రాప్తం - రక్షసాం ప్రత్యచోదయత్, న - చ - తస్య - సః - దుష్టాత్మా - శృణోతి - వచనం - హితమ్.

అన్వయక్రమము : -మేధావీ విద్వాన్ ధృతిమాన్ శీలవాన్ వృద్ధః రావణస్య సుసమ్మతః అవింధ్యః నామ రాక్షస పుంగవః రక్షసాం రామాత్ ప్రాప్తం క్షయం ప్రతి అచోదయత్, సః దుష్టాత్మా తస్య హితం వచనం నచ శృణోతి॥

ప్రతిపదార్థము :- మేధావీ = మేధాశాలియును, విద్వాన్ = విద్వాంసుడును, ధృతిమాన్ = ధైర్యశాలియును, శీలవాన్ = శీలసంపన్నుడును, వృద్ధః = వృద్ధుడును, రావణస్య = రావణునకు, సుసమ్మతః = మిక్కిలి ఇష్టుడును అగు, అవింధ్యః నామ = అవింధ్యుడను పేరుగల, రాక్షస పుంగవః = రాక్షస శ్రేష్ఠుడు, రక్షసాం = రాక్షసులకు, రామాత్ = శ్రీరాముని వలన, ప్రాప్తం = సంభవించు, క్షయం ప్రతి = వినాశమును గూర్చి, అచోదయత్ = ప్రోత్సహించెను, సః దుష్టాత్మా = ఆ దుర్మార్గుడైన రావణుడు, తస్య = ఆయవింధ్యునియొక్క, హితం వచనం = శ్రేయస్కరమైన మాటను, నచ శృణోతి = ఎంతమాత్రము వినుటలేదు.

సూచన :- పై రెండు శ్లోకములును ఉత్తరదేశీయ ప్రతులలో మాత్రమే కానవచ్చు చున్నవి.

తాత్పర్యము :- మేధావియు విద్వాంసుడును, ధీరుడును, వృద్ధుడును, రావణునకు మిక్కిలి ఇష్టుడును అగు అవింధ్యుడను రాక్షసోత్తముడు శ్రీరాముని వలన రాక్షస కులమునకు సంభవించు వినాశమును గూర్చి విశదముగ హెచ్చరించెను. కాని ఆ దుర్మార్గుడు అతని హిత వచనములను చెవిని బెట్టలేదు.

శ్లో॥ ఆశంసేయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః
అంతరాత్మాహి మే శుద్ధ స్తస్మింశ్చ బహవో గుణాః. 14

పదచ్ఛేదము :- ఆశంసేయం - హరిశ్రేష్ఠ - క్షిప్రం - మాం - ప్రాప్స్యతే - పతిః - అంతరాత్మా - హి - మే - శుద్ధః - తస్మిన్ - చ - బహవః - గుణాః.

అన్వయక్రమము :- హరిశ్రేష్ఠః మే అంతరాత్మా శుద్ధః, తస్మిన్ చ బహవః గుణాః (అతః) పతిః మాం క్షిప్రం ప్రాప్స్యతె - ఇతి ఆశంసేయమ్.

ప్రతిపదార్థము :- హరిశ్రేష్ఠః = వానరశ్రేష్ఠుడా!, మే అంతరాత్మా = నా అంతరాత్మ, శుద్ధః = పరిశుద్ధముగా నున్నది. తస్మిన్ = ఆ శ్రీరామునియందు, బహవః గుణాః = పెక్కు గొప్పగుణములున్నవి, (అతః = అందువలన) పతిః = (నా) భర్త, మాం = నన్ను, క్షిప్రం = శీఘ్రముగా, ప్రాప్స్యతే = పొందగలడు, ఇతి = అని ఆశంసేయం = ఆశించు చున్నాను.

సూచన :- ఆశంసేయం 'అనుటకు బదులుగా' ఆసంశయం అని పాఠాంతరము.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! నా యంతరాత్మ పరిశుద్ధమై యున్నది. శ్రీరామునియందు చూడగా అసంఖ్యాకములైన ఉత్కృష్ట గుణములున్నవి. అందుచే నా భర్త నన్ను త్వరలోనే పొందగలడని ఆశింప గల్గుచున్నాను.

శ్లో॥ ఉత్సాహః పౌరుషం సత్త్వ మానృశంస్యం కృతజ్ఞతా,
విక్రమశ్చ ప్రభావశ్చ సంతి వానర రాఘవే. 15

పదచ్ఛేదము :- ఉత్సాహః - పౌరుషం - సత్త్వం - ఆనృశంస్యం - కృతజ్ఞతా - విక్రమః - చ - ప్రభావః - చ - సంతి - వానర - రాఘవే.

అన్వయక్రమము :- వానర! రాఘవే ఉత్సాహః, పౌరుషం, సత్త్వం, అనృశంస్యం, కృతజ్ఞతా, విక్రమః, ప్రభావః చ సంతి.

ప్రతిపదార్థము :- వానర! = ఓ హనుమా! రాఘవే = శ్రీరామునియందు, ఉత్సాహః = ఉత్సాహము, పౌరుషం = పురుషకారము, సత్త్వం = బలము, అనృశంస్యం = అకౄర స్వభావము, కృతజ్ఞతా = కృతజ్ఞతయును, విక్రమః = పరాక్రమము, ప్రభావః = మహిమ, సంతి = ఉన్నవి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- ఉత్సాహః - లోకోత్తర కార్యము లందు స్థిరమైన ప్రయత్నము, పౌరుషం = అట్టి కార్యసాధనము.

తిలకము :- అనృశంస్యం - ఆశ్రితజనులందు వాత్సల్యము. ప్రభావః - దివ్యాస్త్ర సంపదవలన జనించిన మహిమ.

వాసుదాసస్వామి :- కొందఱియందా గుణములు అల్పకాలమేయుండును. మఱికొందరి యందిందుకొన్నియే యుండును. శ్రీరాముని యందట్లుకాదు. కళ్యాణ గుణములన్నియు సంపూర్ణముగ శాశ్వతముగ నిలచియున్నవి.

తాత్పర్యము :- ఓ వానరశ్రేష్టుడా! నా శ్రీరామునియందు అమితమైన ఉత్సాహము, పౌరుషము, శక్తి, ఆశ్రితజన వాత్సల్యము, కృతజ్ఞత, పరాక్రమము, దివ్యాస్త్ర ప్రభావము అను అపూర్వ గుణములు నిండుగ నిత్యముగా వెలయుచుండును సుమా!

శ్లో॥ చతుర్దశసహస్రాణి రాక్షసానాం జఘాన యః,
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః క స్తస్య నోద్విజేత్.16

పదచ్ఛేదము :- చతుర్దశ - సహస్రాణి - రాక్షసానాం - జఘాన - యః - జనస్థానే - వినా - భ్రాత్రా - శత్రుః - కః - తస్య - న - ఉద్విజేత్॥

అన్వయక్రమము -: జనస్థానే భ్రాత్రావినా యః రాక్షసానాం చతుర్దశ సహస్రాణి జఘాన, తస్య శత్రుః కః నోద్విజేత్?

ప్రతిపదార్థము :- జనస్థానే = జనస్థానమునందు, భ్రాత్రా వినా = సోదరుడైన లక్ష్మణుడు లేకుండ, యః = ఏ వీరుడు, రాక్షసానాం = రాక్షసుల యొక్క, చతుర్దశ సహస్రాణి = పదునాల్గువేలమందిని,

జఘాన = సంహరించెనో, తస్య = అట్టి వీరునికి, శత్రుః = వైరియైన, కః = ఎవ్వడు, న ఉద్విజేత్ = భయము నొందకుండును?

తాత్పర్యము :- అనాడు జనస్థానమున తన సోదరుని సహాయములేకుండగనే ఏ వీరుడు పదునాలుగు వేలమంది రాక్షసలను పరిమార్చెనో అతనిని జూచి శత్రువైన వాడెవ్వడు భయపడకుండగ నుండగలడు?

శ్లో॥ న స శక్య స్తులయితుం వ్యసనైః పురుషర్షభః,
అహం త స్యానుభావజ్ఞా శక్రస్యేవ పులోమజా॥ 17

పదచ్ఛేదము :- న - సః - శక్యః - తులయితుం - వ్యసనైః - పురుషర్షభః - అహం - తస్య - అనుభావజ్ఞా - శక్రస్య - ఇవ - పులోమజా॥

అన్వయక్రమము :- సః పురుషర్షభః వ్యసనైః తులయితుం శక్యః న, పులోమజా శక్రస్య ఇవ అహం తస్య అనుభావజ్ఞా॥.

ప్రతిపదార్థము :- సః పురుషర్షభః = ఆ పురుష సింహుడు, వ్యసనైః = ఆపదలచే, తులయితుం = చలింపచేయుటకు, శక్యః న = సాధ్యుడుగాడు, పులోమజా = పులోముని పుత్రికయైన శచీదేవి, శక్రస్య ఇవ = దేవేంద్రునియొక్క (ప్రభావమును)వలె, అహం = నేను, తస్య= అతనియొక్క, అనుభావజ్ఞా = ప్రభావము నెఱిగినదానను.

తాత్పర్యము .- పురుష సింహుడైన శ్రీరాముడు రాక్షసులు కల్పించు ఆపదలకు చలించునట్టివాడుగాడు. శచీదేవి దేవేంద్రుని ప్రభావమును పూర్తిగా ఎఱిగియున్నట్లు నేను నా శ్రీరాముని మహిమను సంపూర్ణముగా తెలిసియున్నదానను.

శ్లో॥ శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః,
శత్రురక్షోమయం తోయ ముపశోషం నయిష్యతి॥ 18

పదచ్ఛేదము :- శరజాలాంశుమాన్ - శూరః - కపే - రామ దివాకరః - శత్రురక్షోమయం - తోయం - ఉపశోషం - నయిష్యతి॥.

అన్వయక్రమము :- కపే! శూరః శరజాలాంశుమాన్ రామ దివాకరః శత్రురక్షోమయం తోయం ఉపశోషం నయిష్యతి॥.

ప్రతిపదార్థము :- కపే! = ఓ హనుమా! శూరః = మహా వీరుడగు, శరజాలాంశుమాన్ = బాణసమూహములనెడి కిరణములుగలిగిన, రామదివాకరః = శ్రీరాముడనెడి సూర్యుడు, శత్రురక్షోమయం = శత్రువులనెడి రాక్షసుల రూపమైన తోయం = జలమును, ఉపశోషం = ఎండి పోవుటను, నయిష్యతి = పొందింపగలడు.

తాత్పర్యము :- ఓ హనుమా! తన బాణములనెడి కిరణములతో కూడిన శూరుడైన రామదివాకరుడు, శత్రుపక్షీయులైన రాక్షసులనెడి నీటిని పూర్తిగా ఎండించి వేయగలడు సుమా!

శ్లో॥ ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్,
అశ్రుసంపూర్ణ వదనా ముచాచ హనుమా న్కపిః. 19

పదచ్ఛేదము :- ఇతి - సంజల్పమానాం - తాం - రామార్థే - శోకకర్శితామ్, అశ్రుసంపూర్ణవదనాం - ఉవాచ - హనుమాన్ - కపిః॥.

అన్వయక్రమము :- కపిః హనుమాన్ ఇతి సంజల్పమానాం, రామార్థే శోకకర్శితాం, అశ్రుసంపూర్ణవదనాం తాం ఉవాచ॥.

ప్రతిపదార్థము :- కపిః హనుమాన్ = వానరశ్రేష్ఠుడగు హనుమ, ఇతి = ఈరీతిగా, సంజల్పమానాం = భాషించుచున్నదియును, రామార్థే = రామునికొఱకై, శోకకర్శితాం = దుఃఖముచే కృశించినదియును, అశ్రుసంపూర్ణవదనాం = దుఃఖబాష్పములతో నిండినముఖము గలదియు నగు, తాం = ఆ సీతమ్మను గూర్చి ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- అప్పుడు వానరోత్తముడైన హనుమ ఈ విధముగా భాషించుచు శ్రీరాముని గూర్చి శోకించుచు కృశించి కన్నీటితో నిండిన ముఖముగల సీతమ్మను గూర్చి ఇట్లు పలికెను.

శ్లో॥ శ్రుత్వైవచ వచో మహ్యం క్షిప్ర మేష్యతి రాఘవః,
చమూం ప్రకర్ష న్మహతీం హర్యృక్షగణ సంకులామ్. 20

పదచ్ఛేదము :- శ్రుత్వా - ఏవ - చ - వచః - మహ్యం - క్షిప్రం - ఏష్యతి - రాఘవః - చమూం - ప్రకర్షన్ - మహతీం - హర్యృక్షగణ సంకులామ్.

అన్వయక్రమము :- రాఘవః మహ్యం (మత్తః) వచః శ్రుత్వాఏవ హర్యృక్షగణ సంకులాం మహతీం చమూం ప్రకర్షన్ క్షిప్రం ఏష్యతి॥.

ప్రతిపదార్థము :- రాఘవః=శ్రీరాముడు, మహ్యం (మత్తః)= నా నుండి, వచః = మాటను, శ్రుత్వాఏవ = వినినంతనే, హర్యృక్షగణ సంకులాం = వానరుల యొక్కయు, భల్లూకముల యొక్కయు సమూహముతో నిండినట్టి, మహతీం చమూం = గొప్పదైన సైన్యమును, ప్రకర్షన్ = తెచ్చుచు, క్షిప్రం = శీఘ్రముగా, ఏష్యతి = రాగలడు.

తాత్పర్యము :- శ్రీరాముడు నేను చెప్పిన మాటను వినిన వెంటనే అపారమైన వానరుల సమూహము తోడను, భల్లూకగణముల తోడను కూడిన అమితమైన సైన్యమును నడిపించుకొనుచు అతి శీఘ్ర కాలములోనే ఇటకు రాగలడు సుమా।

శ్లో॥ అథవా మోచయిష్యామి త్వా మద్యైవ వరాననే,
అస్మా ద్దుఃఖా దుపారోహ మమ పృష్ఠ మనిందితే. 21

పదచ్ఛేదము :- అథవా - మోచయిష్యామి - త్వాం - అద్య - ఏవ - వరాననే - అస్మాత్ - దుఃఖాత్ - ఉపారోహ - మమ - పృష్ఠం - అనిందితే॥.

అన్వయక్రమము :- అథవా అద్యఏవ త్వాం అస్మాత్ దుఃఖాత్ మోచయిష్యామి, వరాననే అనిందితే మమ పృష్ఠం ఆరోహ॥.

ప్రతిపదార్థము :- అథవా = లేకపోయినచో, అద్యఏవ = ఇప్పుడే, త్వాం = నిన్ను, అస్మాత్ దుఃఖాత్ = ఈ దుఃఖమునుండి, మోచయిష్యామి = విడిపించెదను, వరాననే = ఓ చంద్రముఖీ!, అనిందితే! = ఓ ఉత్తమురాలా!, మమ పృష్ఠం = నా వీపును, ఉపారోహ = ఆరోహింపుము.

సూచన :- "వరాననే"కి బదులుగా"వరాశసాత్"అని పాఠాంతరము.

తాత్పర్యము :- శ్రీరాముడు వచ్చుట ఆలస్యమగునని శంకించుచో నేనిప్పుడే నిన్ను నీ దుఃఖమునుండి విడిపించెదను. నా వీపుపై కూర్చుండుము.

శ్లో॥ త్వాంతు పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్,
శక్తి రస్తిహి మే వోఢుం లంకామపి సరావణామ్. 22

పదచ్ఛేదము :- త్వాం - తు - పృష్ఠగతాం - కృత్వా - సంతరిష్యామి - సాగరమ్, - శక్తిః - అస్తి - హి - మే - వోఢుం- లంకాం - అపి - సరావణామ్॥.

అన్వయక్రమము :- త్వాం పృష్ఠగతాం కృత్వా సాగరం సంతరిష్యామి, సరావణాం లంకాం అపి వోఢుం మే శక్తిః అస్తిహి॥.

ప్రతిపదార్థము :- త్వాం = నిన్ను, పృష్ఠగతాం కృత్వా = వీపుపై నున్నదానినిగా చేసికొని, సాగరం = సముద్రమును, సంతరిష్యామి = దాటగలను, సరావణాం = రావణాసురునితో గూడిన, లంకాం అపి = లంకానగరమునుగూడ, వోఢుం = వహించుటకు, మే = నాకు, శక్తిః = సామర్థ్యము, అస్తిహి = ఉన్నది సుమా!

తాత్పర్యము :- నన్ను నా వీపుపై నెక్కించుకొని ఈ మహా సముద్రమును దాటించెదను. ఈ రావణాసురునితో సహితముగా లంకానగరమునంతను గూడ మోసికొని పోవుటకు కావలసినంత సామర్థ్యము నాకున్నది సుమా!

శ్లో॥ అహం ప్రస్రవణస్థాయ రాఘవాయాద్య మైథిలి,
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుతమి వానలః.23

పదచ్ఛేదము :- అహం - ప్రస్రవణస్థాయ - రాఘవాయ - అద్య - మైథిలి - ప్రాపయిష్యామి - శక్రాయ - హవ్యం - హుతం - ఇవ - అనలః॥.

అన్వయక్రమము :- మైథిలి! అనలః హుతం హవ్యం శక్రాయ ఇవ అహం అద్య (త్వాం) ప్రస్రవణస్థాయ రాఘవాయ ప్రాపయిష్యామి.

ప్రతిపదార్థము :- మైథిలి! = ఓ జానకీ! అనలః = అగ్నిహోత్రుడు, హుతం = హోమము చేయబడిన, హవ్యం = హవిస్సును శక్రాయ ఇవ = దేవేంద్రునకువలె, అహం = నేను, అద్య = నేడు, త్వాం = నిన్ను, ప్రస్రవణస్థాయ = ప్రస్రవణ పర్వతముపై నున్నట్టి, రాఘవాయ = శ్రీరామునకు, ప్రాపయిష్యామి = చేర్చెదను.

తాత్పర్యము :- ఓ జానకీ! అగ్నిహోత్రుడు తనలో హోమము చేయబడినట్టి వస్తువును దేవేంద్రునకు సమర్పించినట్లుగా నే నిప్పుడే ప్రస్రవణ పర్వతముపై నున్న శ్రీరామునకు నిన్ను సమర్పించెదను.

శ్లో॥ ద్రక్ష్యసి త్వద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్,
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధేయథా॥ 34

పదచ్ఛేదము :- ద్రక్ష్యసి - అద్య - ఏవ - వైదేహి - రాఘవం - సహలక్ష్మణమ్ వ్యవసాయసమాయుక్తం - విష్ణుం - దైత్యవధే - యథా॥

అన్వయక్రమము :- వైదేహి! సహలక్ష్మణం రాఘవం దైత్యవధే వ్యవసాయసమాయుక్తం విష్ణుం యథా అద్యఏవ ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- వైదేహి! = ఓ జానకీ!, సహలక్ష్మణం = లక్ష్మణునితో కూడినట్టి, రాఘవం = శ్రీరాముని, దైత్యవధే = రాక్షస సంహారమునందు, వ్యవసాయసమాయుక్తం = ప్రయత్నసమన్వితుడైనట్టి, విష్ణుం యథా = విష్ణువునువలె, అద్యఏవ = నేడే, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- ఓ జానకీదేవీ! తమ్ముడైన లక్ష్మణునితో కూడిన శ్రీరాముని రాక్షస సంహారమునకై యత్నపరుడైయున్న విష్ణుమూర్తినివలె నేడే కనులార దర్శింపగలవు సుమా!

శ్లో॥ త్వద్దర్శనకృతోత్సాహ మాశ్రిమస్థం మహాబలమ్,
పురందరమి వాసీనం నగరాజస్య మూర్ధని. 25

పదచ్ఛేదము :- త్వద్దర్శనకృతోత్సాహం - ఆశ్రిమస్థం - మహాబలమ్ - పురందరం - ఇవ - ఆసీనం - నగరాజస్య - మూర్ధని॥.

అన్వయక్రమము :- నగరాజస్య మూర్ధని ఆసీనం పురందరం ఇవ త్వద్దర్శనకృతోత్సాహం మహాబలం ఆశ్రిమస్థం (రాఘవం ద్రక్ష్యసి).

ప్రతిపదార్థము :- నగరాజస్య = మేరు పర్వతము యొక్క, మూర్ధని = శిఖరముపై, ఆసీనం = కూర్చున్నట్టి, పురందరం ఇవ = దేవేంద్రునివలె త్వద్దర్శనకృతోత్సాహం = నీ దర్శనమునకై వేగిరపడుచున్న ఉత్సాహముగలవాడును, మహాబలం = మహాబలాఢ్యుడును, ఆశ్రిమస్థం = ఆశ్రిమమునందున్నవాడు నగు, (రాఘవం=శ్రీరాముని, ద్రక్ష్యసి= చూడగలవు)

తాత్పర్యము :— మేరుపర్వత శిఖరముపై ఆసీనుడైయున్న దేవేంద్రునివలె నిన్నుజూచుటకై వేగిరపడుచున్న శ్రీరాముడు తన ఆశ్రమమునందే యుండగా నీవిప్పుడే అతనిని కన్నులార చూడగలవు సుమా।

శ్లో॥ పృష్ఠ మారోహ మే దేవి మా వికాంక్షస్వ శోభనే
యోగ మన్విచ్ఛ రామేణ శశాంకేనేవ రోహిణీ. 26

పదచ్ఛేదము :— పృష్ఠం - ఆరోహ - మే - దేవి - మా - వికాంక్షస్వ - శోభనే - యోగం - అన్విచ్ఛ - రామేణ - శశాంకేన - ఇవ - రోహిణీ॥.

అన్వయక్రమము :— దేవి। మే పృష్ఠం ఆరోహ, శోభనే। మా వికాంక్షస్వ; రోహిణీ శశాంకేన ఇవ (త్వం) రామేణ యోగం అన్విచ్ఛ॥.

ప్రతిపదార్థము :— దేవి। = ఓ పూజ్యురాలా। మే = నాయొక్క, పృష్ఠం = వీపును, ఆరోహ = ఎక్కుము, శోభనే = ఓ మంగళ స్వరూపురాలా।, మా వికాంక్షస్వ = ఉపేక్షింపకుము, రోహిణీ = రోహిణీతార, శశాంకేన ఇవ = చంద్రునితోవలె, (త్వం = నీవు) రామేణ = శ్రీరామునితో, యోగం = కలయికను, అన్విచ్ఛ = కోరుకొనుము.

తాత్పర్యము :— దేవీ। నా వీపుపై ఆరోహింపుము, ఉపేక్షవహింపకుము; ఆకాశముపై పయనించి, రోహిణీతార చంద్రునితోకలసి యున్నట్లుగా నీవు శ్రీరామునితో కలసియుందువు.

శ్లో॥ కథయంతీవ చంద్రేణ సూర్యేణచ మహార్చిషా,
మత్పృష్ఠ మధిరుహ్య త్వం తరాకాశ మహార్ణవౌ. 27

పదచ్ఛేదము :— కథయంతి - ఇవ - చంద్రేణ - సూర్యేణ - చ - మహార్చిషా - మత్పృష్ఠం - అధిరుహ్య - త్వం - తర - ఆకాశ మహార్ణవౌ॥.

అన్వయక్రమము :— త్వం మత్పృష్ఠం అధిరుహ్య చంద్రేణ, మహర్షిషా సూర్యేణచ కధ యంతిఇవ, ఆకాశమహార్ణవౌ తర॥

ప్రతిపదార్థము :— త్వం = నీవు, మత్పృష్ఠం = నా వీపును, అధిరుహ్య = అరోహించి, చంద్రేణ = చంద్రుని తోడను, మహర్షిషా = గొప్పతేజస్సుగల్గినట్టి, సూర్యేణచ = సూర్యునితోడను, కధయంతి ఇవ = భాషించుచున్నదానివలె, ఆకాశమహార్ణవౌ = ఆకాశమును మహాసముద్రమును, తర = దాటుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :— చంద్రేణ, సూర్యేణ కధయంతీ ఇవ- చంద్రసూర్యులతో మాటలాడగలిగినంతటి ఉన్నత మార్గమున నిన్నుగై కొని నేను ప్రయాణింపగలను సుమా యని భావము.

తాత్పర్యము :— నీవు నా వీపు నధిరోహించి సూర్యచంద్రులతో మాటలాడుచున్నట్లుగా ఉన్నత మార్గమున ఆకాశమున పయనించుచు మహా సాగరమును దాటుము.

శ్లో॥ నహి మే సంప్రయాతస్య త్వాం ఇతో నయతో౽ంగనే,
అనుగంతుం గతిం శక్తాః సర్వే లంకానివాసినః. 28

పదచ్ఛేదము :— న - హి - మే - సంప్రయాతస్య - త్వాం - ఇతః - నయతః - అంగనే - అనుగంతుం - గతిం - శక్తాః - సర్వే - లంకానివాసినః.

అన్వయక్రమము :— అంగనే! త్వాం ఇతః నయతః, సంప్రయాతస్య మే గతిం అనుగంతుం సర్వే లంకానివాసినః నశక్తాహి.

ప్రతిపదార్థము :- అంగనే = ఓ భామినీ!, త్వాం - నిన్ను, ఇతః = ఇచ్చటినుండి, నయతః = కొనిపోవుచు, సంప్రయాతస్య = వెడలిపోవుచున్నట్టి, మే = నా యొక్క, గతిం = గమనమును, అనుగంతుం = అనుసరించుటకు, లంకానివాసినః = లంకలోనివసించుచున్నట్టి, సర్వే = ఎల్లరును, నశక్తాః హి = సమర్థులుగారు సుమా!

తాత్పర్యము :- నిన్నుగైకొని వెడలిపోవుచున్న నన్ను వెంబడించుటకు ఈ లంకలో నివసించుచున్న వారిలో ఎవ్వడును సమర్థుడు గాడు సుమా!

శ్లో॥ యథైవాహమిహ ప్రాప్తస్తథైవాహమసంశయమ్,
యాస్యామి పశ్య వైదేహి త్వాముద్యమ్య విహాయసమ్.

పదచ్ఛేదము :- యథా - ఏవ - అహం - ఇహ - ప్రాప్తః - తథా - ఏవ - అహం - అసంశయమ్ - యాస్యామి - పశ్య - వైదేహి - త్వాం - ఉద్యమ్య - విహాయసమ్॥

అన్వయక్రమము :- వైదేహి! పశ్య, అహం యథా ఏవ ఇహ ప్రాప్తః తథా ఏవ త్వాం ఉద్యమ్య అసంశయం విహాయసం యాస్యామి॥

ప్రతిపదార్థము :- వైదేహి! = ఓ జానకీ!, పశ్య = చూడుము, అహం = నేను, ఇహ = ఇచ్చటికి, యథాఏవ = ఏరీతిగా, ప్రాప్తః = చేరితినో, తథైవ = ఆ రీతిగనే, త్వాం = నిన్ను, ఉద్యమ్య = ఎత్తుకొని, అసంశయం = నిస్సందేహముగా, విహాయసం = ఆకాశమార్గమున, యాస్యామి = పయనింపగలను.

తాత్పర్యము :- సీతాదేవీ! నేను ఈ లంకకు ఎట్లు అవలీలగ చేరగల్గితినో అంతశేలికగనే నా వీపుపై నిన్నుంచుకొని ఆకాశమార్గమున అనాయాసముగా పయనింతును. నీవే చూడుము.

శ్లో॥ మైథిలీతు హరిశ్రేష్ఠా చ్ఛ్రుత్వా వచన మద్భుతమ్,
హర్ష విస్మితసర్వాంగీ హనూమంత మ థా(బవీత్. 30

పదచ్ఛేదము :_ మైథిలీ - తు - హరిశ్రేష్ఠాత్ - శ్రుత్వా - వచనం - అద్భుతమ్ - హర్షవిస్మిత సర్వాంగీ - హనూమంతం - అథ - అబ్రవీత్॥

అన్వయ(క్రమము :_ మైథిలీ హరిశ్రేష్ఠాత్ అద్భుతం వచనం శ్రుత్వా హర్ష విస్మిత సర్వాంగీ (సతీ) హనూమంతం అబ్రవీత్॥

ప్రతిపదార్థము :- మైథిలీ = సీతాదేవి, హరిశ్రేష్ఠాత్ = వానరశ్రేష్ఠుడైన హనుమనుండి, అద్భుతం = ఆశ్చర్యకరమైనట్టి, వచనం = మాటను, శ్రుత్వా = విని, హర్ష విస్మిత సర్వాంగీ = సంతోషముచేగగుర్పొడిచిన శరీరముగలదై, అథ = పిమ్మట, హనూమంతం = హనుమను గూర్చి, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :_ సీతాదేవి హనుమ పలికిన ఆశ్చర్యకరమైన మాటలను ఆలకించి ఆనందముతో శరీరము గగుర్పాటు నొందుచుండ అతనిని జూచి ఇట్లు పలికెను.

శ్లో॥ హనూమన్ దూర మధ్వానం కథం మాం నేతు మిచ్ఛసి,
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప. 31

పదచ్ఛేదము :_ హనూమన్-దూరం - అధ్వానం - కథం - మాం - నేతుం - ఇచ్ఛసి - తత్ - ఏవ - ఖలు - తే - మన్యే - కపిత్వం - హరియూథప॥.

అన్వయక్రమము :- హనూమన్! దూరం అధ్వానం మాం కథం నేతుం ఇచ్ఛసి? హరియూథప! తదేవఖలు తే కపిత్వం (ఇతి) మన్యే॥.

ప్రతిపదార్థము :- హనూమన్ = ఓ హనుమా! దూరం - దూరమైనట్టి అధ్వానం = మార్గమును, మాం = నన్ను, కధం = ఎట్లు, నేతుం = కొనిపోవుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు హరియూధప! = ఓ వానరాగ్రణీ!, తదేవఖలు = అదియేగదా, తే కపిత్వం = నీ వానర లక్షణము (ఇతి = అని) మన్యే = తలచుచున్నాను.

తాత్పర్యము :- ఓ హనుమా! ఇంతదూరమైన మార్గమున నన్ను ఎట్లుగా తీసికొనిపోవ గోరుచున్నావు? వానరశ్రేష్ఠుడా! నీ యందలి వానరస్వభావము ఇట్లే యుండునుగదా! యని నేను అర్థము చేసికొనుచున్నాను.

శ్లో॥ కథం చాల్పశరీర స్త్వం మా మితో నేతు మిచ్ఛసి,
సకాశం మానవేంద్రస్య భర్తు ర్మే ప్లవగర్షభ. 32

పదచ్ఛేదము :- కథం - చ - అల్పశరీరః - త్వం - మాం - ఇతః - నేతుం - ఇచ్ఛసి - సకాశం - మానవేంద్రస్య - భర్తుః - మే - ప్లవగర్షభః.

అన్వయక్రమము :- ప్లవగర్షభ! అల్పశరీరః త్వం ఇతః మాం మానవేంద్రస్య మే భర్తుః సకాశం కథం నేతుం ఇచ్ఛసి?

ప్రతిపదార్థము :- ప్లవగర్షభ = ఓ వానరశ్రేష్ఠుడా! అల్పశరీరః = చిన్నదైన శరీరము కలిగినట్టి, త్వం = నీవు, ఇతః = ఇచ్చటినుండి, మాం = నన్ను, మానవేంద్రస్య = మనుజనాధుడయిన, మే = నా యొక్క, భర్తుః = పెనిమిటి యొక్క, సకాశం = సమీపమునకు, కథం = ఎట్లుగా, నేతుం = కొనిపోవుటకు, ఇచ్ఛసి = కోరుచున్నావు.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! ఇంతచిన్న శరీరముగల నీవు ఈ లంకానగరము నుండి నా భర్తయైన ఆ నరేంద్రుని సన్నిధికి ఎట్లు గొనిపోవవలెనని ఆశించుచున్నావు?

శ్లో॥ సీతాయాస్తు వచః శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
చింతయామాస లక్ష్మీవా న్నవం పరిభవం కృతమ్. 33

పదచ్ఛేదము :- సీతాయాః - తు - వచః - శ్రుత్వా - హను మాన్ - మారుతాత్మజః - చింతయామాస - లక్ష్మీవాన్ - నవం - పరిభవం కృతమ్॥

అన్వయక్రమము :- లక్ష్మీవాన్, మారుతాత్మజః హనుమాన్ సీతాయాః వచః శ్రుత్వా నవం పరిభవం కృతం ఇవ చింతయామాస.

ప్రతిపదార్థము :- లక్ష్మీవాన్ = శుభలక్షణ సమన్వితుడును, మారుతాత్మజః = వాయునందనుడును అగు, హనుమాన్ = హనుమ, సీతాయాః = సీతాదేవి యొక్క, వచః = మాటను, శ్రుత్వా = విని, నవం = క్రొత్తదైన, పరిభవం = పరాభవము, కృతం ఇవ = చేయబడి నట్లు, చింతయామాస = చింతింపసాగెను.

తాత్పర్యము :- మహాపరాక్రమవంతుడైన హనుమ, తన సామర్థ్యము నెఱుగక సీతాదేవి పలికినట్టి మాటలువిని, తనకు మున్నెన్న డును జుగని మహాపరాభవము జరిగినట్లుగా వ్యథనొందెను.

శ్లో॥ న మే జానాతి సత్త్వం వా ప్రభావం వా ఽసితేక్షణా,
తస్మా త్పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః. 34

పదచ్ఛేదము :- న - మే - జానాతి - సత్త్వం - వా - ప్రభావం - వా - అసితేక్షణా - తస్మాత్ - పశ్యతు - వైదేహీ - యత్ - రూపం - మమ - కామతః.

అన్వయక్రమము :- అసితేక్షణా, వైదేహీ మే సత్వం ప్రభావం వా నజానాతి, తస్మాత్ మమ కామతః యత్ రూపం (భవతి తత్) పశ్యతు॥

ప్రతిపదార్థము - అసితేక్షణా! = సుందరమైన కన్నులుగల!, వైదేహి = జానకీదేవి, మే = నా యొక్క, సత్త్వం = బలమునుగాని, ప్రభావంవా = మహిమనుగాని, నజానాతి = ఎఱుగదు, తస్మాత్ = అందువలన, మమ = నాకు, కామతః = ఇచ్చనుబట్టి, యత్ రూపం = ఏ రూపము (భవతి = ఉండునో, తత్ = ఆ రూపమును) పశ్యతు = చూచును గాక!

తాత్పర్యము :- ఈ కోమలి నా శక్తినిగాని ప్రభావమునుగాని ఏమియు నెఱుగదు. అందుచే నేనుకోరి ఎట్టి రూపమును ధరింపగలనో ఈమె చూచి తెలిసికొనునుగాక!

శ్లో॥ ఇతి సంచింత్య హనుమాన్ తదా ప్లవగసత్తమః,
దర్శయామాస సీతాయా స్స్వంరూప మరిమర్దనః 35

పదచ్ఛేదము :- ఇతి - సంచింత్య - హనుమాన్ - తదా - ప్లవగసత్తమః - దర్శయామాస - సీతాయాః - స్వంరూపం-అరిమర్దనః

అన్వయక్రమము :- అరిమర్దనః, ప్లవగసత్తమః హనుమాన్ ఇతి సంచింత్య తదా సీతాయాః స్వంరూపం దర్శయామాస॥.

ప్రతిపదార్థము :- అరిమర్దనః = శత్రుసంహారకుడైనట్టియును, ప్లవగసత్తమః = వానరశ్రేష్ఠుడైనట్టియు, హనుమాన్ = హనుమ, ఇతి = ఈ విధముగ, సంచింత్య = ఆలోచించి, తదా = అప్పుడు, సీతాయాః = సీతాదేవికి, స్వంరూపం = తన నిజరూపమును, దర్శయామాస = చూపెను.

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడైన హనుమ ఈ విధముగా ఆలోచించి సీతాదేవికి శత్రుసంహార సమర్థుడైన అతడు తన నిజరూపమును చూపెను.

శ్లో॥ స తస్మా త్పాదపా ద్ధీమా నాప్లుత్య ప్లవగర్షభః,
తతో వర్ధితు మారేభే సీతాప్రత్యయకారణాత్. 36

పదచ్ఛేదము :- సః - తస్మాత్ - పాదపాత్ - ధీమాన్ - ఆప్లుత్య - ప్లవగర్షభః - తతః - వర్ధితుం - ఆరేభే - సీతాప్రత్యయ కారణాత్॥.

అన్వయక్రమము :- ధీమాన్ సః ప్లవగర్షభః తస్మాత్ పాదపాత్ ఆప్లుత్య తతః సీతాప్రత్యయ కారణాత్ వర్ధితుం ఆరేభే॥.

ప్రతిపదార్థము :- ధీమాన్ = ప్రజ్ఞాశాలియైనట్టి, సః ప్లవగర్షభః = ఆ వానరశ్రేష్ఠుడు, తస్మాత్ పాదపాత్ = ఆ వృక్షమునుండి, ఆప్లుత్య = లంఘించి, తతః = పిమ్మట, సీతాప్రత్యయకారణాత్ = సీతాదేవికి నమ్మకము నిమిత్తము, వర్ధితుం = వృద్ధిపొందుటకు, ఆరేభే = మొదలిడెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- పాదపాత్ ఆప్లుత్య - కొమ్మనుండి దిగుట తన శరీరభారముచే చెట్టు విరిగి అధ్వనికి రాక్షస స్త్రీలు తనను గుర్తింతురను భీతితో నని భావము.

తాత్పర్యము :- ప్రజ్ఞాశాలియైన హనుమ తానున్న ఆ శింశుపా వృక్షమునుండి క్రిందికి దూకి తనపై సీతాదేవికి నమ్మకము గల్గుటకొఱకై తన శరీరమును పెంచదొడగెను.

శ్లో॥ మేరుమందరసంకాశో బభౌ దీప్తానలప్రభః,
అగ్రతో వ్యవతస్థేచ సీతాయా వానరోత్తమః. 37

పదచ్ఛేదము :- మేరుమందరసంకాశః - బ
ప్రభః - అగ్రితః - వ్యవతస్థే - చ - సీతాయాః - వాన

అన్వయక్రమము :- వానరర్షభః మేరుమ
(సన్) బభౌ, దీప్తానలప్రభః (సన్) సీతాయాః అగ్రతః వ

ప్రతిపదార్థము :- వానరర్షభః = వానరశ్రేష్ఠు
మేరుమందరసంకాశః (సన్) = మేరుపర్వతము తోడను,
తోడను, సమానమైనట్టివాడై, బభౌ = ప్రకాశించెను, దీప్త
ప్రజ్వలించిన అగ్నియొక్క తేజస్సువంటి ప్రభగలవాడై,
సీతాదేవియొక్క, అగ్రితః = ఎదుట, వ్యవతస్థే = నిలచె

తాత్పర్యము :- అట్లు వృద్ధిపొందియున్నహను
తమువలెను, మందరాద్రివలెను చూచుటకు అశ్చర్యము గా
ఇట్లు సీతాదేవియందు నిలచినయాతడు ప్రజ్వలించుచున్న
వలెనే ప్రకాశించెను.

శ్లో॥ హరిః పర్వతసంకాశ స్తామ్రవక్త్రో మహాబలః,
వజ్రదంష్ట్రినఖో భీమో వై దేహీ మిద మబ్ర

పదచ్ఛేదము :- హరిః - పర్వతసంకాశః - తా
మహాబలః - వజ్రిదంష్ట్రినఖః - భీమః - వైదేహీం - ఇదం

అన్వయక్రమము :- పర్వతసంకాశః, తామ్రవ
బలః, వజ్రిదంష్ట్రి నఖః, భీమః (సః) హరిః వైదేహీం ఇద

ప్రతిపదార్థము :- పర్వతసంకాశః = పర్వత
తామ్రివక్త్రః = ఎఱ్ఱనిముఖముగలవాడును, మహాబలః = మ
డును, వజ్రదంష్ట్రినఖః = వజ్రిములవంటి కోఱలును గ

వాడును, భీమః = భయంకరుడును అగు, (సః) హరిః = ఆ వానరుడు, వైదేహీం = జానకీదేవిని గూర్చి, ఇదం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :— ఆ హనుమంతుడు పర్వతమువంటి శరీరమును ఎఱ్ఱనిముఖమును వజ్రమువంటి కోఱలును గోరులును గలిగి మహాబలాఢ్యుడుగాను, భయంకరుడుగాను, కాన్పించుచు సీతాదేవిని గూర్చి ఇట్లు పలికెను.

శ్లో॥ సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్,
లంకా మిమాం సనాథాంవా నయితుం శక్తి రస్తి మే. 39

పదచ్ఛేదము :— సపర్వతవనోద్దేశాం - సాట్టప్రాకారతోరణామ్ - లంకాం - ఇమాం - సనాథాం - వా - నయితుం - శక్తిః - అస్తి - మే॥.

అన్వయక్రమము :— సపర్వతవనోద్దేశాం, సాట్టప్రాకారతోరణాం, సనాథాం ఇమాం లంకాం వా నయితుం మే శక్తిః అస్తి॥.

ప్రతిపదార్థము :— సపర్వతవనోద్దేశాం = పర్వతములతోడను వనప్రదేశములతోడను కూడినదియును, సాట్టప్రాకారతోరణాం = మేడలతోడను ప్రాకారములతోడను తోరణములతోడను గూడినదియును, సనాథాం = రాజుతో గూడినదియునగు, ఇమాం లంకాంవా = ఈ లంకానగరినైనను, నయితుం = తీసికొనిపోవుటకు, మే = నాకు, శక్తిః = సామర్థ్యము, అస్తి = ఉన్నది.

తాత్పర్యము :— సమస్త పర్వతములతోను అరణ్యప్రదేశములతోను సౌధములతోను ప్రాకారములతోను బహిర్ద్వారములతోను తన యేలికయైన రావణునితోను గూడియున్న ఈ లంకానగరము నంతను మోసికొనిపోవుటకు కావలసినంత శక్తి నాకున్నది సుమా!

శ్లో॥ త దవస్థాప్యతాం బుద్ధి రలం దేవి వికాంక్షయా,
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్. 40

పదచ్ఛేదము :- తత్ - అవస్థాప్యతాం - బుద్ధిః - అలం - దేవి - వికాంక్షయా - విశోకం - కురు - వైదేహి - రాఘవం - సహలక్ష్మణమ్॥.

అన్వయక్రమము :- తత్ దేవి! బుద్ధిః అవస్థాప్యతాం; వికాంక్షయా అలం; వైదేహి! సహలక్ష్మణం రాఘవం విశోకం కురు॥.

ప్రతిపదార్థము :- తత్ = ఆకారణమున, దేవి! = ఓ పూజ్యురాలా!, బుద్ధిః = బుద్ధి, అవస్థాప్యతాం = నిశ్చలపఱుపబడుగాక! వికాంక్షయా అలం = వేఱుతలంపువలదు, వైదేహి! = ఓ జానకీ!, సహలక్ష్మణం = లక్ష్మణునితో గూడినట్టి, రాఘవం = శ్రీరాముని, విశోకం = శోకరహితునిగా, కురు = చేయుము.

తాత్పర్యము :- తల్లీ! అందుచే నన్నుగూర్చి నీ మనస్సునందు ధైర్యముతో నిశ్చలముగనుండుము. నీకు ఎట్టి శంకయు అక్కఱలేదు. నా తోడవచ్చి తమ్మునితో గూడి శోకవిమగ్నుడై యున్న శ్రీరాముని శోకమును తొలగింపుము.

శ్లో॥ తం దృష్ట్వాఽచలసంకాశ మువాచ జనకాత్మజా,
పద్మపత్రవిశాలాక్షీ మారుత స్యౌరసం సుతమ్. 41

పదచ్ఛేదము :- తం - దృష్ట్వా - అచలసంకాశం - ఉవాచ - జనకాత్మజా - పద్మపత్రవిశాలాక్షీ - మారుతస్య - ఔరసం - సుతమ్॥

అన్వయక్రమము :- పద్మపత్రవిశాలాక్షీ జనకాత్మజా అచలసంకాశం మారుతస్య ఔరసం సుతం తం దృష్ట్వా ఉవాచ॥.

ప్రతిపదార్థము :— పద్మపత్రవిశాలాక్షీ = తామరతేకులవలె విశాలములైన కన్నులుగల, జనకాత్మజా = జానకీదేవి, అచలసంకాశం = పర్వతసన్నిభుడైనట్టి మారుతస్య = వాయువుయొక్క, ఔరసంసుతం = ఔరసపుత్రుడైన, తం = ఆ హనుమను, దృష్ట్వా = చూచి ఉవాచ = పలికెను.

తాత్పర్యము :— తామరతేకులవలె విశాలములైనట్టి కన్నులు గల సీతాదేవి తన ముందు పర్వతమువలె ప్రకాశించుచున్నట్టి ఆ వాయు నందనుని జూచి ఇట్లు పలికెను.

శ్లో॥ తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే.
వాయోరివ గతించాపి తేజ శ్చాగ్నేరి వాద్భుతమ్. 42

పదచ్ఛేదము :— తవ - సత్త్వం - బలం - చ - ఏవ - విజానామి - మహాకపే - వాయోః - ఇవ - గతిం - చ - అపి - తేజః - చ - అగ్నేః - ఇవ - అద్భుతమ్॥.

అన్వయక్రమము :— మహాకపేః అద్భుతం తవ సత్త్వం, బలంచ, వాయోః ఇవ గతించ, అగ్నేః ఇవ తేజః చ అహం విజానామి॥.

ప్రతిపదార్థము :— మహాకపేః = ఓ వానరశ్రేష్ఠుడా!, అద్భుతం = ఆశ్చర్యకరమైన, తవ = నీ యొక్క, సత్త్వం = శక్తిని, బలంచ = బలమును, వాయోః ఇవ = వాయువునకువలె, గతించ = గమనమును, అగ్నేః ఇవః = అగ్నికివలె, తేజః చ = తేజస్సును, అహం = నేను, విజానామి = బాగుగా తెలిసి కొనుచున్నాను.

తాత్పర్యము :— ఓ వానరోత్తమా! అద్భుతమైనట్టి నీ శక్తిని గూర్చియు, సామర్థ్యమును గూర్చియు, వాయుదేవున కున్నంతటి నీ వేగ మును గూర్చియు, అగ్నిదేవునివంటి నీ తేజస్సును గూర్చియును నాకు బాగుగ తెలిసినది.

శ్లో॥ ప్రాకృతో౽న్యః కథం చేమాం భూమి మాగంతు
మర్హతి,
ఉదధే రప్రమేయస్య పారం వానరయూథప. 43

పదచ్ఛేదము :— ప్రాకృతః - అన్యః - కథం - చ - ఇమాం - భూమిం - ఆగంతుం - అర్హతి - ఉదధేః - అప్రమేయస్య - పారం - వానరయూథప॥.

అన్వయక్రమము :— వానరయూథప! అప్రమేయస్య ఉదధేః పారం ఇమాం భూమిం అన్యః ప్రాకృతః కథం ఆగంతుం అర్హతి?

ప్రతిపదార్థము :— వానరయూథప = ఓ వానరాగ్రేసరా! అప్రమేయస్య = అపారమైనట్టి, ఉదధేః = సముద్రము యొక్క, పారం = అవలియొడ్డైనట్టి, ఇమాం భూమిం = ఈ ప్రదేశమును అన్యః = ఇతరుడైన, ప్రాకృతః = సామాన్యుడు, కథం = ఎట్లు, ఆగంతుం = వచ్చుటకు అర్హతి = సమర్థుడగును.

తాత్పర్యము :— వానరోత్తమా! అపారమైన ఈ మహా సాగరము యొక్క అవలి యొడ్డుననున్న ఈసుదూరదేశమును నీవుగాక మరొవ్వరు చేరుటకు సమర్థుడగును?

శ్లో॥ జానామి గమనే శక్తిం నయనేచాపి తే మమ,
అవశ్యం సంప్రధా ర్యాశు కార్యసిద్ధి ర్మహాత్మనః. 44

పదచ్ఛేదము :— జానామి - గమనే - శక్తిం - నయనే - చ - అపి - తే - మమ - అవశ్యం - సంప్రధార్యా - ఆశు - కార్యసిద్ధిః - మహాత్మనః॥.

అన్వయక్రమము :— మమ నయనే, తే గమనే చ శక్తిం జానామి, మహాత్మనః ఆశు కార్యసిద్ధిః అవశ్యం సంప్రధార్యా॥.

ప్రతిపదార్థము :— మమ = నా యొక్క, నయనే = కొనిపోవుటయందును గమనే చ = గమనమునందును తే = నీ యొక్క, శక్తిం = సామర్థ్యమును గూర్చి, జానామి = ఎఱుగుదును (క్రియ = ని) మహాత్మనః = మహాత్ముడైన శ్రీరాముని యొక్క, ఆశు = శీఘ్రమైన, కార్యసిద్ధిః = కార్యసిద్ధి, అవశ్యం = తప్పక, సంప్రధార్య = నిశ్చయింపవలసియున్నది.

తాత్పర్యము :— ఓ హనుమా! నన్నుగొనిపోవుటకును సముద్రమును లంఘించుటకును నీకుగల విశేషమైన సామర్థ్యమును గూర్చినాకు తెలియునుగాని ఆ మహాత్ముడైన శ్రీరాముడు తలపెట్టిన కార్యసిద్ధినిగూర్చి కూడ మనము ఆలోచింప వలసియున్నదిగదా!

శ్లో॥ అయుక్తం హి కపిశ్రేష్ఠ మయా గంతుం త్వయా సహ,
వాయువేగసవేగస్య వేగో మాం మోహయేత్తవ. 45

పదచ్ఛేదము :— అయుక్తం - హి - కపిశ్రేష్ఠ - మయా - గంతుం - త్వయా - సహ - వాయువేగసవేగస్య - వేగః - మాం - మోహయేత్ - తవ॥.

అన్వయక్రమము :— కపిశ్రేష్ఠ! త్వయా సహ మయా గంతుం అయుక్తంహి, వాయువేగసవేగస్య తవ వేగః మాం మోహయేత్॥.

ప్రతిపదార్థము :— కపిశ్రేష్ఠ! = ఓ వానరశ్రేష్ఠుడా, త్వయా సహ = నీతోగూడ, మయా = నా చేత, గంతుం = అనుసరింపబడుటకు, అయుక్తంహి = అయుక్తము సుమా! వాయువేగసవేగస్య = వాయువు యొక్క వేగముతో సమానమైన వేగముగల్గినట్టి, తవ = నీ యొక్క, వేగః = వేగము, మాం = నన్ను, మోహయేత్ = వశము తప్పినదానిని చేయును.

తాత్పర్యము :— వానరోత్తమా! నీతోగూడ నేను వచ్చుట

ఉచితముగాదు. ఏలననగా వాయువేగముతో ఆకసమున ఎగిరిపోవుచున్నట్టి నీ గమన వేగమును నేను భరింపజాలను॥.

శ్లో॥ అహ మాకాశ మాపన్నా హ్యుపర్యుపరి సాగరమ్,
ప్రపతేయంహి తే పృష్ఠా ద్భయా ద్వేగేన గచ్ఛతః. 46

పదచ్ఛేదము :— అహం - ఆకాశం - అపన్నా - హి - ఉపరి - ఉపరి - సాగరమ్ - ప్రపతేయం - హి - తే - పృష్ఠాత్ - భయాత్ - వేగేన - గచ్ఛతః॥.

అన్వయక్రమము :— సాగరం ఉపరి ఉపరి ఆకాశం అపన్నా అహం వేగేన గచ్ఛతః తవ పృష్ఠాత్ భయాత్ ప్రపతేయంహి॥.

ప్రతిపదార్థము :— సాగరం ఉపరి ఉపరి = సముద్రమునకు పైపైని, ఆకాశం = ఆకాశమును, అపన్నా = పొందినట్టి, అహం = నేను, వేగేన = వేగముగా, గచ్ఛతః = పోవుచున్నట్టి, తవ = నీ యొక్క, పృష్ఠాత్ = వీపుమీదనుండి, భయాత్ = భయమువలన, ప్రపతేయంహి = పడిపోవుదును గదా॥

తాత్పర్యము :— మహాసముద్రము యొక్క మిక్కిలి పై భాగముగ ఆకాశముపై చేర్చి నన్ను మహావేగముతో గొనిపోవుచున్న నీ వీపు మీద నుండి నేను భయముచే పట్టుతప్పి క్రింద పడిపోవచ్చును గదా॥

శ్లో॥ పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే,
భవేయ మాశు వివశా యాదసా మన్న ముత్తమమ్.47

పదచ్ఛేదము :— పతితా - సాగరే - చ - అహం-తిమినక్రఝషాకులే - భవేయం - ఆశు - వివశా - యాదసాం - అన్నం - ఉత్తమమ్॥.

అన్వయక్రమము :— తిమినక్రఝషాకులే సాగరే పతితా అహం ఆశు వివశా యాదసాం ఉత్తమం అన్నం భవేయంచ॥.

ప్రతిపదార్థము :- తిమినక్రఝషాకులే = తిమింగిలములతోడను, మొసళ్ళతోడను, మీనములతోడను సంకులమైయుండు, సాగరే = సము ద్రమునందు, పతితా = పడినదాననై, అహం = నేను, అశు = శీఘ్ర ముగా విపళా = వశముతప్పినదాననై, యాదసాం = జలజంతువులకు, ఉత్తమం = ఉత్తమమైన, అన్నం = ఆహారమును, భవేయంచ = అగు చునుగూడను.

తాత్పర్యము :- తిమింగిలములతోను, మొసళ్ళతోను, మత్స్య ములతోను భీకరమైయుండు మహాసాగరమునందు పడిపోయి వేఱుగతిలేక నేను అందలి జలజంతువులకు మంచి రుచికరమైన ఆహారము కాగలను గదా।

శ్లో॥ నచ శక్ష్యే త్వయాసార్థం గంతుం శత్రువినాశన,
కళత్రవతి సందేహ స్త్వయి స్యాద ప్యసంశయమ్. 48

పదచ్ఛేదము :- న - చ - శక్ష్యే - త్వయా - సార్థం - గంతుం - శత్రువినాశన - కళత్రవతి సందేహః - త్వయి - స్యాత్ - అపి - అసంశయమ్॥.

అన్వయక్రమము :- శత్రువినాశన! త్వయాసార్థం గంతుం చ (అహం) నశక్ష్యే, త్వయి కళత్రవతి (ఇవ) అసంశయం సందేహః స్యాత్॥

ప్రతిపదార్థము :- శత్రువినాశన = శత్రుసంహారకుడైన ఓ హనుమా!, త్వయా సార్థం = నీతోగూడ, గంతుం = పయనించుటకు, అహం = నేను, నశక్ష్యే = చాలను, త్వయి = నీ యందు, కళత్రవతి ఇవ = భార్యతో గూడినవాని యందువలె, అసంశయం = నిస్సంశయ ముగా, సందేహః అపి = శంకగూడ, స్యాత్ = కలుగును.

విశేషార్థములు–వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– కళత్రవతి సందేహః – ఒక స్త్రీని వెంటబెట్టుకొని పోవుచున్నవానిని జూచి రాక్షసులకు విపరీతమైన శంకలు గలుగవచ్చునని భావము.

గోవిందరాజీయము :– కళత్రము అనగా రక్షింపవలసినట్టి వస్తువు అని అర్థము. రక్షింపవలసిన నన్ను వెంటగొని పోవుచున్న నీకు గూడ రాక్షసులచే ప్రాణభయము కలుగవచ్చునను సందేహము కలుగునని భావము.

తాత్పర్యము :– నీతోగూడ నేను ప్రయాణము చేయజాలను. నీవు శత్రువినాశకుడవైనను నీతోగూడనున్న స్త్రీనైన నన్ను చూచి నీ భార్యనేమో అని, పరులు శంకింప వచ్చునుగదా!

శ్లో॥ హ్రియమాణాంతు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః
అనుగచ్ఛేయు రాదిష్టా రావణేన దురాత్మనా. 49

పదచ్ఛేదము :– హ్రియమాణాం – తు – మాం – దృష్ట్వా– రాక్షసాః – భీమవిక్రమాః – అనుగచ్ఛేయుః–ఆదిష్టాః – రావణేన – దురాత్మనా॥.

అన్వయక్రమము :– హ్రియమాణాం మాం దృష్ట్వా దురాత్మనా రావణేన ఆదిష్టాః భీమవిక్రమాః రాక్షసాః అనుగచ్ఛేయుః.

ప్రతిపదార్థము :– హ్రియమాణాం = కొనిపోవబడుచున్న, మాం = నన్ను, దృష్ట్వా = చూచి, దురాత్మనా = దుర్మార్గుడైన, రావణేన = రావణునిచే, ఆదిష్టాః = ఆజ్ఞాపింపబడినట్టి, భీమవిక్రమాః =

భయంకర పరాక్రమముగల్గిన, రాక్షసాః = రాక్షసులు, అనుగచ్ఛేయుః = వెంబడింతురు.

తాత్పర్యము :- నీవు నన్ను గొనిపోవుటను జూచి రావణుడు ఆజ్ఞాపింపగా భయంకరులైన రాక్షసులు వెంటనే మనలను తప్పక వెంబడింతురు.

శ్లో॥ తై స్త్వం పరివృత శ్శూరై శ్శూలముద్గరపాణిభిః,
భవే స్త్వం సంశయం ప్రాప్తో మయా వీర కళత్రవాన్. 50

పదచ్ఛేదము :- తైః - త్వం - పరివృతః - శూరైః - శూలముద్గరపాణిభిః, భవేః - త్వం - సంశయం - ప్రాప్తః - మయా - వీర - కళత్రవాన్॥.

అన్వయక్రమము :- శూలముద్గరపాణిభిః తైః శూరైః పరివృతః కళత్రవాన్ త్వం మయా సంశయం ప్రాప్తః భవేః.

ప్రతిపదార్థము :- శూలముద్గరపాణిభిః = శూలములు ముద్గరములు చేతియందు గలిగినట్టి తైః శూరైః = ఆ శూరులచే, పరివృతః = చుట్టుముట్టబడిన, త్వం = నీవు, మయా = నా చేత, కళత్రవాన్ = కళత్రవంతుడవుగా, సంశయం ప్రాప్తః = సంశయము నొందినవాడవు, భవేః = కాగలవు.

తాత్పర్యము :- శూలములు ముద్గరములు చేతబట్టి వచ్చిన ఆ రాక్షసులు నిన్ను చుట్టుముట్టి నాతోగూడ నున్న నిన్ను కళత్రవంతుడవను సందేహమునే పొందెదరు.

శ్లో॥ సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసా స్త్వం నిరాయుధః,
కథం శక్ష్యసి సంయాతుం మాంచైవ పరిరక్షితుమ్. 51

పదచ్ఛేదము :- సాయుధాః - బహవః - వ్యోమ్ని-రాక్షసాః- త్వం - విరాయుధః - కథం - శక్ష్యసి - సంయాతుం - మాం - చ - ఏవ - పరిరక్షితుమ్॥.

అన్వయక్రమము :- రాక్షసాః బహవః, సాయుధాః, త్వం విరాయుధః వ్యోమ్ని సంయాతుం, మాం పరిరక్షితుంచ కథం శక్ష్యసి?.

ప్రతిపదార్థము :- రాక్షసాః = రాక్షసులు, బహవః = పెక్కు మంది, సాయుధాః = ఆయుధములు గల్గియున్నవారు, త్వం = నీవు, నిరాయుధః = ఆయుధములు లేనివాడవు, వ్యోమ్ని = ఆకసమునందు, సంయాతుం = పోరుటకును, మాం = నన్ను, పరిరక్షితుంచ = కాపాడుటకును, కథం = ఎట్లు, శక్ష్యసి = చాలుదువు?

తాత్పర్యము :- మనలను వెంబడించు రాక్షసులు చూడగా పెక్కుమంది యుందురు. పైగా వారు ఆయుధములను ధరించియుందురు నీవన్ననో ఒంటరివి, మిదుమిక్కిలి నిరాయుధుడవు. అట్టి నీవు అయాకాశమునందు వారందరితో నెట్లుపోరాడగలవు? నన్నెట్లు రక్షింపగలవు?

శ్లో॥ యుధ్యమానస్య రక్షోభి స్తత స్తైః క్రూరకర్మభిః,
ప్రపతేయంహి తే పృష్ఠా ద్భయార్తా కపిసత్తమ. 52

పదచ్ఛేదము :- యుద్ధ్యమానస్య - రక్షోభిః - తతః - తైః- క్రూరకర్మభిః - ప్రపతేయం - హి - తే - పృష్ఠాత్ - భయార్తా - కపిసత్తమ॥.

అన్వయక్రమము :- కపిసత్తమః తతః క్రూరకర్మభిః తైః రక్షోభిః యుద్ధ్యమానస్యతే పృష్ఠాత్ భయార్తా ప్రపతేయంహి॥.

ప్రతిపదార్థము :- కపిసత్తమః = ఓ వానరోత్తమా అథ = పిమ్మట, క్రూరకర్మభిః = క్రూర చేష్టలు గలిగినట్టి, తైః రక్షోభిః = ఆ రాక్షసులతో, యుధ్యమానస్య = యుద్ధము చేయుచున్నట్టి తే - నీ యొక్క పృష్ఠాత్ = వీపుమీదనుండి, భయార్తా = భయపీడితురాలనై ప్రపతేయం హి = పడిపోవుదునుగదా.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! పరమ క్రూరులైనట్టి ఆ రాక్షస యోధులతో నీవు పోరాడు చుండగా నీ వీపుమీదనుండి నేను భయ కంపితురాలనై క్రిందికి పడిపోవుదునుగదా.

శ్లో॥ అథ రక్షాంసి భీమాని మహాంతి బలవంతిచ,
కథంచి త్సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ. 58

పదచ్ఛేదము :- అథ - రక్షాంసి - భీమాని - మహాంతి - బలవంతి - చ - కథంచిత్ - సాంపరాయే - త్వాం - జయేయుః - కపిసత్తమః.

అన్వయక్రమము :- కపిసత్తమ! భీమాని, మహాంతి, బలవంతి చ రక్షాంసి అథ సాంపరాయే త్వాం కథంచిత్ జయేయుః.

ప్రతిపదార్థము :- కపిసత్తమః = ఓ వానరోత్తమా!, భీమాని = భీకరులును, మహాంతి = పెద్దవారును, బలవంతిచ = బలాఢ్యులును అగు, రక్షాంసి = రాక్షసులు, అథ = పిమ్మట, సాంపరాయే = యుద్ధమునందు, త్వాం = నిన్ను, కథంచిత్ = ఎట్లో, జయేయుః = జయింతురు.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! మహాభయంకరులును నీకంటె పెద్దవారును బలాఢ్యులును అగు ఆరక్కసులు ఆటుపిమ్మట జరుగు యుద్ధమునందు ఎట్టి మాయోపాయముతో నైన నిన్ను జయించవచ్చును.

శ్లో॥ అథవా యుద్ధ్యమానస్య పతేయం విముఖస్య తే,
పతితాంచ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః.౫౪

పదచ్ఛేదము :_ అథవా - యుద్ధ్యమానస్య - పతేయం - విముఖస్య - తే - పతితాం - చ - గృహీత్వా - మాం - నయేయుః - పాపరాక్షసాః॥

అన్వయక్రమము :_ అథవా యుద్ధ్యమానస్య విముఖస్య తే (పృష్ఠాత్ అహం) పతేయం, పాపరాక్షసాః పతితాం మాం గృహీత్వా నయేయుః చ॥.

ప్రతిపదార్థము :_ అథవా = లేక, యుద్ధ్యమానస్య = యుద్ధము చేయుచున్న, విముఖస్య = ప్రక్కకుతిరిగియున్నట్టి, తే = నీ యొక్క, (పృష్ఠాత్ = వీపునుండి) (అహం = నేను) పతేయం = పడి పోవచ్చును, పాపరాక్షసాః = పాపాత్ములైన రక్కసులు, పతితాం = పడిపోయినట్టి, మాం = నన్ను, గృహీత్వా = పట్టుకొని, నయేయుఃచ = తీసికొని పోవుదురు కూడను.

తాత్పర్యము :_ ఆ జయించు మాట ఎట్లున్నను వారితో నీవు పోరాడుచు ప్రక్కకు తిరిగి యున్నప్పుడు నీ వీపుమీద నుండి నేను క్రిందికి పడిపోవుదును. అట్లు పడిపోవగనే పాపాత్ములైన రాక్షసులు వెంటనే నన్ను బంధించి తీసికొని పోవుదురు.

శ్లో॥ మాంవా హరేయు స్త్వద్ధస్తా ద్విశసేయు రథాపివా,
అనవస్థౌహి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ. ౫౫

పదచ్ఛేదము :_ మాం - వా - హరేయుః - త్వద్ధస్తాత్ - విశసేయుః - అథ - అపి - వా - అనవస్థౌ - హి - దృశ్యేతే - యుద్ధే - జయపరాజయౌ॥.

అన్వయక్రమము :— వా త్వద్ధస్తాత్ మాం హరేయుః, అథాపివా, (మాం) విశసేయుః, యుద్ధే జయపరాజయౌ అనవస్థౌ దృశ్యేతేహి॥

ప్రతిపదార్థము :— వా = లేక, త్వదస్తాత్ = నీ చేతినుండి, మాం = నన్ను, హరేయుః = లాగికొనిపోవుదురు అథాపివా = మఱియును, (మాం = నన్ను) విశసేయుః = ఖండించెదరు, యుద్ధే = యుద్ధమునందు, జయపరాజయౌ = జయాపజయములు, అనవస్థౌ = అనిశ్చితములుగా, దృశ్యేతేహి = కాన్పించునుకదా॥

తాత్పర్యము :— ఆ రక్కసులు నీ చేతినుండి నన్ను బలవంతముగా లాగికొని పోయి వెంటనే ముక్కలుగా ఖండించి వేయవచ్చును, లోకమున యుద్ధమునందు జయాప జయములు నిశ్చయింప రానివిగదా॥

శ్లో॥ అహంవాపి విపద్యేయం రక్షోభి రభితర్జితా,
త్వత్ప్రయత్నో హరిశ్రేష్ఠ భవే న్నిష్ఫలఏవతు 56

పదచ్ఛేదము :— అహం-వా- అపి-విపద్యేయం - రక్షోభిః - అభితర్జితా - త్వత్ప్రయత్నః - హరిశ్రేష్ఠ - భవేత్ - నిష్ఫలః-ఏవ-తు॥

అన్వయక్రమము :— అహం రక్షోభిః అభితర్జితా విపద్యేయం వా అపి, హరిశ్రేష్ఠః తు త్వత్ప్రయత్నః నిష్ఫలః ఏవ భవేత్॥

ప్రతిపదార్థము :— అహం = నేను, రక్షోభిః = రాక్షసులచే, అభితర్జితా = బెదరింపబడిన దాననై, విపద్యేయం వా అపి = నశించిపోవుదును కూడ, హరిశ్రేష్ఠః = వానరశ్రేష్ఠుడా॥ తు = అప్పుడు, త్వత్ప్రయత్నః = నీ ప్రయత్నము, నిష్ఫలః ఏవ = వ్యర్థమైనదియే, భవేత్ = కాగలదు॥

తాత్పర్యము :— నేను ఆ రాక్షసులచే బహు విధములుగ హింసింపబడిన దాననై నాశము నొందవచ్చును గూడను, వానరోత్తమా॥ అప్పుడు నీ ప్రయాసమంతయును నిష్ఫలమే అయిపోవునుగదా॥

శ్లో॥ కామం త్వమసి పర్యాప్తో నిహంతుం సర్వరాక్షసాన్,
రాఘవస్య యశో హీయేత్ త్వయా శస్త్రైస్తు రాక్షసైః

పదచ్ఛేదము :- కామం - త్వం - అసి - పర్యాప్తః నిహంతుం - సర్వరాక్షసాన్ - రాఘవస్య - యశః - హీయేత్ - త్వయా - శస్త్రైః - తు - రాక్షసైః॥

అన్వయక్రమము :- త్వం సర్వరాక్షసాన్ నిహంతుం కామం పర్యాప్తః, అపితు రక్షస్సైః త్వయా శస్త్రైః (నద్భిః) రాఘవస్య యశః హీయేత్॥.

ప్రతిపదార్థము :- త్వం = నీవు, సర్వరాక్షసాన్ = సమస్త రాక్షసులను, విహంతుం = పరిమార్చుటకు, కామం = కావలసినంతగా, పర్యాప్తః = తగియున్నావు, అపితు = కాని, రాక్షసైః = రాక్షసులు, త్వయా = నీచేత, శస్త్రైః (నద్భిః) = వధింపబడినవారుకాగా, రాఘవస్య= శ్రీరాముని యొక్క, యశః = కీర్తి, హీయేత్ = క్షీణించును

తాత్పర్యము :- ఈ రాక్షసుల నెల్లరను పరిమార్చుటకు నీ వెంతయును సమర్థుడవే యైయున్నావు గాని రాక్షసులు నీ చేతనే వధింప బడినచో శ్రీరాముని కీర్తికి భంగము వాటిల్లునుగదా।

శ్లో॥ అథవా ఉఊదాయ రక్షాంసి న్యసేయు స్సంవృతే హి మామ్,
యత్ర తే నాభిజానీయు ర్హరయో నాపి రాఘవః, 58

పదచ్ఛేదము :- అథవా - అదాయ - రక్షాంసి - న్యసేయుః - సంవృతే - హి - మామ్ - యత్ర - తే - న - అభిజానీయుః - హరయః - న - అపి - రాఘవః॥.

అన్వయక్రమము :- అథవా రక్షాంసి మాం ఆదాయ యత్రతే హరయః, రాఘవః అపి న అభిజానీయుః (తత్ర) సంప్రతే న్యసేయుః.

ప్రతిపదార్థము :- అథవా = లేక, రక్షాంసి = రాక్షసులు, మాం = నన్ను, ఆదాయ = తీసికొని, యత్ర = ఎచ్చటనైతే, తేహరయః = ఆ వానరులును, రాఘవః అపి = శ్రీరాముడును గూడ, న అభిజానీయుః = గుర్తింపలేకుందురో, (తత్ర = అట్టి) సంప్రతే = గూఢమైనట్టిచోట, న్యసేయుః = ఉంచెదరు.

తాత్పర్యము :- లేక రాక్షసులు నన్ను గొనిపోయి వానరులెవ్వరును గాని శ్రీరాముడుగాని కనిపెట్టజాలనట్టి అతి రహస్యమైన ప్రదేశమునందు నన్ను దాచి యుంచెదరు.

శ్లో॥ ఆరంభస్తు మదర్థో౽యం తత స్తవ నిరర్థకః,
త్వయాహి సహ రామస్య మహా నాగమనే గుణః. 59

పదచ్ఛేదము :- ఆరంభః - తు - మదర్థః - అయం - తతః - తవ - నిరర్థకః - త్వయా - హి - సహ - రామస్య - మహాన్ - ఆగమనే - గుణః॥.

అన్వయక్రమము :- తతః మదర్థః అయం తవ ఆరంభః నిరర్థకః (భవేత్) త్వయా సహ రామస్య ఆగమనే మహాన్ గుణః (స్యాత్) హి॥.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, మదర్థః = నా కొఱకైనట్టి, అయం = ఈ, తవ = నీ యొక్క, ఆరంభః = ప్రయత్నము, నిరర్థకః = నిష్ఫలము, భవేత్ = అగును. త్వయాసహ = నీతోగూడ, రామస్య = రాముని యొక్క, ఆగమనే = రాకలో, మహాన్ = గొప్పదైన, గుణః = మేలు, (స్యాత్) హి = (ఉండును) సుమా.

తాత్పర్యము :— నా కొఱకై నీవు పడినశ్రమ అంతయును విఫలమై పోవునుగదా! అందుచేత నీతో గూడ శ్రీరాముడు లంకకు వచ్చుటలోనే ఎంతయో క్షేమ మున్నది.

శ్లో॥ మయి జీవిత మాయత్తం రాఘవ స్యామితౌజసః,
భ్రాతౄణాంచ మహాబాహో తవ రాజకులస్యచ, 60

పదచ్ఛేదము :— మయి - జీవితం - ఆయత్తం - రాఘవస్య - అమితౌజసః - భ్రాతౄణాం - చ - మహాబాహో - తవ - రాజకులస్య - చ॥.

అన్వయక్రమము :— మహాబాహో! అమితౌజసః రాఘవస్య భ్రాతౄణాంచ, తవ, రాజకులస్య చ జీవితం మయి ఆయత్తమ్॥.

ప్రతిపదార్థము :— మహాబాహో! = మహావీరుడా! అమితౌజసః = అమిత పరాక్రమము గలిగినట్టి రాఘవస్య = శ్రీరాముని యొక్కయు, భ్రాతౄణాం చ = సోదరుల యొక్కయును, తవ = నీ యొక్కయు, రాజకులస్య చ = సుగ్రీవుని కుటుంబము యొక్కయు! జీవితం = జీవితము, మయి = నా యందు, ఆయత్తం = అధీనమైనది.

తాత్పర్యము :— ఓ మహావీరుడా! మహాపరాక్రమ సంపన్ను డైన శ్రీరాముని యొక్కయు అతని సోదరుల యొక్కయు, నీ యొక్కయు సుగ్రీవుని వంశము యొక్కయు జీవితము లన్నియును నా క్షేమము మీదనే ఆధారపడి యున్నవిగదా!

శ్లో॥ తౌ నిరాశౌ మదర్థంచ శోకసంతాపకర్శితౌ,
సహాసర్వర్క్ష హరిభి స్త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్. 61

పదచ్ఛేదము :— తౌ - నిరాశౌ - మదర్థం - చ - శోకసంతాప కర్శితౌ - సహ - సర్వర్క్షహరిభిః - త్యక్ష్యతః - ప్రాణసంగ్రహమ్॥

అన్వయక్రమము :— మదర్థం శోకసంతాపకర్శితౌ తౌ నిరాశౌ (సన్తౌ) సర్వర్క్షహరిభిః సహ ప్రాణసంగ్రహం త్యక్ష్యతః॥.

ప్రతిపదార్థము :— మదర్థం = నా కొఱకు, శోకసంతాపకర్శితౌ = దుఃఖము చేతను పరితాపము చేతను పీడింపబడినట్టి, తౌ = వారిరువురును, నిరాశౌసన్తౌ = నిరాశ నొందినవారై, సర్వర్క్షహరిభిః సహ = సమస్తమైన భల్లూకములతోడను వానరులతోడను గూడ, ప్రాణసంగ్రహం = ప్రాణధారణమును, త్యక్ష్యతః = విడుతురు.

తాత్పర్యము :— నా నిమిత్తమైన దుఃఖముతోడను సంతాపము తోడను కృశించియున్నట్టి ఆ సోదరు లిరువురును నిరాశాపూరితులై తమ పరివారము నందలి సమస్త భల్లూకములతోడను వానరులతోడను గూడ ప్రాణములను విడిచి పెట్టుదురు.

శ్లో॥ భర్తృభక్తిం పురస్కృత్య రామా దన్యస్య వానర,
నాహం స్ప్రష్టుం స్వతో గాత్ర మిచ్ఛేయం వానరోత్తమ॥

పదచ్ఛేదము :— భర్తృభక్తిం - పురస్కృత్య - రామాత్ - అన్యస్య - వానర - న - అహం - స్ప్రష్టుం - స్వతః - గాత్రం - ఇచ్ఛేయం - వానరోత్తమ॥.

అన్వయక్రమము :— వానర! వానరోత్తమ! భర్తృభక్తిం పురస్కృత్య స్వతః అహం రామాత్ అన్యస్య గాత్రం స్ప్రష్టుం న ఇచ్ఛేయమ్॥.

ప్రతిపదార్థము :— వానర, వానరోత్తమ = వానరోత్తముడైన ఓ హనుమా!, భర్తృభక్తిం = నాధునియందలి భక్తిని, పురస్కృత్య = పురస్కరించుకొని, స్వతః = స్వయముగా, అహం = నేను, రామాత్ - శ్రీరామునికంటె, అన్యస్య = వేఱైనట్టి వానియొక్క, గాత్రం = శరీరమును, స్ప్రష్టుం = తాకుటకు, న ఇచ్ఛేయం = ఇచ్ఛగించను.

తాత్పర్యము :— ఓ వానరోత్తమా! నా భర్తృభక్తిని అనుసరించి నాయంతటనేను ఎన్నడును రఘురాముని తప్ప వేఱెవ్వని శరీరమును స్పృశింప బోవను సుమా!

శ్లో॥ య దహం గాత్రసంస్పర్శం రావణస్య గతా బలాత్,
అనీశా కిం కరిష్యామి వినాథా వివశాసతీ॥ 63

పదచ్ఛేదము :— యత్ - అహం - గాత్రిసంస్పర్శం - రావణస్య - గతా - బలాత్ - అనీశా - కిం - కరిష్యామి - వినాధా - వివశా - సతీ॥.

అన్వయక్రమము :— బలాత్ యత్ రావణస్య గాత్రిసంస్పర్శం అహం గతా (తత్) అనీశా వినాధా, వివశా (సతీ) కృతవతీ; కిం కరిష్యామి?.

ప్రతిపదార్థము :— బలాత్ = బలవంతముగా, అహం = నేను, యత్ = ఏ, రావణస్య = రావణుని యొక్క, గాత్రిసంస్పర్శం = శరీరస్పర్శను, గతా = పొందియుంటినో, (తత్ = అది) అనీశా = అసమర్థురాలను, వినాధా = రక్షణ హీనురాలను, వివశా = చేష్టారహితురాలను (సతీ=అగుచు కృతవతీ = చేసితిని) కిం కరిష్యామి = ఏమి చేయగలను?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— అనీశా - స్త్రీ నైయుండుట చేత అసమర్థురాలను. వినాధా - దూరమునందుండి పోయిన రామలక్ష్మణులు గలదానను.

వాసుదాసస్వామి :— రామచంద్రమూర్తి యొక్కడే పురుషుడు తక్కిన వారందరును స్త్రీలని యభిప్రాయము.

"స ఏవ వాసుదేవోఽయం సాక్షాత్పురుష ఉచ్యతే॥
స్త్రీప్రాయ మితరత్సర్వం జగద్బ్రహ్మ పురస్సరమ్"

కావున జీవాత్మ భగవంతునితో సాయుజ్యము నొందినవే ఆనందము గలదు. గాని బ్రహ్మాదులతో సాయుజ్యము గలిగిన మరల జన్మింప వలసినదే, మరల దుఃఖింపవలసినదే.

తాత్పర్యము :- అనాడు బలాత్కారము గావింపబడి-మూర్ఛ బోయి పరాధీననై యుండి రావణుని గాత్రస్పర్శను బొందిన మాట నిజమే. అత్తఱి నేను అసమర్థురాలను, రక్షణ హీనురాలను, చేష్టలను గోల్పోయి యున్న దానను కాబట్టి అంతకంటె నేను అనాడు వేమి చేయగలను?

శ్లో॥ యది రామో దశగ్రీవ మిహ హత్వా సరాక్షసమ్,
మా మితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్.64

పదచ్ఛేదము :- యది - రామః - దశగ్రీవం - ఇహ - హత్వా - సరాక్షసమ్, - మాం - ఇతః - గృహ్య - గచ్ఛేత - తత్ - తస్య - సదృశం - భవేత్॥.

అన్వయక్రమము :- రామః ఇహ సరాక్షసం దశగ్రీవం హత్వా ఇతః మాం గృహ్య గచ్ఛేతయది తత్ తస్య సదృశం భవేత్॥.

ప్రతిపదార్థము :- రామః = శ్రీరాముడు, ఇహ = ఇచ్చట, సరాక్షసం = రాక్షసులతో గూడినట్టి, దశగ్రీవం= దశకంఠుని, హత్వా = పరిమర్చి, ఇతః = ఇటనుండి, మాం = నన్ను, గృహ్య = తీసికొని, గచ్ఛేత యది = వెళ్ళినయెడల, తత్ = అది, తస్య = అతనికి, సదృశం = యుక్తమైనది, భవేత్ = కాగలదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- "తత్ సదృశంభవేత్" - రాక్షసు లందఱితోడను కలిపి రావణుని నిర్మూలించి తనను గొనిపోవుట జరిగినప్పుడే శ్రీరాముని

అవతార ప్రయోజనము నెఱవేఱినట్లగును గదా! అట్లుగాక సీతమ్మయే రాముని వద్దకు ఎట్లో చేరినచో తానుపూనిన కార్యము నెఱవేఱనందున అతనికి కోపముగూడ గలుగవచ్చునని భావము.

వాసుదాసస్వామి :- ఇందు ఆత్మనిక్షేపము పారతంత్ర్యము స్పష్టముగా చెప్పబడెను. ప్రపన్నుడు భగవత్ప్రాప్తికి ఉపాయముగా భక్తి యోగము, కర్మయోగము, జ్ఞానయోగము మున్నగు సాధనములను దేనిని అవలంబక భగవత్ప్రాప్తికి భగవంతుడే సాధనము, అయనయే వచ్చినన్ను తీసికొని పోవలెనని కోరును. వానికి భగవంతుని.

"అహం స్మరామి మద్భక్తం: నయామి పరమాంగతిమ్
'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి'
'అభయం సర్వభూతేభ్యో దదామి" యను

వాక్యములే యూతకోలలు. భగవంతుని తప్ప వేఱొకదేవత నాశ్ర యించిన ప్రపత్తిచెడును, ఫలింపదు. పారతంత్ర్యము వదలిన ప్రపన్నుని భగవంతుడు స్వీకరింపడు. కావున ప్రపన్ను లన్నివిధముల అనన్యులై యుండవలెను.

తాత్పర్యము :- రాక్షస బలములతో సహితముగా రావణుని నిర్మూలించి శ్రీరాముడు నన్ను లంకనుండి గొనిపోయినప్పుడే అతని ఘనతకు తగినట్లుగా తన కర్తవ్యము నెఱవేర్చినట్లగును.

శ్లో॥ శ్రుతాశ్చ దృష్టాహి మయా పరాక్రమా,
మహాత్మన స్తస్య రణావమర్దినః,
న దేవగంధర్వభుజంగరాక్షసా,
భవంతి రామేణ సమా హి సంయుగే, ౬౫

పదచ్ఛేదము :- శ్రుతాః - చ - దృష్టాః - హి - మయా - పరాక్రమాః - మహాత్మనః - తస్య - రణావమర్దినః, - న - దేవగంధర్వ భుజంగ రాక్షసాః - భవంతి - రామేణ - సమాః-హి- సంయుగే,

అన్వయక్రమము :— మయా రణావమర్దినః తస్య మహాత్మనః పరాక్రమాః శ్రుతాః చ, దృష్టాః హి; సంయుగే రామేణ దేవగంధర్వ భుజంగ రాక్షసాః సమాః న భవంతి హి॥.

ప్రతిపదార్థము : మయా = నా చేత, రణావమర్దినః = యుద్ధమునందు శత్రువులను హతమార్చునట్టి, తస్య మహాత్మనః = ఆ మహాత్ముని యొక్క, పరాక్రమాః = పరాక్రమములు, శ్రుతాః చ = వినబడినవి గూడను, దృష్టాః హి = చూడబడినవి కూడను గదా! రామేణ = శ్రీరామునితో, సంయుగే = యుద్ధమునందు, దేవగంధర్వ భుజంగ రాక్షసాః = దేవతలును, గంధర్వులును, నాగులును, రాక్షసులును సమాః = సరియగువారు, న భవంతి హి = కాజాలరు గదా!

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— శ్రుతాః చ - విశ్వామిత్ర యాగరక్షణము తాటకవధ మున్నగు రఘురాముని పరాక్రమములు వినబడినవి. దృష్టాః = ఖరదూషణాది సంహారము మున్నగు పరాక్రమములు స్వయముగా చూడబడినవి.

వాసుదాసస్వామి :— భక్తవశు డున్నాడను భగవంతుడు తన పాలిట గలడనుటకు అనేక నిదర్శనము లనుభవమున తెలియుచుండును. బాల కాండమున బ్రహ్మరుద్రేంద్రాదుల శరణాగతి, యుద్ధకాండమున బ్రహ్మాదుల స్తుతి మున్నగునవి యన్నియును భగవంతుడగు శ్రీరామచంద్రమూర్తియే తక్కిన యందరి దేవతలకంటె గొప్పవాడని స్థాపించుచున్నవి.

తాత్పర్యము :— యుద్ధమునందు శత్రువిధ్వంసకుడై యుండు ఆ మహాత్ముని పరాక్రమ విశేషము లెన్నియో నేను విని యుంటిని; ఇక ఎన్నియో నేను కన్నులార జూచియుంటిని; యుద్ధమున దేవతలందును గంధర్వులందును, నాగులందును రాక్షసులందును ఎందును రామునితో సాటివచ్చు వీరులుండరు సుమా!

శ్లో॥ సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకం,
మహాబలం వాసవతుల్యవిక్రమమ్।
సలక్ష్మణం కో విషహేత రాఘవం,
హుతాశనం దీప్తమి వానిలేరితమ్. ౮౮

పదచ్ఛేదము :— సమీక్ష్య-తం - సంయతి - చిత్రకార్ముకం- మహాబలం - వాసవతుల్యవిక్రమమ్ - సలక్ష్మణం - కః - విషహేత - రాఘవం - హుతాశనం - దీప్తం - ఇవ - అనిలేరితమ్.

అన్వయక్రమము :— సంయతి చిత్రకార్ముకం మహాబలం వాసవతుల్యవిక్రమం అనిలేరితం దీప్తం హుతాశనం ఇవ (స్థితం) సలక్ష్మణం రాఘవం సమీక్ష్య కః విషహేత?

ప్రతిపదార్థము :— సంయతి = యుద్ధమునందు చిత్రకార్ముకం = బహువిధ వర్ణములతో ప్రకాశించు ధనుస్సు గలవాడును, మహాబలం = మహాబలాఢ్యుడును, వాసవతుల్యవిక్రమం = దేవేంద్రునితో సమానమైన పరాక్రమము గలవాడును, అనిలేరితం = వాయువుచే రగుల్కొల్పబడిన, దీప్తం = ప్రజ్వలించిన, హుతాశనం ఇవ=అగ్నివలె, స్థితం = ఉన్నవాడునగు, సలక్ష్మణం = లక్ష్మణునితో గూడినట్టి రాఘవం = శ్రీరాముని, సమీక్ష్య = చూచి, కః = ఎవ్వడు, విషహేత =సహింపగలడు?

తాత్పర్యము :— రణాంగణమునందు పలువన్నెలతో వెలయు విల్లు ధరించి దేవేంద్రునితో సమానమైన పరాక్రమమును ప్రదర్శించుచు వాయువుచే ప్రజ్వలించుచున్న అగ్ని దేవునివలె భీకరుడైన లక్ష్మణుడు వెంటనుండగా ఆ శ్రీరాముని ఎదుటనిలచి చూచుటకుగూడ ఎవ్వరికైన శక్యమగునా?

శ్లో॥ సలక్ష్మణం రాఘవ మాజిమర్దనం,
దిశాగజం మత్తమివ వ్యవస్థితమ్,

సహేత కో వానరముఖ్య సంయుగే,
యుగాంతసూర్యప్రతిమం శరార్చిషమ్. 67

పదచ్ఛేదము :- సలక్ష్మణం - రాఘవం - ఆజిమర్దనం - దిశాగజం - మత్తం - ఇవ - వ్యవస్థితమ్, - సహేత - కః - వానర ముఖ్య - సంయుగే - యుగాంత సూర్యప్రతిమం - శరార్చిషమ్॥

అన్వయక్రమము :- వానరముఖ్యః సంయుగే మత్తం దిశా గజం ఇవ వ్యవస్థితం, యుగాంత సూర్యప్రతిమం, శరార్చిషం, ఆజి మర్దనం, సలక్ష్మణం రాఘవం కః సహేత॥

ప్రతిపదార్థము :- వానరముఖ్య = వానరశ్రేష్ఠుడా! సంయుగే = యుద్ధమునందు, మత్తం = మదించినట్టి, దిశాగజం ఇవ = దిగ్గజమువలె, వ్యవస్థితం = నిలచియున్నవాడును, శరార్చిషం = బాణములనెడి జ్వాలలు కలిగినట్టి వాడును, యుగాంతసూర్యప్రతిమం = ప్రళయకాల సూర్యునితో సమానుడును, ఆజిమర్దనం = యుద్ధమున శత్రువులను హతమార్చువాడును అగు, సలక్ష్మణం = లక్ష్మణునితో గూడియుండు, రాఘవం = శ్రీరాముని, కః = ఎవ్వడు, సహేత = ఓర్వగలడు?

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడా! యుద్ధభూమియందు మదించిన ఏనుగువలె నిలచి తన బాణ జ్వాలలతో ప్రళయకాల సూర్యునివలె భయము గొల్పుచు, శత్రువులను లెక్కలేకుండ పరిమార్చుచు, మహావీరుడైన లక్ష్మణుని వెంటబెట్టుకొనియున్న ఆ శ్రీరాముని ఎదిరించుటకు ఎవనికి శక్తి యున్నది?

శ్లో॥ స మే కపిశ్రేష్ఠ సలక్ష్మణం ప్రియం
సయూథపం క్షిప్రమిహోపపాదయ,

చిరాయ రామం ప్రతి శోకకర్శితాం
కురుష్వ మాం వానరవీర హర్షితామ్. 68

ఇత్యార్షే శ్రీ మద్వాల్మీకి రామాయణే సుందరకాండే
సీతాప్రత్యానయనా నౌచిత్యం నామ
సప్తత్రింశ స్సర్గః

పదచ్ఛేదము :— సః - మే - కపిశ్రేష్ఠ - సలక్ష్మణం - ప్రియం - సయూథపం - క్షిప్రం - ఇహ - ఉపపాదయ, చిరాయ - రామం - ప్రతి - శోకకర్శితాం - కురుష్వ - మాం - వానరవీర - హర్షితామ్.

అన్వయక్రమము :— కపిశ్రేష్ఠః సః (త్వం) సయూథపం సలక్ష్మణం మే ప్రియం క్షిప్రం ఇహ ఉపపాదయ, వానరవీర! చిరాయ రామం ప్రతి శోకకర్శితాం మాం హర్షితాం కురుష్వ॥.

ప్రతిపదార్థము :— కపిశ్రేష్ఠః= వానరోత్తమా!, సః (త్వం)= అట్టినీవు, సయూథపం = సేనాధిపతులతోడను, సలక్ష్మణం = లక్ష్మణుని తోడను, మే ప్రియం = నా నాధుని, క్షిప్రం = శీఘ్రముగా, ఇహ = ఇటకు, ఉపపాదయ = రప్పింపుము, వానరవీర! = వానరయోధుడా!, చిరాయ = చిరకాలము, రామంప్రతి = శ్రీరామునిగూర్చి, శోకకర్శితాం= దుఃఖగ్రస్తురాలనైనట్టి, మాం = నన్ను, హర్షితాం = సంతోషమునొందిన దానినిగా, కురుష్వ = చేయుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— 'రామం ఉపపాదయ' శోకకర్శితాం హర్షితాం కురుష్వ - శోకకర్శితులకు రామ సాన్నిధ్యమే హర్షప్రాప్తి సాధనమగును అని ఇట సూచింపబడినది.

వాసుదాసస్వామి :— జీవాత్మ పరమాత్మలకు నడిమివా డాచార్యుడు. ఆచార్యుని మూలమున భగవత్ప్రాప్తి సుకరము, ఇది భక్

ప్రపన్నుల చర్య. లక్ష్మణ శబ్దము నిత్యశూరులకును సుగ్రీవ శబ్దము ముక్తులకు నుపలక్షణము. భగవంతుని వెదకుచు నేను పోలేను, ఆయనయే ఇచటికి వచ్చునట్లు చేయుమని శిష్యుడు గురువును ప్రార్థించవలెను.

తాత్పర్యము :— వానరశ్రేష్ఠుడా! నీవు వెంటనే సుగ్రీవాది వానరవీరులతోడను లక్ష్మణునితోడను కూడియున్న నా ప్రియుని ఇటకు గొనిరమ్ము. చిరకాలము రాముని ఎడబాటుచే శోకకర్శితు రాలనై యున్న నాకు ఆనందమును కూర్పుము.

ఇది శ్రీ మత్సుందర కాండమునకు 'సుబోధిని' యను ఆంధ్రి వివరణము నందు "సీతా ప్రత్యానయనా నౌచిత్యము" అను ముప్పదియేడవ సర్గము

శ్రీరామాయ నమః

శ్రీరామశరణ గురుభ్యో నమః

అష్టత్రింశ స్సర్గః

శ్లో॥ తత స్స కపిశార్దూల స్తేన వాక్యేన తోషితః,
సీతా మువాచ త చ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః. 1

పదచ్ఛేదము :— తతః - సః - కపిశార్దూలః - తేన - వాక్యేన - తోషితః - సీతాం - ఉవాచ - తత్ - శ్రుత్వా - వాక్యం - వాక్యవిశారదః.

అన్వయక్రమము :— తత్ శ్రుత్వా తేన వాక్యేన తోషితః, వాక్యవిశారదః, సః కపిశార్దూలః తతః సీతాం వాక్యం ఉవాచ.

ప్రతిపదార్థము :— తత్ శ్రుత్వా = అదివిని, తేన వాక్యేన = ఆ వచనముచే, తోషితః = సంతోషము కల్గింపబడినవాడై, వాక్యవిశా

రదః = వాక్పాటవముగల్గినట్టి, సః కపిశార్దూలః = ఆ వానరశ్రేష్ఠుడైన హనుమ, తతః = అటుపిమ్మట, సీతాం = సీతనుగూర్చి, వాక్యం ఉవాచ = ఈ మాటను పలికెను.

తాత్పర్యము :_ సీతాదేవి పలికిన మాటలువిని ఆ మాటలకు మిక్కిలి ఆనందించి యుక్తముగా మాటలాడుటయందు ప్రజ్ఞగలిగిన హనుమ ఆమెను గూర్చి ఇట్లు పలికెను.

శ్లో॥ యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే,
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్యచ. 2

పదచ్ఛేదము :_ యుక్తరూపం - త్వయా - దేవి - భాషితం - శుభదర్శనే - సదృశం - స్త్రీస్వభావస్య - సాధ్వీనాం - వినయస్య-చ.

అన్వయక్రమము :_ శుభదర్శనే! త్వయా స్త్రీస్వభావస్య, సాధ్వీనాం వినయస్యచ సదృశం, యుక్తరూపం భాషితమ్.

ప్రతిపదార్థము :_ శుభదర్శనే = మంగళకరమైన దర్శనము గల్గినట్టి, దేవి! = ఓ పూజ్యురాలా!, త్వయా = నీచేత, స్త్రీస్వభావస్య = స్త్రీలస్వభావమునకు, సాధ్వీనాం = పతివ్రతలయొక్క, వినయస్యచ = వినయమునకును, సదృశం = సరిగా, యుక్తరూపం = తగినట్లుగా, భాషితమ్ = పలుకబడినది.

తాత్పర్యము :_ మంగళప్రదమైన దర్శనముగల ఓ పూజ్యురాలా! ధీరస్వభావులైన స్త్రీలకును పాతివ్రత్య శోభితులైన వివయవతులకును తగినట్లుగా నీవు మాటలాడితివి సుమా!

శ్లో॥ స్త్రీత్వాన్న త్వం సమర్థాఽసి సాగరం వ్యతివర్తితుమ్,
మామధిష్ఠాయ విస్తీర్ణం శతయోజన మాయతమ్. 3

పదచ్ఛేదము :- స్త్రీత్వాత్ - న - త్వం - సమర్థా - అసి - సాగరం - వ్యతివర్తితుం - మాం - అధిష్ఠాయ - విస్తీర్ణం - శతయోజనం - ఆయతమ్॥.

అన్వయక్రమము :- మాం అధిష్ఠాయ శతయోజనం ఆయతం విస్తీర్ణం సాగరం వ్యతివర్తితుం స్త్రీత్వాత్ త్వం సమర్థా న అసి॥.

ప్రతిపదార్థము :- మాం = నన్ను, అధిష్ఠాయ = అధిరోహించి, శతయోజనం=నూఱామడల, ఆయతం = పొడవైనట్టి, విస్తీర్ణం= విశాలమైనట్టి, సాగరం = సముద్రమును, వ్యతివర్తితుం = దాటుటకు, స్త్రీత్వాత్ = ఆడుదానివగుటవలన, త్వం = నీవు, సమర్థా = శక్తురాలవు, న అసి = కావు.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- 'స్త్రీత్వం నతు సమర్థంహి' అని పాఠాంతరము. సముద్రము వలెనే మిక్కిలి విశాలమైయుండు నన్ను అధిరోహించికూడ సముద్రము దాటుటకు స్త్రీ సహజమైన నీ భయమును నీవు దాటలేకున్నావని భావము

తాత్పర్యము :- స్త్రీవి కాబట్టి నూఱామడల విస్తీర్ణమైన మహాసముద్రమును నా వీపుమీద కూర్చుండి దాటుటకు నీవు భయపడుచున్నావు.

శ్లో॥ ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే,
రామా దన్యస్య నార్హామి సంస్పర్శ మితి జానకి.
ఏత త్తే దేవి సదృశం పత్న్యా స్తస్య మహాత్మనః,
కా హ్యన్యా త్వామృతే దేవి బ్రూయా ద్వచన
మీదృశమ్. 4

పదచ్ఛేదము :- ద్వితీయం - కారణం - యత్ - చ - బ్రవీషి - వినయాన్వితే - రామాత్ - అన్యస్య - న-అర్హామి - సంస్పర్శం - ఇతి - జానకి - ఏతత్ - తే - దేవి - సదృశం - పత్న్యాః - తస్య - మహాత్మనః - కా - హి - అన్యా - త్వాం - ఋతే - దేవి - బ్రూయాత్ - వచనం - ఈదృశమ్.

అన్వయక్రమము :- వినయాన్వితే, దేవి! జానకి! రామాత్, అన్యస్య సంస్పర్శం న అర్హామి ఇతి ద్వితీయం యత్ కారణం బ్రవీషి, ఏతత్ మహాత్మనః తస్యపత్న్యాః తే సదృశమ్; దేవి! ఈదృశం వచనం త్వాం ఋతే అన్యాకా బ్రూయాత్‌హి?

ప్రతిపదార్థము :- వినయాన్వితే = వినయ సంపన్నురాలవై నట్టి, దేవి! = పూజ్యురాలవైన, జానకి! = ఓ సీతా, రామాత్ = రాముని కంటె, అన్యస్య = వేఱైనవానియొక్క, సంస్పర్శం = స్పర్శను, న అర్హామి = పొందదగను, ఇతి = అని, ద్వితీయం = రెండవదియైన, యత్ = ఏ, కారణం = కారణమును, బ్రవీషి = పలుకుచున్నావో, ఏతత్ = ఇది, మహాత్మనః = మహనీయుడైనట్టి, తస్య = ఆ శ్రీరామునకు, పత్న్యాః = భార్యవైనట్టి, తే = నీకు, సదృశం = తగియున్నది, దేవి! = ఓపూజ్యురాలా!, ఈదృశం = ఈ విధమైన, వచనం = మాటను, త్వాం = నిన్ను, ఋతే = తప్పించి, అన్యా = వేఱైన, కా = ఏస్త్రీ, బ్రూయాత్‌హి = పలుకగలదు?

తాత్పర్యము :- వినయ భూషణురాలవైన ఓ జానకిదేవీ, రామునితప్ప వేఱెవ్వరిని నేను తాకననెడి ఏ రెండవ కారణము నీవు చెప్పుచున్నావో అట్టి వచనము మహాత్ముడైన ఆ శ్రీరామునకు ధర్మపత్నివైన నీకెంతయు ఉచితమైయున్నదితల్లీ! ఇట్టి మాటను నీవు తప్ప వేఱెవ్వరు పలుకగలరు?

శ్లో॥ శ్రోష్యతే చైవ కాకుత్స్థః సర్వం నిరవశేషతః,
చేష్టితం యత్త్వయా దేవి భాషితం చ మమాగ్రతః. 6

పదచ్ఛేదము :- శ్రోష్యతే - చ - ఏవ - కాకుత్స్థః - సర్వం - నిరవశేషతః - చేష్టితం - యత్ - త్వయా - దేవి - భాషితం - చ - మమ - అగ్రతః.

అన్వయక్రమము :- దేవి! మమ అగ్రతః త్వయా యత్ చేష్టితం (యత్) భాషితం చ (తత్) సర్వం నిరవశేషతః కాకుత్స్థః (మత్తః) శ్రోష్యతే.

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా!, మమ = నా యొక్క, అగ్రతః = ఎదుట, త్వయా = నీచేత, యత్ = ఏది చేష్టితం = ఆచరింపబడినదో (యత్) = (ఏది) భాషితం చ = పలుకబడినదో (తత్) = అది), సర్వం = అంతయును, నిరవశేషతః = సంపూర్ణముగా, కాకుత్స్థః = శ్రీరాముడు, మత్తః = నావలన, శ్రోష్యతే = వినగలడు.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవింద రాజీయము :- త్వయా చేష్టితం - ఉరిపోసికొనుట మున్నగు కృత్యములను. భాషితం - రావణుని తృణీకరించి పలికిన మాటలను అని భావము.

తాత్పర్యము :- దేవి! దుఃఖగ్రస్తురాలవై నీవు చేసిన చేష్టలను, రావణునితో నిర్భయముగ నీవుపలికిన మాటలను, నాతో చెప్పిన వచనములను అన్నింటిని సంపూర్ణముగా నేను శ్రీరామునకు విన్నవించెదను.

శ్లో॥ కారణైర్బహుభిర్దేవి రామప్రియచికీర్షయా,
స్నేహప్రస్కన్న మనసా మయైతత్సముదీరితమ్. 7

పదచ్ఛేదము :- కారణైః - బహుభిః - దేవి - రామప్రియ చికీర్షయా - స్నేహప్రస్కన్నమనసా - మయా - ఏతత్ - సముదీరితమ్.

అన్వయక్రమము :- దేవి! రామప్రియచికీర్షయా బహుభిః కారణైః ఏతత్ స్నేహప్రస్కన్న మనసా మయా సముదీరితమ్.

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా!, రామప్రియచికీర్షయా = రామునకు ప్రియమును చేయవలెనను ఇచ్ఛతోడను, బహుభిః కారణైః = పెక్కుహేతువులచేతను, ఏతత్ = ఈ మాట, స్నేహప్రస్కన్నమనసా = స్నేహముచేద్రవించిన హృదయము గల్గినట్టి, మయా = నా చేత, సముదీరితమ్ = పలుకబడినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :- బహుభిఃకారణైః - నీ యొక్క దుఃఖ స్థితిని చూచుట మున్నగు కారణములచే.

తాత్పర్యము :- తల్లీ! నీ దుఃఖస్థితి చూచుట మున్నగు పెక్కు కారణముల చేతను, శ్రీరామునకు ప్రియమును గూర్చు కోరికతోడను, మీ యుభయులపైగల స్నేహ గౌరవముచే నా మనస్సు ద్రవించి యిట్లు పలికితిని.

శ్లో॥ లంకాయాం దుష్ప్రవేశత్వా ద్దుస్తరత్వా న్మహోదధేః।
సామర్థ్యా దాత్మనశ్చైవ మయైత త్సముదీరితమ్. ౮

పదచ్ఛేదము :- లంకాయాః - దుష్ప్రవేశత్వాత్ - దుస్తరత్వాత్ - మహోదధేః - సామర్థ్యాత్ - ఆత్మనః - చ - ఏవ - మయా - ఏతత్ - సముదీరితమ్.

అన్వయక్రమము :— లంకాయాః దుష్ప్రవేశత్వాత్, మహోదధేః దుస్తరత్వాత్, ఆత్మనః సామర్థ్యాత్ చ ఏవ ఏతత్ మయా సముదీరితమ్॥.

ప్రతిపదార్థము :— లంకాయాః = లంకానగరము, దుష్ప్రవేశత్వాత్ = ప్రవేశించుటకు కష్టమైన దగుట వలనను, మహోదధేః = మహాసముద్రము, దుస్తరత్వాత్ = దాటుటకు కష్టమైనదగుట వలనను, ఆత్మనః = నా యొక్క, సామర్థ్యాత్ చ ఏవ = ప్రజ్ఞవలనను మాత్రమే, ఏతత్ = ఈ మాట, మయా = నా చేత, సముదీరితమ్ = పలుకబడినది.

తాత్పర్యము :— ఈ లంకాపట్టణము సామాన్యులకు ప్రవేశింప రానిదగుటచేతను, ఈ మహాసముద్రము ఎల్లరకును దాటరానిదగుటచేతను నేనీ దుర్ఘట కార్యమును చేయగల సమర్థుడనై యుండుట చేతను మాత్రమే ఈ విధముగ పలికితినిగాని మరేమియుగాదు సుమా!

శ్లో॥ ఇచ్ఛామి త్వాం సమానేతు మద్యైవ రఘునందినా,
గురుస్నేహేన భక్త్యాచ నా న్యథేత దుదాహృతమ్ 9

పదచ్ఛేదము :— ఇచ్ఛామి - త్వాం - సమానేతుం - అద్య - ఏవ - రఘునందినా - గురుస్నేహేన - భక్త్యా - చ - న - అన్యథా - ఏతత్ - ఉదాహృతమ్॥.

అన్వయక్రమము :— రఘునందినా త్వాం అద్యఏవ సమానేతుం ఇచ్ఛామి; గురుస్నేహేన భక్త్యాచ ఏతత్ ఉదాహృతమ్; అన్యథా న.

ప్రతిపదార్థము :— రఘునందినా = రఘునందనుడైన శ్రీరామునితో, త్వాం = నిన్ను, అద్యఏవ = నేడే, సమానేతుం = చేర్చుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను, గురుస్నేహేన = గొప్పదైన అనురాగము

చేతను, భక్త్యాచ = భక్తిచేతను, ఏతత్ = ఇది, ఉదాహృతమ్ = చెప్పబడినది, అన్యథా = వేఱు విధముగా, న = కాదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'గురుస్నేహేన' - శ్రీరాముని యందలి స్నేహముచే, అన్యథా న - నా బలమునందలి గర్వము చేతనేనిట్లు పలుకలేదని భావము.

తాత్పర్యము :- తల్లీ! అ రఘునందనునితో నిన్ను ఈనాడే చేర్పవలెనను శీఘ్రమైన వాంఛ గలవాడనై రామునియందలి అనురాగము చేతను, భక్తి విశేషము చేతను మాత్రమే ఇట్లుపలికితిని. అంతకన్న వేఱు భావము ఏమియు నాకులేదు సుమా!

శ్లో॥ యది నోత్సహసే యాతుం మయాసార్థ మనిందితే,
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయా ద్రాఘవోహి యత్. 10

పదచ్ఛేదము :- యది - న - ఉత్సాహసే - యాతుం - మయా - సార్థం - అనిందితే, - అభిజ్ఞానం - ప్రయచ్ఛ - త్వం - జానీయాత్ - రాఘవః - హి - యత్॥.

అన్వయక్రమము :- అనిందితే! మయా సార్థం యాతుం న ఉత్సహసేయది, రాఘవః యత్ జానీయాత్ (తత్) అభిజ్ఞానం త్వం (మే) ప్రయచ్ఛ॥.

ప్రతిపదార్థము :- అనిందితే! = అనింద్య చరిత్రురాలవైన జానకీ!, మయా సార్థం = నాతో గూడ, యాతుం = పయనించుటకు, న ఉత్సహసేయది = ఇచ్ఛగింపని యెడల, రాఘవః = శ్రీరాముడు, యత్ = దేనినయితే, జానీయాత్ = తెలిసికొనగలడో, తత్ = అ, అభిజ్ఞానం = గుర్తును, త్వం = నీవు, మే = నాకు, ప్రయచ్ఛ = ఇమ్ము.

తాత్పర్యము :- ఓ పూజ్యురాలా, నా వెంబడి వచ్చుటకు నీ విష్టపడనియెడల శ్రీరాముడు చక్కగా గ్రహింపగలిగినట్టి గుర్తునొక దానిని నా కొసగుము.

శ్లో॥ ఏవ ముక్తా హనుమతా సీతా సురసుతోపమా,
ఉవాచ వచనం మందం బాష్పప్రగ్రథితాక్షరమ్. 11

పదచ్ఛేదము :- ఏవం - ఉక్తా - హనుమతా - సీతా - సుర సుతోపమా - ఉవాచ - వచనం - మందం - బాష్ప ప్రగథితాక్షరమ్॥.

అన్వయక్రమము :- హనుమతా ఏవం ఉక్తా సురసుతోపమా సీతా మందం బాష్పప్రగ్రథితాక్షరం వచనం ఉవాచ॥.

ప్రతిపదార్థము :- హనుమతా = హనుమచే, ఏవం = ఇట్లు, ఉక్తా = పలుకబడినట్టి, సురసుతోపమా = దేవకన్యలతో సాటియైనట్టి, సీతా = జానకి, మందం = నెమ్మదిగా, బాష్పప్రగ్రథితాక్షరం = కన్నీటిచే తో టుపడిన అక్షరములుగల, వచనం=మాటను, మందం = మెల్లగా, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- హనుమంతుడిట్లు పలుకగనే దేవకన్యలను బోలిన శుభలక్షణములు గలిగిన సీతాదేవి కన్నీటితో డగ్గుత్తిక పడిన కంఠముతో మెల్లగా ఇట్లు పలికెను.

శ్లో॥ ఇదం శ్రేష్ఠ మభిజ్ఞానం బ్రూయా స్త్వంతు మమ ప్రియమ్,
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్త రే పురా. 12
తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే,
తస్మిన్ సిద్ధాశ్రితే దేశే మందాకిన్యా హ్యదూరతః. 13

పదచ్ఛేదము :- ఇదం - శ్రేష్ఠం - అభిజ్ఞానం - బ్రూయాః - త్వం - తు - మమ - ప్రియమ్ - శైలస్య - చిత్రకూటస్య - పాదే-

పూర్వోత్తరే - పురా - తాపసాశ్రమవాసిన్యాః - ప్రాజ్యమూలఫలోదకే - తస్మిన్ - సిద్ధాశ్రితే - దేశే - మందాకిన్యాః - హి - అదూరతః.

అన్వయక్రమము :- పురా చిత్రకూటస్య శైలస్య పాదే, పూర్వోత్తరే, మందాకిన్యాః అదూరతః, ప్రాజ్యమూలఫలోదకే, తస్మిన్ సిద్ధాశ్రితే దేశే మమ తాపసాశ్రమవాసిన్యాః (సత్యాః) (మే) ప్రియం శ్రేష్ఠం ఇదం అభిజ్ఞానం త్వం బ్రూయాః.

ప్రతిపదార్థము :- పురా = పూర్వము, చిత్రకూటస్య = చిత్రకూటమనెడి, శైలస్య = పర్వతముయొక్క, పాదే = దిగువ ప్రదేశమున, పూర్వోత్తరే = ఈశాన్యమున, మందాకిన్యాః = మందాకినీ నదికి, అదూరతః = సమీపమున, ప్రాజ్యమూలఫలోదకే = సమృద్ధమైన మూలములను, ఫలములను, జలములను గలిగినట్టి, తస్మిన్ = ఆ సుప్రసిద్ధమైన, సిద్ధాశ్రితే = సిద్ధులచే ఆశ్రయింపబడినట్టి, దేశే = ప్రదేశమున, మమ = నేను, తాపసాశ్రమవాసిన్యాః (సత్యాః) = తాపసాశ్రమమునందు నివసించుచున్న దాననగుచుండగా, మే = నాకు, ప్రియం = ప్రియమైనట్టి, శ్రేష్ఠం = గొప్పదైనట్టి, ఇదం = ఈ, అభిజ్ఞానం = గుర్తును, త్వం = నీవు, బ్రూయాః = చెప్పుము.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- శ్రేష్ఠం అభిజ్ఞానం - ఇతరులెవ్వరికిని తెలియనందువలన శ్రీరామునికి నమ్మకము కలిగించుటలో శ్రేష్ఠమైనదని భావము.

గోవిందరాజీయము :- ప్రియం బ్రూయాః-నా ప్రియుడైన రాఘురాముని గూర్చి పలుకుము.

తాత్పర్యము :- పూర్వము చిత్రకూట పర్వతమునకు దిగువ ప్రదేశమున, ఈశాన్యదిక్కుగా ప్రవహించుచున్న మందాకినీ నదికి సమీ

పమున పుష్కలమైన కందమూల ఫలములు గలిగి సిద్ధపురుషులకు నీరు నిలయమైన ఆ పుణ్యభూమియందున్న తాపసాశ్రమమునందు నేను వసించు చుండగా జరిగినట్టి శ్రేష్ఠమైన ఈ గుర్తును నీవు నా ప్రియుడైన శ్రీరామునకు తెలుపుము.

శ్లో॥ త స్యోపవనషండేషు నానాపుష్పసుగంధిషు,
విహృత్య సలిలక్లిన్నా త వాంకే సముపావిశమ్. 14

పదచ్ఛేదము :- తస్య - ఉపవనషండేషు - నానాపుష్పసుగంధిషు - విహృత్య - సలిలక్లిన్నా - తవ - అంకే - సముపావిశమ్.

అన్వయక్రమము :- నానాపుష్పసుగంధిషు తస్య ఉపవనషండేషు విహృత్య సలిలక్లిన్నా (అహం) తవ అంకే సముపావిశమ్.

ప్రతిపదార్థము :- నానాపుష్పసుగంధిషు = బహువిధపుష్పముల యొక్క పరిమళములు గలిగినట్టి, తస్య = ఆ యాశ్రమము యొక్క, ఉపవనషండేషు = తోటలసమూహములందు, విహృత్య = విహరించి, సలిలక్లిన్నా = ౕటిచే తడిసినదాననై, అహం=నేను, తవ = నీ యొక్క, అంకే = ఒడియందు, సముపావిశమ్ = కూర్చుంటిని.

సూచన :- ఇటనుండి సీతమ్మ చెప్పుచున్న మాటలు శ్రీరామునితో తాను ప్రత్యక్షముగా చెప్పుచున్నట్లుగనే పలుకుచున్నదని తెలియవలెను.

వాసుదాసస్వామి :- నొక్కి చెప్పవలసిన దానిని రాముని సంబోధించియు, నితరవార్త హనుమంతుని సంబోధించియు అనుచున్న దని కాని, నాతో మాటలాడుచున్నను మనస్సంతయు నీ మీదనే యుండు టచే మైమఱచి నడుమ నడుమ నిన్ను సంబోధించెనని హనుమంతుడు రామునితో చెప్పుటకై యని కాని సీతమ్మ ఇట్లు పలికినదని యెఱుంగునది.

తాత్పర్యము :_ బహువిధములగు పుష్పముల పరిమళములతో నిండిన ఆ యాశ్రమము నందున్న ఉద్యానవనములందు చిరకాలము విహరించి అలసి చెమటచే తడిసిన దాననై నీయొడిలోనికి వచ్చి కూర్చుంటిని.

శ్లో॥ తతో మాంస సమాయుక్తో వాయసః పర్యతుండయత్,
త మహం లోష్ట ముద్యమ్య వారయామిస్మ వాయసమ్.

పదచ్ఛేదము :_ తతః - మాంససమాయుక్తః - వాయసః - పర్యతుండయత్ - తం - అహం - లోష్టం - ఉద్యమ్య - వారయామిస్మ - వాయసమ్.

అన్వయక్రమము :_ తతః మాంససమాయుక్తః వాయసః (మాం) పర్యతుండయత్. అహం లోష్టం ఉద్యమ్య తం వాయసం వారయామిస్మ.

ప్రతిపదార్థము :_ తతః = అటుపిమ్మట, మాంససమాయుక్తః = మాంసమునందు లోభము గలిగినట్టి, వాయసః = కాకి, (మాం = నన్ను) పర్యతుండయత్ = పొడిచినది, అహం = నేను, లోష్టం = మట్టి బెడ్డను, ఉద్యమ్య = ఎత్తి (తీసికొని) తం = ఆ, వాయసం = కాకిని, వారయామిస్మ = నివారించుచుంటిని.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :_ మాంససమాయుక్తః వాయసః-తననోటితో మాంసమును కలుచుకొన్న ఒక కాకి, మాం పర్యతుండయత్ _ఆ మాంసముతో నన్ను కొట్టినది.

మహేశ్వరతీర్థులు :_ మాం పర్యతుండయత్ -నాస్తన మధ్యమున తన ముక్కుతో పొడిచెను.

తాత్పర్యము :- అటుపిమ్మట మాంసమునందు వాంఛ గలిగి నట్టి ఒక కాకి నావొమ్మపై తన ముక్కుతో పొడిచినది. అంత నేనొక పట్టిబెడ్డను తీసికొని దానిని నివారించుచుంటిని.

శ్లో॥ దారయన్ సచ మాం కాక స్తత్రైవ పరిలీయతే,
న చాప్యుపారమ న్మాంసా ద్భక్షార్థీ బలిభోజనః. 16

పదచ్ఛేదము :- దారయన్ - సః - చ - మాం - కాకః - తత్రై - ఏవ - పరిలీయతే - న - చ - అపి - ఉపారమత్ - మాంసాత్ - భక్షార్థీ - బలిభోజనః

అన్వయక్రమము :- సః కాకః మాం దారయన్ తత్ర ఏవ పరిలీయతే, భక్షార్థీ (సః) బలిభోజనః మాంసాత్ న అపిచ ఉపారమత్.

ప్రతిపదార్థము :- సః కాకః = ఆ వాయసము, మాం = నన్ను, దారయన్ = పొడుచుచు, తత్ర ఏవ = అచ్చటనే, పరిలీయతే = దాగుకొనుచుండెను, భక్షార్థీ = భక్షణముకోరునట్టి, సః బలిభోజనః = ఆ వాయసము, మాంసాత్ = మాంసభక్షణమునుండి, నఅపిచ ఉపారమత్ = ఎంత మాత్రముగూడ విరమింపకుండెను.

తాత్పర్యము :- ఆ కాకి నన్నట్లు పొడుచుచు నేను వారించుచుండగా ప్రక్కకుపోయి దాగుకొనుచుండెను. అది నా మాంస భక్షణము నుండి ఎంత మాత్రము విరమింపకుండెను.

శ్లో॥ ఉత్కర్షంత్యాంచ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణి,
స్రంసమానేచ వసనే తతో దృష్టా త్వయా హ్యహమ్. 17

పదచ్ఛేదము :- ఉత్కర్షంత్యాం - చ - రశనాం - క్రుద్ధాయాం - మయి - పక్షిణి - స్రంసమానే - చ - వసనే - తతః - దృష్టా - త్వయా - హి - అహమ్.

అన్వయక్రమము :_ తతః మయి పక్షిణి క్రుద్ధాయాం, రశనాం ఉత్కర్షంత్యాంచ (సత్యాం) వసనే ప్రంసమానే (సతి) అహం త్వయా దృష్టా.

ప్రతిపదార్థము :_ తతః = అటుపిమ్మట, మయి = నేను, పక్షిణి = వాయసమునందు, క్రుద్ధాయాం = కోపించియున్నదానినై, రశనాం = మొలనూలును, ఉత్కర్షంత్యాంచ (సత్యాం) = పైకిత్తీయుచున్నదాన నగుచుండగా, వసనే = చీర, ప్రంసమానే సతి = జాఱిపోవుచుండగా, అహం = నేను, త్వయా = నీ చేత, దృష్టా = చూడబడితిని.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :_ "పక్షిణా ప్రస్యమానేచ వసనే" అని పాఠాంతరము - కాకిచే నా చీర లాగివేయబడగా అని అర్థము - "క్రుద్ధాయాం మయి పక్షిణే" అని తిలక సమ్మతమైన పాఠాంతరము.

తాత్పర్యము :- నేనే వాయసముపై కోపించి దానిని కొట్టుటకై నా మొలనూలును లాగుచుంటిని. అప్పటున నా చీర జాఱిపోవుచుండగా అట్టి యవస్థలో నున్న నన్ను నీవు కనులు తెఱచి చూచితివి.

శ్లో॥ త్వయా విహసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా,
భక్ష్యగృధ్నేన కాకేన దారితా త్వా ముపాగతా. 18

పదచ్ఛేదము :_ త్వయా - విహసితా - చ - అహం-క్రుద్ధా- సంలజ్జితా - తదా - భక్ష్యగృధ్నేన - కాకేన - దారితా - త్వం - ఉపాగతా.

అన్వయక్రమము :_ భక్ష్యగృధ్నేన కాకేన దారితా, అహం త్వాం ఉపాగతా: త్వయా విహసితా (సతి) సంలజ్జితా, క్రుద్ధాచ.

ప్రతిపదార్థము :— భక్ష్యగృద్ధ్నేన = మాంస భక్షణమున లోభముగల, కాకేన = కాకిచే, దారితా = పొడవబడినదాననై, అహం = నేను, త్వాం = నిన్ను, ఉపాగతా = చేరియుంటిని, తదా = అప్పుడు, త్వయా = నీ చేత, విహసితా (సతీ) = పరిహసింపబడిన దాననగుచు, సంలజ్జితా = సిగ్గుమబొందితిని, క్రుద్ధా చ = కోపించితిని కూడను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— 'భక్ష్యగృద్ధ్నేన దారితా త్వాం ఉపాగతా' కాకిచే పొడవబడి నిన్ను చేరితిని అనుటచే సీతాదేవి వాయసమును తఱుముచు కొంత దూరము పోయితిరిగి వచ్చి రాముని యొడిలో కూర్చున్నదని తెలియుచున్నది.

తాత్పర్యము :— అట్లు మాంసలోభియైన వాయసముచే పొడువబడినదాననై కోపముతో నీ యొద్దకు వచ్చియుంటిని. కాని నీ వప్పుడు నన్ను పరిహాసముతో చూడగా నాకు చాల సిగ్గును కోపమును కూడ గలిగినది.

శ్లో॥ తతః శ్రాంతాఽహ ముత్సంగ మాసీనస్య త వావిశమ్,
క్రుద్ధ్యంతీవ ప్రహృష్టేన త్వ యాహం పరిసాంత్వితా.19

పదచ్ఛేదము :— తతః - శ్రాంతా - అహం - ఉత్సంగం - ఆసీనస్య - తవ - అవిశమ్ - క్రుద్ధ్యంతీ - ఇవ - ప్రహృష్టేన - త్వయా - అహం - పరిసాంత్వితా.

అన్వయక్రమము :— తతః శ్రాంతా అహం ఆసీనస్య తవ ఉత్సంగం. అవిశమ్ క్రుద్ధ్యంతీ ఇవ (స్థితా) అహం ప్రహృష్టేన త్వయా పరిసాంత్వితా.

ప్రతిపదార్థము :— తదా = అటుపిమ్మట, శ్రాంతా = అలసి యున్నట్టి, అహం = నేను, ఆసీనస్య = కూర్చుండియున్నట్టి, తవ = నీ యొక్క, ఉత్సంగం = ఒడిని, అవిశమ్ = ప్రవేశించితిని, క్రుద్ధ్యంతీ ఇవ = కోపిదమునొందుచున్నట్లు, స్థితా = ఉన్నట్టి, అహం = నేను, ప్రహృష్టేన = సంతోషించియున్నట్టి, త్వయా= నీ చేత, పరిసాంత్వితా= ఓదార్చబడితిని.

తాత్పర్యము :— అప్పుడు నేను అలసిపోయి అచ్చటనే కూర్చుండియున్న నీ యొడిలోనికి చేరితిని. జరిగిన దానికి కోపముతోనున్న నన్ను నీవు సంతోషముతో ఓదార్చియున్నావు.

శ్లో॥ బాష్పపూర్ణ ముఖీ మందం చక్షుషీ పరిమార్జతీ,
లక్షితా ఽహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా.20

పదచ్ఛేదము :— బాష్పపూర్ణముఖీ - మందం - చక్షుషీ - పరిమార్జతీ - లక్షితా - అహం - త్వయా - నాథ - వాయసేన - ప్రకోపితా.

అన్వయక్రమము :— నాథ! వాయసేన ప్రకోపితా బాష్పపూర్ణ ముఖీ మందం చక్షుషీ పరిమార్జతీ త్వయా అహం లక్షితా.

ప్రతిపదార్థము :— నాథ = ప్రియుడా!, వాయసేన = కాక ముచే, ప్రకోపితా = కోపింపచేయబడినదాననై, బాష్పపూర్ణముఖీ = కన్నీటితోనిండిన ముఖముగలదాననై, మందం = మెల్లగా, చక్షుషీ = కన్నులను, పరిమార్జతీ = తుడుచుకొనుచున్నదానివిగా, త్వయా = నీ చేత, అహం = నేను, లక్షితా = చూడబడితిని.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— శ్రీరాముని ఒడిలో నుండగా వాయసము తనను పొడిచినప్పుడు దానిని తఱుముటకై సీతమ్మ ప్రయాసపడుచు అ

తఱమును తక్కము గానందులకు దుఃఖించుచుండగా శ్రీరాము డామెను పరిహాసము చేయుచు ఓదార్చెను. అవగా తన యొక్క రక్షణమునుగూర్చి తానే ప్రయాస పడుచున్నవాని యెడల పరమేశ్వరు డుపేక్షించును. రక్షణ భారము నాదిగాదు నీదేయను భావము గల్గినప్పుడు అతడే రక్షించునని ఈ వృత్తాంతముచే వెల్లడింప బడుచున్నది.

తాత్పర్యము :– రామా! వాయసముపై నేను కోపించి దానిని తఱుమలేనందులకు దుఃఖించుచు కన్నులమండి ఆ శోకబాష్పములను తుడుచుకొనుచుండగా నీవు నన్నప్పుడు అనురాగముతో చూచితివి.

శ్లో॥ పరిశ్రమాత్ప్రసుప్తా చ రాఘవాంకే ఽప్యహం చిరమ్,
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాంకే భరతాగ్రజః. 21

పదచ్ఛేదము :– పరిశ్రమాత్ - ప్రసుప్తా - చ - రాఘవాంకే - అస్మి - అహం - చిరమ్ - పర్యాయేణ - ప్రసుప్తః - చ - మమ - అంకే - భరతాగ్రజః.

అన్వయక్రమము :– అహం పరిశ్రమాత్ రాఘవాంకే చిరం ప్రసుప్తా అస్మి, భరతాగ్రజః చ పర్యాయేణ మమ అంకే ప్రసుప్తః.

ప్రతిపదార్థము :– అహం = నేను, పరిశ్రమాత్ = అలసట వలన, రాఘవాంకే = శ్రీరామునియొడిలో, చిరం = చాలసేపు, ప్రసుప్తా అస్మి = నిద్రించి యుంటిని, భరతాగ్రజః చ = శ్రీరాముడును, పర్యాయేణ = క్రమప్రకారముగా, మమ = నా యొక్క, అంకే = ఒడియందు, ప్రసుప్తః = నిద్రించెను.

తాత్పర్యము :– నేను శ్రీరాముని యొడిలో చాలసేపటి వఱకు నిద్రబోయితిని, శ్రీరాముడు గూడ వంతు ప్రకారము మేల్కొన్న పిదప నా యొడిలో తాను నిద్రించెను.

శ్లో॥ స తత్ర పునరే వాథ వాయస స్సముపాగమత్,
తత స్సుప్త ప్రబుద్ధాం మాం రాఘవాంకా త్సముత్థితామ్
వాయస స్సహసా ఽఽగత్య విదదార స్తనాంతరే. 22

పదచ్ఛేదము :- సః - తత్ర - పునః - ఏవ - అథ - వాయసః - సముపాగమత్ - తతః - సుప్త ప్రబుద్ధాం - మాం - రాఘవాంకాత్ - సముత్థితామ్ - వాయసః - సహసా - ఆగత్య - విదదార - స్తనాంతరే.

అన్వయక్రమము :- అథ తత్ర పునః ఏవ సః వాయసః సముపాగమత్; తతః సుప్త ప్రబుద్ధాం, రాఘవాంకాత్ సముత్థితాం మాం వాయసః సహసా ఆగత్య స్తనాంతరే విదదార.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, తత్ర = అచటికి, పునః ఏవ = మరల, సః వాయసః = ఆకాకము, సముపాగమత్ = వచ్చెను, తతః = పిమ్మట, సుప్త ప్రబుద్ధాం = నిద్రించి లేచినట్టియు, రాఘవాంకాత్ = శ్రీరాముని యొక్క ఒడినుండి, సముత్థితాం = లేచినదానను, మాం = నన్ను, వాయసః = కాకము, సహసా = శీఘ్రముగ, ఆగత్య = వచ్చి, స్తనాంతరే = స్తనములనడుమ, విదదార = పొడిచెను.

తాత్పర్యము :- పిమ్మట అచటికి ఆ వాయసము మరల వచ్చినది. అప్పటికి నిద్రనుండి మేల్కొని శ్రీరాముని ఒడి నుండి లేచి కూర్చొనియున్న నా మీదికి అది వేగముగ వచ్చి నా రొమ్ముపై పొడిచెను.

శ్లో॥ పునఃపున రథోత్పత్య విదదార స మాం భృశమ్,
తత స్సముక్షితో రామో ముక్తైః శోణితబిందుభిః. 23

పదచ్ఛేదము :- పునఃపునః - అథ - ఉత్పత్య - విదదార - సః - మాం - భృశమ్ - తతః - సముక్షితః - రామః - ముక్తైః - శోణితబిందుభిః.

అన్వయక్రమము :- అథ సః పునఃపునః ఉత్పత్య మాం భృశం విదదార. తతః ముక్తైః శోణితబిందుభిః రామః సముక్షితః.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, సః = ఆవాయసము, పునఃపునః – మాటిమాటికి, ఉత్పత్య = ఎగిరి, మాం = నన్ను, భృశం = మిక్కిలిగా, విదదార = పొడువసాగెను. తతః = అటు పిమ్మట, ముక్తైః = విడువబడిన, శోణితబిందుభిః = రక్తబిందువులచే, రామః = శ్రీరాముడు, సముక్షితః = తడుపబడెను.

తాత్పర్యము :- ఆ వాయసము మాటిమాటికి ఎగురుచు వచ్చి నన్ను పొడువసాగెను. అప్పుడు శ్రీరాముడు, నా గాయమునుండి స్రవించిన రక్తబిందువులచే తడిసెను.

శ్లో॥ వాయసేన తత స్తేన బలవత్ క్లిశ్యమానయా,
స మయా బోధిత శ్శ్రీమా న్సుఖసుప్తః పరంతపః. 24

పదచ్ఛేదము :- వాయసేన - తతః - తేన - బలవత్ - క్లిశ్యమానయా - సః - మయా - బోధితః - శ్రీమాన్ - సుఖసుప్తః - పరంతపః.

అన్వయక్రమము :- తతః తేనవాయసేన బలవత్ క్లిశ్యమానయా మయా సుఖసుప్తః పరంతపః సః శ్రీమాన్ మయా బోధితః.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, తేన = ఆ, వాయసేన = కాకముచే, బలవత్ = బలముగా, క్లిశ్యమానయా = పీడింపబడుచున్నట్టి, మయా = నాచే, సుఖసుప్తః = సుఖముగ నిద్రించుచున్నట్టి, పరంతపః = శత్రుసంహారకుడైన, శ్రీమాన్ = శుభలక్షణసమన్వితుడైన, సః = ఆ రాముడు, మయా = నా చేత, బోధితః = మేల్కొల్పబడెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవింద రాజీయము :— వః - విశ్వలోకములయందును మవిదితమైన విరతశయ సౌందర్యముచే సుప్రసిద్ధుడు. మయాబోధితః - నిద్రాకాలమునందలి సౌందర్య విశేషమును అనుభవించుట మాని మేల్కొల్పుటచే వన్ను నేనే నష్టపఱచుకొంటిని. శ్రీమాన్ - మెలకువతో సంచరించుచున్నప్పుడు మాత్రమే సుందరముగ నుండి శయనించినప్పుడు వికారముగ కనబడుటగాక, నిద్రావస్థయందు గూడ సహజ సౌందర్య విశేషముతో ప్రకాశించునట్టివాడు. సుఖసుప్తః - ఆత్మలక్షణమైన ఆనందానుభూతి నొందుచు శయనించియున్నవాడు. పరంతపః - శయనించినను, శత్రుసంహార సమర్థుడుగ నుండువాడు. 'సుఖసుప్తః శ్రీమాన్' అనుటచే నిద్రావస్థలో గూడ సౌందర్య విశేషమునకు దృష్టి దోషము తగులకుండ 'దిష్టి' తీయవలసి నంతటి సౌందర్య వంతుడు.

తాత్పర్యము :— అప్పుడు నేను ఆనాయసము కలిగించుచున్న తీవ్రమైన పీడను భరింపజాలక సుఖముగ నిద్రించుచున్న ఆ మహావీరుని ఆ మహావీరుని నా ప్రియుని మేల్కొల్పితిని.

శ్లో॥ స మాం దృష్ట్వా మహాబాహుః వితున్నాం స్తనయో స్తదా,
ఆశీవిష ఇవ క్రుద్ధ శ్శ్వసన్ వాక్య మభాషత. 25

పదచ్ఛేదము :— సః - మాం - దృష్ట్వా - మహాబాహుః - వితున్నాం - స్తనయోః - తదా - ఆశీవిషః - ఇవ - క్రుద్ధః - శ్వసన్ - వాక్యం - అభాషత.

అన్వయక్రమము :— తదా సః మహాబాహుః స్తనయోః వితున్నాం మాం దృష్ట్వా క్రుద్ధః ఆశీవిషః ఇవ శ్వసన్ వాక్యం అభాషత.

ప్రతిపదార్థము :– తదా = అప్పుడు, సః మహాబాహుః = ఆ మహావీరుడు, స్తనయోః = స్తనములందు, వితున్నాం = గాయము నొందియున్న, మాం = నన్ను, దృష్ట్వా = చూచి, క్రుద్ధః = (క్రోధితుడై, (క్రుద్ధః = పగబట్టి కోపించిన) ఆశీవిషః ఇవ = సర్పమువలె శ్వసన్ = రోజుచు, వాక్యం = ఈ వాక్యమును, అభాషత = పలికెను.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :– క్రుద్ధః - ఇంతవఱకును కాకిచేష్టలను సామాన్యమైనవిగా మాత్రము ఎంచెను, పరిహాసించెను. ఇప్పుడు సీతమ్మ ఱొమ్ముపై గాయమును జూచి క్రుద్ధ భుజంగమువలె రోజుచు లేచెనని భావము.

రా. శిరోమణి –: స్తనయోః వితున్నాం-అనగా ఆ వాయసము తన నోటియందు కఱచుకొనియున్న మాంసముతో కూడిన ముట్టెను తగిలించుటచే ఆ మాంసము నందలి రక్తపు బిందువులచే గాయపడినట్లు సీతమ్మ ఱొమ్ము కాన్పించినది. ఆ దృశ్యమునుజూచి రాముడు క్రోధమునొందెను.

తాత్పర్యము :– అప్పుడా మహావీరుడు స్తనములందు గాయమునొందియున్న నన్నుజూచి మహాక్రోధము నొంది తోకత్రొక్కిన త్రాచు బుసకొట్టుచున్నట్లు రోజుచు ఈ విధముగ పలికెను.

శ్లో. కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాంతరమ్,
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా. 26

పదచ్ఛేదము :– కేన - తే - నాగనాసోరు - విక్షతం - వై - స్తనాంతరమ్, కః - క్రీడతి - సరోషేణ - పంచవక్త్రేణ - భోగినా.

అన్వయక్రమము :– నాగనాసోరు ! తే స్తనాంతరం కేనవై

ప్రతిపదార్థము :- నాగనాసోరు = ఏనుగు తొండమువంటి ఊరువులు గల్గినట్టి ఓ సుందరీ!, తే = నీయొక్క, స్తనాంతరం = స్తనమధ్యము, కేనవై = ఎవ్వనిచేత, విక్షతం = గాయపఱచబడెను?, సరోషేణ = క్రోధముతోనున్న, పంచవక్త్రేణ = ఐదునోళ్ళుగలిగినట్టి భోగినా = సర్పముతో, కః = ఎవ్వడు, క్రీడతి = ఆటలాడుచున్నాడు?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము .- "పంచవక్త్రేణ భోగినా" పెద్దగ తెఱచిన నోరుగల క్రుద్ధసర్పముతోనని భావము. పంచ యనగా విస్తృతమైనయని అర్థము.

తాత్పర్యము :- ఓ సుందరీ! నీస్తనమధ్యము ఎవనిచే ఇట్లు గాయపఱుప బడినది? రోషావేశము నొంది ఐదు నోళ్ళతో బుసకొట్టు చున్న భీకర సర్పముతో ఎవడు ఆటలాడుచున్నాడు?

శ్లో॥ వీక్షమాణా తత స్తం వై వాయసం సమవైక్షత,
నఖై స్సరుధిరై స్తీక్ష్ణై ర్మామేవాభిముఖం స్థితమ్. 27

పదచ్ఛేదము :- వీక్షమాణా - తతః - తం - వై - వాయసం - సమవైక్షత - నఖైః - సరుధిరైః - తీక్ష్ణైః - మాం - ఏవ - అభిముఖం - స్థితమ్.

అన్వయక్రమము :- వీక్షమాణా తతః సరుధిరైః తీక్ష్ణైః నఖైః మాం ఏవ అభిముఖం స్థితం తం వాయసం సమవైక్షత.

ప్రతిపదార్థము :- వీక్షమాణా = అన్నివైపులకు చూచుచున్నదానై, తతః = అటుపిమ్మట, సరుధిరైః = రక్తముతో కూడినవియును, తీక్ష్ణైః=వాడియైనవియునగు, నఖైః=నఖములతో, మామేవ=నన్నుగూర్చియే,

అభిముఖం = అభిముఖముగా, స్థితం = నిలచియున్న, తంవాయసం = ఆ కాకమును, సమవైక్షత = చూచెను.

తాత్పర్యము :_ అట్లు పలుకుచు శ్రీరాముడు నలువైపులకును చూచుచుండగా నా ఎదుట రక్తపుబిందువులతో వాడిగనున్న గోళ్ళతో నిలచి యున్న వాయసము కాన్పించెను.

శ్లో॥ పుత్రఃకిల స శక్రస్య వాయసః పతతాంవరః,
ధరాంతరం గత శ్శీఘ్రం పవనస్య గతౌ సమః. 28

పదచ్ఛేదము :_ పుత్రః - కిల - సః - శక్రస్య - వాయసః - పతతాం - వరః - ధరాంతరం - గతః - శీఘ్రం - పవనస్య - గతౌ - సమః.

అన్వయక్రమము :_ పతతాంవరః సః వాయసః శక్రస్య పుత్రః కిల. గతౌ పవనస్య సమః (సః) శీఘ్రం ధరాంతరం గతః.

ప్రతిపదార్థము :_ పతతాంవరః = పక్షులలో శ్రేష్ఠుడైన, సః వాయసః = ఆ కాకము, శక్రస్య = దేవేంద్రునకు, పుత్రః కిల = కుమారుడట, గతౌ = గమనమునందు, పవనస్య సమః = వాయునమాను డైనట్టి, సః = అతడు, శీఘ్రం = వేగముగా, ధరాంతరం = భూమియందలి బిలమును, గతః = చేరెను.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :_ మానవుల ఒడలిని కాకిపొడుచుట లోకము నందు ఎన్నడును కాన్పింపని విషయముగదా యని హనుమ తన మనస్సు నందు శంకింపకుండగ ఈ కాకము విశేషమైనదని దానివిశేషమును సీతమ్మ హనుమకు తెలుపుచున్నది. వాయువేగముగలది గనుక తలచినంతనే

భూమిమీదకి రాగలిగినది. ఈ పద్భుట రాముని పరాక్రమమును పరీక్షించు టకై దేవేంద్రుని ప్రేరణ చేతనే జరిగి యుండు నని ధ్వనితము.

గోవిందరాజీయము :– ఒక్క కాకి నిమిత్తమై (ముందు తెలుపబోవు రీతిగా) బ్రహ్మాస్త్రమునేల రాముడు ప్రయోగించెనని హనుమ శంకింపకుండ తనకు శ్రీరాముడు ఈ సంఘటనము జరిగిన పిమ్మట తెలిపి నట్టి వాయసపూర్వ వృత్తాంతమును సీతమ్మ ఇట్లు తెలిపినది ఈ వాయసము ఇంద్ర పుత్రుడైన జయంతుడని కొందఱును వాయసరూపమైన పుత్రుడిం కొకడని మఱి కొందఱును చెప్పుచున్నారు.

వాసుదాసస్వామి :– ఇంద్రుడు అహల్యను జెఱుపదలచి యొకనాటి రాత్రి కాకియై కూసెను. గౌతముడు కాకులు కూయువేళయైన దని లేచి యేటికి బోయి ఆ నది నిద్రించుచుండుట చూచి వెనుకకువచ్చి ఇది యింద్రుని కుచేష్టయని ఎఱిగి అతనిని నీకు కాకి రూపమే శాశ్వత మగును గాకయని శపించెను. అప్పుడు దేవతలు ఋషులు గౌతముని ప్రార్థింపగా ఈ శాపము ఇంద్రుని కొడుకునకు తగులుననియు రామబాణ పీడితుడై అయనచే రక్షింపబడి శాపవిముక్తు డగుననియు గౌతముడు చెప్పెనని వసిష్ఠ రామాయణము.

తాత్పర్యము :– ఆ వాయసము సామాన్యమైనది కాదు. అది దేవేంద్రుని యొక్క పుత్రుడేఅట. వాయువుతో సమానమైన వేగము గలి గిన ఆ వాయసముఅప్పుడే మహా వేగముతో దూరమునగల భూమి యందలి బిలమును చేరినది.

శ్లో॥ తత స్తస్మి న్మహాబాహుః కోపసంవర్తితేక్షణః,
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాంవరః.28

పదచ్ఛేదము :– తతః – తస్మిన్ – మహాబాహుః–కోపసంవర్తి తేక్షణః – వాయసే – కృతవాన్ – క్రూరాం – మతిం–మతిమతాం–వరః.

అన్వయక్రమము :– తతః మతిమతాం వరః (సః) మహా బాహుః కోపసంవర్తి తేక్షణః (సన్) తస్మిన్ వాయసే క్రూరాం మతిం కృతవాన్.

ప్రతిపదార్థము :– తతః = అటుపిమ్మట, మతిమతాం = ప్రజ్ఞావంతులలో వరః = శ్రేష్ఠుడైనట్టి, సః మహాబాహుః = ఆ మహా వీరుడు, కోపసంవర్తితేక్షణః సన్ = క్రోధముచే త్రిప్పబడుచున్న కన్నులు గలవాడై, తస్మిన్ వాయసే = ఆ కాకి విషయమునందు, క్రూరాం = క్రూరమైనట్టి, మతిం = తలంపును, కృతవాన్ = చేసెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :– క్రూరాం మతిం – క్రూరముగా గావింపదు ఆలోచన.

తాత్పర్యము :– అప్పుడు మహా మేధావియైన ఆ మహావీరుడు క్రోధముచే కన్నులు చలించుచుండ ఆ వాయసమును గూర్చి క్రూరమైన నిశ్చయమును పూనెను.

శ్లో॥ స దర్భం సంస్తరా ద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్,
స దీప్త ఇవ కాలాగ్ని ర్జజ్వాలాభిముఖో ద్విజమ్. 30

పదచ్ఛేదము :– సః – దర్భం – సంస్తరాత్ – గృహ్య – బ్రాహ్మేణ – అస్త్రేణ – యోజయత్ – సః – దీప్తః – ఇవ – కాలాగ్నిః – జజ్వాల – అభిముఖః – ద్విజమ్.

అన్వయక్రమము :– సః సంస్తరాత్ దర్భం గృహ్య, బ్రాహ్మేణ అస్త్రేణ యోజయత్ సః దీప్తః కాలాగ్నిః ఇవ ద్విజం అభిముఖః జజ్వాల.

ప్రతిపదార్థము :- సః = అతడు, సంస్తరాత్ = ఆస్తరణము నుండి, దర్భం = ఒక దర్భను, గృహ్య = గ్రహించి, (తం = దానిని) బ్రాహ్మేణ అస్త్రేణ = బ్రహ్మాస్త్రముతో, యోజయత్ = సంధించెను, సః = అదర్భ, కాలాగ్నిః ఇవ = ప్రళయకాలాగ్నివలె, ద్విజం అభిముఖః = వాయసమునకు ఎదురుగా నిలచినదై, జజ్వాల = ప్రజ్వరిల్ల సాగెను.

తాత్పర్యము :- వెంటనే శ్రీరాముడు తాను కూర్చున్న ఆసనమునుండి ఒక దర్భను గ్రహించి బ్రహ్మాస్త్ర మంత్రముతో దానిని అభిమంత్రించెను. వెంటనే ఆ యస్త్రము ప్రళయకాలాగ్నివలె అపక్షి ఎదుటకు బోయి భయంకరముగ ప్రజ్వలింపసాగెను.

శ్లో॥ స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి,
తతస్తు వాయసం దర్భః సో ఽంబరే ఽనుజగామహ. 31

పదచ్ఛేదము :- సః - తం - ప్రదీప్తం - చిక్షేప - దర్భః - తం - వాయసం - ప్రతి - తతః - తు - వాయసం - దర్భః - సః - అంబరే - అనుజగామ - హ.

అన్వయక్రమము :- సః ప్రదీప్తం తం దర్భం తం వాయసం ప్రతి చిక్షేప. తతః సః దర్భః తం వాయసం అంబరే అనుజగామ హ.

ప్రతిపదార్థము :- సః = అతడు, ప్రదీప్తం = ప్రజ్వరిల్లుచున్నట్టి, తం దర్భం = ఆ దర్భను, తం వాయసం ప్రతి = ఆకాకమును గూర్చి, చిక్షేప = విసరెను, తతః = పిమ్మట, సః దర్భః = ఆదర్భ, అంబరే = ఆకాశమున, తం వాయసం = ఆ వాయసమును, అనుజగామహ = వెంబడించెను.

తాత్పర్యము :- శ్రీరాముడప్పుడు ప్రజ్వలించుచున్న ఆదర్భను వాయసము మీదికి విసరెను. ఆదర్భ ఆకాశమునందు ఆ వాయసమును వెంబడించి తరుము సాగెను.

శ్లో॥ అనుసృష్ట స్తదా కాకో జగామ వివిధాం గతిమ్,
త్రాణకామ ఇమంలోకం సర్వంవై విచచారహ. ౩౨

పదచ్ఛేదము :- అనుసృష్టః - తదా - కాకః - జగామ - వివిధాం - గతిమ్ - త్రాణకామః - ఇమం - లోకం - సర్వం - వై - విచచారహ,

అన్వయ క్రమము : తదా అనుసృష్టః (సః) కాకః వివిధాం గతిం జగామ. త్రాణకామః (సః) సర్వం ఇమం లోకం విచచార హ.

ప్రతిపదార్థము :- తదా = అప్పుడు, అనుసృష్టః = తఱుమ బడుచున్నట్టి, (సః) కాకః = (ఆ) వాయసము, వివిధాం గతిం = వివిధమైన మార్గమును, జగామ = పొందెను, త్రాణకామః (సః) = రక్షణమును గోరుచున్నట్టి, (ఆకాకము) సర్వం = సమస్తమైన, ఇమం లోకం = ఈ లోకమును, విచచారహ = తిరిగెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- వివిధాం గతిం జగామ - వివిధములైన ఆశ్రియములను గూర్చి చింతింప సాగెను.

గోవిందరాజీయము :- 'వివిధాం గతిం' వివిధములైన స్థానములను.

త్రాణకామ :- అనుటకు బదులుగా లోకకామః అని పాఠాంతరము

తాత్పర్యము :- అప్పుడాయస్త్రముచే తఱుమ బడుచు ఆ వాయసము వివిధములైన ఆశ్రియములను గూర్చి పరుగులెత్తుచు, తనను రక్షించువారి కొఱకై ఈ లోకము నంతటను కలయదిరిగెను.

శ్లో॥ స పిత్రాచ పరిత్యక్త స్సురై స్సర్వై ర్మహర్షిభిః,
త్రీన్ లోకా న్సంపరిక్రమ్య తమేవ శరణం గతః. ౩౩

పదచ్ఛేదము :- సః - పిత్రా - చ - పరిత్యక్తః - సురైః - సర్వైః - మహర్షిభిః - త్రీన్ - లోకాన్ - సంపరిక్రమ్య - తం - ఏవ - శరణం - గతః.

అన్వయక్రమము :- సః సర్వైః సురైః మహర్షిభిః పిత్రాచ పరిత్యక్తః త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తం ఏవ శరణం గతః.

ప్రతిపదార్థము :- సః = ఆ వాయసము, సర్వైః = ఎల్ల, సురైః = దేవతల చేతను, మహర్షిభిః = మహర్షులచేతను, పిత్రాచ = తండ్రిచేతను, పరిత్యక్తః = విడిచివేయబడినవాడై, త్రీన్ లోకాన్ = మూడు లోకములను, సంపరిక్రమ్య = పలుమారులు పరిభ్రమించి, తం ఏవ = ఆ శ్రీరామునే, శరణం గతః = శరణుజొచ్చెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- "పిత్రాచ పరిత్యక్తః" తండ్రిచేతను గూడ విడువబడెను అనుటచే మొదట ఈతడు తల్లి కడకు పోయెనవియు పురుషకార భూతయైన సీతామాత యెడ అపరాధము చేసినట్టి వీనిని గాచుట తనకును సమ్మతముగాక పోవుటచే ఆమె వెడలగొట్టగా అప్పుడు తండ్రిని జేరి ఆతనిచే గూడ విడువబడెనని తెలియవలెను.

రామునకు విరోధియైనవానిని "ఇంద్రో మహేంద్రస్సురనాయకో వా .... త్రాతుం న సమర్థాః" అనునది సుప్రసిద్ధమే గనుక దేవేంద్రుడు విడుచుట ఆశ్చర్యముగాదు.

'పరిత్యక్తః' అనుటచే వీనిని తల్లి దండ్రులు కోరియే విడిచి పెట్టిరని భావము.

సురైస్సర్వైః మహర్షిభిః - పిమ్మట ఈతడు, తనను తల్లిదండ్రులు విడిచినను తన బంధువులు ఆదరింపవచ్చునని వారికడకు పోగా - "కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే" అను ప్రసిద్ధి ననుసరించి ఆ దేవతలెవ్వరును గూడ ఈతనిని రక్షింపకుండిరి. ఇట్లు దేవత లెల్లరును

పరిత్యజించగా సహజ దయాపరులైన మహర్షుల కడకుపెడలగా సర్వరక్షకుడైన శ్రీరాముడుండగా ఆతని యెడ నపరాధము చేసిన వీనియెడలదయ చూపినచో మాకును అధర్మముఅంటి హాని వాటిల్లుననియు, చివరికీతడు శ్రీరామునిచేతనే రక్షింప బడుననియు దూర మాలోచించి వారును వీనిని విడచి పెట్టిరి.

ఇట్లాతడు ముల్లోకములందును రక్షణ కొఱకై పలుమాఱులు తిరిగి తిరిగి గత్యంతరములుగానక సర్వలోక శరణ్యుడైన శ్రీరాముడే శరణు జొచ్చెను.

సురైః సర్వైర్మహర్షిభిః - అనుదానికి బదులుగా సురైశ్చ సమహర్షిభిః- అని పాఠాంతరము.

తాత్పర్యము :- అప్పుడావాయసము తల్లిదండ్రుల చేతను, ఎల్ల దేవతల చేతను, సర్వమహర్షుల చేతను గూడ రక్షణను బొందజాలక ముల్లోకములందును పలుమాఱులు తిరిగితిరిగి ఎందును రక్షణమునుగానక ఆ శ్రీరామచంద్రునే శరణుజొచ్చెను.

శ్లో॥ స తం నిపతితం భూమౌ శరణ్య శ్శరణాగతమ్,
వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్. 34

పదచ్ఛేదము :- శరణ్యః - సః - కాకుత్స్థః - వధార్హం - అపి - శరణాగతం-భూమౌ-నిపతితం-తం-కృపయా పర్యపాలయత్.

అన్వయక్రమము :- శరణ్యః సః కాకుత్స్థః వధార్హం అపి శరణాగతం భూమౌనిపతితం తం కృపయా పర్యపాలయత్.

ప్రతిపదార్థము :- శరణ్యః = శరణు వేడినవానిని రక్షించు స్వభావము గలిగినట్టి, సః కాకుత్స్థః = ఆ శ్రీరాముడు, వధార్హం అపి = వధించుటకు దగినవాడై యున్నప్పటికిని, శరణాగతం = శరణువేడిన

వాడును, భూమౌ నిపతితం = నేలపై బడియున్నవాడగు, తం = ఆ వాయసమును కృపయా = కరుణతో, పర్యపాలయత్ = రక్షించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :— "శరణాగతం తం కృపయా పర్యపాలయత్" అవ్యాజకృపాళువైన శ్రీరాముడు అతనిని కాపాడుటకు ఇంత అలస్యము ఏల చేసెననరాదు. ప్రార్థించిన వారికే పరమ కళ్యాణములు ప్రసాదింపబడును.

కరుణావానపి వ్యక్తం శక్తః స్వామ్యపి, దేహినామ్,
అప్రార్థితో న గోపాయేత్, ఇతి తత్ప్రార్థనామతిః
అని పురాణ వచనము.

గోవింద రాజీయము :— భూమౌ నిపతితం దేవజాతి యగుటచే నేలను తాకుట అతని స్వభావముగాకున్నను తండ్రిచే శిక్షింపబడిన పుత్రుడు తల్లి పాదములపై బడినట్లు తన పాదముల చెంతపడియుండెనని భావము. వధార్హం అపి కృపయా పర్యపాలయత్-తనచే వధింపబడవలసి యున్నను తన సహజ స్వభావమైన దయాగుణముచే వానిని రక్షించెను.

దోషోయద్యపి తస్యస్యాత్ - అనుచు శ్రీరాముడు శరణాగతుల దోషములను ఉదారబుద్ధితో ఉపేక్షించును.

వాసుదాసస్వామి :- 'యదివా రావణః స్వయం' అనగా "రావణుడు వచ్చినను రక్షింతు"ననిగదా శ్రీరాముని యధ్యవసాయము.

తాత్పర్యము :— భక్త శరణ్యుడైన శ్రీరాముడు తన పాదముల ముందు భూమిపై బడి శరణు వేడుచున్న ఆ వాయసమును చంపవలసి యున్నట్టి అతని దోషము నుపేక్షించి తన సహజదయా గుణముచే రక్షించెను.

శ్లో॥ పరిద్యూనం విషణ్ణంచ స త మాయాంత మబ్రవీత్,
మోఘం కర్తుం న శక్యంతు బ్రాహ్మ మస్త్రం త
దుచ్యతామ్. 35

పదచ్ఛేదము :- పరిద్యూనం - విషణ్ణం - చ - సః - తం - ఆయాంతం - అబ్రవీత్ - మోఘం - కర్తుం - న - శక్యం - తు - బ్రాహ్మం - అస్త్రం - తత్ - ఉచ్యతామ్.

అన్వయక్రమము :- పరిద్యూనం విషణ్ణం ఆయాంతం తం (సః) అబ్రవీత్; బ్రాహ్మం అస్త్రం మోఘం కర్తుం తు నశక్యం; తత్ ఉచ్యతామ్.

ప్రతిపదార్థము :- పరిద్యూనం = పరితాపమునొందినవాడును, విషణ్ణం = విషాదముతో కూడినవాడు నగు, ఆయాంతం = వచ్చుచున్నట్టి, తం = ఆ వాయసమును గూర్చి, సః = ఆ శ్రీరాముడు, అబ్రవీత్ = పలికెను. బ్రాహ్మం అస్త్రం = బ్రహ్మాస్త్రము, మోఘం కర్తుం = విఫలము నుచేయుటకు, న శక్యం = సాధ్యముకాదు, తత్ = ఆ కారణమున, ఉచ్యతామ్ = చెప్పబడుగాక.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'తత్ ఉచ్యతామ్' బ్రహ్మాస్త్రము దేనిని సంహరింపవలెనో అట్టిదానిని చెప్పుము. పూర్వము తనకు పరశురాముడు చూపించినట్లు నీవును చూపించు మని భావము.

తాత్పర్యము :- ముల్లోకములు తిరిగి అలసిపోయి విషాదగ్రస్తుడై శరణుగోరి వచ్చుచున్న యాతనిని జూచి శ్రీరాముడు బ్రహ్మాస్త్రము ప్రయోగింపబడి వ్యర్థముగ వెనుకకురాదు. కాబట్టి దానికి లక్ష్యము చేయవలసినది ఏదియో తెలుపుమని వాయసము నడిగెను.

శ్లో॥ హింసస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సో ఽబ్రవీత్,
తత స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్. 36

పదచ్ఛేదము :- హినస్తు - దక్షిణాక్షి - త్వచ్ఛరః - ఇతి - అథ - సః - అబ్రవీత్ - తతః - తస్య-అక్షి - కాకస్య - హినస్తి - స్మ - సః - దక్షిణమ్.

అన్వయక్రమము :- అథ సః త్వచ్ఛరః (మే) దక్షిణాక్షి హినస్తు ఇతి అబ్రవీత్; తతః సః తస్యకాకస్య దక్షిణం అక్షి హినస్తి స్మ.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, సః = ఆ వాయసము, త్వచ్ఛరః = నీ బాణము, మే = నా యొక్క, దక్షిణాక్షి = కుడికంటిని, హినస్తు = నశింపజేయునుగాక, ఇతి = అని, అబ్రవీత్ = పలికెను, తతః = పిమ్మట, సః = ఆ బ్రహ్మాస్త్రము. తస్య కాకస్య = ఆ వాయసము యొక్క, దక్షిణం అక్షి = కుడికంటిని, హినస్తి స్మ = నశింపజేసెను,

తాత్పర్యము :- అప్పుడా వాయసము నీ యస్త్రము నా దక్షిణ నేత్రమును నశింపచేయుగాక యని పలికెను. అంతట శ్రీరాముడు తన అస్త్రమునకు ఆ వాయసము యొక్క కుడికంటినే లక్ష్యముచేసెను.

శ్లో॥ దత్త్వాతు దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః,
స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయచ.
విసృష్ట స్తేన వీరేణ ప్రతిపేదే స్వ మాలయమ్. 37

పదచ్ఛేదము :- దత్వా - తు - దక్షిణం - నేత్రం - ప్రాణేభ్యః - పరిరక్షితః - సః - రామాయ - నమస్కృత్వా - రాజ్ఞే - దశరథాయ - చ - విసృష్టః - తేన - వీరేణ - ప్రతిపేదే - స్వం - ఆలయమ్.

అన్వయక్రమము :- సః ప్రాణేభ్యః దక్షిణం నేత్రం దత్వా పరిరక్షితః; సః రామాయ, రాజ్ఞే దశరథాయచ నమస్కృత్వా తేన వీరేణ విసృష్టః, స్వం ఆలయం ప్రతిపేదే.

ప్రతిపదార్థము :- సః = ఆ వాయసము, ప్రాణేభ్యః = ప్రాణముల కొఱకై, దక్షిణం నేత్రం = కుడికంటిని, దత్వా = అర్పించి, పరిరక్షితః = కాపాడబడినది, సః = ఆ వాయసము, రామాయ = శ్రీరాము నకును, రాజ్ఞే = మహారాజయిన, దశరథాయచ = దశరథునకును నమస్కృత్వా = నమస్కరించి, తేన వీరేణ = ఆ వీరునిచే, విసృష్టః = విడువబడినదై, స్వం ఆలయం = నిజ గృహమును, ప్రతిపేదే = చేరెను.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి -: "దశరథాయచ నమస్కృత్వా" అని దశరథునకు గూడ నమస్కరించెనని చెప్పుటచే ఈతడు స్వర్గమునందు రక్షణకొఱకు వరుగిడునప్పుడు తమ వంశధర్మమైన దయాగుణము ననుసరించి అచ్చట నున్న దశరథుడు తన కుమారుని ఆశ్రితరక్షకత్త్వము ఎఱిగియున్నవాడు గావున అతనినే శరణువేడుమని ఉపదేశింపగా ఆయుప దేశము ననుసరించియే తన ప్రాణములను నిలుపుకొనెను. కాబట్టి శ్రీరామునితో బాటుగ దశరథునకు గూడ నమస్కరించెనని తెలియవలెను.

తాత్పర్యము :- ఆ వాయస మట్లు తన దక్షిణ నేత్రమును అర్పించి తన ప్రాణములను నిలుపుకొనెను. పిమ్మట అతడు శ్రీరామునకును దశరథ మహారాజునకును నమస్కారముచేసి శ్రీరాముడు తనను విడిచిపెట్టగా నిజగృహమునకు చేరుకొనెను.

శ్లో॥ మత్కృతే కాకమాత్రే ఽపి బ్రహ్మాస్త్రం సముదీరితమ్,-
కస్మాద్యో మా ఽహరత్త్వత్తః క్షమసే తం మహీపతే.

పదచ్ఛేదము :- మత్కృతే - కాకమాత్రే - అపి - బ్రహ్మాస్త్రం - సముదీరితమ్ - కస్మాత్ - యః - మా - అహరత్ - త్వత్తః - క్షమసే - తం - మహీపతే.

అన్వయక్రమము :- మహీపతే (త్వయా) మత్కృతే కాకమాత్రే అపి బ్రహ్మాస్త్రం సముదీరితమ్, యః త్వత్తః మా అహరత్ తం కస్మాత్ క్షమసే?

ప్రతిపదార్థము :- మహీపతే = ఓ మహారాజా!, త్వయా = నీ చేత, మత్కృతే = నా నిమిత్తమై, కాకమాత్రే అపి = కాకమాత్రము నందే, బ్రహ్మాస్త్రం = బ్రహ్మాస్త్రము, సముదీరితం = ప్రయోగింపబడినది, యః = ఎవ్వడు, త్వత్తః = నీ నుండి, మా = నన్ను, అహరత్ = అపహరించెనో, తం = వానిని, కస్మాత్ = ఎందువలన, క్షమసే = సహించుచున్నావు?

తాత్పర్యము :- ఓ రామా! నీవు నా క్షేమము కొఱకై అల్పమైన ఒక కాకి మీదనే బ్రహ్మాస్త్రమును ప్రయోగించియున్నావు గదా! అట్టి దయాపరుడవు నేడు నీ కడనుండి నన్ను అపహరించినట్టి ఆ దుర్మార్గుని ఈనాడింత కాలము ఎట్లు సహింపగలుగుచున్నావు?

శ్లో॥ స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ,
త్వయా నాథవతీ నాథ హ్యనాథాఇవ దృశ్యతే. 40

పదచ్ఛేదము :- సః - కురుష్వ - మహోత్సాహః - కృపాం - మయి - నరర్షభ - త్వయా - నాథవతీ - నాథ - హి - అనాథా - ఇవ - దృశ్యతే.

అన్వయక్రమము :- నరర్షభ! మహోత్సాహః (సన్) మయి కృపాం కురుష్వ; నాథ! త్వయా నాథవతీ (ఏషానారీ) అనాథా ఇవ దృశ్యతే.

ప్రతిపదార్థము :— నరర్షభ = ఓ మనుజశ్రేష్ఠుడా! మహోత్సాహః (సన్) = గొప్పదైన ఉత్సాహముగలవాడవై, మయి = నాయెడ కృపాం = దయను, కురుష్వ = చేయుము, నాథ! = ఓ స్వామీ! త్వయా = నీ చేత, నాథవతీ = సనాథయైయున్న, (ఏషానారీ = ఈయబల) అనాథా ఇవ = అనాథవలె, దృశ్యతే = చూడబడుచున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవింద రాజీయము :— నరర్షభ! - నీవు నరోత్తముడవు గదా! నీవు పరుల దుఃఖమును సహింప లేని వాడవుగదా. అట్టి నీ ఉత్తమ గుణమును నా యెడల ప్రదర్శింప కుండుట నీ నరోత్తమత్వమునకే హాని యగునని సూచించుచు సీతమ్మ ఇచ్చట రాముని ఇట్లు సంబోధించె నని తెలియవలెను.

తాత్పర్యము :— ఓ నరశ్రేష్ఠుడా! నీవు మహోత్సాహము నూని నాపై కృపజూపి నన్ను రక్షింపుము. లోకముచే నీ భార్యను అని అనిపించుకొనుచున్న నేను ఒక అనాథవలె ఇట్టి దీనస్థితిలో నుండుట నీకు ఉచితముకాదు సుమా!

శ్లో॥ ఆనృశంస్యం పరోధర్మ స్త్వత్తఏవ మయా శ్రుతమ్,
జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహా
బలమ్. 41

శ్లో॥ అపారపార మక్షోభ్యం గాంభీర్యా త్సాగరోపమమ్,
భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమమ్. 42

పదచ్ఛేదము :— ఆనృశంస్యం - పరః - ధర్మః - త్వత్తః - ఏవ - మయా - శ్రుతమ్ - జానామి - త్వాం - మహావీర్యం - మహోత్సాహం - మహాబలమ్ - అపారపారం - అక్షోభ్యం - గాంభీర్యాత్ - సాగరోపమమ్ - భర్తారం - ససముద్రాయాః - ధరణ్యాః - వాసవోపమమ్.

అన్వయక్రమము :- త్వత్తః ఏవ ఆనృశంస్యం పరః ధర్మః ఇతి మయా శ్రుతమ్. త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలం అపారపారం అక్షోభ్యం గాంభీర్యాత్ సాగరోపమం ససముద్రాయాః ధరణ్యాః భర్తారం వాసవోపమం జానామి.

ప్రతిపదార్థము :- త్వత్తః ఏవ = నీ నుండియే, ఆనృశంస్యం = దయాళుత్వము, పరః = శ్రేష్ఠమైన, ధర్మః = ధర్మము, ఇతి = అని, మయా = నా చేత, శ్రుతమ్ = వినబడినది, త్వాం = నిన్ను, మహావీర్యం = గొప్పవీరత్వముగలవానిగాను, మహోత్సాహం = గొప్పఉత్సాహముగలవానిగాను, మహాబలం = గొప్పశక్తిగలవానిగను, అపారపారం = అపరిమితమైన సామర్థ్యము గలవానిగను, అక్షోభ్యం = క్షోభ పొందింప శక్యముగాని వానిగాను, గాంభీర్యాత్ = గాంభీర్యమున, సాగరోపమం=సముద్రతుల్యునిగను, ససముద్రాయాః =(చుట్టును) సాగరములతో కూడినట్టి, ధరణ్యాః = భూమికి, భర్తారం = ప్రభువుగను, వాసవోపమం = దేవేంద్రసదృశునిగను, జానామి = ఎఱుగుదును.

తాత్పర్యము :- మానవ గుణములలో దయాళుత్వము శ్రేష్ఠమైన ధర్మమని నీవేనాకు చెప్పియున్నావుగదా! అట్టి దయాగుణముతో నన్నేల కాపాడకుంటివి? నీవు రాక్షసులను జూచి భయమునొందు వాడవు కాదుగదా! నీవు వీర్యశాలివనియు, ఉత్సాహ సంపన్నుడవనియు, మహాబలాఢ్యుడవనియు, అపరమితమైన సామర్థ్యము గలవాడవనియు, పరులచే క్షోభనొందు వాడవుగావనియు, సముద్రమువలె గంభీరుడవనియు చతుస్సముద్ర వలయితమైన భూమండలమును పాలించు ప్రభువువనియు, దేవేంద్రసన్నిభుడవనియు, నీ ప్రభావమును గూర్చి నాకు బాగుగా తెలియును.

శ్లో॥ ఏవ మస్త్రవిదాం శ్రేష్ఠో బలవా న్సత్త్వవానపి,
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయసి రాఘవ. 43

పదచ్ఛేదము :— ఏవం - అస్త్రవిదాం - శ్రేష్ఠః - బలవాన్ - సత్యవాన్ - అపి - కిమర్థం - అస్త్రం - రక్షస్సు - న - యోజయసి - రాఘవ.

అన్వయక్రమము :— రాఘవః ఏవం అస్త్రవిదాం శ్రేష్ఠః బలవాన్ సత్యవాన్ అపి కిమర్థం రక్షస్సు అస్త్రం న యోజయసి?

ప్రతిపదార్థము :— రాఘవః = ఓ శ్రీరామా,, ఏవం = ఇట్లు అస్త్రవిదాం = అస్త్రవేత్తలలో, శ్రేష్ఠః = శ్రేష్ఠుడవును, బలవాన్ = బలవం తుడవును, సత్యవాన్అపి = సత్యవంతుడవు నైనప్పటికిని, కిమర్థం = ఏల,, రక్షస్సు = రక్కసులపై, అస్త్రం = అస్త్రమును, న యోజయసి = సంధింపకుంటివి?

తాత్పర్యము :— రామా, ఈ విధముగ ధనుర్విద్యలో శ్రేష్ఠుడవై సత్యవంతుడవై సామర్థ్య సంపన్నుడవై యుండియు కూడ నీ వేల ఈ రాక్షసులపై అస్త్రమును ప్రయోగింపకుంటివి?

శ్లో॥ న నాగా నాపిగంధర్వా నాసురా న మరుద్గణాః,
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమాధితుమ్. 44

పదచ్ఛేదము :— న - నాగాః - న - అపి - గంధర్వాః - న - అసురాః - న - మరుద్గణాః - రామస్య - సమరే - వేగం - శక్తాః - ప్రతిసమాధితుమ్.

అన్వయక్రమము :— సమరే రామస్య వేగం ప్రతిసమాధితుం నాగాః నశక్తాః; గంధర్వాః అపి న శక్తాః; మరుద్గణాః నశక్తాః.

ప్రతిపదార్థము :— సమరే = యుద్ధమునందు, రామస్య = శ్రీరాముని యొక్క, వేగం = ఉద్ధతిని, ప్రతిసమాధితుం = ఎదుర్కొ

నటకు, నాగాః = నాగులు, నశక్తాః = నమర్థులుగారు, గంధర్వాః అపి = గంధర్వులుగూడ, న = సమర్థులుగారు, అసురాః = రాక్షసులు, న = సమర్థులుగారు, మరుద్గణాః = దేవగణములును, నశక్తాః = సమర్థులుగారు.

తాత్పర్యము :- రణాంగణమున రాముని ధాటికి తట్టుకొని నిలచుటకు నాగయోధులుగాని, గంధర్వవీరులుగాని, రాక్షసయోధులుగాని దేవగణములుగాని సామర్థ్యము గలవారుకాదు సుమా।

శ్లో॥ తస్య వీర్యవతః కశ్చి ద్యద్యస్తి మయి సంభ్రమః,
కిమర్థం న శరైః స్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్. 45

పదచ్ఛేదము :- తస్య - వీర్యవతః - కశ్చిత్ - యది - అస్తి - మయి - సంభ్రమః - కిమర్థం - న - శరైః - తీక్ష్ణైః - క్షయం - నయతి - రాక్షసాన్.

అన్వయక్రమము :- వీర్యవతః తస్య మయి కశ్చిత్ సంభ్రమః అస్తి యది తీక్ష్ణైః శరైః రాక్షసాన్ కిమర్థం క్షయం న నయతి?

ప్రతిపదార్థము :- వీర్యవతః = పరాక్రమవంతుడైన, తస్య = ఆ రామునకు, మయి = నా యందు, కశ్చిత్ = ఏమైనను, సంభ్రమః = వేగిరపాటు, అస్తి యది = ఉన్నయెడల, తీక్ష్ణైః = వాడియైనట్టి, శరైః = బాణములచేత, రాక్షసాన్ = రాక్షసులను, కిమర్థం = ఏల, క్షయం న నయతి = నాశము నొందించుటలేదు.

తాత్పర్యము :- మహావీరుడైన ఆ శ్రీరామునకు నన్నుగూర్చి కొంచెమైనను సంభ్రమమున్న యెడల తన తీక్ష్ణమైన శరములకు రాక్షసులను గురిచేసి వారినెల్లర నేల నశింపజేయకున్నాడు.

శ్లో॥ భ్రాతు రాదేశ మాదాయ లక్ష్మణోవా పరంతపః,
కస్య హేతో ర్న మాం వీరః పరిత్రాతి మహాబలః. 46

పదచ్ఛేదము :– భ్రాతుః - ఆదేశం - ఆదాయ - లక్ష్మణః - వా - పరంతపః - కస్య - హేతోః - న - మాం - వీరః - పరిత్రాతి- మహాబలః.

అన్వయక్రమము :– వీరః పరంతపః మహాబలః లక్ష్మణోవా కస్య హేతోః భ్రాతుః ఆదేశం ఆదాయ మాం న పరిత్రాతి.

ప్రతిపదార్థము :– వీరః = వీరుడును, పరంతపః = శత్రు సంహారకుడును, మహాబలః = మహాబలాఢ్యుడును అగు, లక్ష్మణోవా = లక్ష్మణుడైనను, కస్య హేతోః = దేని కారణమువలన, భ్రాతుః = సోదరునియొక్క, ఆదేశం = ఆజ్ఞను, ఆదాయ = గైకొని, మాం = నన్ను, న పరిత్రాతి = రక్షింపకున్నాడు?

తాత్పర్యము :– మహావీరుడును, శత్రుమర్దనుడును మహా సమర్థుడును అగు లక్ష్మణుడైనను తన అన్నఆజ్ఞను గైకొని నన్ను రక్షింప పూనకున్నాడు ఏ కారణము చేతనో కదా?

శ్లో॥ యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమ తేజసౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః. 47

పదచ్ఛేదము :– యది - తౌ - పురుష్యవాఘ్రౌ - వాయ్వగ్ని సమతేజసౌ - సురాణాం - అపి - దుర్ధర్షౌ - కిమర్థం - మాం - ఉపేక్షతః.

అన్వయక్రమము :– పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ (తౌ సంగతౌ) యది సురాణామపి దుర్ధర్షౌ తౌ కిమర్థం మాం ఉపేక్షతః

ప్రతిపదార్థము :- పురుషవ్యాఘ్రౌ = పురుషశ్రేష్ఠులైనట్టి, వాయ్వగ్నిసమతేజసౌ = వాయువుతోడను అగ్నితోడను సమానమైన ప్రతాపముగలవారైనట్టి, (తౌ సంగతౌ) యది = వారు కలసికొన్నియెడల, సురాణాంఅపి = దేవతలకుగూడ, దుర్ధర్షౌ = ఎదుర్కొనశక్యముగానట్టి. తౌ = వారు, కిమర్థం = ఏల, మాం = నన్ను, ఉపేక్షతః = ఉపేక్షించుచున్నారు?

తాత్పర్యము :- వాయువుతోడను అగ్నితోడను సమానమైన ప్రతాపముగల ఆ యన్నదమ్ములిరువురును ఆనాడు తిరిగి కలిసికొన్న యెడల దేవతలకు కూడ అజేయులైనట్టి వారు నాయెడ నేల ఇట్లు ఉపేక్ష వహించియున్నారు?.

శ్లో॥ మమైవ దుష్కృతం కించి న్మహా దస్తి న సంశయః,
సమర్థావపి తౌ య న్మాం నావేక్షేతే పరంతపౌ. 48

పదచ్ఛేదము :- మమ - ఏవ - దుష్కృతం - కించిత్ - మహత్ - అస్తి - న - సంశయః - సమర్థౌ - అపి - తౌ - యత్ - మాం - న - అవేక్షేతే - పరంతపౌ.

అన్వయక్రమము :- పరంతపౌ తౌ సమర్థౌ అపి యత్ మాం న అవేక్షేతే, తత్ మమ ఏవ మహత్ కించిత్ దుష్కృతం అస్తి; సంశయః న.

ప్రతిపదార్థము :- పరంతపౌ = శత్రుతాపనులైన, తౌ = ఆ యన్నదమ్ములు, సమర్థౌఅపి = సమర్థులైనను, యత్ = ఏ కారణమున, మాం = నన్ను, నఅవేక్షేతే = పరికించుటలేదో, తత్ = ఆ కారణమున, మమ ఏవ = నాయదియే, మహత్ = గొప్పదైన, కించిత్ = ఒకానొక, దుష్కృతం = పాతకము, అస్తి = ఉన్నది, సంశయః = సందేహము, న = లేదు.

వి. శేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :– 'మమైవ దుష్కృతం కించిత్ మహదస్తి' – రామలక్ష్మణులు తనను రక్షించుటలో జరిగిన ఉపేక్షకు కారణము నూహించుచు ఆ సోదరుల లోపమో తన లోపమో యైయుండవలెనని ఎంచుకొని రాముని అసాధారణ ప్రభావమును స్మరించి రాముని లోపము కాదు అని నిశ్చయించి అది తన లోపమే యని సీతమ్మ ఒప్పుకొనుచున్నది. వనవాసమునకు తన అనుగమనమును అంగీకరింపలేదని తాను అనాడు నాదుని దూషించి దుష్కృతము చేసియున్నది. అట్లే మాయా మృగవధ సందర్భమున రాముని గానివచ్చుటకై పోలేదని లక్ష్మణుని దూషించియున్నది అట్లు భగవత్ భాగవతాప చారములు రెండును తాను చేసితినని ఇప్పుడు విచారముతో ఇట్లు స్మరించుచున్నదని గ్రహించవలెను.

వాసుదాసస్వామి :– రామునితో చెప్పుమని సీతమ్మ హనుమకు చెప్పిన మాటలలో కొన్ని రామునితో ప్రత్యక్షముగ చెప్పినట్లుగా పలికినది. కొన్ని హనుమను గూర్చి చెప్పినట్లే పలికినది. వికల మనస్కురాలైన సీతాదేవి దుఃఖావేశముతో ఈ విధముగ వేఱువేఱు రీతులుగా చెప్పుట సహజమైన విషయముగ గ్రహింపవలెను. విపరీతమని శంకింపరదు.

తాత్పర్యము :– మహావీరులైన అ యన్నదమ్ములు నా కష్టములు తొలగించుటకు సమర్థులైనను నన్ను ఉపేక్షించుచున్నారనగా నేను చేసిన దోషమేదియో గొప్పది యుండవలెను; సందేహములేదు.

శ్లో॥ వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః. 49

పదచ్ఛేదము :– వైదేహ్యాః – వచనం – శ్రుత్వా – కరుణం – సాశ్రుభాషితమ్ – అథ – అబ్రవీత్ – మహాతేజాః – హనుమాన్ – మారుతాత్మజః.

అన్వయక్రమము :- వైదేహ్యాః కరుణం సాశ్రుభాషితం శ్రుత్వా అథ మారుతాత్మజః మహాతేజాః హనుమాన్ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- వైదేహ్యాః = జానకీదేవియొక్క, కరుణం = దీనమైనట్టి, సాశ్రుభాషితం = కన్నీటితోడి మాటను, శ్రుత్వా = విని, అథ = పిమ్మట, మారుతాత్మజః = వాయునందనుడును, మహాతేజాః = మహాప్రతాపవంతుడునగు, హనుమాన్ = హనుమ, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- సీతాదేవి కన్నీటితో దీనముగా పలికిన మాటలు విని మహాప్రతాపశాలియైన వాయునందనుడు ఆమెతో ఇట్లు పలికెను.

శ్లో॥ త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన మే శపే,
రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే. 50

పదచ్ఛేదము :- త్వచ్ఛోకవిముఖః - రామః - దేవి - సత్యేన - మే - శపే - రామే - దుఃఖాభిపన్నే - చ - లక్ష్మణః - పరితప్యతే.

అన్వయక్రమము :- దేవి! మే సత్యేన శపే, రామః త్వచ్ఛోకవిముఖః; రామే దుఃఖాభిపన్నేతు లక్ష్మణః పరితప్యతే.

ప్రతిపదార్థము :- దేవి = ఓ పూజ్యురాలా!, మే సత్యేన = నా సత్యవ్రతముతో, శపే = ఒట్టు పెట్టుకొనుచున్నాను, రామః = శ్రీరాముడు, త్వచ్ఛోకవిముఖః = నీ యందలి శోకముచే (లోక) విముఖుడై యున్నాడు, రామే = శ్రీరాముడు, దుఃఖాభిపన్నేతు = దుఃఖనిమగ్నుడై యుండగా, లక్ష్మణః = లక్ష్మణుడు, పరితప్యతే = దుఃఖించుచున్నాడు.

తాత్పర్యము :- నా సత్యపాలన వ్రతముపై ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. తల్లీ! శ్రీరాముడు నీ వియోగ దుఃఖముచే సర్వ విషయము లందును విముఖుడై యున్నాడు; రాముడట్లు శోకనిమగ్నుడై యుండగా లక్ష్మణుడుగూడ సంతాపమున మునిగియున్నాడు.

శ్లో॥ కథంచి ద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్ష్య స్యంత మనిందితే. 51

పదచ్ఛేదము :– కథంచిత్ - భవతీ - దృష్టా - న - కాలః - పరిశోచితుమ్ - ఇమం - ముహూర్తం - దుఃఖానాం - ద్రక్ష్యసి - అంతం - అనిందితే.

అన్వయక్రమము :– భవతీ-కథంచిత్ దృష్టా; పరిశోచితుం (అయం) కాలః నః అనిందితే। ఇమం ముహూర్తం దుఃఖానాం అంతం ద్రక్ష్యసి

ప్రతిపదార్థము :– భవతీ = నీవు, కథంచిత్ = ఎట్లో, దృష్టా = కనబడితివి (అయం = ఇది) పరిశోచితుం = దుఃఖించుటకు, కాలః = సమయము న = కాదు, అనిందితే = ఓ ఉత్తమురాలా। ఇమం ముహూర్తం = ఈ క్షణమే, దుఃఖానాం = దుఃఖములకు, అంతం = అంతమును, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :– తల్లీ! ఎట్లో మా యదృష్టముచే నీవు నా కంటబడితివి ఇది దుఃఖింప వలసిన సమయముగాదు. అతి స్వల్పకాలము లోనే నీ దుఃఖములకు అంతమును చేరగలవు సుమా!

శ్లో॥ తౌ వుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. 52

పదచ్ఛేదము :– తౌ - ఉభౌ - పురుషవ్యాఘ్రౌ - రాజపుత్రౌ - మహాబలౌ - త్వద్దర్శనకృతోత్సాహౌ - లంకాం - భస్మీకరిష్యతః.

అన్వయక్రమము :– పురుషవ్యాఘ్రౌ, మహాబలౌ తౌ ఉభౌ రాజపుత్రౌ త్వద్దర్శన కృతోత్సాహౌ (సంతౌ) లంకాం భస్మీకరిష్యతః,

ప్రతిపదార్థము :- పురుషవ్యాఘ్రౌ = పురుషశ్రేష్ఠులును, మహాబలౌ = మహాబలాఢ్యులునగు, తౌ ఉభౌ = ఆ ఇరువురు, రాజపుత్రౌ = రాజకుమారులును, త్వద్దర్శనకృతోత్సాహౌ (సంతౌ) = నిన్నుచూచుట యందు గలిగిన ఉత్సాహముతోకూడిన వారగుచు లంకాం = లంకానగరమును, భస్మీకరిష్యతః = భస్మము గావింపగలరు.

తాత్పర్యము :- మహాబలాఢ్యులును పురుషసింహులునైన ఆ రాజకుమారులిరువురును నిన్ను చూడవలెనను అమితమైన ఉత్సాహముతో బయలుదేరి ఈ లంకానగరమును భస్మము చేసి వేయుదురు, చూచు చుండుము.

శ్లో॥ హత్వాచ సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవ స్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి. 63

పదచ్ఛేదము :- హత్వా - చ - సమరే - క్రూరం - రావణం - సహబాంధవమ్ - రాఘవః - త్వాం - విశాలాక్షి - నేష్యతి - స్వాం - పురీం - ప్రతి.

అన్వయక్రమము :- విశాలాక్షి! రాఘవః క్రూరం రావణం సమరే సహబాంధవం హత్వా త్వాం స్వాం పురీంప్రతి నేష్యతి.

ప్రతిపదార్థము :- విశాలాక్షి = విశాలమైన నేత్రములుగల ఓ జానకీ!, రాఘవః = శ్రీరాముడు, క్రూరం రావణం = క్రూరుడైన రావణుని సమరే = యుద్ధమున, సహబాంధవం = బంధువులందరితోడను గూడ, హత్వా = వధించి, త్వాం = నిన్ను, స్వాం పురీంప్రతి = తన నగరమునకుగూర్చి, నేష్యతి = కొనిపోవగలడు.

తాత్పర్యము :- ఓ జానకీ! శ్రీరాముడు యుద్ధమున ఈ రావణుని బంధుసమేతముగా సంహరించి నిన్ను నిజపట్టణమునకు త్వరలోనే తీసికొని పోవగలడు సుమా!

శ్లో॥ బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః,
సుగ్రీవో వాపి తేజస్వీ హరయో వా సమాగతాః. 54

పదచ్ఛేదము :- బ్రూహి - యత్ - రాఘవః - వాచ్యః - లక్ష్మణః - చ - మహాబలః - సుగ్రీవః - వా - అపి - తేజస్వీ - హరయః - వా - సమాగతాః.

అన్వయక్రమము :- రాఘవః, మహాబలః లక్ష్మణశ్చ, తేజస్వీ సుగ్రీవః వాఅపి యత్ వాచ్యః, సమాగతాః హరయః వా (యత్ వాచ్యాః తత్ బ్రూహి).

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడును, మహాబలః = బలశాలియైన, లక్ష్మణశ్చ = లక్ష్మణుడును, తేజస్వీ = ప్రతాపశాలియైన, సుగ్రీవః వాఅపి = సుగ్రీవుడైనను, యత్ = ఏమి, వాచ్యః = చెప్పబడ వలయునో, సమాగతాః = చేరినట్టి, హరయఃవా = వానరులుగాని, యత్ = ఏమి, వాచ్యాః = చెప్పబడవలసియున్నారో, తత్ = దానిని, బ్రూహి = చెప్పుము.

తాత్పర్యము :- తల్లీ! శ్రీరామునితో ఏమని చెప్పుమందువో చెప్పుము. మహాబలశాలియగు లక్ష్మణుని తోడను ప్రతాపవంతుడైన సుగ్రీవునితోడను ఏమని చెప్పుమందువు. నన్ను చూడగనే అచ్చటికి చేరిన వానరులందరితోడను ఏమని చెప్పుమందువు?

శ్లో॥ ఇత్యుక్తవతి తస్మింస్తు సీతా సురసుతోపమా,
ఉవాచ శోకసంతప్తా హనుమంతం ప్లవంగమమ్. 55

పదచ్ఛేదము :- ఇతి - ఉక్తవతి - తస్మిన్ - తు - సీతా - సురసుతోపమా - ఉవాచ - శోకసంతప్తా - హనుమంతం - ప్లవంగమమ్.

అన్వయక్రమము :- తస్మిన్ ఇతి ఉక్తవతి, సురసుతోపమా సీతా శోకసంతప్తా (సతీ) హనూమంతం ప్లవంగమం ఉవాచ.

ప్రతిపదార్థము :- తస్మిన్ = అతడు, ఇతి = ఇట్లు, ఉక్తవతి = పలుకగా, సురసుతోపమా = దేవకన్యలతో సమానురాలయిన, సీతా = జానకి, ప్లవంగమం = వానరశ్రేష్ఠుడైన, హనుమంతం = హనుమంతునిగూర్చి, శోకసంతప్తా (సతీ) = శోకముతో పరితపించుచున్నదై, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- హనుమంతుడు పలికిన మాటలువిని మహాసీయురాలైన సీతాదేవి శోకసంతప్తురాలగుచు అతనితో ఇట్లు పలికెను.

శ్లో॥ కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ,
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ. 58

పదచ్ఛేదము :- కౌసల్యా - లోకభర్తారం - సుషువే - యం - మనస్వినీ - తం - మమ - అర్థే - సుఖం - పృచ్ఛ - శిరసా - చ - అభివాదయ.

అన్వయక్రమము :- మనస్వినీ కౌసల్యా లోకభర్తారం యం సుషువే, తం మమార్థే సుఖం పృచ్ఛ; శిరసా అభివాదయచ.

ప్రతిపదార్థము :- మనస్వినీ = ధీరురాలైన, కౌసల్యా = కౌసల్యాదేవి, లోకభర్తారం = లోకములకు ప్రభువైనట్టి, యం = ఎవనినైతే, సుషువే = కనినదో, తం = అతనిని, మమార్థే = నా నిమిత్తమై, సుఖం పృచ్ఛ = క్షేమమును అడుగుము, శిరసా = శిరస్సుతో, అభివాదయచ = నమస్కారము కూడ చేయుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :- మనస్వినీ కౌసల్యా - విశాలహృదయురాలైన కౌసల్య, లోకభర్తారం యం సుషువే - లోకమున స్త్రీలు సామాన్యముగా తనకు రక్షకులుగ నుండవలెనని కోరుచు పుత్రులను బడయుదురు,

కౌసల్య మా తము విశాలభావముగలదై సర్వలోక రక్షకుడైన పుత్రుడు తనకు గలుగవలెనని నవమీవ్రతము నాచరించి లోకోపకారము కొఱకై కుమారుని గన్నది. అట్టి ఆమె కోరిక వ్యర్థమైనదెట్లగును? అతనివల్ల మేలు పొందవలసిన లోకములో నేను గూడ ఒకతెనేగదా! అతడు సుఖముగ నున్న తప్పక అందఱి సుఖములను అతని వలన సిద్ధించును. అందువలన అతని సుఖమే మొదట నేను కోరవలసినది. నా రక్షణ భారము అతనిదే. నా చింతయెల్లను అలసత్వము కాగూడదని మాత్రమే. అందుకే అతని సుఖమునుగూర్చి నేను అడుగుచున్నానని చెప్పుము.

తాత్పర్యము :- అత్యుత్తమ హృదయముగల కౌసల్యాదేవి సర్వలోక రక్షకుడైన ఏ మహనీయుని గనినదో అతనిని నా కోరికగా క్షేమ వార్తను అడుగుము. నాకు మాఱుగా తలవంచి నమస్కారము చేయుము.

శ్లో॥ స్రజశ్చ సర్వరత్నాని ప్రియా యాశ్చ వరాంగనాః,
ఐశ్వర్యంచ విశాలాయాం పృథివ్యామపి దుర్లభమ్. 57
పితరం మాతరంచైవ సమ్మాన్యాభిప్రసాద్యచ,
అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః. 58

పదచ్ఛేదము :- స్రజః - చ - సర్వరత్నాని - ప్రియాః - యాః - చ - వరాంగనాః - ఐశ్వర్యం - చ - విశాలాయాం - పృథివ్యాం - అపి - దుర్లభమ్ - పితరం - మాతరం - చ - ఏవ - సమ్మాన్య - అభిప్రసాద్యచ - అనుప్రవ్రజితః - రామం - సుమిత్రా - యేన - సుప్రజాః.

అన్వయక్రమము :- సుమిత్రా యేన సుప్రజాః సః లక్ష్మణః, స్రజః చ, సర్వరత్నాని, యాః ప్రియాః వరాంగనాః (తాః), విశాలాయాం పృథివ్యాం అపి దుర్లభం ఐశ్వర్యంచ, త్యక్త్వా పితరం సమ్మాన్య మాతరం అభిప్రసాద్యచ రామం అను ప్రవ్రజితః.

ప్రతిపదార్థము :- సుమిత్రా = సుమిత్రాదేవి, యేన = ఏ మహాత్మునిచే, సుప్రజాః = ఉత్తమమైన సంతానముగలది యయ్యెనో, సః లక్ష్మణః = ఆ లక్ష్మణుడు, స్రజశ్చ = పూలమాలలను, సర్వరత్నాని = సమస్తరత్నములను, ప్రియాః = ప్రియమైనట్టి, యాః వరాంగనాః = ఏ సుందరాంగనలు గలరో (తాః = వారిని) విశాలాయాం = విశాలమైనట్టి, పృథివ్యాం అపి = భూమండలమునందుగూడ, దుర్లభం = దుర్లభమైనట్టి ఐశ్వర్యంచ = ఐశ్వర్యమును, త్యక్త్వా = విడిచిపెట్టి, పితరం = తండ్రిని, సమ్మాన్య = గౌరవించి, మాతరం = తల్లిని, అభిప్రసాద్యచ = నచ్చచెప్పియు, రామం = శ్రీరాముని, అనుప్రవ్రాజితః = సన్యాసిగా వెంబడించెను.

తాత్పర్యము :- ఏ మహావీరుని వలన సుమిత్రాదేవి అపూర్వ సంతానవంతురాలని పేరుబడసినదో అట్టి మహాత్ముడైన లక్ష్మణుడు అనాడు తాను అనుభవింపదలచిన విలాసములైన పూలమాలలను, రత్నాభరణములను, ప్రియాంగనలను, భూమండలమున ఎవ్వరికిని లభ్యముగాని ఆ యఖండైశ్వర్యమును తృణప్రాయముగ విడిచి తండ్రిని తగురీతిగా గౌరవించుచు తల్లికి నచ్చజెప్పి అరణ్యమునకు వెడలుచున్న శ్రీరాముని వెంబడించినాడుగదా!.

శ్లో॥ అనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖ మనుత్తమమ్,
అనుగచ్ఛతి కాకుత్స్థం భ్రాతరం పాలయన్ వనే. 59

పదచ్ఛేదము :- అనుకూల్యేన - ధర్మాత్మా - త్యక్త్వా - సుఖం - అనుత్తమమ్ - అనుగచ్ఛతి - కాకుత్స్థం - భ్రాతరం - పాలయన్ - వనే.

అన్వయక్రమము :- ధర్మాత్మా (సః) అనుకూల్యేన అనుత్తమం సుఖం త్యక్త్వా వనే భ్రాతరం కాకుత్స్థం పాలయన్ అనుగచ్ఛతి.

ప్రతిపదార్థము :— ధర్మాత్మా సః = ధర్మాత్ముడైన యాతడు, అనుకూల్యేన = అనుకూలమైన స్వభావముతో, అనుత్తమం = శ్రేష్ఠమైనట్టి, సుఖం = సుఖమును, త్యక్త్వా = విడిచి, వనే = అరణ్యమునందు, భ్రాతరం = సోదరుడైన, కాకుత్థ్సం = శ్రీరాముని, పాలయన్ = సంరక్షించుచు, అనుగచ్ఛతి = అనుసరించుచున్నాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవిందరాజీయము :— 'అనుకూల్యేన అనుగచ్ఛతి' భక్తి భావముతో అనుసరించుచున్నాడు.

వాసుదాసస్వామి :— శ్రీరాముని అర్ధాంగినగుటచే నా కడవులకు రాక తప్పినదిగాదు. లక్ష్మణు డరణ్యములకు రావలసిన కారణములేదు. ఆయన కన్నగారియందుగల భక్తి ప్రపత్తులే అందుకు కారణము.

తాత్పర్యము :— ధర్మాత్ముడైన లక్ష్మణుడు మిక్కిలి అనురాగముతో గొప్పదైన తన సుఖములను అన్నింటిని విడిచి అరణ్యవాసము చేయుచున్న సోదరుని సంరక్షణ కొఱకు అతనిని వెంబడించి వచ్చుచున్నాడు.

శ్లో॥ సింహస్కంధో మహాబాహు ర్మనస్వీ ప్రియదర్శనః,
పితృవ ద్వర్తతే రామే మాతృవ న్మాం సమాచరన్.60

పదచ్ఛేదము :— సింహస్కంధః - మహాబాహుః - మనస్వీ - ప్రియదర్శనః - పితృవత్ - వర్తతే - రామే - మాతృవత్ - మాం - సమాచరన్.

అన్వయక్రమము :— సింహస్కంధః మహాబాహుః మనస్వీ ప్రియదర్శనః (సః) మాతృవత్ మాం సమాచరన్ రామే పితృవత్ వర్తతే.

ప్రతిపదార్థము :- సింహస్కంధః = సింహమువంటి మూపు గలవాడును, మహాబాహుః = బలిష్ఠమైన భుజములుగలవాడును, మనస్వీ = ధీరుడైనవాడును, ప్రియదర్శనః = ప్రియమైన రూపముగలవాడు నగు, సః = అతడు, మాతృవత్ = తల్లినివలెనే, మాం = నన్ను, సమాచరన్ = పరిచరించుచు, రామే = శ్రీరామునియెడ, పితృవత్ = తండ్రియెడవలెనే, వర్తతే = ప్రవర్తించుచుండువాడు.

తాత్పర్యము :- మహావీర లక్షణములు గలవాడు,పరమధీరుడు, ప్రియదర్శనుడు అగు ఆ లక్ష్మణుడు నన్ను తన తల్లినివలెనే సేవించుచు, శ్రీరాముని యెడ తన తండ్రియెడవలె ప్రియముతోడను భక్తితోడను ప్రవర్తించువాడు.

శ్లో॥ హ్రియమాణాం తదా వీరో నతు మాం వేద లక్ష్మణః,
వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా. 61

పదచ్ఛేదము :- హ్రియమాణాం - తదా - వీరః - న - తు - మాం - వేద - లక్ష్మణః - వృద్ధోపసేవీ - లక్ష్మీవాన్ - శక్తః - న - బహుభాషితా.

అన్వయక్రమము :- వృద్ధోపసేవీ లక్ష్మీవాన్, శక్తః, నబహుభాషితా, వీరః లక్ష్మణః తదా హ్రియమాణాం మాం నతువేద.

ప్రతిపదార్థము :- వృద్ధోపసేవీ = పెద్దలను వినయముతో సేవించువాడును, లక్ష్మీవాన్ = శుభలక్షణ సమన్వితుడును, శక్తః = సమర్థుడును, నబహుభాషితా = ఎక్కువగ మాటలాడనివాడునగు, వీరః లక్ష్మణః = వీరుడైన లక్ష్మణుడు, తదా = అనాడు, హ్రియమాణాం = అపహరింపబడుచున్నట్టి, మాం = నన్నుగూర్చి, నతువేద = ఎఱుగనే ఎఱుగడు.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- "వీరః లక్ష్మణః హ్రియమాణాం మాం న వేద" "దుర్వాక్యములచే తన మనస్సునకు బాధగలిగిన ఆ వీరుడైన లక్ష్మణుడు నేనట్లు రక్కసునిచే అపహరింపబడుదు నని తెలిసికొనిలేక పోయెను. లేనిచో నన్నాతడు విడిచి దూరమునకు బోవడు నా దురదృష్టవశము చేతనే అట్లు అంతయును జరిగినదని నా భావము.

తాత్పర్యము :- మహా వినయముతో పెద్దలను సేవించువాడు, సర్వశుభలక్షణ సంశోభితుడు, సమర్థుడైయుండియు ఎక్కువగ మాటలాడని స్వభావముగలవాడు, మహావీరుడు అగు నా మఱది లక్ష్మణుడు అనాడు నన్నా దుర్మార్గుడు అపహరించునని ఏమియు ఎఱుగడుగదా!

శ్లో॥ రాజపుత్రః ప్రియః శ్రేష్ఠ స్సదృశ శ్శ్వశురస్య మే,
మత్తః ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః. 62

పదచ్ఛేదము :- రాజపుత్రః - ప్రియః - శ్రేష్ఠః - సదృశః - శ్వశురస్య - మే - మత్తః - ప్రియతరః - నిత్యం - భ్రాతా - రామస్య - లక్ష్మణః.

అన్వయక్రమము :- ప్రియః శ్రేష్ఠః రాజపుత్రః మే శ్వశురస్య నిత్యం మత్తః ప్రియతరః.

ప్రతిపదార్థము :- మే శ్వశురస్య = నా మామ దశరథునకు, సదృశః = తగినట్టియు, ప్రియః = ప్రియుడైనట్టియు, శ్రేష్ఠః = శ్రేష్ఠుడైనట్టియు, రాజపుత్రః = రాజకుమారుడైనట్టియు, భ్రాతా లక్ష్మణః = తమ్ముడైన లక్ష్మణుడు, నిత్యం = ఎల్లప్పుడును, రామస్య = శ్రీరామునకు, మత్తః = నా కంటెను. ప్రియతరః = మిక్కిలి ఇష్టుడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :- "మత్తః ప్రియః = మహాపి ప్రియః" అనగా నాకును మిక్కిలి ఇష్టుడు.

తిలకము :- రాజపుత్ర ప్రియశ్రేష్ఠః - శ్రీరామునకు ప్రియ
మైన వారిలో శ్రేష్ఠుడు.

తాత్పర్యము :- నా మామయైన దశరథునకు ఎల్లవిధముల
సమానమైన వాడును ప్రియమైన వాడును శ్రేష్ఠుడైన రాజపుత్రుడును అగు
నా మఱది లక్ష్మణుడు శ్రీరామునకు తన అనుంగు తమ్మునిగా నా కంటెను
గూడ మిక్కిలి ప్రియమైనవాడు సుమా!

శ్లో॥ నియుక్తో ధురి యస్యాంతు తా ముద్వహతి వీర్యవాన్,
యం దృష్ట్వా రాఘవో నైవ వృత్త మార్య
మనుస్మరత్. ౬౩
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనా న్మమ,
మృదు ర్నిత్యం శుచి ర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః. ౬౪

పదచ్ఛేదము :- నియుక్తః - ధురి - యస్యాం - తు -
తాం - ఉద్వహతి - వీర్యవాన్ - యం - దృష్ట్వా - రాఘవః - న -
ఏవ - వృత్తం - ఆర్యం - అమస్మరత్ - సః - మమ - అర్థాయ -
కుశలం - వక్తవ్యః - వచనాత్ - మమ - మృదుః - నిత్యం - శుచిః -
దక్షః - ప్రియః - రామస్య - లక్ష్మణః.

అన్వయక్రమము :- (వానరశ్రేష్ఠ!) యః వీర్యవాన్ యస్యాం
ధురి నియుక్తః తాం ఉద్వహతి; రాఘవః యం దృష్ట్వా వృత్తం ఆర్యం
నైవ అనుస్మరత్, సః మృదుః, శుచిః, దక్షః, నిత్యం రామస్య ప్రియః
లక్ష్మణః మమ అర్థాయ మమ వచనాత్ కుశలం వక్తవ్యః.

ప్రతిపదార్థము :- (వానరశ్రేష్ఠ = ఓ వానరోత్తమా) యః
వీర్యవాన్ = ఏ పరాక్రమశాలి, యస్యాంధురి = ఏ (కార్య) భారము
నందు, నియుక్తః = నియోగింపబడినవాడో, తాం = ఆ భారమును,
ఉద్వహతి = చక్కగా నిర్వహించునో, రాఘవః = శ్రీరాముడు, యం =

ఎవరినైతే, దృష్ట్వా = చూచుకొని, వృత్తం అర్యం = చనిపోయిన తండ్రిని, నైవ అనుస్మరత్ = స్మరించకుండెనో, నః = అట్టి, మృదుః = సౌమ్యుడును శుచిః = పరిశుద్ధుడును, దక్షః = సమర్థుడును, రామస్య = రామునకు, నిత్యం = ఎల్లప్పుడును, ప్రియః = ఇష్టుడును అగు, లక్ష్మణః = లక్ష్మణుడు, మమ వచనాత్ = నా మాటవలన, మమ అర్థాయ = నా నిమిత్తము, కుశలం = క్షేమము, వక్తవ్యః = అడుగబడవలయును.

తాత్పర్యము :— ఏ మహావీరుడు తనకు నియోగించిన కార్యభారమును మా సుఖముకొఱకై అతి సమర్థతతో చక్కగా నెఱవేర్చుచుండువాడో, ఎవ్వనిని చూచుకొనుచు శ్రీరాముడు చనిపోయిన తండ్రిని మఱచిపోగలిగినాడో అట్టి సౌమ్య స్వభావుడును, పరిశుద్ధ హృదయుడును, అతి సమర్థుడును, శ్రీరామునకు నిత్యము అత్యంతము ఇష్టమైనవాడును అగు అట్టి మా లక్ష్మణునితో నా మాటగా నా కొఱకై ప్రత్యేకముగా క్షేమ వార్త అడిగితినని చెప్పుము.

శ్లో॥ యథాహి వానర శ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్,
త్వ మస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ. 65
రాఘవ స్త్వత్సమారంభా న్మయి యత్నపరో భవేత్.

పదచ్ఛేదము :— యథా - హి - వానర శ్రేష్ఠ - దుఃఖక్షయకరః - భవేత్ - త్వం - అస్మిన్ - కార్యనిర్యోగే - ప్రమాణం - హరిసత్తమ - రాఘవః - త్వత్సమారంభాత్ - మయి - యత్నపరః - భవేత్.

అన్వయక్రమము :— వానర శ్రేష్ఠ హరిసత్తమ యథా (రాఘవః మమ) దుఃఖ క్షయకరః భవేత్ (తథా) త్వం అస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణంహి; రాఘవః త్వత్సమారంభాత్ మయి యత్నపరః భవేత్.

ప్రతిపదార్థము :— వానరశ్రేష్ఠ = ఓ కపిశ్రేష్ఠుడా! హరిసత్తమ = ఓ వానరోత్తమా!, యథా = ఏ విధముగా, (రాఘవః = శ్రీరాముడు) మమ = నాకు) దుఃఖక్షయకరః = దుఃఖమును పోగొట్టువాడు, భవేత్ = అగునో, (తథా = అట్లు) త్వం = నీవు, అస్మిన్ = ఈ, కార్యనిర్యోగే = కార్యనిర్వహణమునందు, ప్రమాణం హి = అధారముసుమా! రాఘవః = శ్రీరాముడు, త్వత్సమారంభాత్ = నీ ప్రయత్నము వలన, మయి = నాయెడ, యత్నవరః = ప్రయత్నశీలుడు, భవేత్ = కావలెను.

తాత్పర్యము :— ఓ వానరోత్తమా! ఏ విధముగా శ్రీరాముడు నా దుఃఖమును పోగొట్టునట్టివాడు అగునో ఆ విధముగా కార్యమును చక్కబెట్టవలసినవాడవు నీవేసుమా! నీ పూనికవలననే శ్రీరాముడు నా విముక్తి యెడ యత్నపరుడుగావలసియున్నది.

శ్లో॥ ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః,
జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ,
ఊర్ధ్వం మాసా న్నజీవేయం సత్యే నాహం బ్రవీమి తే.

పదచ్ఛేదము :— ఇదం - బ్రూయాః - చ - మే - నాథం - శూరం - రామం - పునః - పునః - జీవితం - ధారయిష్యామి - మాసం - దశరథాత్మజ - ఊర్ధ్వం - మాసాత్ - న - జీవేయం - సత్యేన - అహం - బ్రవీమి - తే.

అన్వయక్రమము :— మే నాథం శూరం రామం పునఃపునః ఇదంచ బ్రూయాః; దశరథాత్మజ! మాసం జీవితం ధారయిష్యామి; మాసాత్ ఊర్ధ్వం న జీవేయం; అహం సత్యేన తే బ్రవీమి.

ప్రతిపదార్థము :— మే = నా యొక్క, నాథం = భర్తయైన, శూరం = శూరుడైన, రామం = రాముని గూర్చి, పునఃపునః = మఱల

మఱల, ఇదంచ = ఈ మాటనుకూడ, బ్రూయాః = చెప్పుము; దశరథాత్మజః = ఓ రామా! మాసం = ఒక్క మాసము, జీవితం = జీవితమును, ధారయిష్యామి = ధరించగలను; మాసాత్ ఊర్ధ్వం = ఒకనెలకన్న మించి, నజీవేయం - బ్రదుకను, అహం = నేను, సత్యేన = యథార్థముగా, తే = నీకు, బ్రవీమి = చెప్పుచున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- లంకను రావణుడిచ్చిన గడువు రెండు నెలలకు మించి యుండగా ఒక్కనెలకే ప్రాణములు విడిచెదనన నేల?

ఇది పదునాలుగవ సంవత్సరము, ఫాల్గుణ మాసము, సీతా రామ లక్ష్మణులు అయోధ్య విడిచినది చైత్రశుద్ధ చతుర్థి. పదునాలుగు సంవత్సరములు పూర్తి యగుటకు పందొమ్మిది దినములే కొఱతయున్నది. పదునైదవ సంవత్సరము మొదటిదినము శ్రీరాముడయోధ్యకు రాకున్నచో భరతు డగ్ని ప్రవేశము చేసెదనని శపథము చేసెను. కావున నేటి కిరువదవనా డయోధ్యలో రామచంద్రమూర్తి యుండక తప్పదు. ఆయన ఇటు రాక అయోధ్యకు బోయెనేని నాయాశ భంగమగును. దానితో ప్రాణములు పోవును. కావున నెల దినములు బ్రదికి యుండెద ననెను.

తాత్పర్యము :- మహావీరుడైన నా భర్తతో ఈ విషయమును మఱల మఱల చెప్పుము. రామా! ఒక్కనెల మాత్రము నేను ప్రాణములను ధరించి యుండగలను. మాసము గడచిన పిమ్మట నేను ప్రాణములతో నుండను. నేను యథార్థముగనే నీకీ విషయమును తెలుపుచున్నాను.

శ్లో॥ రావణే నోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా,
త్రాతు మర్హసి వీర త్వం పాతాళాదివ కౌశికీమ్. 67

పదచ్ఛేదము :- రావణేన - ఉపరుద్ధాం - మాం - నికృత్యా -

పాపకర్మణా - త్రాతుం - అర్హసి - వీర - త్వం - పాతాళాత్ - ఇవ-కౌశికీమ్.

అన్వయక్రమము :- వీర! నికృత్యా పాపకర్మణా రావణేన ఉపరుద్ధాం మాం పాతాళాత్ కౌశికీం ఇవ త్రాతుం అర్హసి.

ప్రతిపదార్థము :- వీర! = ఓ వీరుడా! పాపకర్మణా = పాపాత్ముడైనట్టి, రావణేన = రావణునిచే, నికృత్యా = అవమానముచేత, ఉపరుద్ధాం = నిరోధింపబడినట్టి, మాం = నన్ను, పాతాళాత్ = పాతాళలోకమునుండి, కౌశికీం ఇవ = కౌశికివలె, త్రాతుం = రక్షించుటకు, అర్హసి = తగియున్నావు.

విశేషార్థములు-వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :- 'పాతాళాదివ కౌశికీం' పూర్వము వృత్రాసుర వధచే ఇంద్రునకు బ్రహ్మహత్యా పాతకము సంభవింపగా ఆ ఇంద్రుని యొక్క లక్ష్మి స్వర్గమును విడిచి పాతాళమునకు పోయెను. అప్పుడు భగవానుడగు ఆదినారాయణుని దేవతలందఱును ప్రార్థింపగా ఆతడు పాతాళముననున్న ఆ లక్ష్మిని స్వర్గమునకు గొనివచ్చి దేవేంద్రునకు ప్రసాదించెను. ఆ పురాణ ప్రసిద్ధమైన గాథను ఇచ్చట అనుసంధించుకొనవలెను.

రా. శిరోమణి :- పూర్వము వరాహావతారమున శ్రీ మహావిష్ణువు పాతాళ నిమగ్నయైన కౌశికి అవగా పృథివిని ఉద్ధరించి రక్షించినట్లుగా నని భావము.

గోవింద రాజీయము :- ఉచథ్యుని భార్య యమునలో స్నానము చేయుచుండగా వరుణుడామె నపహరించి పాతాళమునకు గొనిపోయెను. అప్పుడు ఉచథ్యుడు నారదుని ద్వారా తన భార్యను తిరిగి ఇమ్మని వరుణుని యాచించెను. కాని ఆత దియ్యకుండుటచే ఉచథ్యుడు

కుపితుడై పాతాళ హ్రదమును శోషింపజేసి అమెను సంపాదించుకొనెను. ఆ ఉచధ్యుని భార్యయే కౌశికి యని యందురు. (భారతము)

తాత్పర్యము :_ పాపాత్ముడైన రావణునిచే మోసముతో నిరోధింపబడినట్టి నన్ను పాతాళలోకము నుండి పూర్వమింద్రుడు కౌశికి నుద్ధరించినట్లుగా మహావీరుడవైన నీవు నన్ను కాపాడుటకు సమర్థుడవు.

శ్లో॥ తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్,
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ. 68

పదచ్ఛేదము :_ తతః - వస్త్రగతం - ముక్త్వా - దివ్యం - చూడామణిం - శుభమ్ - ప్రదేయః - రాఘవాయ - ఇతి - సీతా - హనుమతే - దదౌ.

అన్వయక్రమము :_ తతః సీతా వస్త్రగతం దివ్యం శుభం చూడామణిం ముక్త్వా రాఘవాయ ప్రదేయః ఇతి (ఉక్త్వా) హనుమతే దదౌ.

ప్రతిపదార్థము :_ తతః = పిమ్మట, సీతా = సీతమ్మ, వస్త్రగతం = చీరయందున్న, దివ్యం = దివ్యమైనట్టి, శుభం = మంగళకరమైనట్టి, చూడామణిం = చూడామణిని (శిరోభూషణమును), ముక్త్వా = (ముడి) విప్పి, రాఘవాయ = శ్రీరామునకు, ప్రదేయః = ఈయవలసియున్నది. ఇతి = అని (ఉక్త్వా = పలికి) హనుమతే = హనుమకు, దదౌ = ఇచ్చెను.

తాత్పర్యము :_ అప్పుడు సీతాదేవి తన చీరకొంగున ముడి వేసియున్న దివ్యమై మంగళకరమైనట్టి తన చూడామణిని విప్పి దీనిని శ్రీరామునకు సమర్పింపుమని హనుమ చేతియందుంచెను.

శ్లో॥ ప్రతిగృహ్యా తతో వీరో మణిరత్న మనుత్తమమ్,
అంగుళ్యా యోజయామాస న హ్యస్య ప్రాభవ ద్భుజః.69

పదచ్ఛేదము :- ప్రతిగృహ్య - తతః - వీరః - మణి రత్నం - అనుత్తమమ్ - అంగుళ్యా - యోజయామాస - న - హి - అస్య - ప్రాభవత్ - భుజః.

అన్వయక్రమము :- తతః వీరః అనుత్తమం మణిరత్నం ప్రతిగృహ్య అంగుళ్యా యోజయామాస; అస్య భుజః న హి ప్రాభవత్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, వీరః = వీరుడైన హనుమ, అనుత్తమం = శ్రేష్ఠమైనట్టి, మణిరత్నం = చూడామణిని, ప్రతిగృహ్య = స్వీకరించి, అంగుళ్యా = వ్రేలితో, యోజయామాస = చేర్చుకొనెను, అస్య = అతనియొక్క, భుజః = భుజము, నహి ప్రాభవత్ = చాలకుండెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు : అంగుళ్యా యోజయామాస; నహ్యస్య ప్రాభవత్ భుజః' - చూడామణి ఆభరణమునందు కేశములు జొనుపుటకై యుండు రంధ్రమున వ్రేలికి తొడుగుకొనెను. హనుమ మిక్కిలి సూక్ష్మరూపమున నున్నాడు గదా! అతనికి దానిని భుజమునకే తొడిగికొన వచ్చుననేమో అనిపించెను. కాని అతని భుజము దానిని తొడుగుకొనుటకు సరిపడలేదు. అందుచేతనే వ్రేలికి తొడిగికొనెనని భావము.

తిలకము :_ చూడామణి భూషణమునకే చిన్నదారమున్నది. దానిని హనుమ తన వ్రేలికి ముడివేసికొనెను దానిని భుజమునకు కట్టు కొనుటకు మాత్రము సరిపడలేదు. అందుచే వ్రేలికి కట్టుకొనెను. అంతియే గాక భుజమునకు కట్టుకొన్నచో ఎల్లవారలకును గాన వచ్చును. తన గుప్పిటి యందుగూడ దాచుటకు వీలుపడదు అనియెంచి హనుమ వ్రేలికి ధరించెను.

తాత్పర్యము :- సీతమ్మయొసగిన ఆ దివ్యమైన చూడామణిని

హనుమ గ్రహించి తన వ్రేలికి తొడిగికొనెను, భుజమునకు కట్టుకొనుట తగదని భావించి అతడు వ్రేలికే ధరించెను

శ్లో॥ మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ,
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః. 70

పదచ్ఛేదము :— మణిరత్నం – కపివరః – ప్రతిగృహ్య – అభివాద్య – చ – సీతాం – ప్రదక్షిణం – కృత్వా – ప్రణతః – పార్శ్వతః – స్థితః

అన్వయక్రమము :— కపివరః మణిరత్నం ప్రతిగృహ్య సీతాం అభివాద్య చ ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః.

ప్రతిపదార్థము :— కపివరః = వానరశ్రేష్ఠుడైన హనుమ, మణిరత్నం = చూడామణిని, ప్రతిగృహ్య = గ్రహించి, సీతాం = సీతమ్మను, అభివాద్య చ = మ్రొక్కియు, ప్రదక్షిణం కృత్వా = ప్రదక్షిణమును గావించి, ప్రణతః = వినయవంతుడై, పార్శ్వతః = ప్రక్కగా, స్థితః = నిలచెను.

విశేషార్థములు–వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :— హనుమంతుడు సీతమ్మకు ప్రదక్షిణము చేసి నమస్కరించినట్లు చెప్పబడుటచే హనుమంతునకు సీతారాములిరువురును సమానులే యైనను భక్తి మల్లు కొంచెము సీతమ్మపైపు వ్రాలెనే మో యని చెప్పవలసియున్నది.

తాత్పర్యము :— అప్పుడు హనుమ ఆ చూడామణి నట్లు గ్రహించి సీతాదేవికి మ్రొక్కి, ప్రదక్షిణము గావించి కొంచముపంచి ప్రక్కగా నిలచియుండెను.

శ్లో॥ హర్షేణ మహతా యుక్తః సీతాదర్శనజేన సః,
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః. 71

పదచ్ఛేదము :- హర్షేణ - మహతా - యుక్తః - సీతాదర్శ నజేన - సః - హృదయేన-గతః - రామం - శరీరేణ - చ - విష్ఠితః.

అన్వయక్రమము :- సః సీతాదర్శనజేన మహతా హర్షేణ యుక్తః హృదయేన రామం గతః, శరీరేణ విష్ఠితః.

ప్రతిపదార్థము :- సః = ఆ హనుమ, సీతాదర్శనజేన = సీతమ్మ యొక్క దర్శనమువలన గల్గినట్టి మహతా = గొప్పదైన, హర్షేణ = ఆనందముతో, యుక్తః = కూడినవాడై, హృదయేన = మనస్సుతో, రామం = శ్రీరాముని, గతః = పొందెను, శరీరేణ = శరీరముచే, విష్ఠితః = విలచియుండెను.

తాత్పర్యము :- ఆ హనుమ సీతాదేవిని దర్శించిన ఆనంద ముతో నిండినవాడై ఒక్క సారిగ మనస్సుతో శ్రీరాముని సన్నిధికి చేరు కొనెను. అతని శరీరము మాత్రమే అచట నుండెను.

శ్లో॥ మణివర ముపగృహ్య తం మహార్హం,
జనకనృపాత్మజయా ధృతం ప్రభావాత్,
గిరిరివ పవనావధూతముక్తః
సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే. 72

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకి రామాయణే సుందరకాండే
"వాయసవృత్తాంతకథనం" నామ
అష్టత్రింశ స్సర్గః

పదచ్ఛేదము :- మణివరం - ఉపగృహ్య - తం - మహా ర్హం - జనకనృపాత్మజయా - ధృతం - ప్రభావాత్ - గిరిః - ఇవ - పవనావధూతముక్తః - సుఖితమనాః - ప్రతిసంక్రమం - ప్రపేదే.

అన్వయక్రమము :- జనకనృపాత్మజయా ప్రభావాత్ ధృతం మహార్హం తం మణివరం ఉపగృహ్య (సః) పవనావధూతముక్తః గిరిః ఇవ సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే.

ప్రతిపదార్థము :- జనకనృపాత్మజయా = జానకీదేవిచే ప్రభావాత్ = మహిమవలన, ధృతం = ధరింపబడినట్టి మహార్హం = అమూల్యమైనట్టి తం మణివరం = ఆ గొప్పదైన చూడామణిని, ఉపగృహ్య = స్వీకరించి, (సః = ఆ హనుమ) పవనావధూతముక్తః = వాయువుయొక్క కంపనమునుండి విడువబడినట్టి, గిరిః ఇవ = పర్వతము వలె, సుఖితమనాః = సంతోషము నొందిన మనస్సు గలవాడై, ప్రతిసంక్రమం = తిరుగు ప్రయాణమును, ప్రపేదే = పూనెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- ప్రభావాత్ ధృతం - సీతాదేవి తన సామర్థ్యముచే రాక్షస స్త్రీల కెవ్వరికిని కాన్పింపకుండ ఆ చూడామణిని ధరించెనని భావము.

వాసుదాసస్వామి :- శ్యమంతకమణివలె నీ మణినందఱును ధరింప యోగ్యులు గారు

తాత్పర్యము :- జానకీదేవి తన ప్రభావ విశేషముచే రాక్షసాంగనల కంటబడకుండ ధరించినట్టి అమూల్యమైన ఆ చూడామణిని ఆమె కడనుండి స్వీకరించి హనుమ పెనుగాలిచే కంపించి మఱల యథాస్థితి నొందిన పర్వతమువలె, సీతాదేవి గాన్పించలేదను దుఃఖముతో వ్యాకులత చెందినను తిరిగి ఆమె దర్శనముచే మహానందము నొంది తన తిరుగు ప్రయాణమునకు సమకట్టెను.

ఇది శ్రీమత్సుందర కాండమునకు "సుబోధిని"
యను ఆంధ్ర వివరణమునందు "వాయస
వృత్తాంత కథనము" అను మువ్వది యెనిమిదవ సర్గము.

శ్రీరామాయ నమః

శ్రీరామశరణగురుభ్యో నమః

అథ శ్రీమద్వాల్మీకిరామాయణే సుందరకాండే

ఏకోనచత్వారింశ స్సర్గః

శ్లో॥ మణిం దత్త్వా తత స్సీతా హనూమంత మ థాబ్రవీత్,
అభిజ్ఞాన మభిజ్ఞాత మేత ద్రామస్య తత్త్వతః. 1

పదచ్ఛేదము :— మణిం - దత్త్వా - తతః - సీతా - హనూమంతం - అథ - అబ్రవీత్ - అభిజ్ఞానం - అభిజ్ఞాతం - ఏతత్ - రామస్య - తత్త్వతః

అన్వయక్రమము — తతః సీతా మణిం దత్త్వా అథ హనూమంతం అబ్రవీత్ "ఏతత్ రామస్య తత్త్వతః అభిజ్ఞాతం అభిజ్ఞానమ్."

ప్రతిపదార్థము :— తతః = పిమ్మట, సీతా = సీతాదేవి మణిం = చూడామణిని, దత్త్వా = ఇచ్చి, అథ = అనంతరము, హనూమంతం = హనుమనుగూర్చి, అబ్రవీత్ = పలికెను, ఏతత్ = ఇది, రామస్య = శ్రీరామునకు, తత్త్వతః = యథార్థముగా, అభిజ్ఞాతం = గుర్తింపబడునట్టి, అభిజ్ఞానం = చిహ్నము.

తాత్పర్యము :— అటుపిమ్మట సీతాదేవి హనుమకు చూడామణి నొసగి అతనితోనిట్లు పలికెను. ఈ చూడామణి రాముడకు నన్ను బాగుగా గుర్తు చేయునట్టి మంచి ఆనవా లగును సుమా.

శ్లో॥ మణిం దృష్ట్వాతు రామో వై త్రయాణాం సంస్మరిష్యతి,
వీరో జనన్యా మమచ రాజ్ఞో దశరథస్యచ. 2

పదచ్ఛేదము :_ మణిం - దృష్ట్వా - తు - రామః - వై - త్రయాణాం - సంస్మరిష్యతి - వీరః - జనన్యాః - మమ - చ - రాజ్ఞః - దశరథస్య - చ.

అన్వయక్రమము :_ వీరః రామః మణిం దృష్ట్వా జనన్యాః, మమచ, రాజ్ఞః దశరథస్యచ త్రయాణాం సంస్మరిష్యతి.

ప్రతిపదార్థము :_ వీరః = వీరుడైనట్టి, రామః= శ్రీరాముడు, మణిం = చూడామణిని, దృష్ట్వా = చూచి, జనన్యాః = తల్లిని, మమచ= నన్నును, రాజ్ఞః = రాజైన, దశరథస్యచ = దశరథునిని, త్రయాణాం= మువ్వురను, సంస్మరిష్యతి = బాగుగ స్మరింపగలడు.

తాత్పర్యము :_ ఈ చూడామణిని చూచినంతనే నా వివాహ సమయమున నాకు దీనిని కానుకగా నొసగిన మహారాజైన దశరథుని, దీనిని నా తలపై అలంకరించినట్టి, నా తల్లిని, ఆ అలంకారమును ధరించి నట్టి నన్నును, ఈ మామువ్వురిని కూడ నా నాథుడు జ్ఞాపకము తెచ్చుకొనును.

శ్లో॥ స భూయ స్త్వం సముత్సాహచోదితో హరిసత్తమ,
అస్మిన్కార్యసమారంభే ప్రచింతయ య దుత్తరమ్. ౩

పదచ్ఛేదము :_ సః - భూయః - త్వం - సముత్సాహచోదితః - హరిసత్తమ - అస్మిన్ - కార్యసమారంభే - ప్రచింతయ - యత్ - ఉత్తరమ్.

అన్వయక్రమము :_ హరిసత్తమ, సః త్వం భూయః సముత్సాహచోదితః (సన్) అస్మిన్ కార్యసమారంభే యత్ ఉత్తరం (తత్) ప్రచింతయ.

ప్రతిపదార్థము :— హరిసత్తమః = ఓ వానరశ్రేష్ఠుడా! సః త్వం = అట్టి నీవు, అస్మిన్ కార్యసమారంభే = ఈ కార్యసమారంభమున, భూయః = ఎక్కువగా, సముత్సాహచోదితః = గొప్పఉత్సాహముచే పేరేపింపబడినవాడవై, యత్ ఉత్తరం = మీది కర్తవ్యము ఏదియో, (తత్ = దానిని) ప్రచింతయ = బాగుగా ఆలోచింపుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

రా. శిరోమణి :— 'సముత్సాహచోదితః'-మనిదర్శనమువలన కలిగినట్టి శ్రీరాముని యుద్ధోత్సాహమును చూచుసమయమున నీవు ఇంకను ఆ శ్రీరామునిచే పేరేపింపబడుదు వని భావము.

తాత్పర్యము :— ఓ వానరశ్రేష్ఠుడా! ఈ ప్రస్తుత కార్యసమారంభమునందు నీవు సమధికోత్సాహ పూరితుడవై భావికర్తవ్యమును గూర్చి బాగుగా ఆలోచింప వలసియున్నది.

శ్లో॥ త్వ మస్మి న్కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
తస్య చింతయ యో యత్నః దుఃఖక్షయకరో భవేత్. 4

పదచ్ఛేదము :— త్వం - అస్మిన్ - కార్యనిర్యోగే - ప్రమాణం - హరిసత్తమ - తస్య - చింతయ - యః - యత్నః - దుఃఖక్షయకరః - భవేత్.

అన్వయక్రమము :— హరిసత్తమ! అస్మిన్ కార్యనిర్యోగే త్వం ప్రమాణమ్. తస్య యః యత్నః దుఃఖక్షయకరః (తం) చింతయ.

ప్రతిపదార్థము :— హరిసత్తమః = ఓ వానరోత్తమా!, అస్మిన్ కార్యనిర్యోగే = ఈ కార్యనిర్వహణమునందు, త్వం = నీవు, ప్రమాణం = ప్రమాణము, తస్య = దానికి, యః యత్నః = ఏ ప్రయత్నము,

దుఃఖక్షయకరః = దుఃఖము నశింపచేయునట్టిది, భవేత్ = అగునో, (తం = దానిని), చింతయ = ఆలోచించుము.

తాత్పర్యము :- వావరోత్తమా! ఈ భావి కార్యనిర్వహణము అంతయును నీ మీదనే ఆధారపడి యున్నది. అందు నా దుఃఖము తొలగి పోవునట్లుగా చేయవలసిన ప్రయత్నము ఎట్టిదో నీవే ఆలోచింపుము.

శ్లో॥ హనుమన్ యత్న మాస్థాయ దుఃఖక్షయకరో భవ.

పదచ్ఛేదము :- హనుమన్ - యత్నం - ఆస్థాయ - దుఃఖక్షయకరః - భవ.

అన్వయక్రమము :- హనుమన్! (త్వం) (తం) యత్నం ఆస్థాయ దుఃఖక్షయకరః భవ.

ప్రతిపదార్థము :- హనుమన్ = ఓ ఆంజనేయా! (త్వం = నీవు) (తం యత్నం = (అట్టి) యత్నమును, ఆస్థాయ = చేపట్టి, దుఃఖక్షయకరః = దుఃఖమును పోగొట్టువాడవు, భవ = అగుము,

తాత్పర్యము :- ఓ హనుమా! నీవే అట్టి తగిన ప్రయత్నమును గావించి నా దుఃఖమును నిర్మూలింప వలసియున్నది సుమా!

శ్లో॥ స తథేతి ప్రతిజ్ఞాయ మారుతి ర్భీమవిక్రమః.
శిరసా ఽఽవంద్య వైదేహీం గమనా యోపచక్రమే.5

పదచ్ఛేదము :- సః - తథా - ఇతి - ప్రతిజ్ఞాయ - మారుతిః - భీమవిక్రమః - శిరసా - అవంద్య - వైదేహీం - గమనాయ - ఉపచక్రమే.

అన్వయక్రమము :- భీమవిక్రమః సః మారుతిః తథా ఇతి ప్రతిజ్ఞాయ వైదేహీం శిరసా అవంద్య గమనాయ ఉపచక్రమే.

ప్రతిపదార్థము :- భీమవిక్రమః = భయంకర పరాక్రముదైన, సః మారుతిః = ఆ హనుమ, తథా ఇతి = అట్లే యని, ప్రతిజ్ఞాయ = ప్రతిజ్ఞచేసి, వైదేహీం = సీతాదేవిని గూర్చి, శిరసా = శిరస్సుతో, అవంద్య = మ్రొక్కి, గమనాయ = పయనమునకు, ఉపచక్రమే = ప్రారంభించెను.

తాత్పర్యము :- మహా పరాక్రమ సంపన్నుడైన హనుమ అట్లే యొనర్చెద నని అమెకు వాగ్దానముచేసి శిరమువంచి మ్రొక్కి తన ప్రయాణమునకు సిద్ధమయ్యెను.

శ్లో॥ జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్,
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్య మబ్రవీత్. 6

పదచ్ఛేదము :- జ్ఞాత్వా - సంప్రస్థితం - దేవీ - వానరం - మారుతాత్మజమ్ - బాష్పగద్గదయా - వాచా - మైథిలీ - వాక్యం - అబ్రవీత్.

అన్వయక్రమము :- దేవీ మైథిలీ మారుతాత్మజం వానరం సంప్రస్థితం జ్ఞాత్వా బాష్పగద్గదయా వాచా వాక్యం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- దేవీ మైథిలీ = పూజ్యురాలయిన జానకీ దేవి, మారుతాత్మజం = వాయునందనుడైన, వానరం = హనుమను, సంప్రస్థితం = బయలుదేరిన వానినిగా, జ్ఞాత్వా = తెలిసికొని, బాష్పగద్గదయా = కన్నీటిచే డగ్గుత్తికపడినట్టి, వాచా = వాక్కుతో, వాక్యం = వాక్యమును అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :— జానకీదేవి హనుమ అటనుండి బయలుదేరు చుండుట గమనించి పొంగుచున్న దుఃఖముచే డగ్గుత్తిక పడిన స్వరముతో అతనిని చూచి ఇట్లు పలికెను.

శ్లో॥ హనుమన్ కుశలం బ్రూయాః సహితౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవంచ సహామాత్యం సర్వాన్ వృద్ధాంశ్చ వానరాన్,
బ్రూయాః స్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్. 7

పదచ్ఛేదము :— హనుమన్ - కుశలం - బ్రూయాః - సహితౌ - రామలక్ష్మణౌ - సుగ్రీవం - చ - సహామాత్యం - సర్వాన్ - వృద్ధాన్ - చ - వానరాన్ - బ్రూయాః - త్వం - వానరశ్రేష్ఠ - కుశలం - ధర్మసంహితమ్.

అన్వయక్రమము :— హనుమన్, సహితౌ రామలక్ష్మణౌ త్వం కుశలం బ్రూయాః; వానరశ్రేష్ఠ, సహామాత్యం సుగ్రీవంచ, వృద్ధాన్ వానరాన్ చ ధర్మసంహితం కుశలం బ్రూయాః.

ప్రతిపదార్థము :— హనుమన్ = ఓ అంజనేయా!, సహితౌ = కలసికొన్నట్టి, రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను, త్వం = నీవు, కుశలం = క్షేమమును, బ్రూయాః = పలుకుము, వానరశ్రేష్ఠ = ఓ వానరోత్తమా! సహామాత్యం = మంత్రులతో గూడినట్టి, సుగ్రీవంచ = సుగ్రీవునిని, వృద్ధాన్ = పెద్దలైనట్టి, వానరాన్ సర్వాన్ చ = వానరుల నందఱిని గూడ, ధర్మసంహితం = ధర్మసంయుతముగా, కుశలం = క్షేమమును, బ్రూయాః = పలుకుము.

తాత్పర్యము :— ఓ అంజనేయా! అన్నదమ్ములైన రామ లక్ష్మణుల నిరువురను కుశలము నడిగితినని చెప్పుము. మఱియు తన మంత్రులతో గూడియున్న సుగ్రీవుని, అచ్చటగల పెద్దలైన వానరుల నెల్లరను ధర్మసమ్మతముగ నేను క్షేమము నడుగుచున్నట్లుగా తెలుపుము.

శ్లో॥ యథాచ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః,
అస్మాత్ దుఃఖాంబుసంరోధా త్త్వం సమాధాతు మర్హసి.

పదచ్ఛేదము :— యథా - చ - సః - మహాబాహుః - మాం - తారయతి - రాఘవః - అస్మాత్ - దుఃఖాంబుసంరోధాత్ - త్వం - సమాధాతుం - అర్హసి.

అన్వయక్రమము :— సః మహాబాహుః రాఘవః అస్మాత్ దుఃఖాంబుసంరోధాత్ యథా మాం తారయతిచ, త్వం (తథా) సమాధాతుం అర్హసి

ప్రతిపదార్థము :— మహాబాహుః = మహావీరుడైన, సః రాఘవః = ఆ శ్రీరాముడు, మాం = నన్ను, అస్మాత్ = ఈ, దుఃఖాంబు సంరోధాత్ = దుఃఖమనెడి ఉప్పెననుండి, యథా = ఏ విధముగా, తారయతి = దాటించునో తథా = ఆ రీతిగా, త్వం = నీవు, సమాధాతుం = ఒనరించుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :— మహావీరుడైన శ్రీరాముడు నన్ను దుఃఖ సముద్రము నుండి ఎట్లు దాటింపగలడో ఆ విధానమును నీవే సమకూర్చుటకు అర్హుడవు సుమా!

శ్లో॥ జీవంతీం మాం యథా రామ స్సంభావయతి కీర్తిమాన్,
తత్త్వయా హనుమ న్వాచ్యం వాచా ధర్మ మవాప్నుహి.

పదచ్ఛేదము :— జీవంతీం - మాం - యథా - రామః - సంభావయతి - కీర్తిమాన్ - తత్ - త్వయా - హనుమన్ - వాచ్యం - వాచా - ధర్మం - అవాప్నుహి.

అన్వయక్రమము :— హనుమన్! కీర్తిమాన్ రామః జీవం

తిం మాం యథా సంభావయతి తత్ త్వయా వాచ్యం, వాచా ధర్మం అవాప్నుహి.

ప్రతిపదార్థము :- హనుమన్ = ఓ ఆంజనేయా, కీర్తిమాన్ = యశశ్శాలియైన, రామః = శ్రీరాముడు, జీవంతం మాం = బ్రదికియున్నట్టి, నన్ను, యథా = ఎట్లుగా, సంభావయతి = ఆదరించునో, తత్ = ఆ విధమును, త్వయా = నీచే, వాచ్యం = చెప్పబడవలెను, వాచా = మాటతో, ధర్మం = ధర్మమును, అవాప్నుహి = పొందుము.

తాత్పర్యము :- ఓ ఆంజనేయా! కీర్తిశాలియైన శ్రీరాముడు నేను జీవించియుండగనే నన్ను చేరి ఆదరించునట్లుగా నీ పలనితో తగు విధముగా పలుకవలెను. ఈ మాట సహాయముచేసి నీవు పుణ్యముగట్టుకొనుము.

శ్లో॥ నిత్య ముత్సాహయుక్తాశ్చ వాచ శ్రుత్వా త్వయేరితాః,
వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే. 10

పదచ్ఛేదము :- నిత్యం - ఉత్సాహయుక్తాః - చ - వాచః - శ్రుత్వా - త్వయా - ఈరితాః - వర్ధిష్యతే - దాశరథేః - పౌరుషం - మదవాప్తయే.

అన్వయక్రమము :- నిత్యం త్వయా ఈరితాః ఉత్సాహయుక్తాః వాచః శ్రుత్వా దాశరథేః మదవాప్తయే పౌరుషం వర్ధిష్యతే;

ప్రతిపదార్థము :- నిత్యం = నిరంతరము, త్వయా = నీచేత, ఈరితాః = పలుకబడినట్టి, ఉత్సాహయుక్తాః = ఉత్సాహకరములైనట్టి, వాచః = మాటలను, శ్రుత్వా = విని దాశరథేః = శ్రీరామునకు, మదవాప్తయే = నన్నుపొందుటకై, పౌరుషం = పౌరుషము, వర్ధిష్యతే = వృద్ధినొందగలదు.

తాత్పర్యము :- ఉత్సాహమును కల్గించునట్టి నీ మాటలు నిత్యము వినుచుండుటవలన శ్రీరామునిలో నన్ను సంపాదించుటకై గొప్ప పౌరుషము పెంపొందును,

శ్లో॥ మత్సందేశయుతా వాచ స్త్వత్త శ్శ్రుత్వాచ రాఘవః,
పరాక్రమే మతిం వీరో విధివ త్సంవిధాస్యతి. 11

పదచ్ఛేదము :- మత్సందేశయుతాః - వాచః - త్వత్తః - శ్రుత్వా - చ - రాఘవః - పరాక్రమే - మతిం - వీరః - విధివత్ - సంవిధాస్యతి.

అన్వయక్రమము :- వీరః రాఘవః త్వత్తః మత్సందేశయుతాః వాచః శ్రుత్వాచ విధివత్ పరాక్రమే మతిం సంవిధాస్యతి.

ప్రతిపదార్థము :- వీరః = వీరుడైనట్టి, రాఘవః = శ్రీరాముడు, త్వత్తః = నీ నుండి, మత్సందేశయుతాః = నా సందేశముతో గూడినట్టి, వాచః = మాటలను, శ్రుత్వాచ = వినినంతనే, విధివత్ = తగుపద్ధతిననుసరించి, పరాక్రమే = పరాక్రమించుటయందు, మతిం = నిశ్చయమును, సంవిధాస్యతి = కావించును.

తాత్పర్యము :- మహావీరుడైన శ్రీరాముడు నీవు తెలిపినట్టి నా సందేశ వాక్యములను వినినంతనే న్యాయమైన విధానమున తన పరాక్రమము జూపుటకు నిర్ణయమును తీసికొనగలడు.

శ్లో॥ సీతాయా వచనం శ్రుత్వా హనుమా న్మారుతాత్మజః,
శిర స్యంజలి మాధాయ వాక్య ముత్తర మబ్రవీత్. 12

పదచ్ఛేదము :- సీతాయాః - వచనం - శ్రుత్వా - హను

మాన్ - మారుతాత్మజః - శిరసి - అంజలిం - ఆధాయ - వాక్యం - ఉత్తరం - అబ్రవీత్.

అన్వయక్రమము :- మారుతాత్మజః హనుమాన్ సీతాయాః వచనం శ్రుత్వా శిరసి అంజలిం ఆధాయ ఉత్తరం వాక్యం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- మారుతాత్మజః = పవనసుతుడైనట్టి, హనుమాన్ = అంజనేయుడు, సీతాయాః = సీతయొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, శిరసి = తలపై, అంజలిం = దోసిలిని, ఆధాయ = ఉంచి, ఉత్తరం వాక్యం = సమాధాన వాక్యమును, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- పవన నందనుడైన హనుమ సీతమ్మమాటలను విని తలవంచి దోసిలి యొగ్గి ఈ రీతిగ పలుకదొడగెను.

శ్లో॥ క్షిప్ర మేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరై ర్వృతః,
యస్తే యుధి విజి త్యారీన్ శోకం వ్యపనయిష్యతి. 13

పదచ్ఛేదము :- క్షిప్రం - ఏష్యతి - కాకుత్స్థః - హర్యృక్షప్రవరైః - వృతః - యః - తే - యుధి - విజిత్య - అరీన్ - శోకం - వ్యపనయిష్యతి.

అన్వయక్రమము :- యః యుధి అరీన్ విజిత్య తే శోకం వ్యపనయిష్యతి, సః కాకుత్స్థః హర్యృక్షప్రవరైః వృతః క్షిప్రం ఏష్యతి.

ప్రతిపదార్థము :- యః = ఏ మహాత్ముడు, యుధి = యుద్ధమునందు, అరీన్ = శత్రువులను, విజిత్య = జయించి, తే = నీ యొక్క, శోకం = దుఃఖమును, వ్యపనయిష్యతి = తొలగింపగలడో, సః కాకుత్స్థః = ఆ శ్రీరాముడు, హర్యృక్షప్రవరైః = వానరుల యొక్కయు, భల్లూకముల యొక్కయు వీరులతో, వృతః = కూడినవాడై, క్షిప్రం = శీఘ్రముగ, ఏష్యతి = రాగలడు.

తాత్పర్యము :_ యుద్ధభూమియందు శత్రువులను దునుమాడి నీ శోకము నిర్మూలింపచేయునట్టి వీరుడైన ఆ కాకుత్థ్సుడు వానరవీరుల తోను, భల్లూకయోధులతోను కలసి అచిరకాలములోనే ఇటకు రాగలై యున్నాడు.

శ్లో॥ నహి పశ్యామి మర్త్యేషు నాసు రేషు సు రేషువా,
యస్తస్య క్షిపతో బాణా న్స్థాతు ముత్సహతే౽గ్రతః.

పదచ్ఛేదము :_ న - హి - పశ్యామి - మర్త్యేషు - న - అసురేషు - సురేషు - వా - యః - తస్య - క్షిపతః - బాణాన్ - స్థాతుం - ఉత్సహతే - అగ్రతః.

అన్వయక్రమము :_ మర్త్యేషు అసురేషు సురేషువా బాణాన్ క్షిపతః తస్య అగ్రతః స్థాతుం యః ఉత్సహతే (తం) నహిపశ్యామి.

ప్రతిపదార్థము :_ మర్త్యేషు= మానవులందుగాని, అసురేషు= రాక్షసులందుగాని, సురేషువా = దేవతలందుగాని, బాణాన్ = శరములను, క్షిపతః = ప్రయోగించుచున్నట్టి, తస్య = ఆ శ్రీరామునియొక్క, అగ్రతః = ఎదుట, స్థాతుం = నిలచుటకు, యః = ఎవ్వడు, ఉత్సహతే= ఉత్సహించునో, (తం = అట్టివానిని) నహిపశ్యామి = ఎంత మాత్రము చూడను.

తాత్పర్యము :_ మానవులందుగాని, దానవులందుగాని, దేవతలందుగాని, యుద్ధభూమిలో బాణములను వర్షించుచున్న ఆ శ్రీరాముని ఎదురుగ నిలుచుట కంగీకరించు వీరుని నేను ఎందును గానను.

శ్లో॥ అప్యర్కమపిపర్జన్య మపివైవస్వతంయమమ్,
సహి సోఢుం రణే శక్తస్తవహేతో ర్విశేషతః. 15

పదచ్ఛేదము :- అపి - అర్కం - అపి - పర్జన్యం - అపి - వైవస్వతం - యమమ్ - సః - హి - సోఢుం - రణే - శక్తః - తవ - హేతోః - విశేషతః.

అన్వయక్రమము :- సః రణే అర్కంఅపి పర్జన్యంఅపి, వైవస్వతంయమంఅపి సోఢుం శక్తః హి; తవహేతోః విశేషతః శక్తః (భవతి).

ప్రతిపదార్థము :- సః = అతడు, రణే = యుద్ధమునందు, అర్కం అపి = సూర్యునైనను, పర్జన్యం అపి = ఇంద్రునైనను, వైవస్వతంయమం అపి = వివస్వంతుని సుతుడైన యమునైనను, సోఢుం = నహించుటకు, శక్తః హి = సమర్థుడుసుమా; తవహేతోః = నీ నిమిత్తమై, విశేషతః = ఇంకను మిక్కిలిగా, శక్తః = సమర్థుడు, (భవతి = అగును)

తాత్పర్యము :- వీరుడైన ఆ శ్రీరాముడు రణరంగమునందు సూర్యుడెదుర్కొన్నను, దేవేంద్రుడే ఎదుటనిలచినను యమధర్మరాజే వచ్చిఎదిరించినను అవలీలగ నోడింపగలడు సుమా; అందునను నీ కొఱకే యైనచో వేఱుగా చెప్పనక్కఱలేదు.

శ్లో॥ సహి సాగరపర్యంతాం మహీం సాధితు మర్హతి,
త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనందిని. 16

పదచ్ఛేదము :- సః - హి - సాగరపర్యంతాం - మహీం - సాధితుం - అర్హతి - త్వన్నిమిత్తః - హి - రామస్య - జయః - జనకనందిని

అన్వయక్రమము :- సః సాగరపర్యంతాం మహీం సాధితుం అర్హతిహి; జనకనందిని; రామస్య జయః త్వన్నిమిత్తః హి.

ప్రతిపదార్థము :— సః = ఆ శ్రీరాముడు, సాగరపర్యంతాం = సముద్రముల వఱకునుగల, మహీం = వసుధను, సాధితుం = వశపఱచు కొనుటకు, అర్హతిహి = సమర్థుడు అగుచున్నాడు సుమా! జనకనందిని! = ఓ జనకపుత్రీ!, రామస్య = శ్రీరామునకు, జయః = విజయము, త్వన్నిమిత్తః హి = నీ నిమిత్తమైనదే సుమా!

తాత్పర్యము :— ఆ మహావీరుడు సాగరపర్యంతముగల భూమండలము నంతను స్వాధీనముచేసికొనగల సమర్థుడు! తల్లీ! శ్రీరాముడు సాధించు ఈ విజయమంతయు నీ గుఱించియే సుమా!

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్సత్యం సుభాషితమ్,
జానకీ బహుమేనే తం వచనం చేద మబ్రవీత్. 17

పదచ్ఛేదము :— తస్య - తత్ - వచనం - శ్రుత్వా - సమ్యక్ - సత్యం - సుభాషితమ్ - జానకీ - బహు - మేనే; - తం - వచనం - చ - ఇదం - అబ్రవీత్.

అన్వయక్రమము :— తస్య సత్యం సుభాషితం తద్వచనం సమ్యక్ శ్రుత్వా జానకీ తం వచనం బహు మేనే ఇదం వచనం అబ్రవీత్ చ.

ప్రతిపదార్థము :— తస్య = హనుమంతుని యొక్క, సత్యం = యథార్థమైనదియును, సుభాషితం = చక్కగ చెప్పబడినదియు నగు, తద్వచనం = ఆ మాటను, సమ్యక్ = లెస్సగా, శ్రుత్వా = విని, జానకీ = సీతాదేవి తం = ఆ హనుమను, బహుమేనే = మెచ్చుకొనెను, ఇదం వచనం = ఈ మాటను, అబ్రవీత్ చ = పలికెను కూడ.

తాత్పర్యము :— హనుమంతుడు పలికినట్టి యథార్థమైన ఆ మంచిమాటలను సీతాదేవి సంతోషముగావిని ఎంతయు మెచ్చుకొని అతనితో తిరిగి ఇట్లు పలికెను.

శ్లో॥ తత స్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునఃపునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దా దనుమానయత్.

పదచ్ఛేదము :- తతః - తం - ప్రస్థితం - సీతా - వీక్షమాణా - పునః - పునః - భర్తృస్నేహాన్వితం - వాక్యం - సౌహార్దాత్- (బ్రువన్) అనుమానయత్.

అన్వయక్రమము :- తతః సీతా ప్రస్థితం తం పునః పునః వీక్షమాణా సౌహార్దాత్ భర్తృస్నేహాన్వితం వాక్యం (బ్రువన్) అనుమానయత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, సీతా = సీతాదేవి, ప్రస్థితం = బయలుదేరినట్టి తం = ఆ హనుమను, పునః పునః = తిరిగి తిరిగి' వీక్షమాణా = చూచుచున్నదై, సౌహార్దాత్ = స్నేహమువలన, భర్తృస్నేహాన్వితం = భర్తృప్రేమతోగూడినట్టి, వాక్యం = వాక్యమును, (బ్రువన్ = పలుకుచు) అనుమానయత్ = గౌరవించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'భర్తృస్నేహాన్వితం వాక్యం అనుమానయత్' తన భర్తపై స్నేహముతో హనుమపలికిన మాటను సీతమ్మ ప్రేమతో గౌరవించెను.

రా. శిరోమణి :- ప్రస్థితం తం అనుమానయత్ - తిరుగుముఖముబట్టి బయలుదేరిన హనుమను సీతాదేవి మిక్కిలి గౌరవించినదని భావము.

గోవిందరాజీయము :- 'వాక్యం అనుమానయత్' మొంచు ... గౌరవించుచు పలికినదని భావము.

మహేశ్వరతీర్థులు :— 'వాక్యం అనుమానయత్' హనుమంతుడు పలికిన మాటలను గౌరవించుచున్నదై అని అన్వయము

తాత్పర్యము :— పిమ్మట తిరిగి వెడలి పోవసమకట్టిన హనుమంతుని మఱల మఱల జూచుచు సీతాదేవి భర్తయందలి ప్రేమచే గౌరవపూర్వకముగా అతనితో తిరిగి ఇట్లు పలికెను.

శ్లో॥ యదివా మన్యసే వీర వసైకాహ మరిందమ.
కస్మింశ్చి త్సంవృతే దేశే విశ్రాంత శ్శ్వో గమిష్యసి. 19

పదచ్ఛేదము :— యది - వా - మన్యసే - వీర - వస - ఏకాహం - అరిందమ - కస్మిన్ - చిత్ - సంవృతే - దేశే - విశ్రాంతః - శ్వః - గమిష్యసి.

అన్వయక్రమము :— వీరః అరిందమః యదివా మన్యసే ఏకాహం వస; కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతః (సన్)శ్వః గమిష్యసి.

ప్రతిపదార్థము :— వీర = మహావీరుడా! అరిందమ = శత్రు సంహారకుడా! యదివా మన్యసే = తలచుచున్నయెడల, ఏకాహం = ఒక్కదినము, వస = వసింపుము, కస్మింశ్చిత్ = ఏదియైన, సంవృతే = గూఢమైనట్టి, దేశే = ప్రదేశమునందు, విశ్రాంతః (సన్) = విశ్రమించినవాడవై, శ్వః = రేపు, గమిష్యసి = వెడలగలవు.

తాత్పర్యము :— శత్రుసంహారకుడవైన ఓ మహావీరుడా! నీ కిష్టమైనచో ఇంకొక్కదినము వసింపుము. పరులకు కానరాకుండ గూఢమైన ఏ ప్రదేశమందైనను విశ్రాంతి తీసికొని రేపు వెడలిపోవచ్చును.

శ్లో॥ మమ చైవాల్పభాగ్యాయాః సాన్నిధ్యా త్తవ వానర,
అస్య శోకస్య మహతః ముహూర్తం మోక్షణం భవేత్.

పదచ్ఛేదము :— మమ - చ - ఏవ - అల్పభాగ్యాయాః - సాన్నిధ్యాత్ - తవ - వానర - అస్య - శోకస్య - మహతః - ముహూర్తం - మోక్షణం - భవేత్.

అన్వయక్రమము :— వానరః అల్పభాగ్యాయాః మమచ తవ సాన్నిధ్యాత్ అస్య మహతః శోకస్య ముహూర్తం మోక్షణం భవేత్

ప్రతిపదార్థము :— వానరః = ఓ హనుమాః అల్పభాగ్యాయాః = మందభాగ్యురాలనైనట్టి మమచ = నాకును, తవ = నీ యొక్క, సాన్నిధ్యాత్ = దగ్గరనుండుటవన, అస్య = ఈ, మహతః = గొప్పదైన, శోకస్య = దుఃఖమునకు, ముహూర్తం = క్షణకాలము, మోక్షణం = విముక్తి, భవేత్ = అగును.

తాత్పర్యము :— ఓ అంజనేయా! నీవు నా యొద్ద ఇంకను కొద్దికాల ముండుము. మంద భాగ్యురాలనైన నాకు ఆ కొద్దికాలమైనను నన్ను దహించుచున్న ఈ శోకతాపము నుండి విమోచనము కలుగును.

శ్లో॥ గతేహి హరిశార్దూల పునరాగమనాయతు,
ప్రాణానామపి సందేహో మమ స్యా న్నాత్ర సంశయః.

పదచ్ఛేదము :— గతే - హి - హరిశార్దూల - పునః - అగమనాయ - తు - ప్రాణానాం - అపి - సందేహః - మమ - స్యాత్ - న - అత్ర - సంశయః.

అన్వయక్రమము :— హరిశార్దూల! పునః అగమనాయ(త్వయి) గతే (సతి) హి మమ ప్రాణానాం అపి సందేహః స్యాత్: అత్రసంశయః న (అస్తి).

ప్రతిపదార్థము :— హరిశార్దూల = ఓ వానరశ్రేష్ఠుడా! పునః అగమనాయ = తిరిగివచ్చుటకై, త్వయి = నీవు, గతే (సతి) హి =

వెళ్ళినవాడవుకాగా, మమ = నా యొక్క, ప్రాణానాం అపి = ప్రాణములకుగూడ సందేహః - సంశయము స్యాత్ = అగును, అత్ర = ఈ విషయమున, సంశయః = సందేహము, న (అస్తి) లేదు.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! మఱల వచ్చుటకై నీ విప్పుడు వెడలిపోయినచో మఱల నాయాతన ఆరంభమై నా ప్రాణములకే సంశయము వాటిల్లును. ఇందు సందేహములేదు.

శ్లో॥ తవాదర్శనజః శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖా ద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర. 22

పదచ్ఛేదము :- తవ - అదర్శనజః - శోకః - భూయః - మాం - పరితాపయేత్ - దుఃఖాత్ - దుఃఖపరావృష్టాం - దీపయన్ - ఇవ - వానర.

అన్వయక్రమము :- వానర! దుఃఖాత్ దుఃఖపరామృష్టాం మాం తవ అదర్శనజః శోకః దీపయన్ ఇవ భూయః పరితాపయేత్.

ప్రతిపదార్థము :- వానర! = ఓ హనుమా! దుఃఖాత్ = దుఃఖమునుండి, దుఃఖపరామృష్టాం = దుఃఖములచే కప్పబడుచున్నట్టి, మాం = నన్ను తవ = నీ యొక్క, అదర్శనజః = దర్శనము లేనందువలన గలిగినట్టి, శోకః = దుఃఖము, భూయః = ఇంకను, దీపయన్ ఇవ = మండించుచున్నట్లుగా, పరితాపయేత్ = మిక్కిలిగ తపింపజేయును.

తాత్పర్యము :- ఓ వానరోత్తమా! ఒక దుఃఖము పిమ్మట ఇంకొక దుఃఖము కప్పివేయుచున్ననాకు నీ సాన్నిధ్యముగూడ దూరమైన యెడల ఈ శోకము ఇంకను నన్ను దహించి నాకు అమితమైన సంతాపము కలుగజేయును సుమా!

శ్లో॥ అయంచ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర.23

పదచ్ఛేదము :- అయం - చ - వీర - సందేహః - తిష్ఠతి- ఇవ - మమ - అగ్రతః - సుమహాన్ - త్వత్సహాయేషు- హర్యృక్షేషు - హరీశ్వర.

అన్వయక్రమము :- వీర! హరీశ్వర! త్వత్సహాయేషు హర్యృక్షేషు సుమహాన్ సందేహః మమ అగ్రతః తిష్ఠతి ఇవ.

ప్రతిపదార్థము :- వీర! = మహావీరుడవైన, హరీశ్వర = వానరశ్రేష్ఠుడా! త్వత్సహాయేషు = నీకుసహాయకులైనట్టి, హర్యృక్షేషు = వానరభల్లూకముల విషయమున, సుమహాన్ = మిక్కిలిగొప్పదైన, అయం సందేహః = ఈ సందేహము, మమ అగ్రతః = నా యెదుట, తిష్ఠతి ఇవ (అస్తి) = నిలచియున్నట్లున్నది,

తాత్పర్యము :- ఓ వీరాగ్రేసరా! నీకు సహాయకులైన మీ వానర భల్లూకముల విషయమున గొప్పసందేహమొకటి యెదురై నన్ను వేధించుచున్నది.

శ్లో॥ కథంనుఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. 24

పదచ్ఛేదము :- కథం - ను - ఖలు - దుష్పారం - తరిష్యంతి - మహోదధిమ్ - తాని - హర్యృక్షసైన్యాని - తౌ - వా - నరవరాత్మజౌ.

అన్వయక్రమము :- దుష్పారం మహోదధిం తాని హర్యృక్షసైన్యాని, తౌ నరవరాత్మజౌ వా కథంనుఖలు తరిష్యంతి?

ప్రతిపదార్థము :- దుష్పారం = దాటశక్యముగాని, మహోదధిం = మహాసముద్రమును, తాని = ఆ, హర్యృక్షసైన్యాని = వానర

భల్లూకసైన్యములుగాని, తౌ = ఆ, నరవరాత్మజౌవా = రాజకుమారు లిరువురుగాని, కథంనుఖలు = ఎట్లుగ, తరిష్యంతి = దాటగలరు?

తాత్పర్యము :_ హనుమా! మీ వానరభల్లూకసైన్యములుగాని, ఆ రాజపుత్రు లిరువురుగాని దాట శక్యముగానట్టి, ఈ మహాసాగరమును ఏ రీతిగ దాటి రాగలరు?

శ్లో॥ త్రయాణామేవ భూతానాం సాగర స్యేహ లంఘనే,
శక్తి స్స్యా ద్వైనతేయస్య తవవా మారుతస్యవా. 25

పదచ్ఛేదము :_ త్రయాణాం - ఏవ - భూతానాం - సాగరస్య - అస్య - లంఘనే - శక్తిః - స్యాత్ - వైనతేయస్య - తవ - వా - మారుతస్య - వా.

అన్వయక్రమము :_ అస్య సాగరస్య లంఘనే వైనతేయస్య వా తవవా మారుతస్యవా త్రయాణాం భూతానాం ఏవ శక్తిః స్యాత్.

ప్రతిపదార్థము :_ అస్య = ఈ, సాగరస్య = సముద్రముయొక్క, లంఘనే = లంఘనమునందు, వైనతేయస్యవా = గరుత్మంతునకుగాని, తవవా = నీకుగాని, మారుతస్యవా = వాయువునకుగాని, త్రయాణాం భూతానాంఏవ = మూడు ప్రాణులకు మాత్రమే, శక్తిః = సామర్థ్యము, స్యాత్ = ఉండును.

తాత్పర్యము :_ ఈ సాగరమును లంఘించుటకు గరుత్మంతునకును నీకును వాయుదేవునకును మాత్రమే శక్తిగలదు. ఈ ముమ్వురు తప్ప వేఱెవ్వరిచ్చట ఈ సాగర లంఘనమునకు సమర్థులున్నారు.

శ్లో॥ త దస్మి న్కార్యనిర్యోగే వీ రైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం త్వంహి కార్యవిదాంవరః. 26

పదచ్ఛేదము :- తత్ - అస్మిన్ - కార్యనిర్యోగే - వీర - ఏవం - దురతిక్రమే - కిం - పశ్యసి - సమాధానం - త్వం - హి - కార్యవిదాం - వరః.

అన్వయక్రమము :- తత్ వీర! ఏవం దురతిక్రమే అస్మిన్ కార్యనిర్యోగే కిం సమాధానం పశ్యసి? త్వం కార్యవిదాం వరః హి.

ప్రతిపదార్థము :- తత్ = అకారణమున, వీరః = ఓ వీరుడా! ఏవం = ఈ రీతిగా, దురతిక్రమే = అసాధ్యమైనట్టి, అస్మిన్ = ఈ, కార్యనిర్యోగే = కార్యనిర్వహణమునందు, కిం సమాధానం = ఏమి సమాధానమును, పశ్యసి = కనుగొనుచున్నావు, త్వం = నీవు, కార్యవిదాం = కార్యవేత్తలలో, వరఃహి = శ్రేష్ఠుడవుగదా!

తాత్పర్యము :- ఓ మహావీరుడా! ఇట్టి అసాధ్యమైన ఈ కార్యమును నిర్వహించుటకై చేయదగు కర్తవ్యమెట్టిదని యెంచుచున్నావు? నీవే కార్యసాధకులలో అగ్రగణ్యుడవు సుమా!

శ్లో॥ కామ మస్య త్వ మే వైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే ఫలోదయః. 27

పదచ్ఛేదము :- కామం - అస్య - త్వం - ఏవ - ఏకః - కార్యస్య - పరిసాధనే - పర్యాప్తః - పరవీరఘ్న - యశస్యః - తే - ఫలోదయః.

అన్వయక్రమము :- పరవీరఘ్న! అస్య కార్యస్య పరిసాధనే త్వం ఏకః ఏవ కామం పర్యాప్తః; ఫలోదయః తే యశస్యః.

ప్రతిపదార్థము :- పరవీరఘ్న = శత్రువీరులను పరిమార్చునట్టి హనుమా, అస్య కార్యస్య = ఈ కార్యము యొక్క, పరిసాధనే = నిర్వహణమునందు, త్వం = నీవు, ఏకః ఏవ = ఒక్కడవే, కామం =

మిక్కిలిగా, పర్యాప్తః = చాలినట్టివాడవు, ఫలోదయః = ఫలప్రాప్తి, కుతే = నీ, యశస్యః = కీర్తికరమైనట్టిది.

తాత్పర్యము :- శత్రుసంహారకుడవైన ఓ హనుమా! నన్ను విడిపించి, రామునికడచేర్చునట్టి ఈ కార్యమును నిర్వహించుటకు నీ వొక్కడవే సమర్థుడవు. ఈ కార్యనిర్వహణము నీ కెంతయో కీర్తిని గూర్చును.

శ్లో॥ బలైః స్సమగ్రైః ర్యది మాం రావణం జిత్య సంయుగే,
విజయీ స్వపురం యాయా త్తి త్తస్య సదృశం భవేత్.

పదచ్ఛేదము :- బలైః - సమగ్రైః - యది - మాం - రావణం - జిత్య - సంయుగే - విజయీ - స్వపురం - యాయాత్ - తత్ - తస్య - సదృశం - భవేత్.

అన్వయక్రమము :- (రామః) సమగ్రైః బలైః సంయుగే రావణం జిత్య విజయీ (సన్) మాం (గృహీత్వా) స్వపురం యాయాత్ యది తత్ తస్య సదృశం భవేత్.

ప్రతిపదార్థము :- (రామః = శ్రీరాముడు), సమగ్రైః = సమగ్రములైన, బలైః = సైన్యములతో, సంయుగే = యుద్ధమునందు, రావణం = రావణుని, జిత్య = జయించి, విజయీ (సన్) = విజయము గలవాడై, మాం = నన్ను, (గృహీత్వా = తీసికొని), స్వపురం = తన నగరమునుగూర్చి, యాయాత్ యది = వెడలినయెడల, తత్ = అది, తస్య = అతనికి, సదృశం = యుక్తమైనది, భవేత్ = కాగలదు.

సూచన :- ఇచ్చట తత్ తస్య సదృశం భవేత్ అనుటకు బదులుగా, తత్తుమే స్యాత్ యశస్కరం అనికొన్ని ప్రతులలోని పాఠము. ఈ పక్షమున, నీవు రాక్షసులను హతమార్చి నన్నుగొని పోవుటకంటె శ్రీరాముడే వచ్చి రావణుని ఓడించి నన్నుగొని పోవుటయే నాకు ప్రతిష్ఠాకరమైన విషయము గాగల దని భావము.

తాత్పర్యము :— శ్రీరాముడు సమగ్రములైన సైన్యములతో ఇచటికివచ్చి రణరంగమున రావణుని జయించి విజయోపేతుడై నన్ను తన పురమునకు గొనిపోవుటయే అతని పరాక్రమమునకు యుక్తమై యుండును,

శ్లో॥ శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్. 29

పదచ్ఛేదము :— శరైః - తు - సంకులాం - కృత్వా - లంకాం - పరబలార్దనః - మాం - నయేత్ - యది - కాకుత్స్థః తత్ - తస్య - సదృశం - భవేత్,

అన్వయక్రమము :— పరబలార్దనః కాకుత్స్థః శరైః లంకాం సంకులాం కృత్వా మాం నయేత్ యది తత్ తస్య సదృశం భవేత్.

ప్రతిపదార్థము :— పరబలార్దనః = శత్రుసైన్యమును అణచునట్టి, కాకుత్స్థః = శ్రీరాముడు, శరైః = బాణములతో, లంకాం = లంకా నగరమును సంకులాం కృత్వా = కల్లోలితము గావించి, మాం = నన్ను, నయేత్ యది = కొనిపోయినచో, తత్ = అది, తస్య = అతనికి, సదృశం = తగియున్నట్టిది, భవేత్ = అగును,

తాత్పర్యము :— శ్రీరాముడు శత్రుబల సంహారకుడై తన శరపరంపరలచే లంకానగరమును కల్లోలము గావించి నన్నుగొని పోయినచో ఆ వీరకృత్యమే అతనికి యుక్తమై యుండును.

శ్లో॥ తద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః,
భవే దాహవశూరస్య తథా త్వ ముపపాదయ. 30

పదచ్ఛేదము :— తత్ - యథా - తస్య - విక్రాంతం - అనురూపం - మహాత్మనః - భవేత్ - ఆహవశూరస్య - తథా - త్వం - ఉపపాదయ.

అన్వయక్రమము :— తత్ ఆహవశూరస్య తస్య మహాత్మనః అనురూపం విక్రాంతం యథా భవేత్ తథా త్వం ఉపపాదయ.

ప్రతిపదార్థము :— తత్ = అందువలన, ఆహవశూరస్య = యుద్ధవీరుడైన, తస్య మహాత్మనః = ఆ మహనీయునకు, అనురూపం = ఉచితమైన, విక్రాంతం = పరాక్రమము, యథా = ఏ రీతిగా, భవేత్ = అగునో, తథా = ఆ రీతిగా, త్వం = నీవు, ఉపపాదయ = ప్రతిపాదించుము.

తాత్పర్యము :— అందుచే మహావీరుడైన ఆ మహాత్మునకు ఉచితమైన రీతిగా అతని పరాక్రమ విజృంభణము ఎట్టుగ జరుగవలసి యున్నదో ఆ రీతిగ నీవు ఆలోచించి నిర్ణయించుము.

శ్లో॥ తదర్థోపహితం వాక్యం సహితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాన్ శేషం వాక్య ముత్తర మబ్రవీత్. 31

పదచ్ఛేదము :— తత్ - అర్థోపహితం - వాక్యం - సహితం - హేతుసంహితమ్ - నిశమ్య - హనుమాన్ - శేషం - వాక్యం - ఉత్తరం - అబ్రవీత్.

అన్వయక్రమము :— హనుమాన్ హేతుసంహితం, అర్థోపహితం, సహితం తత్ వాక్యం నిశమ్య శేషం ఉత్తరం వాక్యం అబ్రవీత్

ప్రతిపదార్థము :— హనుమన్ = హనుమ, హేతుసంహితం, సహేతుకమైనట్టియు, అర్థోపహితం = ప్రయోజనయుక్తమైనట్టియు, సహితం = హితముతో గూడినట్టిదియు నగు, తత్ వాక్యం = ఆ వాక్యమును, నిశమ్య = విని, శేషం = మిగిలినట్టి, ఉత్తరం = సమాధానమైన, వాక్యం = వచనమును, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :_ సహేతుకముగను, ప్రయోజనవంతముగను, హితకరముగను సీతాదేవి పలికినట్టి వచనములను అలకించి హనుమ తాను చెప్పవలసిన మిగిలిన మాటలను ఈ రీతిగ పలికెను.

శ్లో॥ దేవి హర్యృక్షసైన్యానా మీశ్వరః ప్లవతాంవరః,
సుగ్రీవ స్సత్వసంపన్న స్తవార్థే కృతనిశ్చయః. 32

పదచ్ఛేదము :_ దేవి - హర్యృక్షసైన్యానాం - ఈశ్వరః - ప్లవతాం - వరః - సుగ్రీవః - సత్వసంపన్నః - తవ - అర్థే - కృత నిశ్చయః.

అన్వయక్రమము :_ దేవి! హర్యృక్షసైన్యానాం ఈశ్వరః సత్వసంపన్నః ప్లవతాం వరః సుగ్రీవః తవ అర్థే కృత నిశ్చయః (అస్తి)

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా! హర్యృక్షసైన్యానాం = వానరుల యొక్కయు భల్లూకములయొక్కయు సైన్యములకు, ఈశ్వరః = ప్రభువును, సత్వసంపన్నః = బలసంపన్నుడును, ప్లవతాం వరః = వానరులలో శ్రేష్ఠుడును అగు, సుగ్రీవః = సుగ్రీవుడు, తవ అర్థే = నీ విషయమునందు, కృతనిశ్చయః = చేయబడిన నిశ్చయము గలవాడుగా, (అస్తి = ఉన్నాడు).

తాత్పర్యము :_ ఓ సీతాదేవీ! అపారమైన వానర భల్లూక సైన్యములకు అధిపతియు మహా బలాఢ్యుడును అగు వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు నీ శోకమును తొలగించు కార్యమునందు దృఢమైన నిశ్చయముతో నున్నాడు సుమా!

శ్లో॥ స వానరసహస్రాణాం కోటిభి రభిసంవృతః,
క్షిప్ర మేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః. 33

పదచ్ఛేదము :- సః - వానరసహస్రాణాం - కోటీభిః - అభిసంవృతః - క్షిప్రం - ఏష్యతి - వైదేహి - రాక్షసానాం - నిబర్హణః,

అన్వయక్రమము :- వైదేహి! రాక్షసానాం నిబర్హణః సః వానర సహస్రాణాం కోటీభిః అభిసంవృతః క్షిప్రం ఏష్యతి.

ప్రతిపదార్థము :- వైదేహి! = ఓ సీతాదేవీ! రాక్షసానాం నిబర్హణః = రాక్షసులను హతమార్చునట్టి, సః = ఆ సుగ్రీవుడు, వానరసహస్రాణాం = వేలకొలది వానరుల యొక్క, కోటీభిః = కోటులతో అభిసంవృతః = కూడియున్నవాడై, క్షిప్రం = త్వరలో, ఏష్యతి = రాగలడు.

తాత్పర్యము :- ఓ జానకీదేవీ! రాక్షసులను తుదముట్టింప గలవాడైనట్టి ఆ సుగ్రీవుడు వేలకొలది కోట్లుగనున్న వానరసైన్యముతో కలిసి నిన్ను విడిపించుటకై త్వరలో ఇచ్చటకు రాగలడు.

శ్లో॥ తస్య విక్రమసంపన్నాః సత్త్వవంతో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయ స్థితాః. 34

యేషాం నోపరి నాధ స్తాన్నతిర్యక్సజ్జతే గతిః,
నచ కర్మసు సీదంతి మహా త్స్వమిత తేజసః. 35

పదచ్ఛేదము :- తస్య - విక్రమసంపన్నాః - సత్త్వవంతః - మహాబలాః - మనస్సంకల్పసంపాతాః - నిదేశే - హరయః - స్థితాః - యేషాం - న - ఉపరి - న - అధస్తాత్ - న - తిర్యక్ - సజ్జతే - గతిః.

అన్వయక్రమము :- యేషాంగతిః ఉపరి న సజ్జతే; అధస్తాత్ న సజ్జతే; తిర్యక్ న సజ్జతే; తే విక్రమ సంపన్నాః సత్త్వవంతః మహా

బలాః మనస్సంకల్పసంపాతాః హరయః తస్య నిదేశేస్థితాః; అమిత తేజసః మహత్సు కర్మసు నచసీదంతి.

ప్రతిపదార్థము :— యేషాం = ఎవరియొక్క అయితే, గతిః = గమనము, ఉపరి = ఊర్ధ్వమున, నసజ్జతే = అడ్డగింపబడదో, అధస్తాత్ = క్రిందిలోకములందు, నసజ్జతే = అడ్డగింపబడదో, తిర్యక్ = అడ్డముగ, నసజ్జతే = అడ్డగింపబడదో, తే = అట్టి, విక్రమసంపన్నాః = పరాక్రమ సంపన్నులును, సత్త్వవంతః = శక్తి సంపన్నులును, మహాబలాః = మహాబలాఢ్యులును, మనస్సంకల్పసంపాతాః = మనస్సంకల్పమునుబట్టి చరించువారు నగు, హరయః = వానరులు, తస్య = ఆ సుగ్రీవునియొక్క, నిదేశే = ఆజ్ఞయందు, స్థితాః = ఉన్నారు, అమితతేజసః = అపారమైన ప్రతాపము గల్గినట్టి ఆ వానరులు, మహత్సు = గొప్పవైన, కర్మసు = కార్యములందు, నచసీదంతి = దిగులునొందరు.

తాత్పర్యము :— మహాపరాక్రమవంతులును, అమితశక్తిమంతులును, మహాబలాఢ్యులును, మనస్సంకల్పాను సారముగా అమిత వేగముగ చరింపగలవారును, ఊర్ధ్వలోకములలోగాని అధోలోకములోగాని నలుమూలలగల దేశములలోగాని అడ్డులేకుండ చరింపగల వారును అగు వానరులు అసంఖ్యాకులు అతని ఆజ్ఞకు కట్టుబడియున్నారు. అందుచే నీవు దిగులు నొందవలసిన పనిలేదు. ప్రతాప సంపన్నులగు వానరులు ఎంతటి ఘన కార్యములందును వ్యాకులత నొందరు.

శ్లో॥ అసకృత్తైర్మహోత్సాహైః ససాగరధరాధరా.
పరిదక్షిణీకృతా భూమి ర్వాయుమార్గానుసారిభిః. 38

పదచ్ఛేదము :— అసకృత్ - తైః - మహోత్సాహైః - ససాగర ధరాధరా - ప్రదక్షిణీకృతా - భూమిః - వాయుమార్గానుసారిభిః.

అన్వయక్రమము :— వాయుమార్గానుసారిభిః మహోత్సాహైః తైః ససాగరధరాధరా భూమిః అసకృత్ ప్రదక్షిణీకృతా.

ప్రతిపదార్థము :— మహోత్సాహైః = గొప్పదైన ఉత్సాహము కలిగినట్టి, వాయుమార్గానుసారిభిః = ఆకాశమార్గమున సంచరించునట్టి, తైః = ఆ వానరులచే, ససాగరధరాధరా = సముద్రములతోడను పర్వతములతోడను కూడినట్టి, భూమిః = భూమి, అసకృత్ = పలుమాఱులు, ప్రదక్షిణీకృతా = ప్రదక్షిణము చేయబడినది.

తాత్పర్యము :— అమితోత్సాహ సంపన్నులైన ఆ వానరులు వాయుమార్గమును అనుసరించినవారై సముద్రములతోను పర్వతములతోనుకూడిన ఈ భూమండలమును పలుమాఱులు ప్రదక్షిణము చేసిరి.

శ్లో॥ మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చి న్నాస్తి సుగ్రీవసన్నిధౌ. 37

పదచ్ఛేదము :— మద్విశిష్టాః - చ - తుల్యాః - చ - సంతి - తత్ర - వనౌకసః - మత్తః - ప్రత్యవరః - కశ్చిత్ - న - అస్తి - సుగ్రీవసన్నిధౌ.

అన్వయక్రమము :— తత్ర వనౌకసః మద్విశిష్టాః తుల్యాః చ సంతి; సుగ్రీవ సన్నిధౌ మత్తః ప్రత్యవరః కశ్చిత్ న అస్తి.

ప్రతిపదార్థము :— తత్ర = అచ్చట, వనౌకసః = వానరులు, మద్విశిష్టాః = నా కంటె ఘనులైన వారుగను, తుల్యాః చ = సమానులైన వారుగను, సంతి = ఉన్నారు, సుగ్రీవ సన్నిధౌ = సుగ్రీవునికడ, మత్తః = నా కంటె, ప్రత్యవరః = తక్కువవాడు, కశ్చిత్ = ఒక్కడును, నాస్తి = లేడు.

తాత్పర్యము :— ఆ సుగ్రీవుని సన్నిధియందు ఉన్నవానరులు ఎందరో నాతో సమానులున్నారు. మఱెందరో నా కన్నను గొప్పవారున్నారు. అతని కడ నా కంటె తక్కువ వాడెవ్వడునులేడు సుమా!

శ్లో॥ అహం తావ దిహ ప్రాప్తః కింపున స్తే మహాబలాః,
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః.38

పదచ్ఛేదము :— అహం - తావత్ - ఇహ - ప్రాప్తః - కిం - పునః - తే - మహాబలాః - న - హి - ప్రకృష్టాః - ప్రేష్యంతే - ప్రేష్యంతే - హి - ఇతరే - జనాః.

అన్వయక్రమము :— అహం తావత్ ఇహ ప్రాప్తః; తే మహాబలాః కిం పునః? ప్రకృష్టాః న ప్రేష్యంతేహి; ఇతరే జనాః హి ప్రేష్యంతే.

ప్రతిపదార్థము :— అహంతావత్ = నేనే, ఇహ = ఇచ్చటకు, ప్రాప్తః = చేరుకొంటిని, తే మహాబలాః = ఆ మహాబలాఢ్యులు, కిం పునః = ఏమిఇక చెప్పునది? ప్రకృష్టాః = శ్రేష్ఠులు, న ప్రేష్యంతేహి = పంపబడరుగదా!, ఇతరే జనాఃహి = సామాన్యజనులేగదా, ప్రేష్యంతే = పంపబడుదురు.

తాత్పర్యము :— నా వంటివాడనే ఇచటి కనాయాసముగ వచ్చి యుంటిని. ఆ మహాబలశాలుర విషయము ఇక నేమి చెప్పవలయును, ఎచ్చటనైనను ఘనులైన వారిని దూతలుగ పంపరుగదా! సామాన్యులనే గదా దూత కృత్యమునకు వినియోగింతురు.

శ్లో॥ త దలం పరితాపేన దేవి శోకో వ్యపైతు తే,
ఏకోత్పాతేన తే లంకా మేష్యంతి హరియూథపాః. 39

పదచ్ఛేదము :— తత్ - అలం - పరితాపేన - దేవి - శోకః - వ్యపైతు - తే - ఏకోత్పాతేన - తే - లంకాం - ఏష్యంతి - హరియూథపాః.

అన్వయక్రమము :— దేవి! తత్ పరితాపేన అలం; తే శోకః వ్యపైతు; తే హరియూథపాః ఏకోత్పాతేన లంకాం ఏష్యంతి.

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా!, తత్ = అందు వలన, పరితాపేన అలం = సంతాపము వలదు, తే = నీ యొక్క, శోకః = దుఃఖము, వ్యపైతు = తొలగిపోవుగాక, తే హరియూధపాః = ఆ వానరవీరులు, ఏకోత్పాతేన = ఒక్క గంతులో, లంకాం = లంకా నగరమును, ఏష్యంతి = చేరుదురు.

తాత్పర్యము :- ఓ సీతాదేవీ! నీవు విచారింపవలసిన పనిలేదు నీ దుఃఖమంతయును తొలగిపోవును. ఆ వానరవీరులు ఒక్క గెంతులోనే ఈ లంకానగరమునకు రానున్నారు.

శ్లో॥ మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావి వోదితౌ,
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహా వాగమిష్యతః. 40

పదచ్ఛేదము :- మమ - పృష్ఠగతౌ - తౌ - చ - చంద్ర సూర్యౌ - ఇవ - ఉదితౌ - త్వత్సకాశం - మహాసత్త్వౌ - నృసింహౌ- ఆగమిష్యతః.

అన్వయక్రమము :- మహాసత్త్వౌ తౌ నరసింహౌ మమ పృష్ఠ గతౌ (సంతౌ) ఉదితౌ చంద్రసూర్యౌ ఇవ త్వత్సకాశం ఆగమిష్యతః.

ప్రతిపదార్థము :- మహాసత్త్వౌ = గొప్ప శక్తి గలవారగు, తౌ నరసింహౌ = ఆ పురుషశ్రేష్ఠు లిరువురును, మమ పృష్ఠగతౌ = (సంతౌ) = నా వీపుపై నున్నవారై, ఉదితౌ = ఉదయించినట్టి, చంద్ర సూర్యౌ ఇవ =చంద్రసూర్యులవలె, త్వత్సకాశం=నీ సమీపమునుగూర్చి, ఆగమిష్యతః = రాగలరు.

తాత్పర్యము :- మహాబల సంపన్నులును పురుషశ్రేష్ఠులును అగు రామలక్ష్మణు లిరువురును నా పృష్ఠము నధిరోహించినవారై ఒక్క మాఱుగ నుదయించిన చంద్రసూర్యులవలె నీ సమీపమున ప్రత్యక్షము గాగలరు.

శ్లో॥ తౌ హి వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ.
ఆగమ్య నగరీం లంకాం సాయకై ర్విధమిష్యతః. 4

పదచ్ఛేదము :— తౌ - హి - వీరౌ - నరవరౌ - సహితౌ - రామలక్ష్మణౌ - ఆగమ్య - నగరీం - లంకాం - సాయకైః - విధమిష్యతః.

అన్వయక్రమము :— సహితౌ వరవరౌ వీరౌ తౌ రామలక్ష్మణౌ ఆగమ్య సాయకైః లంకాం విధమిష్యతః.

ప్రతిపదార్థము :— సహితౌ = కలసికొన్నవారును, నరవరౌ = పురుషశ్రేష్ఠులును, వీరౌ = వీరులును అగు, తౌ రామలక్ష్మణౌ = ఆ రామలక్ష్మణులు, ఆగమ్య = వచ్చి, లంకాం = లంకను, సాయకైః = బాణములతో, విధమిష్యతః = నాశమొందింతురు.

తాత్పర్యము :— పురుషశ్రేష్ఠులైన మహావీరులగు ఆ రామలక్ష్మణు లిరువురును కలసివచ్చి ఈ లంకానగరమును బాణములతో నాశమొందింతురు.

శ్లో॥ సగణం రావణం హత్వా రాఘవో రఘునందనః,
త్వాం మాదాయ వరారోహే స్వపురీం ప్రతి యాస్యతి.

పదచ్ఛేదము :— సగణం - రావణం - హత్వా - రాఘవః - రఘునందనః - త్వాం - ఆదాయ - వరారోహే - స్వపురీం - ప్రతి యాస్యతి.

అన్వయక్రమము :— వరారోహే! రఘునందనః రాఘవః సగణం రావణం హత్వా త్వాం ఆదాయ స్వపురీం ప్రతియాస్యతి.

ప్రతిపదార్థము :— వరారోహే = శ్రేష్ఠమైన కటిసీమగల ఓ జానకీ! రఘునందనః = రఘువంశవర్ధనుడైన, రాఘవః = శ్రీరాముడు,

నగణం = పరివారముతోగూడిన, రావణం = రావణుని, హత్వా = చంపి, త్వాం = నిన్ను, ఆదాయ = తీసికొని, స్వపురీం = నిజనగరమునుగూర్చి, ప్రతియాస్యతి = వెడలిపోవును.

తాత్పర్యము :— ఓ సుందరాంగీ! రఘుకులభూషణుడైన శ్రీరాముడు రావణుని పరివార సమేతముగా పరిమార్చి నిన్ను గైకొని నిజనగరమునకు వెడలి పోవగలడు.

శ్లో॥ త దాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
నచిరా ద్ద్రక్ష్యసే రామం ప్రజ్వలంతమి వానలమ్. 43

పదచ్ఛేదము :— తత్ - ఆశ్వసిహి - భద్రం - తే - భవ - త్వం - కాలకాంక్షిణీ - న - చిరాత్ - ద్రక్ష్యసే - రామం - ప్రజ్వలంతం - ఇవ - అనలమ్.

అన్వయక్రమము :— తత్ ఆశ్వసిహి; తే భద్రం, త్వం కాలకాంక్షిణీ భవ; నచిరాత్ ప్రజ్వలంతం అనలం ఇవ రామం ద్రక్ష్యసే.

ప్రతిపదార్థము :— తత్ = అందువలన, ఆశ్వసిహి = ఊరడిల్లుము, తే = నీకు, భద్రం = మంగళము; త్వం=నీవు, కాలకాంక్షిణీ= సమయమును కోరుచున్నదానవు, భవ = అగుము; నచిరాత్ = త్వరలో, ప్రజ్వలంతం = ప్రజ్వలించుచున్న, అనలంఇవ = అగ్నిదేవునివలె, రామం = శ్రీరాముని, ద్రక్ష్యసే = చూడగలవు.

తాత్పర్యము :— తల్లీ! ఊరడిల్లుము నీకు శుభమగుగాక! దుఃఖ విమోచన కాలము కొఱకై నిరీక్షించుచుండుము, స్వల్పకాలములోనే ప్రజ్వలించుచున్న అగ్నిదేవునివలె వెలుగుచూపు శ్రీరాముని నీవు కనుగొనగలవు.

శ్లో॥ నిహతే రాక్షసేంద్రే ఽస్మిన్ సపుత్రామాత్యబాంధవే,
త్వం సమేష్యసి రామేణ శశాంకేనేవ రోహిణీ. 44

పదచ్ఛేదము :– నిహతే - రాక్షసేంద్రే - అస్మిన్ - సపుత్రా మాత్యబాంధవే - త్వం - సమేష్యసి - రామేణ - శశాంకేన - ఇవ - రోహిణీ

అన్వయక్రమము :– సపుత్రామాత్యబాంధవే అస్మిన్ రాక్షసేంద్రే నిహతేసతి శశాంకేన రోహిణీ ఇవ రామేణ త్వం సమేష్యసి.

ప్రతిపదార్థము :– సపుత్రామాత్యబాంధవే = పుత్రులతోడను, మంత్రులతోడను, బంధువులతోడను గూడినట్టి, అస్మిన్ రాక్షసేంద్రే = ఈ రాక్షసరాజు నిహతేసతి = చంపబడినవాడుకాగా, శశాంకేన = చంద్రునితో, రోహిణీఇవ = రోహిణివలె, రామేణ = శ్రీరామునితో, త్వం = నీవు, సమేష్యసి = కలసికొనగలవు.

తాత్పర్యము :– శ్రీరామ నిచేతిలో తన పుత్రులు, మంత్రులు మున్నగు పరిజనముతో సహితముగా రావణుడు కడతేరగనే చంద్రునితో రోహిణీరతివలె శ్రీరామునితో నీవు కలసికొనగలవు సుమా.

శ్లో॥ క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి,
రావణంచైవ రామేణ నిహతం ద్రక్ష్యసే உచిరాత్. 45

పదచ్ఛేదము :– క్షిప్రం - త్వం - దేవి - శోకస్య - పారం - యాస్యసి - మైథిలి - రావణం - చ - ఏవ - రామేణ - నిహతం - ద్రక్ష్యసే - అచిరాత్.

అన్వయక్రమము :– దేవి! మైథిలి! త్వం క్షిప్రం శోకస్య పారం యాస్యసి; రామేణ నిహతం రావణంచైవ అచిరాత్ ద్రక్ష్యసే.

ప్రతిపదార్థము :– దేవి! మైథిలి = పూజ్యురాలవైన ఓ జానకీ, త్వం = నీవు, క్షిప్రం = త్వరలో, శోకస్య = దుఃఖము యొక్క, పారం = అంతమును, యాస్యసి = చేరగలవు, అచిరాత్ = త్వరలోనే,

రామేణ = శ్రీరామునిచే, విహతం = చంపబడినట్టి, రావణం చ ఏవ = రావణునిగూడ, ద్రక్ష్యసే = చూడగలవు.

తాత్పర్యము :_ ఓ సీతాదేవీ! త్వరలోనే నీ శోకమునకు అంతముగలుగును. మిక్కిలి త్వరలోనే రామునిచే విహతుడైన రావణుని నీవు కనుగొన గలవు.

శ్లో॥ ఏవ మాశ్వాస్య వైదేహీం హనుమా న్మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీం పున రబ్రవీత్. 45

పదచ్ఛేదము :_ ఏవం - ఆశ్వాస్య - వైదేహీం - హనుమాన్ - మారుతాత్మజః - గమనాయ - మతిం - కృత్వా - వైదేహీం - పునః - అబ్రవీత్.

అన్వయక్రమము :_ మారుతాత్మజః హనుమాన్ వైదేహీం ఏవం ఆశ్వాస్య గమనాయ మతిం కృత్వా పునః వైదేహీం అబ్రవీత్.

ప్రతిపదార్థము :_ మారుతాత్మజః = వాయునందనుడైన, హనుమాన్ = హనుమ, వైదేహీం = జానకిని, ఏవం = ఇట్లు, ఆశ్వాస్య = ఊరడించి, గమనాయ = వెడలుటకై, మతిం కృత్వా = నిశ్చయించి, పునః = తిరిగి, వైదేహీం = సీతనుగూర్చి, అబ్రవీత్ = పలికెను

తాత్పర్యము :_ హనుమ ఈ రీతిగ సీతమ్మనోదార్చి పయనమున కుద్యుక్తుడై తిరిగి ఆమెను జూచి ఇట్లు పలికెను.

శ్లో॥ త మరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం,
లక్ష్మణంచ ధనుష్పాణిం లంకాద్వార ముపస్థితమ్. 47

పదచ్ఛేదము :_ తం - అరిఘ్నం - కృతాత్మానం - క్షిప్రం - ద్రక్ష్యసి - రాఘవమ్ - లక్ష్మణంచ - ధనుష్పాణిం - లంకాద్వారం - ఉపస్థితమ్.

అన్వయక్రమము :- లంకాద్వారం ఉపస్థితం అరిఘ్నం కృతాత్మానం తం రాఘవం ధనుష్పాణిం లక్ష్మణంచ క్షిప్రం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- అరిఘ్నం = శత్రుసంహారకుడును, కృతాత్మానం = నిర్వహించిన ఆత్మకృత్యముగలవాడు నగు, ధనుష్పాణిం = గొప్పధనుస్సు హస్తమునందుగలవాడు నగు, తం రాఘవం = ఆ శ్రీరాముని, లక్ష్మణంచ = లక్ష్మణుని, లంకాద్వారం = లంకానగరద్వారమును, ఉపస్థితం = చేరుకొన్న వానినిగా, క్షిప్రం = త్వరలో, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- తల్లీ! నీవు త్వరలోనే శత్రుసంహారకుడై, కృత కృత్యుడై, మహా ధనుర్ధారియై నిలచు శ్రీరాముని, లక్ష్మణుని ఈ లంకానగర ద్వారమునందు చూడగలవు సుమా!

శ్లో॥ నఖదంష్ట్రాయుధా న్వీరా న్సింహశార్దూలవిక్రమాన్,
వానరా న్వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్.

పదచ్ఛేదము :- నఖదంష్ట్రాయుధాన్ - వీరాన్ - సింహశార్దూలవిక్రమాన్ - వానరాన్ - వారణేంద్రాభాన్ - క్షిప్రం - ద్రక్ష్యసి - సంగతాన్.

అన్వయక్రమము :- సంగతాన్ నఖదంష్ట్రాయుధాన్ సింహశార్దూలవిక్రమాన్ వారణేంద్రాభాన్ వీరాన్ వానరాన్ క్షిప్రం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :- సంగతాన్ = గుంపుగూడినట్టి, నఖదంష్ట్రాయుధాన్ = నఖములు దంష్ట్రలు ఆయుధముగా గలవారును, సింహశార్దూలవిక్రమాన్ = సింహము వ్యాఘ్రమువంటి పరాక్రమముగలవారును, వారణేంద్రాభాన్ = మదగజముల వంటివారును, వీరాన్ = వీరులును అగు, వానరాన్ = వానరులను, క్షిప్రం = త్వరలో, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :- తల్లీ! కొద్దికాలములోనే తమ గోళ్ళను కోఱలను ఆయుధముగా చేసికొని సింహమువలెను వ్యాఘ్రమువలెను విక్రమించుచు మదించిన ఏనుగులవలె గానవచ్చు వానరవీరులను లంకానగరము నందు గుమిగూడియుండుట చూడగలవు సుమా!

శ్లో॥ శైలాంబుద నికాశానాం లంకామలయ సానుషు,
నర్దతాం కపిముఖ్యానా మచిరా చ్ఛ్రోష్యసి స్వనమ్. 49

పదచ్ఛేదము :- శైలాంబుదనికాశానాం - లంకామలయ సానుషు-నర్దతాం - కపిముఖ్యానాం - అచిరాత్ - శ్రోష్యసి - స్వనమ్.

అన్వయక్రమము :- లంకామలయసానుషు అచిరాత్ శైలాంబుదనికాశానాం నర్దతాం కపిముఖ్యానాం స్వనం శ్రోష్యసి.

ప్రతిపదార్థము :- లంకామలయసానుషు = లంకయందలి మలయ పర్వతపు చరియలపై, అచిరాత్ = త్వరలోనే, నర్దతాం = గర్జించుచున్నట్టి, శైలాంబుదనికాశానాం = పర్వతములవలెను, మేఘముల వలెను ఉన్నట్టి, కపిముఖ్యానాం = వానరాగ్రేసరుల యొక్క, స్వనం = ధ్వనిని, శ్రోష్యసి = వినగలవు.

తాత్పర్యము :- జానకీదేవీ! ఈ లంకానగరములోని మలయ పర్వతము యొక్క చఱియలపై భయంకరముగ గర్జించుచున్న పర్వతములవలెను, మేఘములవలెను గానవచ్చు కపిముఖ్యుల హుంకారములను త్వరలోనే వినగలవు.

శ్లో॥ సతు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా,
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః. 50

పదచ్ఛేదము :- సః - తు - మర్మణి - ఘోరేణ - తాడితః మన్మథేషుణా - న - శర్మ - లభతే - రామః - సింహార్దితః - ఇవ - ద్విపః

అన్వయక్రమము :- సః రామః తు ఘోరేణ మన్మథేషుణా మర్మణి తాడితః (సన్) సింహార్దితః ద్విపః ఇవ శర్మ నలభతే.

ప్రతిపదార్థము :- సః రామః తు = ఆ రాముడు, ఘోరేణ = తీవ్రమైన, మన్మథేషుణా = మన్మథశరముచే, మర్మణి = జీవస్థానము నందు, తాడితః (సన్) = వేధింపబడినవాడై, సింహార్దితః = సింహముచే హింసింపబడినట్టి, ద్విపః ఇవ = ఏనుగువలె, శర్మ = సుఖమును, నలభతే = పొందుటలేదు.

తాత్పర్యము :- శ్లో॥ ఆ రాము డిపుడు తీవ్రమైన మన్మథ శరములచే హృదయము వేధింపబడుచుండగా సింహమునకు చిక్కి హింస నొందుచున్న ఏనుగువలెనే సుఖమునకు దూరమైయున్నాడు.

శ్లో॥ రుద మా దేవి శోకేన మాభూత్తే మనసో భయమ్.
శచీవ భర్త్రా శక్రేణ సంగమేష్యసి శోభనే, 51

పదచ్ఛేదము :- రుద - మా - దేవి - శోకేన - మాభూత్ - తే - మనసః - భయమ్ - శచీ - ఇవ - భర్త్రా - శక్రేణ - సంగం - ఏష్యసి - శోభనే.

అన్వయక్రమము :- దేవి! శోకేన మారుదః; తే మనసః భయం మాభూత్; శోభనే! శచీ భర్త్రా శక్రేణ ఇవ సంగం ఏష్యసి.

ప్రతిపదార్థము :- దేవి! = ఓ పూజ్యురాలా!, శోకేన = దుఃఖముతో, మారుద = శోకింపకుము, తే = నీ యొక్క, మనసః = మనస్సునకు, భయం = భీతి, మాభూత్ = లేకుండుగాక, శోభనే = ఓ మంగళ స్వరూపురాలా! శచీ = శచీదేవి, శక్రేణ ఇవ = దేవేంద్రునితోవలె, భర్త్రా = భర్తయగు రామునితో, సంగం = కలయికను, ఏష్యసి = పొందగలవు.

తాత్పర్యము :- తల్లీ! దిగులుతో శోకింపకుము. నీ మనస్సు నుండి భయము తొలగిపోవుగాక! శచీదేవి దేవేంద్రుని కలసి కొన్నట్లుగా నీవు నీ నాథుని కలసికొందువు.

శ్లో॥ రామాద్విశిష్టః కో౽న్యో౽స్తి కశ్చిత్సౌమిత్రిణా సమః
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ. 52

పదచ్ఛేదము :- రామాత్ - విశిష్టః - కః - అన్యః - అస్తి - కశ్చిత్ - సౌమిత్రిణా - సమః - అగ్నిమారుతకల్పౌ - తౌ - భ్రాతరౌ - తవ - సంశ్రయౌ.

అన్వయక్రమము :- రామాత్ విశిష్టః అన్యః కః అస్తి? సౌమిత్రిణాసమః కశ్చిత్ (కుత్ర అస్తి)? అగ్నిమారుతకల్పౌ తౌ తవ సంశ్రయౌ.

ప్రతిపదార్థము :- రామాత్ = రామునికన్న, విశిష్టః = అధికుడు, అన్యః = ఇతరుడు, కః = ఎవడు? అస్తి = ఉన్నాడు? సౌమిత్రిణా = లక్ష్మణునితో, సమః = సమానుడు, కశ్చిత్ = ఏవ్వడైన, (కుత్ర అస్తి = ఎచ్చటనున్నాడు?) అగ్నిమారుతకల్పౌ = అగ్నితోను వాయువుతోను, సమానులైనట్టి తౌ = వారిరువురును, తవ = నీకు, సంశ్రయౌ = ఆశ్రయమైయున్నాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- లోకమున దహనకర్మయం దగ్నిని మించినదిలేదు. ఇది రూపమే లేకుండ చేయును. బలమునందువాయువుతో సమానమైనదిలేదు. ఈ రెండును ఏకమైనప్పుడు అవి శత్రునిశ్శేషము చేయగలవు అట్టి ఆ ఇరువురు నీకు సహాయులు ఇక నీకు వచ్చిన భయమేమి?.

తాత్పర్యము :_ రాముని కంటె అధికుడైనవాడు ఇతరుడెవ్వడైననున్నాడా! లక్ష్మణుని బోలినట్టి వీరుడెచ్చటనైననున్నాడా! పరస్పరము తోడై అగ్ని వాయువులవలెనుండు వారిరువురును నీకు ఆశ్రయమై యుండగా దిగులు చెందవలసినపని పీకేమున్నది?

శ్లో॥ నా స్మిం శ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణై రధ్యుషితే౽తిరౌద్రే
న తే చిరా దాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్. ౬౩

ఇత్యార్షే శ్రీమద్వాల్మీకి రామాయణే
సుందరకాండే "హనూమత్సందేశో" నామ
ఏకోనచత్వారింశః సర్గః.

పదచ్ఛేదము :_ న - అస్మిన్ - చిరం - వత్స్యసి - దేవి - దేశే - రక్షోగణైః - అధ్యుషితే - అతిరౌద్రే - న - తే - చిరాత్ - అగమనం - ప్రియస్య - క్షమస్వ - మత్సంగమకాలమాత్రమ్.

అన్వయక్రమము :_ దేవి! రక్షోగణైః అధ్యుషితే అతిరౌద్రే అస్మిన్ దేశే చిరం నవత్స్యసి; తే ప్రియస్య ఆగమనం నచిరాత్ (భవిష్యతి); మత్సంగమకాలమాత్రం క్షమస్వ.

ప్రతిపదార్థము :_ దేవి! = ఓ పూజ్యురాలా!, రక్షోగణైః = రాక్షసుల సమూహములచే, అధ్యుషితే = నివసింపబడుచున్నట్టి, అతిరౌద్రే = మహాభయంకరమైన, అస్మిన్ దేశే = ఈ దేశమునందు, చిరం = చిరకాలము, నవత్స్యసి = నివసింపబోవు, తే ప్రియస్య = నీ భర్త యొక్క, ఆగమనం = రాక, నచిరాత్ = త్వరలో, (భవిష్యతి = కాగలదు), మత్సంగమమాత్రకాలం = నాతో నీ భర్త (మరల) కలిసి కొనునంత కాలము మాత్రము, క్షమస్వ = ఓర్చుకొనుము.

తాత్పర్యము :— తల్లీ! రక్కసుల మూకలతో నిండియున్న భయంకరమైన ఈ లంకానగరమునచిరకాలము వుసీవు వసింపనక్కఱలేదు. అచిరకాలములోనే నీ ప్రియుడు నీ కడకు వచ్చుట జరుగును. కేవలము నేను మహనీయునితో కలసికొనునంత వఱకును అవశ్యకమైన కొద్ది కాలము మాత్రము ఎట్లో సహింపుము.

ఇది శ్రీ మత్సుందరకాండమునకు సుబోధిని యను
ఆంధ్ర వివరణము నందు "హనూమత్సందేశము"
అను ముప్పది తొమ్మిదవ సర్గము

శ్రీరామాయ నమః

శ్రీ రామశరణ్ గురుభ్యో నమః

అథ శ్రీమత్సుందరకాండే

చత్వారింశస్సర్గః

శ్లో॥ శ్రుత్వాతు వచనం తస్య వాయుసూనో ర్మహాత్మనః,
ఉవాచాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా. 1

పదచ్ఛేదము :— శ్రుత్వా - తు - వచనం - తస్య - వాయుసూనోః - మహాత్మనః - ఉవాచ - ఆత్మహితం - వాక్యం - సీతా - సురసుతోపమా.

అన్వయక్రమము :— మహాత్మనః వాయుసూనోః తస్య వచనం శ్రుత్వా సురసుతోపమా సీతా ఆత్మహితం వాక్యం ఉవాచ.

ప్రతిపదార్థము :— వాయుసూనోః = వాయుపుత్రుడైన, మహాత్మనః = మహనీయుడైనట్టి, తస్య = ఆ హనుమ యొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, సురసుతోపమా = దేవకన్యను బోలిన, సీతా =

సీతాదేవి, ఆత్మహితం = తనకుహితమైనట్టి, వాక్యం = మాటను, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :_ వాయునందనుడైన ఆ మహాత్ముడగు అంజనేయుని మాటలను విని దేవకన్యను బోలిన సీతాదేవి తనకు హితమైన మాటలను ఈ రీతిగ పలికెను.

శ్లో॥ త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర,
అర్ధసంజాత సస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా. 2

పదచ్ఛేదము :_ త్వాం - దృష్ట్వా - ప్రియవక్తారం - సంప్రహృష్యామి - వానర - అర్ధసంజాతసస్యా - ఇవ - వృష్టిం - ప్రాప్య - వసుంధరా.

అన్వయక్రమము :_ వానర! ప్రియవక్తారం త్వాం దృష్ట్వా అర్ధసంజాతసస్యా వసుంధరా వృష్టిం ప్రాప్య ఇవ సంప్రహృష్యామి.

ప్రతిపదార్థము :_ వానర! = ఓ హనుమా!, ప్రియవక్తారం = ప్రియముగ మాటలాడుచున్నట్టి, త్వాం = నిన్ను, దృష్ట్వా = చూచి, అర్ధసంజాతసస్యా = సగము మొలచిన పైరుగల, వసుంధరా = భూమి, వృష్టిం = వర్షమును, ప్రాప్య ఇవ = పొందినవలె, సంప్రహృష్యామి = మిక్కలి సంతోషము నొందుచున్నాను.

తాత్పర్యము :_ ఓ హనుమా! నా మనస్సున కానందకరముగా మంచి మాటలు చెప్పుచున్న నిన్ను జూచి, సగము పెరిగిన పైరుతో వర్షములేక ఎండిపోవుచున్నట్టి చేను అప్పుడే కురిసిన వర్షమువలన ఎంత ఆనందించునో అంత గొప్పఆనందము పొందుచున్నాను సుమా!

శ్లో॥ యథా తం పురుషవ్యాఘ్రం గాత్రైః శోకాభికర్శితైః,
సంస్పృశేయం సకా మాహం తథా కురు దయాం మయి.

పదచ్ఛేదము :- యథా - తం - పురుషవ్యాఘ్రం - గాత్రైః - శోకాభికర్శితైః - సంస్పృశేయం - సకామా - అహం - తథా - కురు - దయాం - మయి.

అన్వయక్రమము :- సకామా అహం శోకాభికర్శితైః (మమ) గాత్రైః తం పురుష వ్యాఘ్రం యథా సంస్పృశేయం తథా మయి దయాం కురు.

ప్రతిపదార్థము :- సకామా = కోరికతో కూడినట్టి, అహం = నేను, శోకాభికర్శితైః = దుఃఖముచే మిక్కిలి కృశించియున్నట్టి, (మమ = నా యొక్క) గాత్రైః = అవయవములతో, తం పురుషవ్యాఘ్రం = ఆ పురుషశ్రేష్ఠుని, యథా = ఏ విధముగ, సంస్పృశేయం = తాకగలనో, తథా = ఆ రీతిగా, మయి = నా యందు, దయాం కురు = దయను చేయుము.

తాత్పర్యము :- మిక్కిలి కోరికతో నున్నట్టి నేను వియోగ దుఃఖముచే కృశించియున్న నా అవయవములతో ఆ పురుషశ్రేష్ఠుని స్పృశించునట్టి భాగ్యమును నాకు దయతో సమకూర్చుము.

శ్లో॥ అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ,
క్షిప్తా మిషీకాం కాకస్య కోపా దేకాక్షిశాతనీమ్. 4

పదచ్ఛేదము :- అభిజ్ఞానం - చ - రామస్య - దద్యాః - హరిగణోత్తమ - క్షిప్తాం - ఇషీకాం - కాకస్య - కోపాత్ - ఏకాక్షిశాతనీమ్.

అన్వయక్రమము :- హరిగణోత్తమ! కోపాత్ క్షిప్తాం కాకస్య ఏకాక్షిశాతనీం ఇషీకాం రామస్య అభిజ్ఞానం చ దద్యాః.

ప్రతిపదార్థము :- హరిగణోత్తమ! = ఓ వానరయూథాగ్రేసరుడా! కోపాత్ = కోపమువలన, క్షిప్తాం = విసరినట్టి, కాకస్య = కాకికి,

ఏకాక్షిశాతనీం = ఒక కన్నును పొగొట్టినట్టి, ఇషీకాం = దర్భనుగురించి నవృత్తాంతమును, రామస్య = శ్రీరామునకు, అభిజ్ఞానం = గుర్తునుగా, దద్యాః = ఒసగుము,

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడా! ఆనాడు కోపముతో విసరి వాయసము యొక్క ఒక కంటిని హరించినట్టి ఆదర్భ వృత్తాంతమును శ్రీరామునకు **గుర్తు**గా తెలుపుము.

శ్లో॥ మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తు మర్హసి. 5

పదచ్ఛేదము :- మనశ్శిలాయాః - తిలకః - గండపార్శ్వే - నివేశితః - త్వయా - ప్రణష్టే - తిలకే - తం - కిల - స్మర్తుం - అర్హసి.

అన్వయక్రమము :- (మమ) తిలకే ప్రణష్టే (సతి) గండపార్శ్వే (యః) మనశ్శిలాయాః తిలకః త్వయా నివేశితః తం స్మర్తుం అర్హసి కిల.

ప్రతిపదార్థము :- (మమ = నా యొక్క) తిలకే = బొట్టు, ప్రణష్టే (సతి) = చెదిగిపోవగా, గండపార్శ్వే = చెక్కిలియందలి, మనశ్శిలాయాః = మణిశిలధాతువుయొక్క, తిలకః = తిలకము, త్వయా = నీ చేత, నివేశితః = (బొట్టుగా) పెట్టబడినది, తం = ఆ విషయమును, స్మర్తుం = జ్ఞాపకము తెచ్చుకొనుటకు, అర్హసి = తగుదువు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'మమ గండపార్శ్వే మనశ్శిలా తిలకః నివేశితః'- బుగ్గపై బొట్టు చెదిగి పోవగా కొండపై నున్న మణిశిలాధాతువుతో తిరిగి ఆ చుక్కను నాకు పెట్టితివి అని భావము.

గోవిందరాజీయము :- గండపార్శ్వే తిలకః నివేశితః - గండస్థలమందు అనిగాని, గండశైలమున ఒక ప్రక్క కూర్చుండగాగాని బొట్టుపెట్టబడినదని భావము.

వాసుదాసస్వామి :- గండశైలమునందు చెమటకు నా ముఖమున చుక్కబొట్టు కరగిపోవగా పాడు ముఖముతో నున్న నాకు తానే ప్రేమతో మణిశిలను జాది తిలకముంచెను.

తాత్పర్యము :- రామా! ఒక మాఱు నా నుదుటిపై తిలకము చెదరిపోవగా, నీవు వెంటనే నా బుగ్గపై నున్న మణిశిల తిలకమును ఒలిచి నా నుదుటిపై బొట్టుగా పెట్టితివి; ఆ విషయమును జ్ఞాపకము తెచ్చుకొనుము.

శ్లో॥ స వీర్యవాన్ కథం సీతాం హృతాం సమనుమన్యసే,
వసంతీం రక్షసాం మధ్యే మహేంద్రవరుణోపమః. 6

పదచ్ఛేదము :- సః - వీర్యవాన్ - కథం - సీతాం - హృతాం - సమనుమన్యసే - వసంతీం - రక్షసాం - మధ్యే - మహేంద్రవరుణోపమః.

అన్వయక్రమము :- మహేంద్రవరుణోపమః వీర్యవాన్ సః (త్వం) సీతాం హృతాం, రక్షసాం మధ్యే వసంతీం కథం సమనుమన్యసే?

ప్రతిపదార్థము :- మహేంద్రవరుణోపమః = దేవేంద్రునితోడను, వరుణునితోడను సాటియైనవాడవు అగు, వీర్యవాన్ = పరాక్రమవంతుడవైన, సః త్వం = ఆ నీవు, సీతాం = సీతను, హృతాం = అపహరింపబడిన దానిగను, రక్షసాం = రాక్షసుల యొక్క, మధ్యే = నడుమ, వసంతీం = నివసించుచున్న దానినిగను, కథం = ఎట్లు, సమనుమన్యసే =

తాత్పర్యము :— దేవేంద్రునివలెను వరుణదేవునివలెను మహా పరాక్రమశాలివగు నీవు నీ భార్యయైన సీతను రాక్షసులు అపహరించుట యును ఆమె ఆ క్రూరుల నడుమ నివసించుటయు ఎట్లు సమ్మతించు చున్నావు?

శ్లో॥ ఏష చూడామణిర్దివ్యో మయా సురక్షితః,
ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వామి వానఘ.7

పదచ్ఛేదము :— ఏషః - చూడామణిః - దివ్యః - మయా - సుపరిరక్షితః - ఏతం - దృష్ట్వా - ప్రహృష్యామి - వ్యసనే - త్వాం - ఇవ - అనఘ.

అన్వయక్రమము :— అనఘ! ఏషః దివ్యః చూడామణిః మయా సుపరిరక్షితః; వ్యసనే ఏతం దృష్ట్వా త్వాం దృష్ట్వా ఇవ ప్రహృష్యామి.

ప్రతిపదార్థము :— అనఘ! = ఓ పాపరహితుడా!, ఏషః = ఈ, దివ్యః = పూజ్యమైనట్టి, చూడామణిః = చూడామణి, మయా = నాచే, సుపరిరక్షితః = చక్కగా భద్రము చేయబడినది, వ్యసనే = కష్ట కాలమునందు, ఏతం = దీనిని, దృష్ట్వా = చూచి, త్వాం = నిన్ను, దృష్ట్వా ఇవ = చూచినట్లువలె, ప్రహృష్యామి = గొప్ప ఆనందము నొందుచున్నాను,

విశేషార్థములు—వ్యాఖ్యాతల అభిప్రాయములు

గోవింద రాజీయము :— 'ఏతం దృష్ట్వా ప్రహృష్యామి' ఈ చూడామణిని నీవు మిక్కిలి ప్రేమగా పలుమారులు చేతిలో నిడికొని చూచెడివాడవు గావున దీనినిచూచి నిన్ను చూచినట్లు సంతోషించుచున్నాను.

తాత్పర్యము :_ ఈ చూడామణి నాకు మిక్కిలి పవిత్రమైన దగుటచే దీనిని మిక్కిలి ప్రియముగా భద్రపఱచు కొంటిని. నేను ఈ కష్ట కాలములో దీనిని చూచికొనియే నిన్ను జూచినట్లు సంతోషించుచున్నాను.

శ్లో॥ ఏష నిర్యాతిత శ్శ్రీమాన్ మయా తే వారిసంభవః,
అతఃపరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా. 8

పదచ్ఛేదము :_ ఏషః - నిర్యాతితః - శ్రీమాన్ - మయా - తే - వారిసంభవః - అతః - పరం - న - శక్ష్యామి - జీవితుం - శోకలాలసా.

అన్వయక్రమము :_ వారిసంభవః శ్రీమాన్ ఏషః మయా తే నిర్యాతితః; శోకలాలసా (సతీ) అతః పరం జీవితుం న శక్ష్యామి.

ప్రతిపదార్థము :_ వారిసంభవః = సముద్రమునుండి ఉద్భవించినట్టి, శ్రీమాన్ = శోభావంతమైనట్టి, ఏషః = ఈ చూడామణి, మయా = నా చేత, తే = నీ కొఱకై, నిర్యాతితః = పంపబడినది. శోకలాలసా = దుఃఖగ్రస్తురాలనై, అతః పరం = ఇటుపైని, జీవితుం = జీవించుటకు, నశక్ష్యామి = చాలను,

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :_ 'ఏతత్ చూడామణి సన్నిధానే రక్షోభిభవస్య అసంభవాత్' ఈ చూడామణి ప్రభావము వలననే సీతమ్మకు రాక్షసుల క్రౌర్యమును, హింసయును ఎట్టి ఉపద్రవమును అపాయమును కలిగించ లేదని భావము.

తాత్పర్యము :_ రత్నాకర సముద్భవమై లక్ష్మీకరమైయున్న ఈ దివ్యమైన చూడామణిని ఇప్పుడు నీకు పంపివేయుచున్నాను. ఇక మీదట చిరకాలము నేను ఒంటిగా జీవముతో నుండజాలను.

శ్లో॥ అసహ్యానిచ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః,
రాక్షసైస్సహ సంవాసం త్వత్కృతే మర్షయా మ్యహమ్.

పదచ్ఛేదము :- అసహ్యాని - చ - దుఃఖాని - వాచః - చ - హృదయచ్ఛిదః - రాక్షసైః - సహ - సంవాసం - త్వత్కృతే - మర్షయామి - అహమ్.

అన్వయక్రమము :- అసహ్యాని దుఃఖానిచ, హృదయచ్ఛిదః వాచఃచ, రాక్షసైః సహ సంవాసంచ త్వత్కృతే. అహం మర్షయామి'

ప్రతిపదార్థము :- అసహ్యాని = భరింపరాని, దుఃఖాని చ = దుఃఖములను, హృదయచ్ఛిదః = గుండెలను బ్రద్దలుచేయు, వాచః చ = మాటలను, రాక్షసైః సహ = రాక్షసులతోడ, సంవాసం = నివాసమును, త్వత్కృతే = నీ నిమిత్తమై అహం = నేను, మర్షయామి = సహించుచున్నాను.

సూచన :- రాక్షసైః 'సహ సంవాసం' అనుటకు బదులుగా 'రాక్షసీనాం సుఘోరాణాం' అని పాఠాంతరము.

తాత్పర్యము :- ఈ భరింపరాని దుఃఖములను ఈ రాక్షస స్త్రీలు పలుకు హృదయ భేదకములైన మాటలను. ఈ దానవుల నడుమ నివాసమును నేను సహించుచున్నది నీ నిమిత్తమే సుమా.

శ్లో॥ ధారయిష్యామి మాసంతు జీవితం శత్రుసూదన,
మాసా దూర్ధ్వం నజీవిష్యే త్వయాహీనా నృపాత్మజ.

పదచ్ఛేదము :- ధారయిష్యామి - మాసం - తు - జీవితం - శత్రుసూదన - మాసాత్ - ఊర్ధ్వం - న - జీవిష్యే - త్వయా - హీనా - నృపాత్మజ.

అన్వయక్రమము :- నృపాత్మజః శత్రుసూదనః మాసంతు జీవితం ధారయిష్యామి; మాసాత్ ఊర్ధ్వం త్వయా హీనా నజీవిష్యే.

ప్రతిపదార్థము :- శత్రుసూదనః = ఓ శత్రుసంహారకుడవైనట్టి నృపాత్మజః = రాజకుమారా!, మాసంతు = ఒక మాసము మాత్రము, జీవితం = జీవితమును, ధారయిష్యామి = ధరింపగలను, మాసాత్ = మాసముకంటె, ఊర్ధ్వం = పిమ్మట, త్వయాహీనా = నీవులేనిదాననై, నజీవిష్యే = జీవింపను.

తాత్పర్యము :- ఓ శత్రుసంహారకుడా! ఒక మాసము మాత్రమెట్లో నా జీవితమును నిలబెట్టుకొందును. అటుపిమ్మట నీవు లేకుండ ఒక్క క్షణమునుగూడ జీవింప జాలను.

శ్లో॥ ఘోరో రక్షసరాజో౽యం దృష్టిశ్చ న సుఖా మయి,
త్వాంచ శ్రుత్వా విషజ్జంతం న జీవేయ మహం క్షణమ్.

పదచ్ఛేదము :- ఘోరః - రాక్షసరాజః - అయం - దృష్టిః - చ - న - సుఖా - మయి - త్వాం - చ - శ్రుత్వా - విషజ్జంతం - న - జీవేయం - అహం - క్షణమ్.

అన్వయక్రమము :- అయం రాక్షసరాజః ఘోరః; మయి (అస్య) దృష్టిః చ న సుఖా; త్వాం విషజ్జంతం చ శ్రుత్వా అహం క్షణం న జీవేయమ్

ప్రతిపదార్థము :- అయం రాక్షసరాజః = ఈ రావణుడు, ఘోరః = క్రూరుడు, మయి = నా యందు, (అస్య = వీనియొక్క,) దృష్టిఃచ = చూపుకూడ, నసుఖా = సుఖమైనదిగాదు, త్వాం = నిన్ను, విషజ్జంతం = విలంబము గావించుచున్నవానినిగా, శ్రుత్వాచ = వినిగూడ, అహం = నేను, క్షణం = క్షణకాలము, నజీవేయం = బ్రదుకజాలను, (ఇతిరామం బ్రూహి = అని రాముని గూర్చి చెప్పుము.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'దృష్టిశ్చన సుఖా' - ఇచ్చట దృష్టిగూడ దుఃఖకరముగనున్నది అనుటచే బుద్ధిగూడ తన యెడ క్రూరముగనే యున్నది అనియు అవధి కాలము గడచిన వెంటనే నన్ను వధింపక మానడనియును రెండు నెలల పిమ్మట అతని చేతిలో చనిపోవుట కంటె మాసము పలుకు చూచి నీవు గాపాడించనిచో నేను చనిపోవుటయే యుక్తమనియు సీతమ్మ తెలుపుచున్నదని భావము.

తాత్పర్యము :- ఈ రాక్షసరాజు మహాక్రూరుడు. అతని దృష్టి కూడ నాకు దుఃఖకరముగనే యున్నది. ఇట్టి స్థితిలో నీవు నన్ను ఉద్ధరించుటలో విలంబము చేసిన యెడల నేను క్షణము గూడ జీవింపజాలను.

శ్లో॥ వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్,
అథాబ్రవీ న్మహాతేజా హనుమా న్మారుతాత్మజః. 12

పదచ్ఛేదము :- వైదేహ్యాః - వచనం - శ్రుత్వా - కరుణం - సాశ్రుభాషితమ్ - అథ - అబ్రవీత్ - మహాతేజాః - హనుమాన్ - మారుతాత్మజః.

అన్వయక్రమము :- మహాతేజాః మారుతాత్మజః హనుమాన్ వైదేహ్యాః సాశ్రుభాషితం కరుణం వచనం శ్రుత్వా అథ అబ్రవీత్,

ప్రతిపదార్థము :- మహాతేజాః = తేజశ్శాలియైన, మారుతాత్మజః = వాయునందనుడును అగు, హనుమాన్ = హనుమ, వైదేహ్యాః = జానకియొక్క, సాశ్రుభాషితం = కన్నీటితో పలుకబడినదియును, కరుణం = దీనమైనదియు నగు, వచనం = మాటను శ్రుత్వా = విని, అథ = పిమ్మట, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- మహాతేజస్సంపన్నుడైన మారుతాత్మజుడు కన్నీటితో దీనముగా పలికిన జానకీ దేవి వచనము నాలకించి వెంటనే ఆమెతో నిట్లు పలికెను.

శ్లో॥ త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే. 13

పదచ్ఛేదము :_ త్వచ్ఛోకవిముఖః - రామః - దేవి - సత్యేన - తే - శపే - రామే - దుఃఖాభిభూతే - తు - లక్ష్మణః - పరితప్యతే.

అన్వయక్రమము :_ దేవి! సత్యేన తే శపే, రామః త్వచ్ఛోకవిముఖః; - రామే - దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే,

ప్రతిపదార్థము :_ దేవి! = ఓ పూజ్యురాలా!, సత్యేన తే శపే = నిజముపై ఒట్టుపెట్టి నీకు చెప్పుచున్నాను, రామః = శ్రీరాముడు, త్వచ్ఛోకవిముఖః = నిన్నుగూర్చిన శోకముచే (అన్నిటియెడల) విముఖుడై యున్నాడు, రామే = శ్రీరాముడు, దుఃఖాభిభూతే తు = శోకసంతప్తుడై యుండగా, లక్ష్మణః = లక్ష్మణుడు, పరితప్యతే = సంతాపమునొందు చున్నాడు.

తాత్పర్యము :_ ఓ జానకీదేవీ! సత్యముపై ప్రమాణముచేసి చెప్పుచున్నాను. శ్రీరాముడిప్పుడు నీ యందలి శోకముచే లోకవ్యవహారము లన్నింటి యెడను విముఖుడై యున్నాడు. అతడట్లు పరితపించు చుండగా లక్ష్మణుడు గూడ సంతాపగ్రస్తుడయియున్నాడు.

శ్లో॥ దృష్ట్వా కథంచిద్భవతీ నకాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానామంతం ద్రక్ష్యసి భామిని.

పదచ్ఛేదము :_ దృష్ట్వా - కథంచిత్ - భవతీ - న - కాలః - పరిశోచితుమ్ - ఇమం - ముహూర్తం - దుఃఖానాం - అంతం - ద్రక్ష్యసి - భామిని.

అన్వయక్రమము :_ భవతీ కథంచిత్ దృష్టా, (అయం) పరిశోచితుం కాలః న; భామిని! ఇమం ముహూర్తం దుఃఖానాం అంతం ద్రక్ష్యసి.

ప్రతిపదార్థము :– భవతీ = నీవు, కథంచిత్ = ఎట్లో, దృష్టా = కనబడితివి, అయం = ఇది, పరిశోచితుం = దుఃఖించుటకు, కాలః న = సమయముగాదు, భామిని = ఓతరుణీ! ఇమం ముహూర్తం = ఈ ఘడియలోనే, దుఃఖానాం = దుఃఖములకు, అంతం = అంతమును, ద్రక్ష్యసి = చూడగలవు.

తాత్పర్యము :– మా భాగ్యముచే నీవెట్లో గానవచ్చితివి. ఇది దుఃఖింపవలసిన సమయముగాదు. కొన్ని ఘడియలలోనే నీ దుఃఖము కడతేరుచున్నది సుమా।

శ్లో॥ తౌ వుభౌ నరశార్దూలౌ రాజపుత్రౌ వరిందమౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. 15

పదచ్ఛేదము :– తౌ - ఉభౌ - నరశార్దూలౌ - రాజపుత్రౌ - అరిందమౌ - త్వద్దర్శనకృతోత్సాహౌ - లంకాం - భస్మీకరిష్యతః.

అన్వయఃక్రమము :– అరిందమౌ, నరశార్దూలౌ, తౌ ఉభౌ రాజపుత్రౌ త్వద్దర్శన కృతోత్సాహౌ (సంతౌ) లంకాం భస్మీకరిష్యతః.

ప్రతిపదార్థము :– అరిందమౌ = శత్రువుల నణచువారును, నరశార్దూలౌ = పురుషశ్రేష్ఠులును అగు, తౌ ఉభౌ = ఆ ఇరువురు, రాజపుత్రౌ = రాజపుత్రులును, త్వద్దర్శన కృతోత్సాహౌ (సంతౌ) = నిన్ను చూచుటయందు కడు ఉత్సాహముగల వారగుచు, లంకాం = లంకానగరమును, భస్మీకరిష్యతః = భస్మము చేయుదురు.

తాత్పర్యము :– శత్రుసంహారకులైన మహావీరులగు ఆ రామ లక్ష్మణు లిరువురును నిన్ను చూచుటయందు మహోత్సాహముతో ఇటకు చేరి ఈ లంకానగరమును భస్మము గావింతురు సుమా।.

శ్లో॥ హత్వాతు సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాంపురీం ప్రాపయిష్యతః.16

పదచ్ఛేదము :- హత్వా - తు - సమరే - క్రూరం - రావణం - సహబాంధవమ్ - రాఘవౌ - త్వాం - విశాలాక్షి - స్వాం - పురీం - ప్రాపయిష్యతః.

అన్వయక్రమము :- విశాలాక్షి! రాఘవౌ సమరే క్రూరం రావణం సహబాంధవం హత్వా త్వాం స్వాం పురీం ప్రాపయిష్యతః

ప్రతిపదార్థము :- విశాలాక్షి = విశాలమైన నేత్రములుగల ఓ జానకీదేవీ!, రాఘవౌ = రామలక్ష్మణులు, సమరే = యుద్ధమున, క్రూరం = క్రూరుడైన, రావణం = రావణుని, సహబాంధవం = బంధువులతోగూడ, హత్వా = సంహరించి, త్వాం = నిన్ను, స్వాం పురీం = తన నగరమును, ప్రాపయిష్యతః = చేర్చగలరు.

తాత్పర్యము :- ఓ కమలాక్షీ! ఆ రామలక్ష్మణులు దుర్మార్గుడైన రావణుని బంధుగణములతో కూడ యుద్ధమునందు పరిమార్చి నిన్ను తమ నగరమునకు గొనిపోవగలరు మామా!

శ్లో॥ యత్తు రామో విజానీయా దభిజ్ఞాన మనిందితే,
ప్రీతిసంజననం తస్య భూయ స్త్వం దాతు మర్హసి 17

పదచ్ఛేదము :- యత్ - తు - రామః - విజానీయాత్ - అభిజ్ఞానం - అనిందితే - ప్రీతిసంజననం - తస్య - భూయః - త్వం - దాతుం - అర్హసి.

అన్వయక్రమము :- అనిందితే! రామః యత్ అభిజ్ఞానం విజానీయాత్ (తం) ప్రీతిసంజననం త్వం భూయః దాతుం అర్హసి.

ప్రతిపదార్థము :- అనిందితే = ఓ పూజ్యులారా!, రామః = శ్రీరాముడు, యత్ అభిజ్ఞానం = ఏ గుర్తును, విజానీయాత్ = తెలిసికొనగలడో, (తం) ప్రీతిసంజననం = అట్టి ఆనందకరమైనదానిని, త్వం = నీవు, భూయః = తిరిగి, దాతుం = ఇచ్చుటకు, అర్హసి = తగుదువు.

తాత్పర్యము :- తల్లీ! శ్రీరాముడు ఏ గుర్తువలన ఇచ్చటి విషయము తెలియగలడో అతని కానందకర మగు అట్టి గుర్తును ఒక దానిని తిరిగి నాకు ఇమ్ము.

శ్లో॥ సా ఽబ్రవీ ద్దత్త మే వేతి మ యాఽభిజ్ఞాన ముత్తమమ్,
ఏత దేవహి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్.
శ్రద్ధేయం హనుమ న్వాక్యం తవ వీర భవిష్యతి. 18

పదచ్ఛేదము :- సా - అబ్రవీత్ - దత్తం - ఏవ - ఇతి - మయా - అభిజ్ఞానం - ఉత్తమమ్ - ఏతత్ - ఏవ - హి - రామస్య - దృష్ట్వా - మత్కేశభూషణం - శ్రద్ధేయం - హనుమన్ - వాక్యం - తవ - వీర - భవిష్యతి.

అన్వయక్రమము :- ఉత్తమం అభిజ్ఞానం మయా దత్తం ఏవ, వీర! హనుమన్! ఏతత్ మత్కేశభూషణం దృష్ట్వాఏవ తవ వాక్యం శ్రద్ధేయం భవిష్యతి, ఇతి సా బ్రవీత్.

ప్రతిపదార్థము :- ఉత్తమం = శ్రేష్ఠమైన, అభిజ్ఞానం = గుర్తు, మయా = నాచే, దత్తం ఏవ అస్తి = ఈయబడియే యున్నది. వీర!హనుమన్!=వీరుడైన ఓ హనుమంతుడా!, ఏతత్ మత్కేశభూషణం= ఈ నా చూడామణిని, దృష్ట్వా ఏవ = చూచియే, తవ = నీ యొక్క, వాక్యం = మాట, శ్రద్ధేయం = విశ్వసింపదగినది, భవిష్యతి= కాగలదు, ఇతి = అని, సా = ఆ సీతాదేవి, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- మేలైన గుర్తును నీకు నేనిదివఱకే ఇచ్చి యుంటిని. ఓ మహావీరుడా! నాకేశభూషణమైనట్టి ఈ చూడామణిని చూడ గనే శ్రీరామునకు తప్పక నీ మాటల యందు విశ్వాసము కలుగును.

శ్లో॥ స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః,
ప్రణమ్య శిరసా దేవీం గమనా యోపచక్రమే, 19

పదచ్ఛేదము :_ సః - తం - మణివరం - గృహ్య - శ్రీమాన్ - ప్లవగసత్తమః - ప్రణమ్య - శిరసా - దేవీం - గమనాయ - ఉపచక్రమే.

అన్వయక్రమము :_ శ్రీమాన్ ప్లవగసత్తమః సః తం మణి వరం గృహ్య దేవీం శిరసా ప్రణమ్య గమనాయ ఉపచక్రమే.

ప్రతిపదార్థము :_ శ్రీమాన్ = శుభలక్షణాఢ్యుడైన, ప్లవగ సత్తమః = వానరశ్రేష్ఠుడగు, సః = ఆ హనుమ, తం మణివరం = ఆ మణిశ్రేష్ఠమును, గృహ్య = గ్రహించి, దేవీం = సీతాదేవిని, శిరసా = శిరస్సుతో, ప్రణమ్య = మ్రొక్కి, గమనాయ = పయనమునకు, ఉప చక్రమే = సిద్ధపడెను.

తాత్పర్యము :_ శుభలక్షణ శోభితుడైన ఆ వానరశ్రేష్ఠుడు సీత యొసగిన చూడామణిని గ్రహించి శిరమువంచి ఆమెకు మ్రొక్కి తిరుగు ప్రయాణమునకు ఉద్యుక్తుడయ్యెను.

శ్లో॥ త ముత్పాతకృతోత్సాహ మవేక్ష్య హరిపుంగవమ్,
వర్ధమానం మహావేగ మువాచ జనకాత్మజా,
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా. 20

పదచ్ఛేదము :_ తం - ఉత్పాతకృతోత్సాహం - అవేక్ష్య - హరిపుంగవమ్ - వర్ధమానం - మహావేగం - ఉవాచ - జనకాత్మజా - అశ్రుపూర్ణముఖీ - దీనా - బాష్పగద్గదయా - గిరా.

అన్వయక్రమము :_ ఉత్పాతకృతోత్సాహం, మహావేగం, వర్ధమానం తం హరియూథపం అవేక్ష్య జనకాత్మజా అశ్రుపూర్ణముఖీ, దీనా (సతీ) బాష్పగద్గదయా గిరా ఉవాచ.

ప్రతిపదార్థము :_ ఉత్పాతకృతోత్సాహం = ఎగిరిపోవుట యందు ఉత్సాహము కలిగినటి వాడును, మహావేగం = గొప్ప వేగముగల

వాడును, వర్ధమానం = వృద్ధిఁబొందుచున్న వాడును అగు, తం హరియూధపం = ఆ హనుమను, అవేక్ష్య = చూచి, జనకాత్మజా = జానకీదేవి, అశ్రుపూర్ణ ముఖీ = కన్నీటితోనిండిన ముఖము గలదియును, దీనా (సతి)= దీనురాలు నగుచు, బాష్పగద్గదయా కన్నీటిచేడగ్గుత్తిక బడినట్టి గిరా = వాక్కుతో, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :_ అప్పుడు సీతాదేవి అతనము మీదికి ఎగిరిపోవుటకు ఉత్సాహపడుచు మహావేగముతో తన శరీరమును పెంచుకొనుచున్నట్టి ఆ హనుమను జూచి కన్నీటితో తడసిన ముఖముగలదై దుఃఖబాష్పములచేడగ్గుత్తి కబడిన కంఠముతో దీనముగా హనుమను జూచి ఇట్లు పలికెను.

శ్లో॥ హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవంచ సహామాత్యం సర్వాన్ బ్రూయా
హ్యనామయమ్, 21

పదచ్ఛేదము :- హనుమన్ - సింహసంకాశౌ - భ్రాతరౌ - రామలక్ష్మణౌ - సుగ్రీవం - చ - సహామాత్యం - సర్వాన్ - బ్రూయాః - హి - అనామయయమ్.

అన్వయక్రమము :- హనుమన్! సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ, సహామాత్యం సుగ్రీవంచ, సర్వాన్ అనామయం బ్రూయాః.

ప్రతిపదార్థము :_ హనుమన్ = ఆంజనేయా! సింహసంకాశౌ = సింహసన్నిభులగు, భ్రాతరౌ = సోదరులైన రామలక్ష్మణౌ = రామలక్ష్మణులను, సహామాత్యం = మంత్రులతోగూడిన సుగ్రీవంచ = సుగ్రీవునిని, సర్వాన్ = ఎల్లరను, అనామయం = క్షేమమును, బ్రూయాః = పలుకుము.

తాత్పర్యము :_ ఓ హనుమంతుడా! సింహవిక్రములగు సోదరులైన ఆ రామలక్ష్మణులను, మంత్రిసమేతుడైన సుగ్రీవుని, మనవారినెల్లరను నేను క్షేమము నడిగినటు చెప్పుము.

శ్లో॥ యథాచ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః,
అస్మా ద్దుఃఖాంబుసంరోధా త్త్వం సమాధాతు మర్హసి.

పదచ్ఛేదము :- యథా - చ - సః - మహాబాహుః - మాం - తారయతి - రాఘవః - అస్మాత్ - దుఃఖాంబుసంరోధాత్ - త్వం - సమాధాతుం - అర్హసి

అన్వయ క్రమము :- మహాబాహుః సః రాఘవః అస్మాత్ దుఃఖాంబు సంరోధాత్ యథా మాం తారయతి తథా త్వం సమధాతుం అర్హసి.

ప్రతిపదార్థము :- మహాబాహుః = పరాక్రమవంతుడైన, సః రాఘవః = ఆ శ్రీరాముడు, అస్మాత్ దుఃఖాంబుసంరోధాత్ = ఈ దుఃఖమనెడి నీటి వెల్లువనుండి, యథా = ఏ విధముగా, మాం = నన్ను, తారయతి = దాటించునో, తథా = ఆ విధముగా, త్వం = నీవు, సమాధాతుం = సన్నద్ధుని చేయుటకు, అర్హసి = తగియున్నావు.

తాత్పర్యము :- మహావీరుడైన ఆ శ్రీరాముడు నన్నీ దుఃఖ సాగరము నుండి ఏ విధముగ దాటించగలడో ఆ విధానము నాలోచించి, దానిని నీవే సమకూర్చ దగుదువు,

శ్లో॥ ఇమంచ తీవ్రం మమ శోకవేగం,
రక్షోభి రేభిః పరిభర్త్సనంచ,
బ్రూయాస్తు రామస్య గత స్సమీపం,
శివశ్చ తే ఽధ్వాస్తు హరిప్రవీర. 23

పదచ్ఛేదము :- ఇమం - చ - తీవ్రం - మమ - శోకవేగం - రక్షోభిః - ఏభిః - పరిభర్త్సనం - చ - బ్రూయాః - తు - రామస్య - గతః - సమీపం - శివః - చ - తే - అధ్వా - అస్తు - హరిప్రవీర.

అన్వయక్రమము :— మమ ఇమం శోకవేగం ఏభిః రక్షోభిః పరిభర్త్స్యనం చ రామస్య సమీపం గతః బ్రూయాః। హరిప్రవీర। తే అధ్వా శివః అస్తు.

ప్రతిపదార్థము :— మమ = నా యొక్క, ఇమం శోకవేగం = ఈ నా దుఃఖ వేగమును, ఏభిః రక్షోభిః = ఈ రక్కసులచే, పరిభర్త్స్యనం చ = గద్దింపును, రామస్య = శ్రీరాముని యొక్క, సమీపం = సాన్నిధ్యమును, గతః = పొందినవాడవై, బ్రూయాః = చెప్పుము, హరిప్రవీరః = ఓ వానరశ్రేష్ఠుడా!, తే = నీ యొక్క, అధ్వా = మార్గము. శివః = మంగళకరమైనది, అస్తు = అగు గాక।

తాత్పర్యము :— నా యీ దుఃఖ వేగమును, ఈ రాక్షసులచే చేయబడు గద్దింపులను రాముని కడకేగి అతనికి అంతయు తెలుపుము. నీకు మార్గము మంగళకరమగు గాక।

శ్లో॥ స రాజపుత్ర్యా ప్రతివేదితార్థః,
కపిః కృతార్థః పరిహృష్టచేతాః,
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం,
దిశం హ్యుదీచీం మనసా జగామ

ఇత్యార్షే శ్రీ మద్వాల్మీకి రామాయణే సుందరకాండే
"హనూమత్ప్రేషణం" నామ
చత్వారింశస్సర్గః

పదచ్ఛేదము :— సః - రాజపుత్ర్యా - ప్రతివేదితార్థః - కపిః - కృతార్థః - పరిహృష్టచేతాః - అల్పావశేషం - ప్రసమీక్ష్య - కార్యం - దిశం - హి - ఉదీచీం - మనసా - జగామ.

అన్వయక్రమము :— సః కపిః రాజపుత్ర్యా ప్రతివేదితార్థః, కృతార్థః, పరిహృష్టచేతాః (సన్) కార్యం అల్పావశేషం ప్రసమీక్ష్య మనసా ఉదీచీం దిశం జగామ.

015, 1A1
35 M 87.5

ప్రతిపదార్థము :- సః కపిః = ఆ హనుమ, రాజపుత్ర్యా = సీతమ్మచే, ప్రతివేదితార్థః = తెలుపబడిన విషయములుగలవాడై, కృతార్థః = కృతకృత్యుడై, పరిహృష్టచేతాః (సన్) = మిక్కిలి సంతుష్టినొందిన మనస్సుగలవాడగుచు, కార్యం = కర్తవ్యమును, అల్పావశేషం = కొంచెముగ మిగిలిన దానినిగా ప్రసమీక్ష్య = కనుగొని, మనసా = మనస్సుచే, ఉదీచీం దిశం = ఉత్తర దిక్కునుగూర్చి, జగామ = వెడలెను.

శేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- 'కార్యం అల్పావశేషం ప్రసమీక్ష్య' ప్రధానమైన సీతా సందర్శన కర్తవ్యము సాధింపబడినను, శత్రుబలపరిమితి దర్శనమనెడి అముఖ్యమైన చిన్నకార్యము మాత్రము మిగిలియున్నదని భావము.

తాత్పర్యము :- హనుమంతుడీ విధముగ సీతాదేవిచే తెలుపబడిన ఆవశ్యక విషయములన్నియును వినినవాడై కృతకృత్యుడై మహానందము నొందిన మనస్సుతో తన దౌత్యకృత్యములో శత్రుబల దర్శనము అనెడి మిగిలిన కృత్యమును గూడ స్మరించుకొనుచు ఒక్కమారు ఉత్తర దిక్కునకు మానసికముగ పయనించెను.

ఇది శ్రీ మత్సుందరకాండమునకు సుబోధిని యను ఆంధ్ర వివరణమునందు "హనూమత్ప్రేషణము" అను నలుబదియవ సర్గము.

హరిః ఓం తత్ సత్
శ్రీ కృష్ణార్పణ మస్తు.

26998
TIRUPATI